Barcode : 2020010003875
Title - aliya_rama_rayalu
Author - chillkuri_veerabadra_raoi
Language - telugu
Pages - 256
Publication Year - 1931
Barcode EAN.UCC-13
2020010003875

# అళియరామరాయలు

గ్రంథకర్త

చిలుకూరి వీరభద్రరావుగారు

ప్రకాశకుడు

నాళం అప్పలనరశింహము

రాజమహేంద్రవరము.

1931

సర్వస్వామ్యసంకలితము.

# పీఠిక.

అళియరామరాయల జీవితగ్రంథమును వ్రాయుటకు నన్నుఁ బురికొల్పినది "The Aravidu dynasty of Vijianagar" అని వ్రాయఁబడిన గ్రంథమే. ఈ గ్రంథమును బొంబయినగరము లోని సెంటుక్షేవియరుకాలేజిలో చరిత్రోపాధ్యాయులుగానున్న The Rev. Henry Heras, S. J. M. A. గారాంగ్లభాషలో రచించిరి. వీరు పోర్చుగల్ దేశస్థులు. వీరు విజయనగరసామ్రా జ్యమును బరిపాలించిన యీయారవీటివంశచరిత్రమును విజయ నగరసామ్రాజ్యమునకుఁ బ్రతిస్పర్థులుగనుండెడు దక్కనుసుల్తా నుల దర్బారులలోనుండెడు విమతస్థులగు చరిత్రకారుల వ్రాత లను, వారలకు సమకాలికులై యాకాలమున వర్తకమునకై యీ దేశమునకు నేతెంచిన పోర్చుగీసులేఖకుల వ్రాఁతలను, క్రైస్తవమత గురువుల వ్రాఁతలను నెక్కువగా నాధారపఱచుకొని రచించి యున్నారు. ఇందునకై యాంధ్రులెల్లరును కృతజ్ఞులై యుండవల సినదేకాని వీరు తమచరిత్రమునందు "అళియరామరాయల" శీలపరిశీలనమున సమకాలికులగు హిందూగ్రంథకర్తల యొక్కయు, కవులయొక్కయు వ్రాఁతలయందు విశ్వాసముంచక సమకాలికులుగాని తమదేశస్థులు తమభాషలో వ్రాసినలేఖనముల యందును, విజయనగరసామ్రాజ్యము నెడస్పర్థగలట్టియు, రామ రాయల నసూయతోఁజూచునట్టియు విమతస్థులయిన చరిత్రకా రుల లేఖనములయందును నిర్హేతుకముగా విశ్వాసముంచి పెక్కు దురభిప్రాయములను వెలువరించియున్నారు. అళియరామరా యలజేయపరాక్రమంబునఁ గృష్ణదేవరాయలను, అమేయబుద్ధి

కౌశలమునఁ దన్మంత్రిశేఖరుఁడగు తిమ్మరుసునుమించిన ప్రతిభాశాలిగాని సామాన్యుఁడుగాఁడు. అట్టిమహనీయుని సచ్ఛీలమును చదువరులు గర్హించువిధముగా గ్రంథమంతయు వ్రాయఁబడినది. ఇట్టిసందర్భములందు వీరు వెల్వరించిన యభిప్రాయములు వేఱ్వేఱుప్రదేశములయందు పరస్పరవిరుద్ధములుగ నున్నవి. మరియు సత్యవిరుద్ధములు కూడనై యున్నవి. వీనిసత్యమును దెలిసికొనఁగోరు చదువరుల కుపయోగకరముగా నుండునటుల సహేతుకవిమర్శనలతోఁగూడిన యీజీవిత విమర్శగ్రంథమును వ్రాసితిని. సదాశివరాయలను ౧౩ సంవత్సరములు కారాగృహముననుంచి రామరాయలుపట్టాభిషిక్తుఁడై విజయనగరసామ్రాజ్యమును బరిపాలించిన స్వార్థపరుఁడని మోసగాఁడని తెలిపిన విధానమంతయు వట్టినిరాధారమైనసిద్ధాంతమని యీచిన్నజీవిత గ్రంథము ఋజువుచేయుచున్నది. ఇంతకన్న నధికముగ వ్రాయుటకిష్టపడక వీనిగుణదోషములను గ్రహింపఁ జదువరులకే విడిచిపెట్టుచున్నాఁడను. నేనస్వస్థతగానున్నకాలమున నిట్టి విమర్శగ్రంథమును వ్రాయుటయు, నచ్చొత్తించుటయు సంభవించినందునను, అచ్చుప్రతులను స్వయముగా దిద్దుకొనుటకు సాధ్యపడనందునను నందందు నచ్చుతప్పులు పడియున్నవి. వానిని సాధ్యమగునంతవఱకు నేర్చికూర్చి శుద్ధపత్రమున సవరించితిని. ఈగ్రంథమునువ్రాయుటకుఁ దోడ్పడినగ్రంథములను పత్రికాలేఖనములను నందందుఁబొందుపఱిచియే యున్నాను. ఏతద్గ్రంథకర్తలకును, వ్యాసలేఖనకర్తలకును నాకృతజ్ఞతావందనములను దెలుపుకొనుచున్నాఁడను.

గ్రంథకర్త.

# వి ష య సూ చి క.

## ప్రథమ ప్రకరణము.

రామరాయలపూర్వులు, వీరహెమ్మాళి రాయఁడు, తాతపిన్నమరాజు, కొటిగంటిరాఘవరాజు, సోమదేవరాజు, రాఘవరాజు, పిన్నభూపాలుఁడు, ఆరవీటిబుక్కరాజు, రామరాజు, అవుకుతిమ్మరాజు, ఆదవేనికొండ్రాజు, శ్రీరంగరాజు.

## రెండవ ప్రకరణము.

కృష్ణరాయలు, రామరాయలు, అచ్యుతరాయలు, రామరాయలు, చిన్నవేంకటాద్రి పట్టాభిషేకము, సలకముతిమ్మరాజు, రామరాయలు, సలకముతిమ్మరాజు ద్రోహకృత్యములు, అళియరామరాయల దండయాత్ర, సలకముతిమ్మయ యుద్ధము, సలకముతిమ్మయ మరణము.

## మూఁడవ ప్రకరణము.

సదాశివరాయల పట్టాభిషేకము, వేంకటాద్రి నవాబరీదుల యుద్ధము, కళ్యాణికలుబరగిదుర్గములముట్టడి, జమ్షీదుకుతుబ్షా మరణము, ఇబ్రహీము పట్టాభిషిక్తుఁడగుట, కలుబరిగెయుద్ధము, మఱియొకయుద్ధము, అబ్దుల్లాతో యుద్ధము, విజయనగరగోల్కొండ యుద్ధము.

నాలుగవ ప్రకరణము.

రాయలగూర్చిన యపనిందలు.

ఐదవ ప్రకరణము.

విఠలుని దక్షిణదేశదండయాత్ర, సెంటుథోముపై దండయాత్ర.

ఆరవ ప్రకరణము.

రక్షస్తఙ్గడియుద్ధము.

ఏడవ ప్రకరణము.

రామరాయల ధర్మపరిపాలనము, దేవాలయపోషకత్వము, విద్వాంసుల పోషకత్వము, సరిహద్దుతగవుల పరిష్కారము.

# అళియరామరాయలు

## ప్రథమ ప్రకరణము

“ సీ. పట్టాభిషేకవిపర్యయంబునఁ బ్రోలు
వెడలి ప్రియానుజు ల్వెంటఁ గొలువఁ
జిత్రకూటాభిఖ్యఁ జెలఁగు పెన్గొండ సాం
ద్రహారిద్విపేంద్ర నాదవనిఁ జెంది
ఖలజనస్థానవాసులఁ బల్వుర వధించి
మహిమ సలకఖరస్మయ మడంచి
వారివీరభటమహోద్ధతి నబ్ధి గంపింప
దురమున గదిసి తద్ద్రోహిఁ దునిమి

తే. యనఘతరపార్థివేందిర నధిగమించి
సాధుకర్ణాటవిభవసంస్థాపనంబు
పూని శరణాగతుల నెల్లఁ బ్రోచె రాముఁ
డతఁడు నిజచరితంబు రామాయణముగ.”

" సీ. ఖలు నతిద్రోహి సల్కాయతిమ్మని హరించి
సకలకర్ణాటదేశంబునిలిపె
సతుని వర్ధితునిఁ దత్సుతునిఁ బట్టముఁ గట్టి
కుతుపనమల్కాన క్షోణి నిలిపెఁ
బడిలుఁడై రాచూరు ముదిగల్లు గప్పంబు
సేయఁ గాంచ సపాదు సీమ నిలిపె
వెరణాన్నమల్కానిజాముస కభయంబొ
సంగి తదీయరాజ్యంబు నిలిపె
గీ. నవని యంతయు రామరాజ్యంబు సేసెఁ
దనగుణమ్ములు కవికల్పితములు గాఁగ
నలవియె రచింప సత్కావ్యములను నెలయ
భూమి నొకరాజమాత్రుఁడే రామవిభుఁడు."

అని యేమహారాజు తనవిద్యాపరిషదంబున భూషణప్రాయుఁడుగా నుండి 'రామరాజభూషణుం' డనఁ బ్రఖ్యాతి వహించి మించినమహాకవిభట్టుమూర్తిచే పొగడ్తలఁ గాంచెనో అట్టి వీరశ్రీరామరాజును 'ఫెరిస్తా' యను నొకచరిత్రకారుఁ డొకయనామకుఁ డగుచరిత్రకారునివాక్యములను బురస్కరించుకొని తాను వ్రాసిన యొకచరిత్రగ్రంథమునం దొకపిఱికిపందనుగాఁ బ్రవేశపెట్టినవిధము సత్యాన్వేషణపరాయణు లగుచరిత్రకారు లెల్లరును బరిశోధించి విమర్శించి సత్యమును బ్రకటించుట మఱువఁ దగదు.

ఒకప్పుడు గోల్కొండనవాబగు 'సుల్తానుకూలీకుతుబ్షాహ' విజయనగరసామ్రాజ్యముపై దండయాత్ర వెడలి సరిహద్దుల నున్నమండలములఁ గొన్నిటిని వశపఱచుకొని తురక సైన్యముల నచట నిలుపుట కిష్టపడక హిందూసామంతకుటుంబములోనివాఁడయినరామరాజును నధికారిగ నియమించె నఁట ! అటుపిమ్మట మూఁడుసంవత్సరములకుఁ బిమ్మట విజాపురసుల్తానగు 'ఆదిల్‌షాహ' సైన్యములు కేవలము దోపిడికొనఁ గోరి వచ్చి పైఁబడి రామరాజును వెడలఁగొట్టి దేశమునంతయుఁ గొల్లఁగొనఁగా రామరాజు పాఱిపోయి సుల్తానుకూలీకుతుబ్షాకు తనపరాభవమును విన్నపించుకొనె నఁట ! అంతట సుల్తానుకూలీకుతుబ్షాహ రామరాజునుగాంచి 'ఛీ! పాఱుఁబోతా ! నీవు నాదర్బారులో నుండఁదగవు ; పొమ్ము ;' అని దేశమునుండి వెడలఁగొట్టె నఁట ! అంతట రామరాజు విజయనగరమార్గముఁ బట్టి కృష్ణదేవరాయలకడ నుద్యోగమును సంపాదించె నఁట ! ఈవాక్యములు గోల్కొండపట్టణములో నుండెడునొక యనామకుఁ డైనచరిత్రకారుఁడు వ్రాసిన వని ఫెరిస్తా తాను వ్రాసిన చరిత్రమునను దెక్కించి యున్నవాఁడు.(1) విజయనగరసామ్రాజ్యమును బరిపాలించినకడపటివంశమగు నారవీటివంశమును గూర్చినచరిత్రమును వ్రాయుచు హీరాసుఫాదిరి యీయనామకుఁడయినచరిత్రకారుఁ డనుభవముతో వ్రాసెనదియగుటచేత

(1) Ferista Vol. III p. 380; Aravidu Dynasty Vol. I p. 25.

దీనిని చులకనగాఁ ద్రోసివేయఁ జాలమని వ్రాయుచున్నాఁడు.2 ఇది యెంతమాత్రము విశ్వాసపాత్రముగాఁ గన్పట్టదని రామరాయలయొక్క పూర్వోత్తరచరిత్రమును నిష్పక్షపాతబుద్ధితోఁ బరిశీలించినవారికిఁ బొడగట్టక మానదు. కనుక రామరాయలయొక్క పూర్వులచరిత్రమును ముందుగఁ దెలిసికొను టత్యావశ్యకముగనుక వారిచరిత్రముకూడ సంగ్రహముగా నిటఁ దెలుపుచున్నాఁడను.

## —◆ రామరాయలపూర్వులు ◆—

దక్షిణహిందూదేశచరిత్రమునందుఁ గడుఁ బ్రఖ్యాతిఁ గాంచినవంశమునకుఁ జెందినవాఁడు రామరాజు. ఇతఁడాంధ్రుఁడు. కర్ణాటభాషలోఁ గన్నడకవి యగు తిరుమలార్యుఁడు గన్నడప్రభువయిన చిక్కదేవరాయల దగు వంశావళి 'చిక్కదేవరాయవంశావళి' యనుపేరిట వ్రాసినగ్రంథములో 'ఆంధ్రకులదరామరాజం' అని రామరాజును ఆంధ్రునిగాఁ జెప్పియున్నాఁడు. ఇతనివంశము 'రామరాజీయ' మనునామాంతరమును వహించిన 'నరపతివిజయ' మనుగ్రంథములో పౌరాణికచంద్రవంశముతోఁ ముడిపెట్టఁ బడినది. ఇతని దాత్రేయసగోత్ర మని వర్ణింపఁ బడినది. ఇతనివంశమున చారిత్రికపురుషు లగునందరాజును, చళుక్యరాజును, బిజ్జలరాజును పేర్కొనఁబడియుండుట చరిత్రమునకు విరుద్ధముగ నుండుటచేత విశ్వాసపాత్రముగఁ

(2) The Aravidu Dynasty Vol. I p. 19.

గన్పట్టుచుండలేదు. శిశునాగవంశము, శృంగవంశము, చళుక్యవంశము, కలచుటివంశము, చరిత్రముచుబట్టి వేర్వేఱు వంశము లనిస్పష్టపడుచుండఁగా వీనినన్నిటిని నేకవంశముగా వర్ణించుట చూడఁగా విజయనగరసామ్రాజ్యమును బరిపాలించిన పూర్వవంశముల వారివలెనె వీరివంశముయొక్క ప్రాశస్త్యమును ప్రకటించుటకై కవి ప్రయత్నించినట్లు గన్పట్టుచున్నది.

కాని, పండ్రెండవశతాబ్దిమధ్యమున బసవేశ్వరునివీరశైవమతము నెదుర్కొని ప్రాణములఁ గోల్పోయిన బిజ్జలుని వంశమువాఁడయినఁ గావచ్చు నని యూహించుటకుఁగూడ ప్రతిబంధక ప్రమాణము లగపడుచున్నవి. హైహయాన్వయ మని శాసనములలో వక్కాణింపఁబడిన కలచుటి వంశములోనివాఁడు బిజ్జలుఁడని పెక్కుశాసనములు దెలుపుచున్నవి. ఈబిజ్జలరాజు ౧౧౫౦ మొదలు ౧౧౬౨ వ సంవత్సరమువఱకు రాజ్యపరిపాలనము చేసిన చాళుక్యత్రైలోక్యమల్లుని సేనాధిపతిగా నుండి, ౧౧౬౨ వ సంవత్సరమున కళ్యాణపురాధీశ్వరత్వమును దానే యపహరించి ౧౧౬౭వ సంవత్సరమునఁ జంపఁబడుట సుప్రసిద్ధమైన చరిత్రాంశమై యున్నది. వీనితరువాత సోమేశ్వరుఁడు, సంకాముఁడు, అహవమల్లుఁడు ననుమూవురు కాలచుర్యరాజులు ౧౧౮౨ వ సంవత్సరము వఱకుఁ బరిపాలించిరి. తరువాత నీరాజ్యమును చాళుక్య నృపతి యగు నాల్గవ సోమేశ్వరుఁడు జయించి పరిపాలించె ననుటకూడ సుప్రసిద్ధమైన చరిత్రాంశమె.

ఇట్లుండ, నరపతివిజయ మను గ్రంథమున బిజ్జలునికి వెనుక వానికుమారుని విడిచి ' వీరహొమ్మాళిరాయని ' వానిమనుమని గాఁజెప్పి అతిశయోక్తులతో నాతని ప్రతాపమును వర్ణించి యున్నాఁడు కాని చరిత్రాంశముల వేనిని పేర్కొని యుండ లేదు. అందువలన వీనియాథార్థ్య మెట్టిదో గ్రహింపసా ధ్యము గాదు.

రామరాయల బిరుదుగద్యములో ' కళ్యాణపుర వరాధీ శ్వర ' అనుబిరుద మొకటి గనంబడుచున్నది. ఆబిరుదము క్రిం దనే మఱియొకచోట ' కళ్యాణపురసాధక ' అనుబిరుదముగూడఁ గనంబడుచున్నది. మొదటిది పూర్వులనుబట్టి వంశపారంపర్య ముగ వచ్చుచున్నదిగను, రెండవది స్వవ్యక్తికి సంబంధించినది గను మన మూహింప వచ్చును. రామరాజునకు ' కల్యాణపు రసాధక ' యన్న బిరుద మెట్టువచ్చినదియు రాఁబోవు ప్రకరణ మున వివరింపఁ బడును.

ఆనెగొంది సంస్థానమునందు ' రాయవంశావళి ' యను నొక గ్రంథము కలదు. ఆరాయవంశావళియు నీరాయవంశా వళియు నొకేవంశావళికి సంబంధించిన వని మనము గ్రహింప వచ్చును.

ఆ గ్రంథమునుబట్టి చూడఁగా నందుఁడనురాజు కిష్కింధలో (ఆనెగొంది) ౧౦౧౪ మొదలు ౧౦౭౬ వఱకును, అతని కుమారుఁడు చాళుక్యరాజు ౧౦౭౬ మొదలు ౧౧౧౭ వఱకు పరిపాలనము చేసి రనియు, వీనికిమువ్వురు పుత్త్రులు గలరనియు

అంద గ్రజుఁ డయినబిజ్జలుఁ డనునాతఁడు కళ్యాణపురమునకు రాజయ్యె ననియు, విజయధ్వజుఁ డను రెండవకొడుకు ౧౧౧౭ మొదలు ౧౧౫౬ వఱకును ప్రభుత్వము చేసె ననియు, మూఁడవవాఁడు విష్ణువర్ధనుఁ డనియుఁ దెలియ వచ్చుచున్నది. విష్ణువర్ధనుఁ డనుమూఁడవవాసం గూర్చి యేమియుం దెలియరాదు. విజయధ్వజుఁడే తుంగభద్రాతీరమునఁ దనపేరిట విజయ నగరమును నిర్మింపఁగా దానిని మాధవ విద్యారణ్యుల వారిప్రోత్సాహముచే సంగమరాజపుత్త్రుఁడగుహరిహరరాయ లతివిశాలమగుపట్టణముగాఁ జేసి విద్యానగర మని పేరుపెట్టి ప్రఖ్యాతికిఁ దెచ్చె ననియు, విజయనగర మను పూర్వపునామమె బహుజనవ్యాప్తిని బొందె చరిత్రమున నిలిచి యున్నదనియుఁ గొందరు వ్రాయుచున్నారు 1 దీనిని బట్టి కూడ బిజ్జలునివంశమువారు కళ్యాణపురము నందును, విజయధ్వజుని వంశమువా రానెగొందిపురము నను గొంతకాలము పరిపాలించి ఢిల్లీచక్రవర్తి యగుమహమ్మదు బీన్ తుగ్లఖ్ దక్షిణహిందూస్థానముపై పలుమాఱు దండయాత్రలు సాగించిన సంక్షోభకాలమునఁ దమరాజ్యములను బోగొట్టుకొని యుందురు.

---

(1) ఈవిషయము 'అవిస్మృతసామ్రాజ్య' మనునర్థమిచ్చు Never-To-Be-Forgotten Empiro (శ్రీయుత రెంగుళూరు సూర్యనారాయణరావు బి. ఎ. గారివిరచితము) అనుగ్రంథమునుండి గ్రహింపఁబడినది గాని ఆనెగొందిసంస్థానములోని 'రాయవంశావళి' యనుగ్రంథముయొక్క మాతృకను జూచి వ్రాసినది కాదు.

వీరిపూర్వులు కళ్యాణపురమును విడిచిపెట్టవలసివచ్చినను, 'కళ్యాణపురవరాధీశ్వర' అనుబిరుదమును మాత్రము విడిచిపెట్టి యుండలేదు. దక్షిణహిందూదేశమును బరిపాలించిన రాజవంశముల లోనిరాజులు తమపూర్వులు గడించినబిరుదములను విడువక వంశపారంపర్యముగాఁ జెప్పుకొనుచు వచ్చుచుండుటచే నాయావంశసంప్రదాయ చరిత్రములకుఁ గొంతవఱకు నైనఁదోడ్పడుట కవకాశ మిచ్చుచున్నవి.

## వీరహొన్నూరిరాయఁడు

ఈవంశమునకు మూలపురుషుఁ డగువీరహొన్నూరి రాయఁడనునాతఁడు పశ్చిమచాళుక్యసామ్రాజ్యభానుఁ డస్తమించుకాలమున నొకసామంతమాండలికుఁడుగాను సైన్యాధ్యక్షుఁడుగాను నుండినవాఁడయి యుండవచ్చునని యూహించుటలోఁ బ్రమాద మేమియును గానరాదు. పండ్రెండవశతాబ్దితుదను హొయిసలరాజయినవీరబల్లాలుఁడు గాంగవాడి, నోలంబవాడి, బనవాసిరాజ్యముల నాక్రమించుకొని పరాక్రమవంతుఁడై పరిపాలనముసేయుచు కళ్యాణపురముపై దండెత్తివచ్చి చాళుక్యనృపతి యగునాల్గవసోమేశ్వరుని సైన్యాధ్యక్షుఁ డగు బొమ్మరాజు నెదుర్కొని యాతని గదనరంగమున నోడించి బిజ్జలునియొద్దనుండి గైకొన్నరాజ్యము నాక్రమించుకొనియెను. కర్ణాటభాషలో వ. బ. అనునక్షరములు 'హ' అనునక్షరముగ మాఱి యుచ్చరింపఁబడుట సాంప్రదాయసిద్ధమయిన

విషయముగనుక 'బొమ్మ' శబ్దము 'హొమ్మ' గావచ్చును. అట్లగుట చేవీరుఁడైన బొమ్మరాజును వీరహొమ్మాళిరాయఁడని కవి ప్రశంసించుట వింతవిషయము గాదు. కనుక పై బొమ్మరాజు సంతతివాఁడయిన మఱియొక బొమ్మరాజు హొయిసలప్రభువులను పదుమూఁడవశతాబ్ద్యంతమున కళ్యాణనగరము నుండి పాఱఁద్రోలి స్వతంత్రుఁడై పరిపాలనము చేసి యుండును. అతఁడే యీవంశమునకు మూలపురుషుఁడయిన వీరహొమ్మాళిరాయనిగా గ్రహింపవచ్చును. ఈవీరహొమ్మాళిరాయఁడు వైష్ణవమతసంప్రదాయాచారములుగలవాఁడనియు, దేవబ్రాహ్మణభక్తి గలవాఁడనియు, మాయాపురం బనునామాంతరముగలిగి యుండినగంగాపురమున 'చెన్నకేశవస్వామిని' ప్రతిష్ఠాపించె ననియును, వీరనారాయణదేవచరణాంభోరుహారాధనానుసంప్రాపితసకలసామ్రాజ్యవిశేషభోగంబులును, పరమభాగవతసఖిత్వంబును, గల్గి పెద్దకాలము ధాత్రిఁ బరిపాలించు చుండె ననియు నరపతివిజయమునందుఁ గవి వర్ణించి యున్నాఁడు.

### —♦ తాతపిన్నమరాజు—కోటిగంటిరాఘవరాజు ♦—

ఈవీరహొమ్మాళిరాయనిపుత్త్రుఁడు తాతపిన్నమరాజని నరపతివిజయమునందు మాత్రమెగాక 'ద్విపదబాలభాగవతము' పీఠికలో నారవీటివంశమును వర్ణించుఘట్టమున దోనూరికోనేరునాథుఁ డనుకవి:—

"సమితిలోఁ జెఱకురాచనరేంద్రు గెలిచి
అలవుగా సప్తాంగహరణం బొనర్చి
పొలుపొందె భువిమన్నెపులి యనుపేర
బిరుదాంచితుఁడు తాతపిన్నభూవరుఁడు."

అని తాతపిన్నమరాజును గూర్చి వక్కాణించి యటు పిమ్మట—

"హరికాంతఁ బోలు నూరాంబిక యందు
ఘనశౌర్యుఁ డౌ కోటిగంటిరాఘవుని
గనియె నతండు సంగ్రామంబు నందు
రాజిల్లుకంపిలిరాయసైన్యములఁ
దేజంబు మెరయంగఁ దెగువమై గెలిచి
గరిమ గైకొనియె నగ్గండరగూళి
బిరుదంబు సరిన్నృపుల్ పేర్కొని పొగడ."

అని యతని ప్రథమభార్యాపుత్త్రుఁ డయినకోటిగంటి రాఘవరాజువీరకృత్యములనువర్ణించియున్నాఁడు. నరపతివిజయ మను గ్రంథమున వెంకయకవి తాత పిన్నమరాజు ప్రథమ భార్యనుగాని యామెకుమారుఁ డగుకోటిగంటి రాఘవరాజును గాని ప్రశంసించినవాఁడుకాఁడు. తాతపిన్నమరాజు జయించిన చెఱకురాచనరేంద్రుఁ డెవ్వఁడో యింతవఱకు చరిత్రమునఁ కందియుండ లేదు. కాని వానికుమారుఁడు కోటిగంటి రాఘవ రాజు యుద్ధమునఁ గంపిలిరాయ సైన్యములను గెలిచి 'గండర

గూళి' యనుబిరుదమును వహించినవాఁడని కవి చెప్పిన దానిని బట్టి కొంతచరిత్రమును దెలిసికొనుట సాధ్యముకాఁగలదు.

నరపతివిజయమునందు వక్కాణింపఁబడిన తాతపిన్నమరాజు బిరుదగద్యములో 'సమస్తమరాచార చెఱుకురాచనాయక రాజ్యసప్తాఙ్గహరణ' అని చెఱుకురాచనాయకుని ప్రశంసగన్పట్టుచున్నది గాని కంపిలిరాయనిగెల్చి 'గండరగూళి' యనుబిరుదముగైకొన్న విషయము ప్రశంసింపఁబడియుండలేదు. అయిన నియ్యవి నిజమగు చరిత్రమును సూచించునవిగా నున్నవనుట కనుమానింపఁ బనిలేదు.

ఇందుఁ బేర్కొనఁబడినకంపిలిరాయఁ డెవ్వఁడో మనము ముందుగఁ దెలిసి కొనవలసియున్నది. కంపిలి కృష్ణానది కుపశాఖ యగు తుంగభద్రానది యొక్క దక్షిణపుటొడ్డున యానెగొందికి నెదురుగ నున్నది. శివకవులలో గంగాధరుఁ డనునొక కవి 'కుమారరామనచరితె' యను కన్నడభాషాకావ్యము నొకదాని రచించి యందు కంపిలి రాజులచరిత్ర మభివర్ణించి యున్నాఁడు. ఈకావ్యమున కుమారరామునతండ్రి కంపిలిరాయఁ డనివక్కాణింపఁబడి యుండెను. కంపిలిరాయని తండ్రి ముమ్మడిసింగనయనియు, ఇతఁడు దేవగిరి రాజధానిగా మహారాష్ట్రదేశమును బరిపాలించిన సేవణవంశీయుఁ డగు రామదేవరాయనికొల్వున నొకదుర్గాధిపతిగ నుండి, యాతనిమరణానంతరమున నతనిమేనల్లుఁ డగు మల్లదేవుఁడు రాజ్యమాక్రమించుకొన నందున కియ్యకొనక, ముమ్మడిసింగన వాని నెదుర్కొని

కడసరింగమును బాసిసంహరించి, రాజ్యముతా నాక్రమించు కొని, తురకల మొత్తిడివలన దేవగిరిని విడిచివచ్చి, కంపిలిరాజధానిగఁ జేసికొని, కొంతకాలము పరిపాలనముచేసి మరణించె ననియు, అటుపిమ్మట వానిమంత్రియగు బైచప్ప యను నాతఁడు వానికుమారుఁ డగునకంపిలిరాయనికిఁ బట్టము గట్టెననియు, నా గ్రంథమున వర్ణింపఁ బడియుండెను. మఱియు నా గ్రంథమున కంపిలిపురమునఁ బ్రతిష్ఠాపింపఁ బడియున్న సోమేశ్వరదేవుని వర ప్రసాదమున జనించిన వాఁ డగుటచేతఁ దమకుమారునికిఁ గంపిలిరాయ డనిపేరు పెట్టిరనికూడ వక్కాణించి యున్నవాఁడు. కనుక బాలభాగవతమునఁ జేర్కొనఁబడిన కంపిలిరాయఁ డను నామ మొకవ్యక్తినామమే యైనయెడల కొటిగంటి రాఘవరాజు వీనిసైన్యములనేజయించి ‘ గండరగూళి ’ యనుబిరుదము గైకొన్నవాఁడని చెప్పవలసి యుండును. కంపిలిరాయఁ డనునది వ్యక్తినామముగాక కంపిలిప్రభు వనియర్థము చేసికొన్నపక్షమున మఱియొకవిధముగాఁ జెప్పవలసియుండును.

ఈవంశములోని రెండవశాఖకు సంబంధించిన విజయధ్వజునివంశము లోనివాఁడగు జంబుకేశ్వరరాయ లానెగొంది పురమున కధీశ్వరుఁడై యున్నకాలమున ఢిల్లీచక్రవర్తి పక్షమునఁ బ్రతినిధిపాలకుఁడుగా ఘూర్జరదేశమును బాలించుచున్న ‘ బహాఉద్దీ ’ నను వాఁడు చక్రవర్తిని నలక్ష్యము చేసి స్వతంత్రపరిపాలనముచేయ నారంభించినపుడు వానిజయించి పట్టుకొని వచ్చుటకై చక్రవర్తి ‘ ఖాజాజెహాన్ ’ అనువానికిఁ గొంతసైన్యము

నిచ్చి పంపఁగా నతఁడు 'బహాఉద్దీన్' సైన్యములను దలపడి యుద్ధమున జయించి వానిం బట్టుకొనఁ బ్రయత్నించెను గాని వాఁడు తప్పించుకొని పాఱివచ్చి ఆనెగొందిపురాధీశ్వరుఁ డైన జంబుకేశ్వరరాయలను శరణువేఁడగా నతఁ డభయదాన మొసంగెను. జంబుకేశ్వరుఁడు 'బహాఉద్దీ' నునకు రక్షణ మొసంగె నను సమాచారమును చక్రవర్తి విని కోపోద్దీపితుఁడై ప్రఖ్యాతిఁగాంచిన చెందేరి, బుదాఘాను, మాళవసైన్యముల నసంఖ్యాకముగాఁ జేర్చుకొని దండెత్తివచ్చి యానెగొందికి సమీపమున నున్నకంపిలిదుర్గమును ముట్టడించి హిందూసైన్యము నోడించి యాదుర్గమును తొలుత స్వాధీనపఱచుకొని 'మల్లికునాయబు' అనువానినిఁ దనకుఁ బ్రతినిధి పాలకునిగా నియమించి కొంతసైన్యముతో వానినచట నిలిపి యానెగొంది ముట్టడింపఁ బోయెను. ఈభయంకరమైనవార్త విని జంబుకేశ్వరరాయలు తనసేనల నన్నిటిని సమకూర్చుకొని తాను ముందుగా నెదురు వచ్చి మారుకొని ఘోరసంగ్రామము గావించెనుగాని తనకు జయముకలుగు నన్నధైర్యము లేకపోవుటచేతను, శరణాగతుఁ డైన బహాఉద్దీనుని వానికి వశ్యపరచి తానానిపత్తునుండి తప్పించుకొనుట ద్రోహమని తలపోయుట చేతను, తెంపరితనము వహించి తనస్త్రీల నెల్లర నగ్నిప్రవేశ మగునటులు గావించి శత్రువుల మార్కొని ప్రాణములున్నంతవఱకుఁ బోరాడి తుదకు వీరస్వర్గమును గాంచెను. మహమ్మదుబీన్‌తుఘ్లక్ ఆనెగొందినిబట్టుకొనియెను. ఇతనికి దాయాదు లయినకోటిగంటిరాఘవరాజును,

వీనికి సవతిసోదరుఁడయినసోమదేవరాజు లీసమాచారము దెలియరాఁగా నన్నదమ్ము లిరువురును విశేషసైన్యముల సమకూర్చుకొని కోటిగంటిరాఘవుఁడు కంపిలిదుర్గమును, మల్లికునాయబు సైన్యములను, సోమదేవుఁడు మహమ్మదుబీన్‌తుఘ్లఖ్ సైన్యములను ముట్టడించి ఘోరసంగ్రామము సలిపియుందురు.

కంపిలిరాయఁడయినమల్లిక్‌నాయబుని సైన్యముల నెదుర్కొని యుద్ధముచేసి యపారవిజయమును గాంచి వానిని దేశమునుండి తరుమఁగొట్టి 'గండరగూళి' యనుబిరుదమును బొందినవీరయువకుఁడు కోటిగంటిరాఘవరాజేగాని యన్యుఁడు గాఁడని తలంపవలసి యుండును. రాఘవరాజు కోటిగల్లుదుర్గమును స్వాధీనపఱచుకొని తద్దుర్గాధ్యక్షుఁడుగ నుండుటచేత నే కోటిగంటిరాఘవరాజనిద్విపదబాలభాగవతమునఁ జెప్పఁబడుట సంభవించెను. ఇతఁడువహించిన 'గండరగూళి' యను బిరుదమునే వీనితరువాత నళియరామరాజు పెదతండ్రి యగునవుకుతిమ్మరాజువహించియున్నటుల "సంగరాంగణచర్యకంపిలిరాయసప్తాంగగండరగూళిసద్బిరుదాది సంగ్రహప్రాణోజ్జ్వలా" యనుపద్యబాలభాగవతములోనివాక్యమువలన గన్పట్టుచున్నది. ఈతిమ్మరాజుకాలమున కంపిలిరాజ్యము లేదు. కావున నితఁ డారాజ్యమును జయించి సాధించినబిరుదము గాదు. అయినను పూర్వులువహించినబిరుదములఁ గూడవంశపారంపర్యముగఁ దత్సంతతులవారు వహించుట గలదనిసమన్వయించు కొనవలయును.

## — సోమదేవరాజు —

తాతపిన్నమరాజునకు ద్వితీయభార్యయైన గొంకలదేవి యందుసోమదేవుఁ డనుమఱియొకకుమారుఁడు పుట్టెను. ఈసోమదేవరాజు సల్పినవీరకృత్యము లత్యద్భుతములుగా నున్నవి. ఈవీరయోధునికాలము దెలిసికొనుట కొక్కనామముతోఁ గూడుకొన్నచరిత్రాంశ మొకింత సూచింపఁ బడుచున్నది. ద్విపదబాలభాగవతమునందు :—

“ మఱియు నతండాజి మహనుదుమలక
గరకరియలిగి యగ్గలికఁ బుట్టించి
బెలుకురి యాతండు బిడ్డపే రిడిన
దలకెల్లఁ దొలగించి దయచేసి కాఁచె
తెలివి నర్వదినూరు తేజీల నచట
గలుగునర్థులకు దానంబుగా నొసఁగె. ”

అనియును, మఱియు నరపతివిజయమునందు.

“ సీ. కదనరంగంబునఁ గరితురంగమవీర
వితతితోఁ బలుమాఱు విఱుగఁదోలి
యమితోగ్రశౌర్యు మహమ్మదుఁ బట్టి నీ
పేరు పెట్టెదన కుమారున కది
గాక భవత్పాదకమలంబు నుదు రంట
దండంబుఁ బెట్టెదఁ దన్నుఁ గాచి

విడువు మన్నను గాచి విడిచి యర్థులకును
షష్టిశతంబుల నశ్వముల వాని
తే. చేత నిప్పించి శరణన్నఁ బ్రీతిఁ గాచు
బిరుదు తగు నీతని కె యని ధరణిపతులు
సన్నుతింపఁగ నాదిరాజన్య చర్యఁ
దేజరిలె సోమదేవ ధాత్రీవరుఁడు. ”

అని వర్ణింపఁబడుటవలన నీసోమదేవరాజు తన శత్రువును మహాపరాక్రమవంతుఁడు నగు మహమ్మదుమలకను పలుమాఱు యుద్ధములలో జయించుటయె గాక యొకప్పుడు వానిని పట్టుకొని బంధించి నప్పుడాతఁడు 'రాజన్యా! నీపాదములను బట్టుకొని నమస్కరించుచున్నాను; నాకుమారునకు నీపేరుపెట్టెదను; నన్నుఁగాచి రక్షించు' మని వేఁడుకొనఁగా దయతో వానిని విడిచిపెట్టి వానిచేత నర్థులకు నాఱువేల యశ్వముల దానమిప్పించెనని దెలియుచున్నది! ఇందు పేర్కొనఁ బడిన మహమ్మదుమలక క్రీ. శ. ౧౩౫౮ మొదలు ౧౩౭౫ వఱకుఁ బదునేఁడు సంవత్సరములు కలుబరగి పట్టణము రాజధానిగాఁ బరిపాలనము చేసిన బహమనీసుల్తానగు మొదటి మహమ్మదుషాహా యని రంగస్వామి సరస్వతిగారు గుర్తింపఁగా డాక్టరు కృష్ణస్వామి అయ్యంగా రామోదించినారు. ఇంతటితో విరమించినఁ జక్కఁగానుండెడిది. అట్లుగాక సోమదేవరాజు విజయనగరచక్రవర్తులలో మొదటివారలయిన హరిహర, బుక్క, రెండవ హరిహరుల సేనానులలో నొక్కఁడయియుండవలయు ననిగూడ రంగ

స్వామిసరస్వతిగారు వ్రాయుచున్నారు. 5 మహామ్మదుమ లకబహామనీసుల్తా నగుమొదటిమహామ్మదుషాహ యని సంశయ మావంతయు లేక యూహించి నపుడింతకన్న నెక్కువయూహ కవకాశమిచ్చు టసంభవము.

ద్విపద బాలభాగవతమునఁ గాని, నరపతివిజయమునఁ గాని వర్ణింపఁబడిన సోమదేవుని వీరకృత్యములుగాని, బిరుదు గద్యములుగాని తదితరచర్యలుగాని వీరియూహలను బలపఱ చునవి గావు. ఏమన సోమదేవునివీరకృత్యము లన్నియు బహ మనీరాజ్యము దక్కనులో స్థాపింపఁబడుటకుఁ బూర్వమె జరిగిన వనియాగ్రంథములలోని వర్ణన లవకాశ మిచ్చుచున్నవి గాని యటుపిమ్మట జరిగినవిగా నవకాశ మిచ్చుచుండలేదు.

"నయవిశారదుఁడు పిన్నయసోమ విభుఁడు
జయశాలి భూపాల సార్వభౌముండు."

అని కోనేరునాథకవి ద్విపదబాలభాగవతమునఁ జెప్పి యుండినవిషయము కవివర్ణనాంశ మైనయతిశయోక్తిగ భావిం పరాదు. అట్లుభావించుట సత్యచరిత్రమునకు వెల్తి కల్పించిన వార మగుదుము. ఇక్కాలమున మనము సోమదేవుఁడుసార్వ భౌముఁ డయినదియు లేనిదియుఁ గుర్తింపఁ జాలనంతటిదౌ ర్భాగ్యస్థితియందున్నను, ఇంచుక జాగరూకతతో నాకాలరాజ కీయపరిస్థితులను బరిశీలించితి మేని సత్యము గోచరింపక మా

(5) Sources of Vizianagar History Introduction p. 7 No. 28 p. 80.

నదు. ఆకాలమున నొకస్వతంత్ర సామ్రాజ్యమును నిర్మాణముఁ
జేయసంకల్పించిన హరిహరబుక్కరాయాదులవలెఁ జాళుక్యసా
మ్రాజ్యమువంటి యొకస్వతంత్ర సామ్రాజ్యమును నిర్మాణ
ముఁజేయసంకల్పించి సార్వభౌమబిరుదము వహించి కృషిచేసిన
యొకస్వతంత్ర ప్రభు వనియె మనము నిశ్చయింపవలసియుం
డును గాని కర్ణాట సామ్రాజ్యాధీశ్వరు లగుహరిహరబుక్కరా
యాదులకు లోఁబడి పరిపాలనముచేయుచు బహమనీసుల్తా నను
మొదటిమహమ్మదుషాహాతోఁ బోరాడినవాఁ డనియూహింప
రాదు. ఇతనిబిరుదములలో "మాళవరాజేంద్రమస్తకశూల"
యనియు, 'హొసబిరుదురగండ' యనియు, రెండుబిరుదము
లున్నట్లు బాలభాగవతమునందును, నరపతివిజయమునందును
బేర్కొనఁబడి యున్నవి. ఈరెండుబిరుదములు నీతఁడు హరి
హరబుక్కరాయాదులకు సామంతుఁడు గాఁడని విశ్వసించుటకుఁ
దోడ్పడుచున్నవి. ఎట్లన మాళవరాజేంద్రుఁడు ఢిల్లీసుల్తా నగు
'మహమ్మదు-బీన్-తుఘ్లఖు' నకుఁ గప్పము గట్టుసామం
తుఁడుగాని బహమనీసుల్తా నగుమహమ్మదుషాహాకు సామం
తుఁడు గాఁడు. ఈబిరుదములనుబట్టి యితఁడు క్రీ. శ. ౧౩౧౦
౧౩౪౭ సంవత్సరముల మధ్యకాలమున నున్నట్లు మనము నిశ్చ
యింపవలసి యుండును. ఈకాలమున ఢిల్లీచక్రవర్తు లగు
మహమ్మదుమతస్థులు విజృంభించి మూఁడుహిందూస్వతంత్ర
సామ్రాజ్యములను నాశనముఁ గావించి దక్షిణహిందూస్థా
నము సంతటను గల్లోలము గావించిరి. క్రీ. శ. ౧౩౧౮లో

దేవగిరి రాజధానిగాఁ గలమహారాష్ట్రసామ్రాజ్య మడుగంటినది. ౧౩౨౩లో నోరుగల్లు (ఏకశిలానగరము) రాజధానిగా గలయాంధ్రసామ్రాజ్యము విచ్ఛిన్నమైపోయినది. ౧౩౨౭ లో హొలెవీడు (ద్వారసముద్రము) రాజధానిగాఁ గల ప్రాచీనకర్ణాటసామ్రాజ్యముభగ్నమైపోయినది. అంతటితో నిరుత్సాహముఁ జెంది హతశేషు లగుమహారాష్ట్రాంధ్ర కర్ణాటవీరులూరకయుండలేదు. నూతనస్వతంత్రసామ్రాజ్యములను స్థాపింపవలయు నని విశ్వప్రయత్నములను గావించి హిందూసంఘమతసంరక్షణమే ప్రధానాదర్శముగాఁ బెట్టుకొని నూతనశత్రువు లగుమహమ్మదుమతస్థులు దక్షిణహిందూస్థానమున స్థావర మేర్పఱచుకొనకుండఁజేయవలె నని వీరాగ్రగణ్యులై ప్రవర్తించి తమజీవితముల ధారపోసిరి. అట్టి మహావీరులలోనివాఁడు సోమదేవుఁడు. వీనికాలమున మనము గుర్తించుటకు మూవ్వురుమలకలు గొప్పవారు గాన్పించుచున్నారు. వారిలో నిరువుర సమానపరాక్రమవంతులు. వారిరువురే దక్షిణహిందూదేశముపై పెక్కుదండయాత్రలు సాగించి దక్షిణదేశమునంతయు సంక్షోభముఁ జెందించినవారు. 'అల్లాఉద్దీన్‌ఖిల్జీ' అను ఢిల్లీచక్రవర్తిబానిసవాఁడయిన 'మలిక్‌కాఫర్' అనువాఁడు మొదటివాఁడు; ఢిల్లీ చక్రవర్తియై 'మహమ్మద్-బిన్-తుఘ్లఖ్' అనుబిరుదమును బొందిన 'మలిక్‌ఫకరుద్దీన్‌జూనా' అనువాఁడు రెండవవాఁడు. ఈరెండవవాఁడు క్రీ. శ. ౧౩౨౫ వ సంవత్సరమున ఢిల్లీసిం

హాసనము నధిష్ఠించుటకుఁ బూర్వము 'అలూఫ్‌ఖాన్' అను నామాంతరము గూడఁ గలిగి యుండెను. 'మలిక్, ముల్క్,' శబ్దములను 'మల్కి, మలక, ముల్కి, ములక' యనుశబ్దములనుగా మార్చి తెలుఁగుకవులు తమతమప్రబంధములలోను, శాసనములలోను ప్రయోగించి వ్యవహరించుట గలదు. కనుక బాలభాగవతమున 'మహమ్మదుమలక' యని చెప్పఁబడినవాఁడు మహమ్మదుబీన్‌తుఘ్లఖ్ అని బిరుదముఁ బొందినమలిక్ ఫకీరుద్దీన్‌జూనా యనురెండవవాఁ డనినాయభిప్రాయము. ఇతఁడు క్రీ. శ. ౧౩౩౮ సంవత్సరమునఁ దనకు శత్రువగు 'బహాఉద్దీను' నకు రక్షణ మొసంగినాఁ డనుకారణముచే జంబుకేశ్వరరాయలపై దండెత్తివచ్చినాఁ డనియు నాయుద్ధములో జంబుకేశ్వరుఁడు వీరమరణము నొందఁగా నీదుర్వార్త విని బహుళసైన్యముతో వచ్చి కళ్యాణపురాధీశ్వరుఁడయినసోమదేవరాజు మహమ్మదుబీన్‌తుఘ్లఖ్‌సైన్యములఁ దలపడి కదనరంగమున వానినోడించి పరిభవించిపంపినవిషయమును రాఘవరాజును గూర్చి వ్రాయుసందర్భమున సూచించియున్నాను. ఈసంవత్సరమునాటికి బహమనీరాజ్యముగాని విజయనగరరాజ్యముగాని యేర్పడి యుండలేదు. ఈయుద్ధమునుగూర్చి మహమ్మదీయ చరిత్రకారులు వేఱువిధముగా వ్రాసినారు. ఈయుద్ధములోఁ జక్రవర్తికే జయముగలిగె ననియు, ఆనెగొంది వానివశమయ్యె ననియు, బహాఉద్దీనునితోఁ బాటు మఱియిర్వురు మంత్రివర్గములోఁ జేరినవారిని చెఱపట్టె ననియు, వారిలో జంబు

కేశ్వరునిమంత్రి హరిహరరాజును, కోశాధ్యక్షుఁడగుబుక్కరాజు గూడ నుండె ననియు, ఢిల్లీచక్రవర్తి రాజ్యమును వశపఱచుకొని యాప్రదేశమునకు 'మలిక్‌నాయబ్' అనువాని నధికారినిగా నేర్పఱచి చెఱపట్టి యుంచినయిర్వురిని వెంటఁ దీసికొని ఢిల్లీనగరమునకు వెడలిపోయె ననియు, ఎప్పుడు చక్రవర్తి వానిసైన్యములతోఁ దమదేశమును విడిచిపెట్టి వెడలిపోయెనో యానాటనుండియు 'మలిక్‌నాయబు' నకు ప్రజలు వశ్యులు గాక దిక్కరించి పోరాడుచున్నందున వారిశౌర్యోత్సాహములను స్వాతంత్ర్యప్రీతిని మెచ్చుకొని యచట రాజ్యముచేయుట తనకుసాధ్యము కాదని తలంచి చక్రవర్తికి దేశస్థితి సంతయుఁ దెలియఁ జేయఁగా నాతఁ డట్లేయూహించి తనకడ బందెలో నున్నహరిహరునకు రాజ్యము నొసంగి బుక్కరాజును వానికి మంత్రిగా నియమించి తమకుసామంతులుగనుండు నట్లొప్పించుకొని వారలను కారాగారమునుండి విముక్తులను గావించి వారిదేశమునకుఁ బంపినతరువాత 'మలిక్‌నాయబు' ను దనకడకు రప్పించుకొనె' ననియు మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసి యున్నారు. ఇవి సత్యములు కావు. ఈదండయాత్రలో మహమ్మదుబీన్‌తుఘ్‌లఖ్ గొప్పదెబ్బ తిన్నాఁడు. ఆదెబ్బతీసిన వాఁడు సోమదేవరాజు. ఈదెబ్బతో మహమ్మదు బీన్‌తుఘ్‌లఖ్ దక్షిణహిందూదేశ దండయాత్రలు సాగించుట నిలిచిపోయినది. చక్రవర్తి యంతటివాని నోడించి కదనరంగమునఁ జెఱపట్టుటయు, అతఁడు 'మహాప్రభూ ! నాకుమారునకు

నీపేరు పెట్టుకొందును ; నన్ను రక్షించివిడువు మనిపాదములను బట్టుకొని వేడుకొన్నందున శరణాగతరక్షణము వీరపురుషధర్మము గావున వానిఁ బాటించి వానివిడిచిపుచ్చి తనసర్దారులుకోరఁగా నాలువేలయశ్వములను వానిచేత వారల కిప్పించుటయుఁ దట స్థించె నపుడు కలిగిన నవమానముకంటె నెక్కువయవమాన మేముండును ? దీనిని గప్పిపుచ్చఁగోరి మహమ్మదీయచరిత్ర కారులు పైవిధముగాఁ గథ మార్చి వ్రాయుట సంభవించినది గాఁ దోఁచుచున్నది. ఈపరిభవమును చక్రవర్తి భరియింపఁ జాలక పిచ్చిపట్టిపోయి తనరాజధాని ఢిల్లీనగరమునుండి దేవ గిరికి మార్చవలె నని ప్రయత్నించెను. ఢిల్లీ పురవాసు లను బెక్కండ్రు ధనికులను ఢిల్లీ విడిచి రావలసిన దని నిర్బంధపఱచెను. అనేకవేలసంఖ్యలవారిని ఢిల్లీనుండి బయ లుదేఱఁ దీయఁ గలిగెనుగాని వారెవ్వరును ప్రాణములతో దేవగిరి చేరియుండలేదని ఇబూబచూతా ' యనుచరిత్రకా రుఁడు వ్రాసి యుండెను. ఇతఁడు చక్రవర్తికి సమకాలికుఁడు గావున గొంతనిజముచెప్పి యుండు నని విశ్వసింపవచ్చును. ఆనెగొందిపై సాగించినదండయాత్రలోఁ గూడ ప్రఖ్యాతము లయినమాళవసైన్యము లుండి వానిపక్షమున హిందూరాజు లతోఁ బోరాడియుండిరి గావునఁ దత్సైన్యముల కధికారిగనున్న సేనాని తురకసర్దారుని జయించియుండుటచేతనే సోమదేవరా జును ' మాళవరాజేంద్రమస్తకశూల ' యనుబిరుదముగలవా నిగా బాలభాగవతగ్రంథకర్త వక్కాణించుట సంభవించెను.

ఇతఁడు వహించిన ‘ఆకులపాటివీరక్షేత్రభారతీమల్ల; ముదిగంటి భారతీక్షేత్రమల్ల; ఆనెగొంది వీరక్షేత్రభారతీమల్ల; కుంతివీరక్షేత్రభారతీమల్ల; ఆకులపాటిముదుగంట్యానెగొందికుంతిసరవిజయలక్ష్మీసమక్షీకరణలక్షిత; వీరక్షేత్రభారతీమల్లబిరుదభరితానుభావ;’ అనుబిరుదమును సోమదేవునకును ఢిల్లీచక్రవర్తి యగుమహమ్మదుబీన్‌తుఘ్లఖునకును జరిగిన యుద్ధములందుఁ జై చెప్పినయానెగొందిసమీపదేశమంతయును వీరక్షేత్రముగా (యుద్ధరంగము) నుండె నని దెలుపుచున్నది. మఱియు నితఁడు సర్వతంత్రస్వతంత్రుఁడై విజృంభించె నని చాటుచున్నది. ఇంతియగాదు. ‘హాసబిరుదురగండ, రాయరణరంగభీభత్స రాయరాహుత్తరగండఁ’ బిరుదములను వహించుట కర్ణాటసామ్రాజ్యాధీశ్వరునకు సామంతుఁడు గాఁడనియు స్వతంత్రుఁడనియు, వారలకుఁ బ్రతిస్పర్థిగాను శత్రువుగాను, నుండె నని దెలుపుచున్నవి. అట్లు ప్రతిస్పర్థవహించి పోరాడినవారు వీనికి సమకాలికు లయినకంపిలిరాయఁడును, వానిమంత్రులును వాని తరువాత రాజ్యపరిపాలనమునందు ఢిల్లీచక్రవర్తిచేత నెలకొల్పఁబడినవారును నగుహరిహరరాయలును, బుక్కరాయలు నైయున్నారు. పయిబిరుదము లన్నియును సోమదేవరాజు హరిహరరాయ లనువానితమ్ముని బుక్కరాయలను తుంగభద్రానదికుత్తరభాగమునుండి దక్షిణభాగమునకుఁ దఱిమిచరిత్రభాగమును దెల్పుబిరుదములుగాని యన్యములు గావు. హాసబిరుదుగలవారు హాసపట్టణవాసు లగువీరులకుఁగాని తత్కాలకులకు

గాని వర్తింపఁ గలదు. వారికి మృత్యుప్రాయుఁ డనునర్థముననే 'హొసబిరుదురగండ' బిరుదము వర్తించు ననిస్ఫురింపను. రాయరణాంగమును భీభత్సము చేయువానికే 'రాయరణరంగభీభత్స' యను బిరుదమును, రాయనిరాహుత్తులకు మృత్యుప్రాయుఁ డగువానికే 'రాయరాహుత్తురగండ' బిరుదమును వర్తింపఁ గలవు. మఱియు, 'సకలనరదేవచూడామణి' యనుబిరుదము స్వాతంత్ర్యుఁడైనరాజునకు వర్తించునదిగాని యొకసామంతప్రభువునకు వర్తింపరానిది. అట్టిబిరుదము సోమదేవునకుఁ గలదు. క్రీ. శ. ౧౩౪౭ వ సంవత్సరమున 'హసన్‌గంగూ' బహమనీరాజ్యమునుస్థాపించుటకుఁ బూర్వము సోమదేవరాజుకళ్యాణపురమును గాని, ఆనెగొంది రాజధానిగా నొకమహాసామ్రాజ్యమును నిర్మాణముఁ జేయవలయు ననిసంకల్పించి వీరాగ్రగణ్యుఁడై కృష్ణాతుంగభద్రానదీమధ్యస్థభూభాగము వీరక్షేత్రముగాఁ జేసికొని విహరించినది సత్యమని యొప్పుకొనకతప్పదు.

క్రీ. శ. ౧౩౩౬ వ సంవత్సరమున విద్యానగరమునిర్మింపఁబడినట్లును, దానిని రాజధానిగాఁ జేసికొని మొదటిహరిహరరాయలు పరిపాలనము చేసినట్లును, మొదటిహరిహర, బుక్కరాజుల కాపలూరు, ఎరగుడిపాడు శాసనములవలనఁ దెలియుచున్నది. తుంగభద్రానది కుత్తరభాగము నందలి దేశమును సోమదేవరాజును, దక్షిణభాగమును మొదటిహరిహరరాయలును నేకకాలమునఁ బరిపాలించుచుండిరి. సోమదేవరాజు తుంగభద్రకు దక్షిణమున నుండు దేశమును బరిపాలించి యుండలేదు.

ఇతనిబిరుదగద్యములో "ఏకదివసఘటికైకఘాటీహఠావృతకోట రాచూరుసాతానికోటకందనవోలుయాతగిరికలువకొల్లు మొసలి మడుగుగంగినేనికొండాభిధానసప్తదుర్గవర్తి" యనునద్భుతబిరు దమున్నట్టు గన్పట్టుచున్నది. (1)

ఒక్కదినములోపలనే కోటరాచూరు, సాతానికోట, కందనవోలు, యాతగిరి, కలువకొల్లు, మొసలిమడుగు, గంగి నేనికొండ దుర్గముల నీతఁడు స్వాధీనపఱచుకొనియె నని పై బిరు దము దెలుపుచున్నది.

ఈయేడుదుర్గములను 'వరుసతో సాధించి' యని నర పతివిజయమునందుండి ఒక్కనాఁడే లగ్గలఁగొన్న ప్రస్తావము

---

(1) బిరుదుగద్యము:—"జయజయ, నిఖిలమహాభాగవతముఖ్యవిఖ్యా తకీర్తి, ఏకదివసఘటికైకఘాటీహఠావృతకోటరాచూరుసాతానికోటకందన వోలుయాపగిరికలువకొల్లుమొసలిమడుగుగంగినేనికొండాభిధాన సప్తదుర్గవ ర్తి, స్థలదుర్గగిరిదుర్గజలదుర్గవనదుర్గచౌరాశిదుర్గవిఘాల, సముద్ఘుష్యమానబిరు దాపదానహాళహాళికాకర్ణనపులకితకపోల, నాకులపాటిముదుగంట్యానెగొం దికుంతిసరవిజయలక్ష్మీసమక్షీకరణలక్షిత, ఆకులపాటివీరక్షేత్రభారతీమల్ల, ముదుగంటివీరక్షేత్రభారతీమల్ల, ఆనెగొందివీరక్షేత్రభారతీమల్ల, కుంతివీర క్షేత్రభారతీమల్ల, వీరక్షేత్రభారతీమల్లబిరుదభరితానుభావ, స్వభావగాం భీరాంభోనిధి, సత్యగుణవాసుదేవ, సకలనరదేవచూడామణి, అసిభరణ పటిమసహదేవ, ఆదిదేవ, సుపర్వమణీమణిస్తుత, వరద, భయద, హొసబి రుదరగండ, వీరప్రతాపబిరుద, బిరుదుమన్నెరగండ, పురిగోలసురత్రాణ, శరణాగతత్రాణబిరుద, రాయరణరంగభీభత్స, రాయరాహుత్తరగండ, మైవరగండ, గండరగండ, తాతపిన్నమరాజతనూజ, సోమదేవరాజ, విజయీభవ, దిగ్విజయీభవ."

లేనికతన మామిత్రులగు రంగస్వామిసరస్వతిగారు నరపతివిజయమునం దట్లుగానరాదనియు నియ్యది తరువాతి కాలమున కడపటిసామ్రాజ్య దర్బారులచేఁ గల్పింపఁ బడినదనియు నభిప్రాయపడిరి. కాని నరపతివిజయము కన్నను బూర్వము క్రీ. శ. ౧౪౬౯ సంవత్సరమున రచింపఁబడిన బాలభాగవతమునందు "ఒక్కనాఁడు లగ్గలుగొన్నవాఁడు" అని వ్రాయఁబడిన విషయము వారెఱింగి యుండరు. పై బిరుదు గద్యముగూడ రామరాజీయములోనిదని యెత్తి తమగ్రంథమునఁ బ్రకటించియుఁ దిన్నగ చూడక వ్రాసినది. బాలభాగవతమునందు:—

"నరులకసాధ్యమైన మొసలిమడుగు
ధరనెన్నఁ దగినసాతానికోటయును
కడుచుతింపఁగఁ జాలు కందనవోలు
కడిమి విశేషంబు గలకల్వకోలను
అరుదైనరాచూరు నల యాతగిరియు
నిరుపమంబగు గంగినేని కొండయును
ననఁగ నొప్పారు నేహైన దుర్గముల
వినుత ధాటీమహావేశంబు నెఱపి
సురపతియోగి యాశుభ్రాంశవంశ
కరుఁ డొక్కనాఁడు లగ్గలు గొన్నవాఁడు"

ఒక్కనాఁ డెట్లుసాధ్యమగునని రంగస్వామిసరస్వతిగారి తలంపు సోమదేవభూపాలుఁడు తనసైన్యములనేఁడు భాగములుగ విభజించియాసైన్యములొక్క దినమున నేయాయేఁడుదుర్గములను

మట్టుపెట్టించి స్వాధీనపఱచు కొనుటకు నసాధ్యమేమిగలదు? శత్రు పక్షము నవలంభించి తన యధికారమును పాలనమును తిరస్క రించిన, సాహసికులును, పౌరుషవంతులునైన, అడబాలనా యకుని, వీరినేడును రుద్రప్పనాయని, గౌరారెడ్డిని, గంగినా యకుని సింగంబు మత్తమతంగజములను బట్టుకొనుకై వడి సం గ్రామరంగంబున సంహరించి కీర్తిచే నసహాయుండునై రిపు లెల్ల గగ్గోలుపడునట్లు చట్టలుచీరించి గంగినేనికొండ ప్రాగ్ద్వార సీమను గంబముల బాతించి తోరణగాఁ గట్టించినాఁడని,

" దండిమీఱంగ నాతఁడు గంగినేని
కొండలగ్గలచేతఁ గొని యంచుపరుల
నుడియంగనీని గుజ్జులవీరినేని
నడబాలయన్న రుద్రప్పనాయకుని
ఘనుని గౌరారెడ్డి గంగినాయకుని
గినిసిసరిపులెల్ల గగ్గోలుపడగ
చట్టలుచీరించి సంరంభ మెసఁగఁ
గట్టించెఁ దూరుపుగవని కంబముల " అనియును,
నరపతివిజయమునందును,

" సీ. బలవంతుఁడగు నడబాలనాయకునిని
శూరుఁడౌ గుజ్జుల వీరినేని
రౌద్రసోన్నద్రు రుద్రపాధిపు మహా
శౌర్యు గౌరారెడ్డి సాహసాంకు

గంగినాయకుని సంగ్రామరంగంబున
సింగంబు మత్తమతంగజములఁ
బట్టుకై వడిఁబట్టి చట్టలె త్తించి కి
న్కను ససహాయుండునై గంగినేని
గీ. కొండ ప్రాగ్ద్వారసీమ నుద్దండవృత్తిఁ
గంబములఁ బాతి తోరణగాఁగఁ గట్టి
వినుతికెక్కెను సకలభూజనులచేత
సోమదేవనృపాల సుత్రాముఁ డెలమి ”
అనియును భయంకరములయిన వీరకృత్యములు వర్ణిం
పఁబడియెను. ఇట్లేబాలభాగవతమునందు,
“ మణిగిల్లదుర్గంబు మదిలోనఁ గలఁగు
కణకదాడిగనేడి కైకొనినిలిచి
గోనంగిమన్నేని గుపితాన్యనృపతి
శాసకుం డగుట మస్తకము గొట్టించి
అరసి తత్పట్టణాగ్రతటాక
భైరవుముంగల బలి యొసగించె. ”
నని మఱియొకవీరకృత్యము వర్ణింపఁ బడినది. ఈరీతిగా
నన్యనృపతిశాసకు లయినదుర్గాధిపతుల నెల్లరనుజయించి కళ్యా
ణపురమునకును కంపిలికి నడుమనుండుదేశమును బరిపాలించిన
యాంధ్రరాజీసోమదేవుఁడని దెలియ నగును. ఇతఁడు పెక్కు
యజ్ఞము లాచరించి నట్లు బాలభాగవతమునందును నరపతివిజ
యమునందును దెలుపఁ బడియెనుగాని నమ్మనర్హ్యమైనదిగాదు.

బాలభాగవతము తెలుఁగుభాషయందు వ్రాయఁబడినగ్రంథము గుటచేత విజయనగరసామ్రాజ్యచరిత్రమును రచించినవిదేశీయులైనగ్రంథకర్తలు కేవలము ఫెరిస్తా మొదలగుమహమ్మదీయ చరిత్రకారులవ్రాఁతల నాధారముచేసికొని హిందూపక్షమును విస్మరించి వ్రాయవలసినవారయిరి. కాని సోమదేవునిచేఁ బలుమాఱులు కదనరంగమున నోడింపఁబడి తుదకుఁ బరిభవింపఁబడినమహమ్మదుమలక బహమనీసుల్తానగు మహమ్మదుషాహా కాఁడని నాయభిప్రాయము.

## —◆ రాఘవరాజు ◆—

సోమదేవరాజునకుఁ గామలదేవియందుఁ బుట్టినకుమారుఁడు రాఘవరాజని దెలియుచున్నది. వీనిగుఱించి ద్విపద బాలభాగవతమున నేమియుఁ దెలుపఁబడి యుండలేదుగాని పద్యబాలభాగవతమునఁ గురుశౌర్యధైర్యభాసురుఁడు రాఘవదేవవసుధేశుఁ డనియు, నరసభూపాలీయమున 'ఘనభుజాశౌర్యరాఘవుఁడు రాఘవదేవధరణీశుఁ' డనియు మాత్రము వర్ణింపఁ బడెను. నరపతివిజయమునందు,

"చ. పరబలవేది రాఘవనృపాలుఁడు పంకజనాభుంగూర్చియ
ధ్వరములు నగ్రహారము లుదాత్తమతిన్ దగఁ జేసిధారుణీ
సురుల కొసంగెఁ బర్వముల శుద్ధసువర్ణగవాదిదానముల్
గరిమను బిన్నశౌరినిజగద్వినుతున్ ఘనుఁగాం చె వేడుకన్."

ఇతఁడు విష్ణువునుగూర్చి జన్నములను గావించి భూసురులకు నగ్రహారములు మొదలగుదానములను బెక్కింటిని జేసెనని మాత్రము దెలుపుచున్నది. 'వాసుదేవచరణకమలసేవాసక్తచిత్త' అన్నబిరుద మీతని కున్నట్లు దెలిపియుండుటఁజూడ నీతఁడు విష్ణుభక్తుఁ డయినవైష్ణవుఁ డని దెలుపఁ గలదు. మఱియు, "యవనబలమర్దనోత్సాహ" యన్నబిరుద మీతఁడు తురుష్కులతోడను "తుళువబలసంహారవీర" యన్నబిరుదము కర్ణాటకులతోడను బోరాడుచున్నట్టు దెలుపఁ గలవు. 'శబరకులబలనిహననవినోద' యన్నబిరుద మితఁ డాటవికులయినమన్నె దొరల నిర్జించె నని తేఁటపఱచు చున్నది.

ఈరాఘవదేవనృపతి యొకప్రక్కను బహామనీసుల్తానులతోడను మరియొకప్రక్క బుక్కరాయలతోడను బోరాడుచుండి తుదకు నేయుద్ధముననో మరణముఁ జెందియుండును. వీనియవసానకాలమున వీనిరాజ్యముయొక్క యుత్తరభాగము బహామనీసుల్తానులును దక్షిణభాగమును బుక్కరాయలును దమతమ సామ్రాజ్యములలోఁ జేర్చుకొని యుందురు. అందుచేతనే పై గ్రంథములలో నేమియు వక్కాణింపఁ బడియుండ లేదు. ఇతనికిఁ బాచలదేవియందుఁ బిన్నభూపాలుఁడు జనించెను.

## పిన్న భూపాలుఁడు

బాలభాగవతమునందు,

అతనికిఁ "బిన్నభూపాగ్రణి యొదవె
సతతసౌభాగ్యబాచల దేవియందు

"ఆపిన్నభూపాలుఁ డారెవీ డనఁగ
నేపారుపురి దన కిరవుగా నిలిచి
సకలమహీపాల జాలంబు గొలువ
ప్రకటితతేజుఁడై రాజ్యంబుఁ జేసె"

అనిమాత్రము చెప్పియుండెనేగాని యతఁడు స్వతంత్రపరిపాలనము సాగించెనో బుక్కరాయలకు సామంతుఁడై యుండెనో దెలిపి యుండలేదు. కాని కాలమునుబట్టి విచారించిచూడఁ గర్ణాటసామ్రాజ్యాధీశ్వరుఁ డగుదేవరాయమహారాయలకు సామంతుఁడుగ నుండెనని యూహింపఁ దగును. వీనింగూర్చియు విశేషవిషయములు గానరావు. ఆరెవీడుసోమదేవరాజునకె రాజధానిగ నుండె నని నరపతి విజయమునందుఁ జెప్పియుండిన విషయము సరియైనది కాదని విశ్వసింపవలసియుండును. బాలభాగవతమునందు సోమదేవుని ప్రతాపము నెక్కువగావర్ణించి యుండియు నావిషయము నెంతమాత్రము సూచించి యుండలేదు. సంగతిసందర్భములను బట్టి చూడ సోమదేవునకు నారెవీటికి సంబంధము లేదనియె తలంప నగును. కావున బాలభాగవతమునందుఁ జెప్పినరీతిని సోమదేవుని మనుమనికాలమున నతనిచే నారెవీడు రాజధానిగఁ జేసికొనఁబడియెననుటయే వాస్తవమని గ్రహింపఁ దగును. ఇతనికి నోబలదేవియందు బుక్కరాజు జనించెను.

## ఆరవీటి బుక్కరాజు

ఆరవీటి వంశావళియందు,

"ప్రభవించె నతని కోబళదేవియందు
ప్రభుమణి బుక్కభూపాల చంద్రుండు
యెక్కువగుణముల నియ్యారవీటి
బుక్కనరేంద్రుండు భువి బుట్టెనంత
వారిజాప్తోదయ వర్ణితవేళ
దారలగతియయ్యెఁ దక్కరాజులకు
నరనాథమణి సాళ్వ నరశింగరాయ
వరసఖుండయిబుక్కవసుధేశుఁ డమరె
బుక్కభూపాలుండు బుధులకు నెల్ల
దిక్కతండై యసంగఁ దేజంబు నందె."

అని యభివర్ణింపఁ బడియుండెను. ఇతఁడు నరనాథమణి యైనసాళ్వనరశింగరాయ భూపాలునకు వరసఖుండుగా నుండెనని చెప్పుటవలన నితనికాలమును మనము సరిగాగుర్తించుటకు సాధ్యమగుచున్నది. సాళ్వనరశింహరాయలు క్రీ. శ. ౧౪౪౭ మొదలుకొని ౧౪౬౫ వఱకును కర్ణాట సామ్రాజ్యమును బరిపాలించిన మల్లికార్జునరాయలకును ౧౪౬౫ మొదలుకొని ౧౪౭౮ వఱకుఁ బరిపాలనము చేసిన విరూపాక్షరాయలకును సమకాలికుఁడై వారలకు సామంతుఁడై యుండి కర్ణాట సామ్రాజ్యములోని చంద్రగిరి రాజ్యమును బరిపాలనము

సేయుచుఁ దరువాతసామ్రాజ్యము క్షీణించి దురవస్థపాలయి యున్నకాలమున స్వతంత్రుఁడై క్రీ. శ. ౧౪౮౭ వ సంవత్సరప్రాంతమున సామ్రాజ్యము నంతయుఁ దానేయాక్రమించు కొని శత్రుల నడంచి పట్టాభిషిక్తుఁడై బలిమిచే ౧౪౯౩ వఱకుఁ బరిపాలించిన వాఁడగుటచేత నాతని విజయయాత్రలందు నార్వీటిబుక్కరాజు పాలుగొనియుండె ననివిశ్వసింప వచ్చును. ఇంతియగాక యితనిబిరుదుగద్యమున 'సాళువనరసింహ రాయ రాజ్య ప్రతిష్ఠాపనాచార్య' అనుబిరుదము గన్పట్టుచుండుట చేతను, బాలభాగవతమునందు వరసఖుం డనివేర్కొనఁ బడి యుండుటచేతను రాజ్యప్రతిష్ఠాపనమునం దీతని ముఖ్యసేనాని యగు నీశ్వరనారసింహునివలె నీబుక్కరాయని సాహాయ్యమును సాళ్వనరసింహరాయలు పొందియుండె ననుట కెంతమాత్రమును సందియము లేదు. కనుకనే పద్యబాలభాగవతమునందు,

“అతఁడు దను మన్నెపులి యని యఖిలదిశల,
జెలఁగి పొగడ సాళువనరసింగరాయ
రాజ్యసంస్థాపకుం డయ్యెఁ బ్రౌఢి నారె
వీటిబుక్కనరేంద్రుఁ డుద్ఘాటితారి.”

అని యభివర్ణించి యుండెను. ఇతనిబిరుదుగద్య మిట్లున్నది. “జయజయ, స్వస్తి శ్రీసంతత వేంకటాచలపతిచరణారవిందసేవాకందళితసామ్రాజ్యసుఖోపభోగ, సాళువనరసింహరాయరాజ్యప్రతిష్ఠాపనాచార్య, శౌర్యగరిష్ఠ, సకలకళావిశారద, దైనందినవితరణ నానాదిగంతరాగతవనీపకజాలపరిపాలనగుణవి

శేష, అసహాయశౌర్య, సుమేరుధైర్య, అష్టాదశవిద్యాప్రజ్ఞాప్రవీణ, రాజకులాభరణ, రాజరాజేశ్వర, పిన్నశౌరిరాజతనూజ, బుక్కరాజ విజయీభవ, దిగ్విజయీభవ.”

ఇతఁడు మిక్కిలివృద్ధుఁడగువరకు దీర్ఘకాలము జీవించి మునిమనుమలఁజూచు నంతవఱకు, అనఁగా శ్రీకృష్ణదేవరాయలవారిపట్టాభిషేకమువఱకు జీవించి యుండె నని,

“చక్కెరవిలుకాని చక్కఁదనము గల్గి
చొక్కమా నార్వీటి బుక్కరాజ”

అనికుమారధూర్జటికవి తనకృష్ణరాయవిజయమునందు కృష్ణరాయలపట్టాభిషేకకాలమున నీవృద్ధనృపతి రాజాస్థానము నలంకరించియున్నవాఁ డని యభివర్ణించియుండుటచేత విశ్వసింపవలసి వచ్చుచున్నది. ఇతనిసంతతియే తామరతంపరలై దక్షిణహిందూదేశచరిత్రమునందు బహుప్రఖ్యాతి కెక్కినచరిత్రవంశముగా నున్నది. ఈవంశమె కొంచెమించుమించుగా మున్నూఱువత్సరములు మహమ్మదీయమతస్థులకు స్థావరము గలుగకుండఁ బోరాడుచుండిన యాంధ్రహిందూరాజవంశ మని నిస్సంశయముగఁ జెప్పవచ్చును. దక్షిణహిందూదేశసంరక్షణార్థమీరాజవంశము తనకుమారులను బెక్కండ్రను రణభూమికి బలిపెట్టి యసమానకీర్తిని సంపాదించుకొనియెను.

## ఆరవీటి రామరాజు

ఆరవీటిబుక్కరాజునకు అబ్బలదేవి, బల్లాంబిక యనునిర్వురు భార్యలు గలరు. వీరిలో అబ్బలదేవియందు సింగరాజు

మొదలగుకొమరులు జనించిరి. సింగరాజునంద్యాలపట్టణమున కధీశ్వరుఁడుగ నియమింపఁబడి పరిపాలించుటవలన నీతనివంశము వారికి నంద్యాలవారనియింటిపేరు గలిగినది. బుక్కరాజు రెండవభార్యయగుబల్లాంబికయందు ప్రకటగుణాఢ్యుఁ డగురామరాజు జనించెనని నరపతివిజయము నందుఁ దెలుపఁబడినది. బాలభాగవతమునందు,

"ఆమహీపతికి బల్లాంబిక యందు
రామనృపాలుండు రాజేంద్రుఁ డొదవె
హరిపాదతీర్థంబునందు బాంధవులు
గరళంబు వెట్టినగతి యెఱింగియును
తెఱఁగొప్ప తత్తీర్థంబు నాని
యరిగించుకొనియె రామావనివిభుఁడు."

అనియును, నరపతివిజయమునందును,

"చ. మగటిమి గోర్వలేక దయమాలుటు జ్ఞాతినియుక్తబుద్ధిచే
సగరతఁ గన్నతీర్థ మిడఁజాలక యర్భకుఁ డున్నఁజూచి శ్రీ
నగధర నీవె దిక్కని జనంబులు గన్గొన నంతఁ గ్రోలి యా
సగరునిఁ బోలి రామనృపచంద్రుఁడు చెందఁడు తద్వికార
మున్."

అనియును రామరాజు మాహాత్మ్యము గొనియాడఁబడి యుండెను. ఇతనికి విషముఁ బెట్టినజ్ఞాతులగుబంధువు లెవ్వరో యెందుకు వారు విషముఁ బెట్టవలసివచ్చెనో యావివరము నేకవియును దెలిపియుండ లేదు. ఆరెవీటిబుక్కరాజు రామరాజును

గండనోలుపట్టణమున కధీశ్వరునిగఁ జేసెను. ఈరామరాజు కంద నోలుపట్టణమున నుండ విజాపురసుల్తా నగుఆలీఆదిల్‌షాహ డెబ్బదివేలయాశ్వికసైన్యముతో వచ్చి ముట్టడించె ననియు, వానితోఁ బోరాడి విజయము గాంచె నని బాలభాగవతము లోని,

"ఎందు నెన్నఁగఁ జాలు నిద్ధశౌర్యమున
గండనవోలిదుర్గంబులోనుండి
బుక్కయ రామభూభుజుఁ డెల్లనృపుల
నెక్కువ యిదియని యెన్నంగఁ జాలి
వీరులు డెబ్బదివేవు రాశ్వికులు
చేరి కొల్వంగవచ్చినసవానెదిరి
కలసంది పంచబంగాళంబు సేసి
గెలిచెఁ దచ్చరితంబు గీర్తింపఁ దరమె."

అనుపంక్తులవలనను, పద్యబాలభాగవతములోని,

"గబ్బుల్ డెబ్బదివేవు రాశ్వికులు వేడ్కన్ గొల్వఁగాఁగిన్కఁ బె
న్మబ్బుల్ గప్పఁగఁగందనోలుగొను వేడ్కన్ జుట్టుముట్టన్‌సవా
బిబ్బీ నుబ్బణగించి తోలె నరిరాడ్భీముండు లంకాసర
ణ్యాబ్బృందారుఁడు బుక్కభూవిభుని రామాధీశుం డాహా
యనన్."

అనుపద్యమువలనను విస్పష్టమగు చున్నది. ఇతని కెంత సైన్యముగలదో యావివరము నరపతివిజయమునం దిట్లు చెప్పఁ బడినది.

“ సీ. మదకరి కొకటి కిర్వదిగుఱ్ఱములు గుఱ్ఱ
మునకును విలుకాండ్రు ముగురు విచ్చు
కత్తులవా రెకాం డ్రట్లు వర్థిల్ల
నిట్టి యేనుఁగులను జట్టు మూఁడు
వేల యేనూరు నుద్వృత్తితో నడవంగఁ
గందనో ల్సాధింపఁగా దలంచి
మొనఁ ద్రుంచి గట్టిగా ముట్టడి దిగిన నా
బిబ్బిని మిక్కిలి యు బ్బణంచి
గీ. ప్రకట సప్తాంగములఁ గొని రామవిభుఁడు
కందనో ల్రాజధానిగాఁగ వసుమ
తియును నేలె మహాహావదీక్షఁ బూని
బలిమి కలిమి నాశావనీపకులఁ బెనుప. ”

అనఁగ రామరాజుసైన్యము 3౫00 ఏనుఁగులు, 20000 గుఱ్ఱములు, ౬30000 కాల్బలము గలదిగ నుండె నట. ఇట్టిమహాభయంకర మైనసైన్యముతోనుండి, డెబ్బదివేల యాశ్వికసైన్యముతో దండెత్తివచ్చి కందనవోలును ముట్టడించిన నవాబిబ్బీని (విజాపుర సుల్తానగు అదిల్‌షాహా) నోడించి తరుమఁగొట్టి యుబ్బణగించిన దర్పోన్నతుఁ డయినరణశూరునిగ వర్ణించి యున్నాఁడు. ఇతనిబిరుదుగద్య మిట్లున్నది.

“ జయజయ, స్వస్తిసమస్తసమరసమయబలరజోమిళితసప్తసాగరఘుంఘుమితకల్లోలజాల, శరణాగతపాల, హల్లీసునేనోల్లాసితసప్తశతసైంధవగ్రహణపరాక్రమధుర్య, రత్నసాను

ధైర్య, దుర్వారతరసవాయిసైనికహరణ, సవాబిబ్బిరాజసప్తా
ఙ్గహరణమార్గచరణ, రణభయానకజయానకారవముఖరీకృతకుల
గిరిదరీనికర, పోషితావనిసుకరప్రకర, నిరావాపాదవనీదుర్గనివాసి
కాశవొడయదుర్మదఖలనిర్మథన, ధర్మధౌరేయ, దాసరాధేయ,
వీరరమానమారోహణారంభసోపానదోస్తంబ, వాకుంభీనససా
ర్వభౌమారంభ, పరిపంధిన్నృపపుండరీకాధిపరాజమండలకబళనవ్య
గ్రిమోదగ్రమండలాగ్ర, సింహికాతనూజ, రామరాజ, విజ
యీభవ. ”

పై బిరుదగద్యములో ‘ దుర్వారతర సవాయిసైనిక హరణ, సవాబిబ్బిరాజసప్తాఙ్గహరణమార్గశరణ ’ అనుబిరుదముల వహించుటకు గారణము విజాపురసుల్తానగుఆదిల్ షాహాను జయించుటయని మనము తెలిసికొనఁ గలుగుచున్నాము. ‘ నివాపాదవనీదుర్గనివాసికాసవొడయదుర్మదఖలనిర్మథన’ యన్న బిరుదము వచ్చినవిధమును, ‘ హాల్లీసుసేనోల్లాసితసప్తశాసైంధవగ్రహణపరాక్రమధుర్య ’ యను బిరుదమును వహించుటకుఁ గలకారణమును దెలిసికొనవలసి యుండును. మొదటి దానిఁగూర్చి ద్విపదబాలభాగవతమునందు,

“ వినుతింపఁ దగునాదవేనిదుర్గమున
ననతుఁడై యుండుకాచాధీశు గెలిచి
అరుదుగా సప్తాఙ్గహరణంబు సేసె
గరిమోన్నతుండు బుక్కయ రామవిభుఁడు. ”

అని యాదవేనిదుర్గాధీశుఁ డయినకాచాధీశుని జయించి

వానిసప్తాంగములను హరించె నని దెలుపఁబడి యుండెను. ఆదివేనిదుర్గము మిక్కిలి బలాఢ్యమైనది ఈదుర్గాధిపతి యైనకాచాధీశునిపై రామరాజేల దండెత్తవలసివచ్చె ననిసంశయము పుట్టఁగలదు. కాని రామరాజు కాలమునుబట్టి విచారించినఁ దగునట్టికారణ మగుపించక పోదు. కాచయొడయఁడు విజయనగరసామ్రాజ్యమును మొదటఁ బరిపాలించినసంగమవంశీయులపక్షమువాఁడయి క్రీ. శ. ౧౪౮౭ వ సంవత్సరప్రాంతమున సాళ్వనరసింహరాయలు విజయనగరసామ్రాజ్య మాక్రమించుకొన్నప్పు డాతనికి వ్యతిరేకముగఁ బ్రవర్తించి యుండును. ఆరెవీటిరామరాజు సాళ్వనరసింహరాయనిపక్షమును వహించి యాదవేనిపై దండయాత్ర సాగించి యాతనిసప్తాంగములను హరించి యాదుర్గమునకుఁ దనరెండవకుమారుఁడైనకొండ్రాజును నధికారిగ నియమించి యుండును. ఇంక రెండవబిరుదమును గురించి విమర్శింతము. ఈబిరుదములోని హల్లీనుసేనుని గూర్చి శ్రీనేలటూరివేంకటరమణయ్యంగా రిట్లు వ్రాసి యున్నారు.(1)

" క్రీ. శ. 1492 మొదలుకొని 1528 వఱకు కళింగదేశముపై ప్రభుత్వముసల్పినప్రతాపరుద్రగజపతి తన 'సరస్వతీవిలాసము' లో జమునాపురాధీశ్వరుఁ డగు 'హుసేనసాహి' యనుతురుష్కుఁడు శరణాగతుఁడు కాఁగా శత్రువుల నుండి వానినిరక్షించితి నని చెప్పుకొని యున్నాఁడు........ ప్రతాపరుద్రగజపతి క్రీ. శ. ౧౪౯౭ లో సింహాసనము నధి

(1) భారతి సం॥ ౬ సంచిక ౬.

ష్ఠించి 1500 లలో దక్షిణదిగ్విజయయాత్రకు బయలువెడలెను. పై దానివలన ఆరెవీటిరామరాజుచే నిర్జితుఁడై నహాల్లీసుసేనుఁడును, ప్రతాపరుద్రగజపతికి శరణాగతుఁడై సంరక్షింపఁబడిన 'హాలుసేనసాహి' యు నేకకాలమువారగుట నిజము."

అయినను 'వీరొక్కరా భిన్నపురుషులా యనునది చింతింపఁ దగినవిషయ' మని వేంకటరమణయ్యగా రనుచున్నారు గాని వీరుభిన్నపురుషులు కారనియే నాయభిప్రాయము. క్రీ. శ. ౧౫౦౦ లలో ప్రతాపరుద్రగజపతి దక్షిణదిగ్విజయయాత్రకు బయలువెడలిన వాఁడగుటచేత నాదండయాత్ర సందర్భమున నావిషయము జరిగియుండును. బిరుదుగద్యములో వేంకటరమణయ్యగారు వ్రాసినట్లు 'సప్తదశసైంధవగ్రహణ, గాక రంగస్వామిసరస్వతిగారి పాఠమున వక్కాణింపఁబడినట్లు 'సప్తశతసైంధవగ్రహణ' మనియె గ్రహింపఁదగి యుండును. రామరాజు హాల్లీసుసేనుని జయించి ౭౦౦ గుఱ్ఱములను గైకొన్నవాఁడు.

ఆరెవీటిరామరాజునకు నల్వురు భార్యలు గలరని బాల భాగవతమునందు,

"ఆరామభూపతి కంగనామణులు
పేరైన యాబళాంబిక లక్కమమ్మ
యంబుజనేత్ర రంగమ్మయు నమల
మాంబయు నల్గు రై రందులోన"

అని ఓబిళాంబ, లక్కమాంబ, రంగమాంబ, అము లాంబ, యనుభార్యలు గల రనియు, వారిలో లక్కమాంబకు

'ఆరామనృపులక్కమాంబపుణ్యమున
ధీరత హేమాద్రి తిమ్మభూవరుని
వరకీర్తి కొండభూవరుని శ్రీరంగ
ధరణీశు ముప్పురు తనయులఁ గాంచె.'

సని ద్విపదబాలభాగవతము నందును,

"ఆరామనృపతికి మహా
దారుఁ డగుతిమ్మరాజు ధన్యుఁడుకొండ
క్ష్మారమణుఁడు బుధనుతస
చ్చారిత్రుఁడురంగవిభుఁడు జనియించి రొగిన్."

అని నరపతివిజయమునందును, రామరాజువలన తిమ్మ రాజు, కొండరాజు, శ్రీరంగరాజు జనించిరని దెలుపఁ బడినది. భట్టుమూర్తికూడ తనవసుచరిత్రమునం దీముప్పుర నిట్లభివ ర్ణించి యున్నాఁడు.

"శా. ఆరామక్షితిభర్తకుం బ్రథితసత్యాలాపధర్మోద్భవ
శ్రీరమ్యుండగుతిమ్మరాజు బలలక్ష్మీధామభీమప్రథా
పారీణుండగుకొండశౌరి విజయప్రఖ్యాతచారిత్రుఁడౌ
శ్రీరంగేంద్రుఁడు గల్గి రైందవకులక్షేమంకరాకా
[రులై."

వీరలలో జ్యేష్ఠుఁ డగుతిమ్మరాజు, తనవారిలో నసమా

సబలపరాక్రమధుర్యుఁడై బహుప్రసిద్ధిఁ గాంచినవాఁడుగ నున్నాఁడు.

## అవుకు తిమ్మరాజు

రామరాజునకు లక్కమాంబ యందుజనించినమూవురు పుత్త్రులలోఁ బెద్దవాఁడయినతిమ్మరాజు 'అవుకు' పురము నేలుచుండినవాఁ డగుటవలనఁ దరువాత నతనిసంతతివారు చరిత్రము నందును, ప్రబంధములలోను నౌకువా రని వ్యవహరింపఁ బడి రని నరపతివిజయములోని :—

“ కం. ఆతిమ్మనృపతిభూకాం
తాతిలకం బైనయవుకుఁ దా నేలుచు వి
ఖ్యాతిగ నప్పురిపేరం
బ్రీతినిఁ దనకులము వెలయఁ బెంపొందె
మహిన్.”

అనుపద్యమువలన విదిత మగుచున్నది. కనుక నీతఁ డవుకువంశమునకు మూలపురుషుఁ డయ్యెను. దోనేరు నాథకవివిరచిత మగుద్విపదబాలభాగవతమును గృతి నొందిన చినతిమ్మరాజు ప్రేరణచే నేతద్గ్రంథకర్త యగుకోనేరునాథకవి పద్యబాలభాగవతమును రచించి యతనితండ్రియగు సీతిమ్మ రాజునకు నంకితము గావించెను. ఈకృతియందునితనికిసంబంధిం చినపెక్కుచారిత్రకాంశములు దెలుపఁ బడి యున్నవి. ఇతఁడు క్రీ. శ. ౧౫౦౫ మొదలుకొని క్రీ. శ. ౧౫౪౭ వఱ

కును తరువాతనుగూడ విజయనగరసామ్రాజ్యాధిపులపక్షమున నుండి పెక్కుయుద్ధములలోఁ బాల్గొని యున్నవాఁడు. ఇతని చరిత్రమునం దొకవింతమాహాత్మ్యము వర్ణింపఁ బడినది. ద్విపదబాలభాగవతమున :—

"అందగ్రజుండైన యాతిమ్మనృపతి
యిందువంశవతంసుఁ డితఁడస వెలసె
రాజశిరోమణి రాజులరాజు
రాజచంద్రుఁడు రామరాజు తిమ్మయ్య
అపదృష్టి యగునొక్కయాభీరునకును
నిపుణుండు వేంకటనిలయుండు చక్రి
యొకకంటిచూవు తానొసఁగి స్వప్నమున
బ్రకటుఁడై తిమ్మభూపాలు మన్నించి
ఓకృతకృత్యా నీ కుర్వీశు లెనయె ?
నీ కృపాబలపుణ్యానిధి మోక్షమిత్తుఁ
గరుణ గోపాలునికడమచూ పిమ్ము,
నరనాథయనుచు నానతి యిచ్చుటయును
గొలువులో నగ్గోపకునకునుచూ పొసఁగె."
అని యున్నది. పద్యబాలభాగవతమునగూడ,
"వేంకటేశ్వరు నాజ్ఞ విగతదృష్టికి దృష్టి
దయమీఱ నిచ్చె నేధర్మమూర్తి"

అనియుఁ గలదు. కన్నులులేని యొకగోపకునకు వేంకటేశ్వరుఁడుకరుణించి యొకకన్నుమాత్రము నిచ్చె ననియు,

ఆస్వామియె తిమ్మరాజు స్వప్నమున సాక్షాత్కరించి కడప కన్నులు నీ వొసంగనలసినదనియాజ్ఞ నిచ్చె ననియు, అంతట నాతఁడు దయతో నతనికిఁ జూపొసఁగె ననియుఁ గవి తెలిపి యున్నాఁడు.

మండువేసవికాలమున నొకప్పుడు తిమ్మరాజు దండుతోఁ బ్రయాణము సేయుచున్నప్పుడు సైనికులకు దప్పిచే నోళ్లెండు కొనిపోవుట నాతని కెఱిఁగింప నాతఁడు నిండుమనంబుతోడ విష్ణుమూర్తిని బ్రార్థించి ౘ దోని సిరంగరాజు కొండనెత్తమున' తత్క్షణమె యొకనీటిబుగ్గను బుట్టింపఁగా రెండుఘటికల కాలమందు నీరముండెననియు, దీనినెల్లవారు చూచి రనియుఁ గవి:—

"ధన్యుండు రామభూధవుతిమ్మనృపతి
సైన్యసమేతుఁడై చైత్రమాసమున
దండు వోవుచు నుండి తనభటుల్ త్రోవ
నెండినవోళ్ల దప్పెఱిగించుటయును
నిండుచిత్తమున దోని సిరంగరాజు
కొండనెత్తమున వైకుంఠునిఁ దలఁచి
గోవిందు వేడి గ్రక్కున నొక్కబుగ్గ
భూవినుతంబుగాఁ బొడమంగఁ జేసె
నందఱుఁజూడఁగానన్నీర మచట
గ్రందుగా విలసిల్లె ఘటికాద్వయంబు."

అనుపంక్తులలోఁ దెలుపుటయెగాక పద్యబాలభాగవత మునఁగూడ, "కరుణమీఁగాములగట్టుపై వేసవిఁ బుట్టించె

జలము లేభూనుతుండు" అని చెప్పి యున్నాఁడు. ఈతిమ్మ రాజు మాహాత్మ్యమెట్టి దైనను ఇతఁడసమానయోధాగ్రేసరుఁ డనియొప్పుకొనక దప్పదు. దోనిసిరంగరాజు కొండనెత్తమునకే మీఁగాములుగట్టని సామాంతరము గలదని తెలిసికొనవలయును. రెండునామములను జేర్చన్న కవియొక్కఁడే యగుటవలన నట్లూహింప నగును. అయ్యవి వేర్వేఱు ప్రదేశము లయి యున్నయెడల నొక్కకవియె యట్లుచెప్పుట సంభవింపదు. అట్లు చెప్పినది సత్యమేయగునేని యసలువిషయముయొక్క సత్యను గూర్చి శంకింప వలసివచ్చును.

ఈతిమ్మరాజునకు

"గండరగూళికి గండర,
గండని కుద్దండరాయగణవారణశ్రీ
గండాంకున కెంతెంబర
గండనికిన్ బట్టవాడ గజసింహునకున్."

అని వక్కాణింపఁబడిన బిరుదములలో 'గండరగూళి' యనుబిరుద మతనిపూర్వుఁ డగుకోటికంటిరాఘవరాజు సంపా దించినదిగాని యితఁడు సంపాదించినది కాదు.

మఱియు,

'చాళుక్యచక్రవర్తికి
మాళవమదభంజనునకున్ మర్దితశకనే
పాళునకు బిరుదుమన్నెవి
భాళునకున్ మన్నెపులికి భాసురమణికిన్.

మన్నె దళధూమకేతువ
మన్నియమృగబేటకార మాళవరాయా
త్యున్నతమస్తకశూలా
మన్నెసురత్రాణబిరుద మన్నెవిభాళా'

అనుపద్యములలో 'మాళవ రాయాత్యున్నతి మస్తక శూలా' యనుబిరుద మితనిపూర్వుఁ డగుసోమదేవరాజు కదన రంగమున మాళవరాజునుజయించి సంపాదించినదిగాని యితఁడు సంపాదించినది కాదు. కావున వీనిపూర్వులు వహించినబిరుద ములు కొన్ని యీతనికినిఁ జేర్పఁ బడినది. ఇతఁడు పట్టవాడ రాజును, ఉద్దండరాయఁ డనువానిని జయించి నట్లు పైపద్య ములవలనఁ దెలియుచున్నది. ఇతఁడు కళింగదేశాధీశ్వరుఁ డగునొడ్డియరాయని, జయించుటయెగాక మహామదమలకకుఁ బ్రాణదాన మొసఁగినట్లు కూడ నీక్రిందిపద్యమున సూచింపఁ బడినది.

" కదనధనంజయునకు మహా
మదమల్కప్రాణదాన మతికొడ్డియరా
యదిశాపట్టున కరిరా
యదళవిభాళునకు పాండవాన్వయపతికిన్. "

ఇతఁడు శ్రీకృష్ణదేవరాయలవారి పట్టాభిషేకసమయ మున రాజసభయందుండి తరువాత కృష్ణరాయల పూర్వ దిగ్విజయయాత్రలో పాల్గొన్నట్టు కుమారధూర్జటి తనకృష్ణరా యవిజయమునందు " సాకల్యముగఁ గీర్తి సర్వదిక్తటు లందుఁ

బ్రాకటస్థితి నిల్చు నౌకువారు" అనియును, 'శివిగ నౌకువారును కడింది రహీన్ వెలుగోటివారలా రావెలవారు గూడుకొని'. అనియును జెప్పియుండుట వలన ధ్రువపడు చున్నది. అచ్యుతదేవరాయలవారి కాలమునను సామ్రాజ్య సామంతులలోఁ బ్రముఖులై యితఁడును, ఇతని కుమారులును నాతనికిఁ దోడునీడగనుండి సర్వవిధములఁ దోడ్పడు చుండిరి. మఱి యునీతని తమ్మునికుమారుఁ డగునళియరామరాజునకు సామ్రాజ్యద్రోహి యగుసలకముమ్మయను సంహరించిన సందర్భమున నాతని ప్రక్కనుండి యప్పటియుద్ధములోఁ బాల్గొన్నట్లు,

" సలకయతిమ్మాసురదు
ర్విలసితవిలయాబ్ధిలగన విహ్వలవసుధా
వలయస్థితికృతివివృతో
జ్జ్వలతర ధరణీవరాహ వఱబిరు దాంకా "

అనుపద్య బాలభాగవతములోని పద్యమువలన వేద్యమగుచున్నది. ఇంతియగాదు,

'కడిమిమై మానువకడ రణక్షోణి
గడుసరి నేదులఖాను జయించె'

యనిద్విపదబాలభాగవతమునందును, 'మానువకడ సవాబూని పోరను బరాజయము నొందించె నేశౌర్యశాలి' యనిపద్య బాలభాగవతమునందును జెప్పియుండుటచేత నితఁడువిజాపుర సుల్తా నగునాలీఅదిల్షాహాను మానువదుర్గముకడ జయించెనని నిశ్చయింప వలసి యున్నది. ఇదియు క్రీ. శ. ౧౫౪౨

సంవత్సర ప్రాంతముననో తరువాతనో జరిగియుండును. ఇతఁడు వీరనృసింహ రాయలవారిచే "స్వామిద్రోహరగండ నూపురము" బహుమానముఁ గాంచి నట్లుగ నీక్రిందిపద్యము వలనఁ దెలియుచున్నది.

"శా. శ్రీమద్వీరనృసింహరాయనృపతి శ్రేయోదయాసాధిత
స్వామిద్రోహరగండనూపురకవి రాజద్రామరా ట్తిమ్మభూ
పామిత్యర్జితపుణ్యసత్ఫలసమస్తాశాంతవిశ్రాంతని
స్సీమోర్వీప్రతిపాదనప్రతయశా శీతాంశువంశోనిధీ."

## ఆదవేనికొండరాజు

పై పద్యమున వీరనరసింహ రాయనిపట్ల ద్రోహబుద్ధితోఁ బ్రవర్తించినవాఁ డెవ్వఁడో చెప్పకపోయినను, ద్విపదబాలభాగవతమున :—

"విక్రమంబున నాదవేనిదుర్గంబు
విక్రాంతు లెన్న వేవేగ సాధించి
సిరులతో వీరనృసింహరాయలకు
బరుసాత్మ దుర్గాధిపతి నొప్పగించి
గరిమ స్వామిద్రోహగండపెండార
మరిభీకరముగ రాయ లొసంగ నొందె
లాలితకీర్తి విలాసుండు పద్య
బాలభాగవతప్రబంధనాయకుండు."

అని ద్విపదపంక్తులలో నుదాహరించినందువలన నా ద్రోహి యాదవేనిదుర్గాధిపతి యని దెలియుచున్నది. కాని నరపతివిజయమునందు :—

"క. దీనావనుఁ డౌకొండను
హీనాధుం డాదవేని నేలుచు బరఁగెన్
దానును సుతులును దత్సం
తానం బాయాదవేని ధామము పేరన్."

అనుపద్యమునుబట్టి యాదవేనిదుర్గమున కధీశుఁడుగ నున్నవాఁడు బుక్కయరామరాజుమూవురుపుత్త్రులలో రెండవవాఁ డయినకొండరాజనియు, అందువలన నాతఁడును నాతని సంతతివారును నాదవేనివారని వ్యవహరింపబడి రనియును దెలియుచున్నది. ఈకొండరాజు తిమ్మరాజు తమ్ముఁ డనుట సంశయింపఁ బనిలేదు. ఇతఁడు వీరనృసింహరాయునికి నేల ద్రోహిగ నుండుట సంభవించినది ? అన్నయగుతిమ్మరాజు ద్రోహియగు తమ్ముని కొండరాజు నేలజయించి వీరనృసింహరాయనివలన 'స్వామిద్రోహరగండపెండేరము' నెందుకుఁ బొందవలసి వచ్చినది ? మొదట వీరలతండ్రి యగుబుక్కయరామరాజు కాచాధీశునిజయించి యాదవేనిదుర్గమును స్వాధీనపఱచుకొనియె నని ద్విపదబాలభాగవతమునఁ జెప్పఁ బడియుండుట చేతను, నరపతి విజయమునందు రెండవకుమారుఁ డయినకొండరాజాదుర్గమును బరిపాలించుచున్నవాఁ డని చెప్పఁబడియుండుటచేతను, బుక్కయ రామరాజు కాచాధీశుని జయించి యాదుర్గమును కొండరాజున

కిచ్చె ననిసమన్వించవలసి యుండును. విజయనగరసామ్రాజ్యము సంగమవంశమునుండి సాళ్వవంశమునకును, సాళ్వవంశము నుండి తుళువ వంశమునకును, తుళువవంశమునుండి యారె వీటివంశమునకును సంక్రమించిన దనుట ప్రసిద్ధచరిత్రాంశము గదా. సాళ్వనరసింహరాయని కుమారుఁ డగునిమ్మడి నరసింహరాయని సింహాసనమును దుళువవీరనృశింహరాయ (కృష్ణరాయనితండ్రి నరసరాయలు) తొడిచికొనుటకుఁ గోపించి కొండరాజు వీరనరసింహరాయనిపైఁ దిరుగఁబడి యుండును. అప్పు డీతనియన్న యగుపైతిమ్మరాజే వీరనృసింహరాయని పక్షము వహించి తిరుగఁబడినతమ్ముని యుద్ధృతమును మాన్పి పైగండ పెండేరమును బొంది యుండును. వీరనరసింహరాయలు వానిని క్షమించి యాదవేనిదుర్గము నాతనిస్వాధీనముననే యుంచి యుండును.

## శ్రీరంగరాజు

బుక్కయరామరాజు మూవురుపుత్త్రులలోను గడపటివాఁడు శ్రీరంగరాజు. ఇతఁడె అళియరామరాయలు తండ్రి. వీనిం గూర్చినచరిత్రాంశము లెవ్వియును గానరావు. నరపతి విజయమునందు,

"క. ఆరాజన్యులతమ్ముఁడు
శ్రీరంగాధీశ్వరుండు శ్రితసంరక్షా

ధౌరంధర్యముచే నా
శ్రీరంగాధీశుఁడనఁగ క్షితినుతి గాంచెన్ "

అని వ్రాసెనేకాని యాతనింగూర్చిన చరిత్రాంశము నొక్కదాని నైన నుడివియుండలేదు గాని,

" కాఁగనసదృశబాహువిక్రమ నిరూఢిఁ
దనరెఁ గర్ణాటరాజ్యపదస్థుఁ డగుచు
దుర్జయాహితరాజ విధుంతుదుండు
రామరాజేంద్ర శ్రీరంగరాజవిభుఁడు. "

అని చెప్పియుండెను. దీనింబట్టి యీ శ్రీరంగరాజు విజయనగరరాయల యాస్థానమున నుండి నట్లూహింపఁ దగియుండెనుగాని యంతకన్న విశేష మేమియును గానరాదు. మఱియు వసుచరిత్రమును రచించిన రామరాజభూషణకవి (భట్టుమూర్తి) సయితము

" శా. ఆరాజత్రితయంబులో నసమభాగ్యారాతి విజాతదో
స్సారుం డాత్తసుభద్రుఁ డర్జునగుణశ్లాఘ్యుండు నై
[పొల్చునా
శ్రీరంగేంద్రుఁడశేషరాజ్యపదవీసింహాసనాక్షీణల
క్ష్మీరాజన్నిజసంతతిప్రథితుఁడై మించెన్ ధరా
[మండలిన్"

అని యభివర్ణించెనేగాని యొక్కచరిత్రాంశము నైనఁ జేర్కొనినవాఁడు గాఁడు. ఇతఁడు కృష్ణరాయనికిమంత్రిగనుండె

నని ఫెరిస్తా వ్రాసినాఁడని హీరాసుఫాదిరి తనయారవీటివంశచరిత్రమున వ్రాసినది సప్రమాణముకాదు (1)

శ్రీరంగరాజుభార్య తిమ్మాంబయనియు, ఆమెవలన శ్రీరంగరాజునకు, కోనరాజు, తిమ్మరాజు, రామరాజు, తిరుమలరాజు, వేంకటాద్రిరాజు నను నైదుగురుకొమాళ్లు జనించిరనియు వసుచరిత్రములోని యీక్రిందిపద్యములవలనఁ దెలియుచున్నది.

"కం. ఆమనుజేంద్రునకుఁ బురం
ధ్రీమణి యగుతిమ్మమాంబ శ్రీరామునకున్
భూమిజసుత్రామునకుఁ బు
లోమజయనుబలె జగంబులోఁ నుతికెక్కన్."

"శా. చేతోజాతసమానమూర్తి యగు నా శ్రీరంగధాత్రీధవుం
డా తిమ్మాంబికయందుఁ గోనవిభుఁ దిమ్మాధీశురామ
ప్రభున్

---

(1) "We know from Ferishta that he was one of the Ministers of Krishna Deva Raya, and was succeeded in this place by his son Rama Raya." (The Aravidu Dynasty of Vizianagar Ch. II. page 19.)

ఫెరిస్తా వ్రాసిన వాక్యములను బ్రిగ్సు యిట్లు భాషాంతరీకరించెను.

"The affairs of Beejanuggur being in confusion owing to the death of Hoemraju who was newly succeeded by his son Ramaraju, against whom rebellions had arisen by several

ఘూతాశేషవిపత్తు శ్రీతిరుమలేంద్రు న్వేంకటాఖ్యానవి
ఖ్యాతుం గాంచె సురద్రుపంచకము నయ్యంబోధిరాజుం
బలెన్."

ఈయైదుగురిలోను మొదటియిర్వురును ద్విపదబాలభాగవతమునందును, వసుచరిత్రమునందును, నరపతివిజయమునం

---

Roies, he (the Sultan) met with no interruptions to his arms. (Brigg's Ferista Vol. III p. 81.)

"హీమ్రాజుమరణముఁ జెందఁగా నూతనముగా నాతనిపదవిని బొందిన యాతనికుమారుఁడు రామరాజుపై ననేకరాజులు తిరుగఁబడినందున విజయనగరములోని వ్యవహారములు గల్లోలముఁ జెందుటచేత నతని (సుల్తాను) యాయుధముల కడ్డంకులు లేకుండెను" అని యావాక్యముల కర్థము.

ఫెరిస్తావ్రాసిన పైవాక్యముల నమ్మి 'విస్మృతసామ్రాజ్యము' (Forgotten Empire p. 81.) అను పేరుతో విజయనగరసామ్రాజ్య చరిత్రము వ్రాసినగొప్పచరిత్రకారులగు రాబర్టుస్యూయల్‌గారు "Heem' Rajah or, as Briggs renders the name Tim-Rajah- representing the 'Timma' are referring doubtless to Saluva Timma, the great Minister of Krishna Deva Raya." అని వ్రాసి హీమ్రాజు కొడుకైన రామరాజు కృష్ణదేవరాయలప్రధానమంత్రిశేఖరుఁడగు సాళువతిమ్మరుసు కుమారుఁడని నిర్ధారణ చేసిరి. ఇదెంతవింతగానున్నదో చూడుఁడు. అళియరామరాజు తండ్రి స్యూయలనుకొన్నట్టు సాళువతిమ్మరాజు కాఁడనియు, శ్రీరంగరాజనియుఁ దేటపడుచుండ లేదా. ఫెరిస్తానిష్పక్షపాతమైనట్టియు సరియైనట్టియు చరిత్రము వ్రాయలేదని యెఱింగియుండియు హీరానుపాదిరి ఫెరిస్తామాటలనమ్మి శ్రీరంగరాజు కృష్ణదేవరాయలప్రధానమంత్రి యని వ్రాయుట సత్యముకాదు.

ప్రకరణమున వివరించియె యున్నాను. ఇట్లవక్రపరాక్రమంబునఁ దండ్రితాతలు పరిపాలించిన మండలము నళియరామరాయలుగూడఁ బరిపాలించుట పితృపారంపర్యపుసత్వముగా సంభవించినదేగాని యొకయనామకచరిత్రకారుఁడు దెల్పినటులు మహమ్మదుకూలీకుతుబ్షా విజయనగరసామ్రాజ్యముపై దండెత్తివచ్చి కృష్ణదేవరాయలను జయించి తనహిందూసామంతకుటుంబములోనివాఁడయిన రామరాజు నధికారిగా నియమించిన సత్వమువలన సంభవించినది గాదు. ఇతనికిఁ బూర్వముననే అళియరామరాయలతండ్రి యీమండలమును బరిపాలించుచున్నట్లు కందనోలు పురశాసనము దెలుపుచుండెను గదా. మహమ్మదుకూలీకుతుబ్షా కందనోలుమండలమును కృష్ణరాయలసామ్రాజ్యమునుండి గైకొనినమాట వాస్తవమని విశ్వసింతమన్నను తనవారి నెవ్వరిని తురకసైన్యములతో నచట నధికారిగ నుంచుట కిష్టపడక కృష్ణరాయలకు మంత్రిగనుండినవానికుమారుఁ డగు రామరాయల నధికారిగ నియమించుట కిష్టపడెనని యెట్లు విశ్వసింపఁ దగును? ఒకవేళ నితఁడు కృష్ణరాయలకు ద్రోహియై మహమ్మదుకూలీకుతుబ్షాకు లోఁబడినవాఁడై యీయనామకచరిత్రకారుఁడు వక్కాణించినట్లు తనదేశమును ఆదిల్‌షాహ చూఱఁగొని తన్ను దఱిమివేసి స్వాధీనపఱచుకొనినప్పుడేమియుఁ జేయంజాలక తన ప్రభువుతో మొఱవెట్టుకొనఁగా నాతఁడు ‘ఛీ! పాఱుఁబోతా!’ నారాజ్యముననుండఁ దగవని వెడలనడచిన మాట వాస్తవమని విశ్వసింతుమన్నను, తనకు ద్రోహియై

శత్రుపక్షమునఁ జేరి తనశత్రువుచే దర్బారునఁ బరిభవింపఁబడి వెడలఁగొట్టఁబడినపిఱికిపందను జూచి సంతోషించి శ్రీకృష్ణదేవ రాయలవంటిశూరచక్రవర్తి తనయొకపుత్రికనిచ్చి వివాహము చేసెనన్న నెట్లు విశ్వసింపఁ దగును? రామరాయలయెడఁ గల యసూయ యాయనామక చరిత్రకారునిగాని, చరిత్రకారుఁ డగు ఫెరిస్తానుగాని యిట్టియసత్యకల్పనమునకుఁ బురికొల్పినఁ బురికొల్పవచ్చునుగాని యదియొక వింతగాదు. ఇరువదవశతాబ్దిలోనుండిన హీరాసుఫాదిరి వంటిచరిత్రకారుఁడు రామరాయలతండ్రి శ్రీరంగరాజు కృష్ణదేవరాయనిమంత్రియని యొక ప్రక్కనొప్పుకొనుచు తాను వ్రాసిన యారవీటివంశచరిత్రము నందు నాయనామక చరిత్రకారునియొక్కయు ఫెరిస్తాయొక్కయు నసత్యకల్పనములను సత్యాంశములనుగా విశ్వసించి వ్రాయుట యాశ్చర్యకరముగా నుండకమానదు. రామరాయల మంత్రులలో నొకఁడుగానుండి యాతనిచే నొకప్పుడు కొండవీడురాజ్యమునకుఁ బ్రతినిధి పాలకుఁడుగా నియమింపఁబడిన రామయామాత్య తోడరమల్లనునాతఁడు రామరాయలతమ్ముఁ డగువేంకటాద్రి ప్రేరేపణచే రచియించి రామరాయని కంకితముగావించిన 'స్వరమేళకళానిధి' యను గ్రంథమున నీక్రింది భావముగలశ్లోకములను వ్రాసి యున్నాఁడు.* చంద్రవంశమున

* ఏషాంకులాలంకృతి శేష జఙ్ఞే శ్రీరంగనాథో జితిరాజరాజః
తయాసదాచారదృశా వివింతే రాజర్షిభావం రమితక్షమాయః॥
తిమ్మాంబికా తస్యబభూవ దేవీ సాధ్వీ జనానామివయాసమష్టిః
సతీయశోదావినతానసూయా సుదక్షిణా సత్యవతీ సుభద్రా॥
తపోవిశేషేణ తయోరశేష రాజాధిరాజోఽజని రామరాజః
కన్యాప్రదోఽస్మై సహి కృష్ణరాయః కన్యాపితృత్వం బహుమన్యతేస్మ॥

జనించి యనేకరాజన్యులను జయించియుఁ బ్రకటసాత్త్వికుఁడై సదాచారతత్పరుఁడై రాజర్షిభావముతో నొప్పుచుండెడి శ్రీరంగరాజు సకలసద్గుణగణంబులచేతను యశోదావినతానసూయాసుదక్షిణాసత్యవతీ సుభద్రలకు సాటియైన తిమ్మాంబికను వివాహము చేసికొనియెను. ఆదంపతుల తపోవిశేషముచేతవారలకు రామరాజు జనియించెను. అట్టిరామరాజునకు కృష్ణరాయలుతనకూఁతునిచ్చి వివాహముగావించి మహానుభావుఁడైన రామరాజునకు భార్యగా నుండఁదగినకన్యకు దానుతండ్రియై యున్నందులకు గర్వపడుచుండెను.

ఇతఁడు కృష్ణరాయల కల్లుఁడగుటచేతనే ఇతనినామమునకు మొదట ' అళియ ' శబ్దము చేర్పఁబడి ' అళియ రామరాయ' లని సామ్రాజ్యప్రజలతో వ్యవహరింపఁబడుట సంభవించినది. ఆరవీటివంశములో రామరాయనామములు పెక్కండ్రుండుటచే సామ్రాజ్యాధిపతి కల్లుఁడయిన కారణమున ' అళియరామరాయ ' లనునామము సామ్రాజ్యమునఁ బ్రాముఖ్యతను గాంచినది. కృష్ణరానియకల్లుఁడయ్యును, కందనోలుమండలమును బాలించుమాండలిక ప్రభువయ్యును, కృష్ణరాయనికాలమున జరిగిన యేప్రసిద్ధదండయాత్రలయందును నితఁడు పాల్గొన్నట్లు చరిత్రమునం దితనినామము వినంబడకుండుటయే చిత్రముగానున్నది. ఈవివాహ మేసంవత్సరమున జరిగినదో యావివరముగూడఁ దెలియరాదు. కృష్ణరాయలకొమార్తె యగుతిరు

మలాంబికను వివాహమాడినవిషయ మొక్కటియే పేర్కొనఁ బడియున్నది.

అళియరామరాయలు కృష్ణరాయలసైన్యములో నొక గొప్పసేనాధిపతిగ నుండి యొకతెలుఁగుమండలమునకుఁ బాలకుఁడై పరిపాలించుచుండె నని 'కోయుటో' (Couts) అను చరిత్రకారుఁడు వ్రాసియున్నాఁ డనిహీరాసుఫాదిరిగారి యారవీటివంశచరిత్రము నందుఁ దెలుపఁబడినది. కృష్ణదేవరాయలవారు తనయవసానకాలమునకుఁ బూర్వము రాజ్యపరిపాలనాభారము నళియరామరాయల చేతులయందును, సైన్యాధికారభారము నంతను రామరాయలతమ్ముఁడగు తిరుమలదేవరాయల చేతులయందును బెట్టె ననియు, తాను మరణించునపుడు తనసామ్రాజ్యమున కచ్యుతదేవరాయలను బట్టాభిషిక్తునిగాఁ జేయవలసిన దని 'అళియరామరాయల' కాజ్ఞాపించె ననియు, ఆతనియభిమతమునకనుసరించి రామరాయలు కృష్ణరాయనిమరణానంతరము నట్లుగావించె నని 'క్వెరోజు' అను చరిత్రకారుఁడు వ్రాసియుండె ననిపై యారవీటి వంశచరిత్రమునందు వక్కాణింపఁబడినది.

## అచ్యుతదేవరాయలు—రామరాయలు

అచ్యుతదేవరాయలవారు క్రీ. శ. ౧౫౩౦ మొదలు క్రీ. శ. ౧౫౪౨ వఱకుఁ బండ్రెండు సంవత్సరములమాత్రమే విజయనగరసామ్రాజ్యమును బరిపాలించెను. ఇతని పరిపాల

నాకాలమునఁ గూడ ‘ అళియరామరాయ ’ లెట్టిసితి యందుం
డియెట్లు గౌరవింపఁబడియెనో సత్యచరిత్రము తేటపడకున్నది.
కాని ‘ నన్నిజు ’ ధనాశాపీడితు లన్యాయాధులగు నీ సోదర
ద్వయముచేతులలోఁ బరిపాలనాభారము నంతయునుంచి వారే
మిచేయుమన్న నదిచేయుచుండె ననియచ్యుత దేవరాయలను
నిందించి యున్నవాఁడు. ఈవాక్యములను విశ్వసించి స్యూయ
లుగారు తమవిస్మృతసామ్రాజ్యమునందు నన్నిజు వ్రాసి
నట్లేవ్రాసి యున్నారు. వీనినివిశ్వసించి హీరాసుఫాదిరి పైను
డివిన ‘ క్వైరోజు ’ వాక్యములను దాము వ్రాసిన చరిత్రమునం
దుదాహరించి యున్నారుగాని యచ్యుత రాయాభ్యుదయ
మునఁగాని వరదాంబికా పరిణయమునఁగాని మరియే గ్రంథ
ములనఁ గాని తదితరము లయిన శాసనాదులలోఁ గాని,
అచ్యుత దేవరాయల దక్షిణదేశ దండయాత్రల సంద
ర్భమునఁ గాని యీసోదరుల నామములు గాని వారు
చేసిన ఘనకార్యములు గాని వినరావు. సామ్రాజ్యమున
వీరి కెట్టిపలుకుఁబడిగలదో యేతద్విషయము గూడ నెం
దును గానరాదు. అచ్యుతదేవరాయలను నిందించుసందర్భమున
‘ నన్నిజు ’ వ్రాసినవాక్యములలో నుదాహరింపఁబడినసోదరు
లిర్వురును వీరుగారనియునుఁ అచ్యుతదేవరాయలభార్యయగు
వరదాంబికతోఁ బుట్టువు లగుసలకము పెదతిమ్మరాజు, చినతిమ్మ
రాజు నై యుండవలయు ననినాయభిప్రాయము. ఎందుకన,
అచ్యుతదేవరాయలు మరణించునపుడు పులికాటి (తూర్పు

సముద్రతీరమునందలి ప్రళయకావేరి) నుండి యచటఁ బరిపాల
నము సేయుచున్నమాండలికప్రభువు రామరాయలు విద్యానగ
రమునకు బయలుదేఱి వచ్చెనని 'కోటియా' యనునాతఁడు
వ్రాసినట్లుగ నారవీటివంశచరిత్రమునందు వక్కాణింపఁబడి
నది కావున సామ్రాజ్యభారమునంతయు వహించినరామరాయ
లంతటివాఁడు దూరదేశమునఁ బ్రళయకావేరి యందొకపాల
కుఁడుగా నుండి సామ్రాజ్యాధిపతిమరణకాలమునకుమాత్రమె
విద్యానగరమునకు వచ్చుటసంభవించి యుండదు. ఈయచ్యుత
దేవరాయలమరణానంతరము సంభవించినచరిత్రవిషయములను
బట్టికూడ నీకాలమున నీసోదరద్వయ మంతగాఁ బ్రాముఖ్యత
వహించి యున్నట్లు గన్పట్టదు. వారెట్లో మానముతో దూర
మునుండి కాలము గడుపుకొన్నటుల గనంబడుచున్నదిగాని
యచ్యుతదేవరాయల పలుకుబడిగలిగి సామ్రాజ్యవ్యవహార
ముల జోక్యముకలిగించుకొని యంతగా వ్యవహరించినటుల
గనుపట్టదు. తిరుమలాంబ విరచితమైన 'వరదాంబికా పరి
ణయ' మనుగ్రంథమునఁ దుళువనరసింహరాయలు దివసకర
కులోత్తంసుఁ డయినరాచిరాజునకు శ్రీరామాంబిక గర్భమున
జనించినయోబమాంబను వివాహము చేసికొనఁగా నామెవలన
నాతనికచ్యుతరాయలనుకుమారుఁడు కలిగె ననియు, ఆకుమా
రునకు సలకరాజుపుత్రులగు తిరుమలరాజను నామములుగలిగి
యచ్యుతదేవరాయలకు మంత్రులుగ నున్నయిరువురసోదరులకు
చెల్లెలుగ నున్నవరదాంబిక వివాహముగావింపబడె ననియు,

వారలకు తిరుపతివెంకటాద్రీశుని కృపాతిశయముచే కుమారుఁడుపుట్టిన నతనికి వేంకటాద్రి యనిపేరుపెట్టి యచ్యుతదేవరాయలు తాను పట్టాభిషిక్తుఁ డయినవెనుక నాతనియువరాజుగఁ జేసె ననియు వ్రాయఁబడి యున్నది. దీనినిబట్టి అచ్యుతదేవరాయలకు మంత్రులుగనున్నవారు సలకరాజుపుత్త్రులును మఱఁదులు నగుపెదతిమ్మరాజు, చినతిమ్మరాజు ననుసోదరులని స్పష్టముగాఁ జెప్పఁబడియున్నది. * విదేశీయు లయినచరిత్రకారుల కీభేదము తెలిసికొన సాధ్యముగాక యీమంత్రిపదవులను రామరాయలకును నాతనితమ్ముఁ డగుతిరుమలరాయనికని ముడిపెట్టి యేమో వ్రాసి యున్నారు. వారివ్రాఁతలు విశ్వాసపాత్రములు గావు. కాఁబట్టి యచ్యుతదేవరాయలకాలమునఁగూడ నంతప్రాముఖ్యులుగ నున్నటుల గనుపట్టదు.

## చిన్నవేంకటాద్రిపట్టాభిషేకము

అచ్యుతదేవరాయలు విద్యానగరమునఁ బట్టాభిషిక్తుఁ డయినపుడే యతఁడు సలకరాజుపుత్త్రిక యగువరదాంబికను బట్టమహిషిగను, ఆమెపుత్త్రుఁ డగుకుమార వేంకటాద్రిని యువరాజుగను జేసె నని రాజనాథకవి విరచిత మగునచ్యుతరాయాభ్యుదయ మనుగ్రంథమునఁ దెలుపఁబడియున్నది.

* సతతవిరచితానేకదానయోః అసాధారణభుజాపధానయోః అఖిలలోకకృతబహుమానయోః తిరుమలరాజాభిధానయోః ఉభయయోః ప్రధానయోః అపరజావరదాంబికాభిధానావరవర్ణినీ......తపోవనముపగతవతీ

ఈ గ్రంథమున నచ్యుతరాయల పట్టాభిషేకకాలమునకు వాని తండ్రి నరసరాయలుకూడ బ్రదికియున్నట్టు దెలుపఁబడియున్నది. ఇదెంతవఱకు సత్యమో దెలియరాదు. అచ్యుతరాయల పరిపాలనకాలమున వానికుఱదియగు సలకము చినతిమ్మరాజు ప్రధానమంత్రిగనుండి రాజ్యభారము నంతయుఁ దానేవహించి యారవీటి వంశమువారికి నెవ్విధమైన ప్రాముఖ్యత కలుగకుండ బహుజాగరూకతతో వ్యవహరించి నటులు గనుపట్టుచున్నది. సామ్రాజ్యములోని మాండలిక ప్రభువులును రాజబంధువులు నీతని నంతగా బ్రేమించినవారుగాఁ గనుపట్టరు. విదేశీయులయిన చరిత్రకారులు గూడ ననుకూలముగా వ్రాసియుండలేదు. అచ్యుతదేవరాయల మరణానంతరము సలకము చినతిమ్మరాజు తనమేనల్లుఁ డగుచిన్న వేంకటాద్రీంద్రుని క్రీ. శ. ౧౫౪౧ సంవత్సరములోఁ బట్టాభిషిక్తునిఁ గావించెను. ఈచిన్న వేంకటాద్రిరాజు పట్టాభిషేకకాలమునకుఁ బదునెనిమిది సంవత్సరములయినఁగడవనిబాలుఁ డని చెప్పఁ దగును. ఇతనికినప్పటికి వయస్సెంతయుండెనో యెవరును సరిగాఁజెప్పఁ జాలకున్నను బాలుఁడని యైకకంఠ్యముగా నెల్లవారు నంగీకరించి యున్నారు. కనుక సామ్రాజ్యసార్వభౌముఁడు నిర్వహింపవలసినకార్యభార మంతయు సలకముచినతిమ్మరాజుపైఁ బడియెను. అతఁడు సమర్థుఁడు గాడు; బుద్ధిమంతుఁడు గాఁడు; అదియునుంగాక విశేషించి దురాశకలవాఁడుగను, ఒక్కొక్కప్పుడవివేకపుం బనులొనర్చువాఁడుగను నుండెను. ఈకాలము

నందలి సామ్రాజ్యవైభవ మింతయంత యని చెప్ప నలవి కాదు. సామ్రాజ్యమునందు నత్యల్పకాలములో నతివేగమునఁ బదిపదునైదులక్షల సైన్యమును సమకూర్ప వచ్చును. ఈసామ్రాజ్యమున నప్పటికి మూఁడువేలయేనుంగులతోఁ గూడిన గజసైన్యమును, అరాబియా, పారశీకములనుండి రప్పించిన నలువదివేల గుఱ్ఱములతోఁ గూడిన యాశ్వికసైన్యమును గలదు. ధనికులయిన సామంతమాండలికులైన ప్రభువులు పెక్కండ్రు గప్పములు చెల్లించువారు గలరు. సమీపస్థులయిన పెక్కండ్రు మహారాజులు సామ్రాజ్యమునకు లోఁబడినవారుగా నుండిరి. ఇదిగాక యీసామ్రాజ్యమునందలి నదులలో బంగారమును, కనములలో వజ్రములు మొదలగు నవరత్నములు లభించుచుండెను. ఎన్నివిధములచేతఁ బరిశీలించి చూచినను నాకాలమున విజయనగర సామ్రాజ్యము మహోచ్ఛస్థితియందుండి శత్రువులకు గన్నెఱ్ఱ నలుపుచుండెనన్న నతిశయోక్తియెంతమాత్రమును గాఁ జాలదు. ఇట్టిసామ్రాజ్యమునకు నొకబాలుఁ డధిపతికావలసి వచ్చెను. తత్సామ్రాజ్యభారనిర్వాహకకర్త దురాశాపీడితుఁడు దుర్మార్గుఁడు నయ్యెను.

## సలకముతిమ్మరాజు—రామరాయలు

అంతఃపురములోని రాణులకును మాండలికులయిన ప్రభువులకును, పెక్కండ్రు జనులకుఁ గూడ సామ్రాజ్యభారము సలకము చినతిమ్మరాజు వహించుట సమ్మతముగా

లేకుండెను. అందుముఖ్యముగాఁ గృష్ణదేవరాయలభార్య లగు తిరుమలదేవికిని, చిన్నాదేవికిని సామ్రాజ్యభారము నళియ రామరాయలును, వానిసోదరులును వహింపవలయు నని పెద్ద కోరిక గలదు. సామ్రాజ్యపరిపాలనా భారము నళియరామ రాయలకును వానిసోదరులకును విడిచిపెట్టి కోశాధికారభార మునుమాత్రము వహింపవలసిన దని సలకముచినతిమ్మరాజు నకు మాండలికప్రభువులు తెలియఁ జేసిరికాని యాతఁ డం దుల కంగీకరింపఁ డయ్యెను. ఇతనిపరిపాలనము సామ్రాజ్య మునకు గొప్పముప్పు తేఁగల దనుగట్టినమ్మకము గలవా రగు టచేత రామరాయలును వానిసోదరులును విద్యానగరమును విడిచిపోవ నిష్టపడలేదు. అభిప్రాయభేదము లుదయించుట చేతను, సామ్రాజ్య మపహరింపవలె ననిదురాశతోఁ గూడి యున్నవాఁ డగుటచేతను, విద్యానగరమున వారలయునికి తన సంకల్పమును విచ్ఛిన్నముచేయు నట్టిదిగ నుండుటచేతను, సల కము చిన్నతిమ్మరాజు దురాలోచనమునకు లోనయి యాసో దరులను చెరపట్టి యుంచవలె నని ప్రయత్నించెను. వీరినిమా త్రమెగాదు. తన ప్రయత్నముల కడ్డముతగులువారని తనకుఁ దోచినవారినెల్లరను బంధింపఁ గుట్రలు చేయ మొదలుపె ట్టెను. వీనిదుష్ప్రయత్నములను కుట్రలను దెలిసికొని యనేక మాండలికప్రభువులు విద్యానగరమును విడిచిపెట్టి స్వస్థాన ములకుఁ బోయిరి. అట్లుపోయి కొందఱు విద్యానగరముతో సంబంధమునువీడి స్వతంత్రు లగుటకుఁ బ్రయత్నింపు చుండి

రని కోరియాయనునాతఁడు వ్రాసి యున్నాఁడు. అప్పు డళి యరామరాయలుగూడ తనసోదరు లిర్వురితోను విద్యానగర మును విడిచి పోయెను. వీరికి ద్వేషము ప్రభువయిన చిన్నవేం కటాద్రిపై నెంతమాత్రము లేదు. వానికార్యకర్తయైనసల కము చినతిమ్మరాజు పయినమాత్రమె గలదు. వారు సేనలను సమకూర్చుకొనివచ్చి యాదుర్మార్గుని శిక్షింపఁ జూచుచుండిరి. ఇంతలో సలకముచిన్నతిమ్మరాజు చేయుచుప్పరిపాలనము బహుక్రూరముగాఁ బరిణమించుచుండెను. రాజభండారము లోనిధనము నంతయుఁ గుట్రచారుల లంచముల క్రిందను, దుష్కార్య నిర్వహణము కొరకును దుర్వ్యయము సలుపు చుండెను.

## సలకముతిమ్మరాజు ద్రోహకృత్యములు

ఇతఁడు మాయోపాయముచేఁ దనకుఁ బ్రతిపక్షులుగా నున్న ప్రభువుల రప్పించి వారలను జంపఁ బ్రయత్నించెను. వీనిమాయలోఁ దగుల్కొని మొదటవచ్చిన కొందఱగుడ్లు పెఱికించెను. ఈసమాచారమును విని వెనుకవచ్చినవారు మర లిపోయి పగఁదీర్చుకొనఁ బ్రయత్నములు సలుపుచుండిరి. సామాన్యప్రజలు వాని నెదుర్కొనఁ జాలరైరి. హిందూ సామ్రాజ్యరాజధాని యగువిజయనగరమున సంభవింపనున్న విప్లవమునకు గోలకొండవిజాపురసుల్తాను లత్యంతసంతోష ముతో నేరీతిగఁ బరిణమించునో యని వీక్షింపుచుండిరి. ఇట్టి

సమయమున సార్వభౌముని తల్లియగు వరదాంబికా దేవియు గూడ సోదరుని దుర్నయమును జూచి భరింపఁ జాలక తన కుమారుని, వానిసామ్రాజ్యము గాపాడినయెడల విశేష ముగా ధనమునొసంగుచున్నా ననివిజాపుర సుల్తా నగుఇబ్రహీమ్ ఆదిల్ షాహాకు రాయబార మంపెననియు, ఆరాయ బారమును మన్నించి యాతఁడు తనసైన్యముతో విద్యానగర మునకు వచ్చుచుండుటవిని సలకముతిమ్మయ విశేషధనము తో రాయబారులను నాతనికడకుఁ బంపి వెనుకకు మరలించె ననియు 'కోరియా' యనునొక విదేశీయుఁడు వ్రాసియున్నాఁడు. రాణి దిక్కులేనిపక్షివలె వానిచేతిలోఁ జిక్కెను. అంత నీద్రోహి తనపదవిని బలపఱచుకొనుటకును, తనమే నల్లునిపక్షమును బూని సామ్రాజ్యములోపలఁగాని వెల్పలఁ గాని తనతో నెవ్వరును యుద్ధముచేయ సాహసింప కుండుట కును, తనమేనల్లుఁడును సార్వభౌముఁడు నగుచిన్నవేంకటాద్రిని వాని పినతండ్రులిర్వురను వానిదాయాదితోసహా నలువ్వురను సంహరించెనని 'కోరియా' యనునాతఁడు వ్రాసియున్నాఁడు.

అచ్యుత దేవరాయల తమ్ముఁడు రంగరాయలు వీనిచే తంబడి మ్రగ్గెనుగాని వానికుమారుఁడు సదాశివరాయలు మాత్ర మీద్రోహి పాలంబడి మడియకుండుట వానియదృష్ట మని భావింపవలయును. రాణి వరదాంబికాదేవిగతి యేమ య్యెనో యిటుపై నెంతమాత్రము వినంబడదయ్యెను. ఆహా! రాజ్యకాంక్ష యీాసురాత్ముని యెంతటిదౌష్ట్యమునకుఁ బురి

కొల్పినది ? ఇంక నీతఁడు విజయనగర సామ్రాజ్యమునఁ దాను బట్టాభిషిక్తుఁ డగుటకు నడ్డుపడసామర్థ్యముగల వారెవ్వరు లేరని తలంచెను. అంత ధైర్యసాహసములు మున్పిరిగొన సామ్రాజ్యవజ్రసింహాసనము నాక్రమించి యధిష్ఠింపఁ జూచెనుగాని తనకు రాఁబోవుముప్పు నెఱుంగఁడయ్యెను. అతనిస్వామిద్రోహమున కెంతయు దుఃఖపడుచున్నవారయినను, కొందఱు ప్రభువు లతనియధికారమునకు లోఁబడియు, నతఁడుగావించు దౌష్ట్యములకు మనస్సు విఱిగిపోయిన వారయి విజాపుర సుల్తాను ఇబ్రహీముతోఁ గుట్రలుచేయ నారంభించి సలకము తిమ్మయ నధికారపదవినుండి తొలఁగించినయెడల విజయనగర సామ్రాజ్యకిరీటము నాతని కొసంగి శతవిధముల తోడ్పడ గల వారమని వాగ్దత్తము చేసిరనియు, దీనినంతయుఁ దెలిసికొన్న వాఁడయి యాద్రోహి తనకిష్టుఁ డైనవాని నొకరాయబారిని సిద్ధముచేసి వానిపరముగా నాలుగులక్షల హొన్నుల ద్రవ్యము నొసఁగి యీధనము విజాపురసుల్తా నగుఇబ్రహీమున కిచ్చి తనకు తోడ్పడవలసిన దనియు, నట్లుతోడ్పడిన యెడల తానతనికి సామంతుఁడ నై యుండుటయెగాక యీయుపకారమునకు బదులుగా దారిబత్తెములకుగాను దినమునకు మూఁడు లక్షలహొన్నుల నదనముగా నిచ్చుటకు సంసిద్ధుఁడనై యున్నాననియు, నాపక్షమున నచ్చఁజెప్పి వానిఁదోడ్కొని రావలసినదని ప్రోత్సహించి యారాయబారిని విజాపురమునకుఁ బంపించెననియు, అనాయాసముగా లభించెడు నీలక్ష్మి పదవికి

పొంగిపోయిన మనస్సంతోషము గలవాఁడై వృద్ధసేనాని యగు అసాదుఖాను ప్రేరేపింప నతఁడు వెంటనే బయలుదేరి యేవిధమైన యడ్డంకులును లేక స్వేచ్ఛగా విజయనగరమునకు విచ్చేసె ననియు, స్వామి ద్రోహియైన సలకము తిమ్మయ తనమిత్రులగు ప్రభుపుంగవులతో నెదురుగాఁ బోయి వానిసింహాసనముపయి కూరుచుండఁ బెట్టియేడుదినములు నగరమునం దంతట వేడుకలు జరిపించి రనియు 'కోరియా, ఫెరిస్తా' లను చరిత్రకారులు వ్రాసి యున్నారు. వీరియుభయుల వ్రాఁతలకు ముఖ్యవిషయమున నేకీభావమున్నను వివరములలో నేకీభావము గన్పట్టదు. వీరిలో 'కోటియా' విదేశీయుఁడు. రెండవవాఁ డయినఫెరిస్తా రామరాయలకు గర్భశత్రువు. విజయనగరసామ్రాజ్యమునెడ ననురాగము లేనిచరిత్రకారుఁడు, అహమ్మదునగరసుల్తానగు నిజాముషాహా కొల్వుకూటమున నున్న మహమ్మదుమతస్థుఁడు. దేశీయులును, సమకాలికులును విజయనగరసామ్రాజ్యమునందున్నవారును వ్రాసిన వ్రాఁతలతో వీరివ్రాఁతలను సమన్వయింపఁ జేసి సత్యసంశోధనఁ జేసినఁగాని సత్యచరిత్రము బయలుపడదు. ఆకాలమునందు విజయనగరసామ్రాజ్యమునకు నారవీటివంశము పెట్టనికోటగ నుండెను. సలకముతిమ్మయగావించినద్రోహకృత్యములమూలమున విజయనగరరాజధాని మహావిప్లవముపాలయి హిందూసామ్రాజ్యము వినాశముఁ జెందనున్న కాలమున నీయుపద్రవము నడంచి సంరక్షింపఁ గలమహాసమర్థుఁ డగువీరాగ్రగణ్యుఁ డొకనిఁ బ్ర

సాదింపు మనిసామ్రాజ్యములోని ప్రజలనుదినము నిష్టదేవత లను బ్రార్థించుచుండిరి. సామ్రాజ్యములోని ప్రభుపుంగవులలో నధికసంఖ్యాకులదృష్టులు రాజబంధువులలోఁ బ్రముఖుఁడై యుధిష్ఠిరునకుభీమార్జునులవలె చేఁదోఁడు వాదోడుగా నుండి భక్తితాత్పర్యములతో తిరుమలరాయవేంకటాద్రులనుసోదర ద్వితయముచే సేవింపఁబడు చున్నయళియరామరాయలపై ప్రసరింపసాగినవి. ఈద్రోహి బాఱిపడక విజయనగరరాజధాని నుండి తప్పించుకొనిపోయినునాఁటనుండి పిఱికిబంటులై మౌన ముతో నొకచోట నొదిగి కూరుచుండినవారు కారు.

## అళియరామరాయల దండయాత్ర

అళియరామరాయ లట్లుసోదరు లయినతిరుమలరాయ వేంకటాద్రులతో విద్యానగరమును విడిచిపెట్టిపోయి మున్ముం దుగా గుత్తి, పెనుగొండ, గండికోట, యాదవాని, కందనోలు దుర్గముల కధిపతులయినవారిని స్వాధీనపఱచుకొని యాయా సీమలసైన్యముల నసంఖ్యముగా సమకూర్చుకొని అచ్యుతదేవ రాయలతమ్ముఁడును, సలకముతిమ్మయచేఁ జంపఁబడినవాఁడును నగురంగరాయలకొడుకు సదాసివదేవరాయ లేగిరిదుర్గముననో దాఁగొని యున్నవాఁ డనితెలిసికొని తొలుతవానినిరప్పించుకొని యాతనికభయప్రదాన మొసంగి, తమకులదైవమైనతిరుమల వేంకటేశ్వరులసన్నిధానమున మఱదియు, బాలుఁడు నగునాతని విజయనగరసామ్రాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిగావించి యట

నుండి బయలు వెడలివచ్చి గుత్తిదుర్గమునఁ బ్రవేశించి కొంతర
క్షణసైన్యముతో సదాశివరాయని నచటనిలిపి, తనపెద్దతండ్రి
యగునౌకుతిమ్మరాజు వానిపుత్త్రులు మొదలుగా బంధువర్గము
తోడను, సొన్నలాపురము హండేహనుమప్పనాయఁడు, పెమ్మ
సాని పెదతిమ్మప్పనాయఁడు, మెసాపెద్దప్పనాయఁడు మొదలుగా
సామంతవీరవర్గముతోడను గూడి యసంఖ్యాకసైన్యములతో
తిరుమలరాయ వేంకటాద్రులు తనకంగరక్షకులుగా నుండి సేవిం
పుచు వెంటరా రణభేరి మ్రోగించుచు మహారభసముతో సల
కముతిమ్మరాజుపై దండయాత్ర సాగించి వెడలి విద్యానగర
మును సమీపించుచుండెను.

ఈదండయాత్ర మొదలుపెట్టుటకుఁ బూర్వమె "మీరు
చేసినద్రోహమునకు మే మెంతయుదుఃఖపడుచున్నవారమైనను,
దీనినంతను విధివశమయినకార్యముగా భావించి మేము మీకు
వినయవిధేయులమై మీయధికారపాలనమునకు లోఁబడి యను
వర్తింపఁ గలవారముకాని యీసామ్రాజ్యమున కపాయకరు
లును శత్రువులు నగుతురకప్రభువులను మాత్రము మున్ముం
దుగా విజయనగరమునుండి పంపివేయవలసినదిగాఁ బ్రార్థించు
చున్నార" మనియొకజాబు వ్రాసి గుత్తిదుర్గమునుండి సలకము
తిమ్మయకుఁ బంపించెననియు, అతఁ డందుల కెంతయు సంతో
షించి యీసమాచారమును విజాపురసుల్తానునకుఁ దెలియఁ
జేసి తాముచేసికొన్న యొడంబడిక ప్రకార మేఁబదిలక్షల
హొన్నుల నాతనికొసంగి యతని వానిరాజ్యమునకుఁ బంపి

వేసె ననియు, 'కోటియా, ఫెరిస్తా' లు వ్రాసియున్నారని యూరవీటివంశ చరిత్రమునందు దెలుపఁబడినది. వీరి వ్రాఁతలంతగా విశ్వాసపాత్రములు గావు. ఈవిప్లవ సందర్భమున విజాపురసుల్తాను దురాశతోఁ జేసిన దురాలోచనలను, ప్రాందినయమిత పరిభవమును గప్పిపెట్టుటకును, అళియరామరాయల ప్రజ్ఞాప్రతిష్ఠలను గొంచెపరచుటకును వ్రాసినవ్రాఁతలు గాని యన్యములుగావు. "ఆలీఇబూ అజీజుఅల్లాతబతాబాయి" అనుచరిత్రకారుఁడు తానువ్రాసిన 'బురహాన్; ఈ. మా అసిర్' అనుగ్రంథమున విజాపురిసుల్తాను తానెవ్వరివలన నాహ్వాతుఁడుగాక తనంత తానే విజయనగరమునకు వచ్చె ననియు, సలకముతిమ్మయ సుల్తానునకు ద్రవ్యము నొసంగ లేదనియు, సుల్తానుదాక విని సలకముతిమ్మయ విజయనగరమును విడిచి పాఱిపోయెననియు, విజాపురసుల్తానుసేనాని యగుఅసాదుఖాను విజయనగరమునకు రావలసినదని సలకముతిమ్మయకు జాబు కూడ వ్రాసె నని దెలిపి యున్నాఁడనియూరవీటివంశ చరిత్రమునందే వర్ణింపఁబడి యున్నది. అహమ్మదు నగరమున నైజాంషాహా దర్బారుననుండి వ్రాసిన 'మహమ్మదుఖాసిం ఫెరిస్తా' వ్రాఁతలనమ్మవలయునా? 'ఆలీఇబూఅజీజు అల్లాతబతాబాయి' వ్రాఁతలు నమ్మవలయునా? మఱియు 'బసాతీన్-ఉస్-సలాతిన్' అనుఫారసీభాషాగ్రంథమున సలకముతిమ్మయ విజాపురసుల్తానుకు ౨౨ లక్షల హొన్నుల ద్రవ్యము నొసంగెనని వ్రాయుచు మఱియొక సమాచారము వలన ౮౦ లక్షల

హొన్నుల ద్రవ్యము నొసఁగఁ బడినట్టు దెలియుచున్న దని గూడఁ లిఖింపఁబడి యుండెను. ఇంత ద్రవ్యమును విచ్చలవిడిగా వెచ్చపెట్టఁ గలిగిన భాగ్యశాలియగు సలకము తిమ్మయామిత్రులగుమంత్రులను నళియరామరాయలులంచముల నిచ్చివశ్యులనుగావించుకొనుటచేత రామరాయలు స్వపరివారముతోవిజయనగరద్వారమునుసమీపించినంతనే యామంత్రులెల్లరు నగరద్వారములనుదెఱచివేసి రనిమహమ్మదుఖాశిం ఫెరిస్తా వ్రాసియున్నాఁడు. ఇంతియగాదు సలకముతిమ్మయకును రామరాయలకును యుద్ధము జరిగినట్లే చెప్పఁడు. సలకముతిమ్మయ యుద్ధములో మరణించి నట్లు ప్రశంసింపఁడు. ఆత్మహత్య చేసికొని సలకముతిమ్మయ చచ్చె నఁట! హీరాసుఫాదిరిగారి విశ్వాసమునకుఁ బాత్రమైన మహమ్మదు ఖాసింఫెరిస్తావాక్యము లిట్లున్నవి. "తానువంచింపఁబడిన విషయమును దెలిసికొని యంతఃపుర రాజమందిరమునఁ దల్పులుబిగించుకొని నిరుత్సాహమూలమున పిచ్చిపట్టిపోయి రాజుగారియేనుగులు, గుఱ్ఱములు, మొదలగువాని గ్రుడ్లు పెరికించియు, తోఁకలుగోయించియు, తనశత్రువులకు నిరుపయోగములగునటులు గావించె నఁట. అనేకయుగములనుండి వంశపరంపరగా సంపాదింపఁబడిన వజ్రములు, కెంపులు, పచ్చలు మొదలుగా నవరత్నరాసులను, అమూల్యములగు మౌక్తికరాసులను బెద్దపెద్దతిరుగటి రాళ్లలోఁ బోయించి విసిరించి పొడుము గావించి భూమిపై చల్లించెనఁట! అంతనతఁడు తన

గదిలోని యొక స్తంభమునకు వాడిగలకత్తి నొకదానిమొన పైకుండునటులు బిగింపఁజేసి యది తనవక్షస్థలమును భేదించుకొని వెన్నుపైకి వచ్చునట్లుగా గొప్పవజ్జ్వన వచ్చి దానిపైఁబడి ప్రాణములఁ గోల్పోయె నఁట ! అంత నగరద్వారముతలుపులు తెఱువఁ బడిన వఁట ! ఈఫెరిస్తా వ్రాసిన దానితో 'కోరియా' యనుపోర్చుగీసు చరిత్రకారుఁ డేకీభవించుటయె గాక 'సలకముతిమ్మయ' విజయనగరసామ్రాజ్యాధిపతిగఁ జావవలెనను కోరికతో నట్లుచచ్చె నని కూడ వర్ణించెనని యారవీటివంశచరిత్రమునందు హీరాసుఫాదిరి నుడువుచున్నాఁడు.

## —♦ సలకముతిమ్మయ యుద్ధముచేసి మడియుట ♦—

హీరాసుఫాదిరి కోరియాఫెరిస్తాలు శాస్త్రోక్తముగ నిష్పక్షపాతమైనచరిత్రను వ్రాసిరని నమ్మి వారివ్రాఁతల నాధారముగాఁ జేసికొని అళియరామరాయల చరిత్రములోని మూలసత్యమును గ్రహింపఁజాలక దుర్భ్రమపాలయి చరిత్రమునంతయుఁ దాఱుమాఱుచేసి వ్రాయుటెంతయు శోచనీయము. వీరు తామువ్రాసినచరిత్రమునం దొకచోట "రామరాయలువచ్చువఱకు విజయనగరమునందు విజాపురసుల్తాను నిలిచియుండెననియు, వీనివలనె బరీదుషాహా, నిజాముషాహా, కుతుబ్షాహాలాతనికి (సలకముతిమ్మయకు) దోడ్పడు చుండిరనియు హండేవారి అనంతపురచరిత్రము దెలుపుచున్నది. సలకముతిమ్మయాతో మైత్రిచేసికొన్న యీప్రభువులందఱితోను యుద్ధము

చేయుటకు సాహసించిన రామరాయల పరాక్రమమును విను
తించుట కుద్దేశింపఁబడినట్లు గన్పట్టుచున్నదికాని యీమైత్రా
నుబంధమునుగూర్చి ఫెరిస్తాయొకపలుకైనఁ బలికియుండలే" దని
వ్రాసి యున్నారు.(1) మఱియొకచోట "పైనుదాహరింపఁబడిన
తెలుగుకావ్యములు రామరాయల పరాక్రమశక్తిని వానిగుణ
ములను ప్రసిద్ధపఱచుటకుగాను నతఁడు తనప్రతిస్పర్థికి వినా
శకుఁడైనట్లుగాఁ దెలుపుచున్నారు; కాని యిదికవులెల్లరు నను
శ్రుతముగా నవలంబించెడి మార్గ" మని వ్రాసియున్నారు. (2)
ఈపైయభిప్రాయములవలన రామరాయలయెడ వీరికెట్టి భావ
ముగలదో యయ్యది విస్పష్టముగాఁ దెలియుచున్నది. అనఁగా
రామరాయలు తిమ్మయను బ్రతిఘటించి స్వశక్తిచే సేన
లను సమకూర్చుకొని తిమ్మయపై దండయాత్ర సాగించి
యాతనితోఁ గాని యాతనికి సాహాయ్యముఁజేయ వచ్చిన
విజాపుర సుల్తానుతోఁ గాని తదితర సుల్తానులతోఁ గాని
యుద్ధముచేయకయే, తిమ్మయయనుచరవరమునకు లంచముల
నొసఁగియు, సలకముతిమ్మయ తనకుఁదోడ్పడవచ్చినవిజాపుర
సుల్తానుకు నసంఖ్యాకముగా ద్రవ్యమునొసంగి వానిస్వస్థానము
నకుఁ బంపివేయునట్లుగా మోసబుజాబును వ్రాసియు, వారల
సాహాయ్యము లభింపకుండఁజేయ రామరాయలుచేసినమోస

(1) The Aravidu Dynasty of Vizanagar. Page 9 foot note 5.

(2) Ibid Page, 11 foot note 7.

మను దెలిసికొని యాద్రోహి తెంపరియై విద్యానగరమును
వైభవవిహీనముగాఁ జేసి తుదకు దారుణమైన యాత్మహత్య
చేసికొని చావఁగాఁ గృష్ణరాయనిరాణుల యాజ్ఞ శిరసావహించి
హతశేషులు ద్వారములు తెఱచి యామహానగరమును రామ
రాయలచేతఁబెట్టి రనివీరియభిప్రాయము. ఇదియెంతమా
త్రము విశ్వాసపాత్రమయిన సత్యము గాదు. అచ్యుతదేవ
రాయనిభార్య వరదాంబికాదేవి సామ్రాజ్యము తనకొడుకునకు
నిలుచునట్లుగాఁ దనకుఁ దోడ్పడినయెడల విశేషద్రవ్యము
నొసంగెద నని యాహూయముచేయ, విజాపురసుల్తాను
స్వసైన్యముతో బయలుదేఱివచ్చుచుండ, సలకముతిమ్మయ
దెలిసికొని, తనరాయబారులమూలమున విశేషద్రవ్యమునొ
సంగి, యాతఁడుమరలితనరాజధానికిఁ బోవునటుల చేసెనని
మొదటవ్రాసిన 'కోటియా' మఱియొకచోట సలకముతిమ్మ
యను బ్రతిఘటించి తొలఁగిపోయినయాతని ప్రతిపక్షమువారు
(రామరాయలపక్షమువారుకాఁబోలు) విద్యానగరము స్వాధీ
నముఁజేసి యాతనిపరిపాలనమునకు లోపడివ్యవహరింతుముగాన
దమకుఁ దోడ్పడి సలకముతిమ్మయను రాజ్యభ్రష్టుని గావింప
వలసినదని ప్రార్థింప, నాతఁడు సమ్మతించి రాఁదలంచియుండ,
సలకముతిమ్మయ తెలిసికొని రాయబారులద్వారా యాఱులక్ష
లహొన్నులనుబంపించి, విద్యానగరమునకువచ్చి తనకుఁదోడ్ప
డినయెడల దారిబత్తెములక్రిందను దినమునకుమూఁడులక్షల
హొన్నులచొప్పున నిచ్చుటయేగాక తనకుసామంతుఁడనై కప్ప

ము చెల్లించుచుండు ననియు వారిచేఁ జెప్పించి, వానిసైన్యము లతోసహా వానిని రప్పించి, విద్యానగరసింహాసనమున వానిని గూరుచుండఁ బెట్టి రేఁడుదినములు మహావైభవముతో వేడుకలు జరిపియుండె ననియుకొందఱు ప్రభువులుగూడ నాతనిసామ్రాజ్యాధిపతిగా నొప్పుకొనిరనియు, రెండవమాఱు వ్రాసియున్నట్లుగా హీరాసుఫాదిరి తాను, వ్రాసినయారవీటివంశచరిత్రమునందే దెలిపి యున్నాఁడు. (1) మొదట వ్రాసినదిసత్యమో, రెండవమారు వ్రాసినది సత్యమో, హీరాసుఫాదిరి నిర్ధారణచేసి యుండలేదు. రెండువిధములుగూడ సత్యమై యుండు నని వీరియభిప్రాయమై యుండవచ్చును. సామ్రాజ్యధనాగారమంతయు సలకముతిమ్మయచేతిలో నుండెనుగాని యళియరామరాయలచేతిలో లేదనివారే యొప్పుకొనుచున్నారు. లక్షలకొలదిహొన్నుల ద్రవ్యమును విజాపురసుల్తానునకు సమర్పింపఁగలిగినసలకముతిమ్మయ ధనాశాపీడితులయినసతనయనుచరవర్గమునకు దృప్తికలుగునట్లు ధనమునొసంగి తనప్రక్కనుంచుకొనుట కేలసాధ్యపడ దయ్యెను ? వీరలకు లంచముల నొసంగుటకు నాకస్మికముగారాజధానివిడిచి సోదరద్వయముతోఁ బాఱిపోయినరామరాయలకీప్రభువులకందఱకు లంచముల నొసంగి తనప్రక్కకుఁ ద్రిప్పుకొనుటకు వారలకు ధనమెక్కడనుండి యొక్కమాఱుగాలభించినదియు నిర్ధారణము

(1) A. D. V. Page 6; Correa. Page 247—8
Ibid Page 8; Correa, Pages 277—278—279.

చేసి యుండలేదు. సలకముతిమ్మయస్వాధీనములో నున్న ప్రభువు లెల్లరు రామరాయలవలన లంచములు తిన్నవారే యైన యెడల సామ్రాజ్యమునకు ప్రబలశత్రువయిన విజాపురసుల్తానుని రప్పించి విజయనగరరత్నసింహాసనమునఁ గూరుచుండఁ బెట్టుట కెట్లుసహింపఁ గలిగిరో హీరాసుఫాదిరి తెలిపి యుండలేదు. మఱియు విజాపురసుల్తానువంటి గడుసరి ప్రభువు తనశత్రురాజధానిలో సామ్రాజ్యసింహాసనమునఁ దన్నుఁ గూర్చుండఁ బెట్టి తన్ను సామ్రాజ్యాధిపతినిగాఁ జేసి, సామంతులై తన్నుఁ గొల్చుట కంగీకారము దెలిపియున్నప్పుడు, పిఱికిపందయై రాజధానివిడిచిపెట్టి పాఱిపోయినవాఁడు వంచనతో వ్రాసినజాబును నమ్మి సలకముతిమ్మయ ప్రార్థించినమాత్రమునఁ దనకు స్వప్రయత్నపూర్వకముగాలభించినయీశత్రుసామ్రాజ్యమును, సింహాసనమును విడిచిపెట్టి ద్రవ్యమునుమాత్రము గ్రహించి వెడలిపోవు నంతటియవివేకి యని గ్రహింప నగునా? రామరాయలపక్షమువారు విజాపురసుల్తానునకు సామంతులమై వానిని సామ్రాజ్యాధిపతినిగాఁ గావించి వానికణకువతోఁ గప్పములు చెల్లించుచుందు మని దురాలోచనచేయుచున్నవా రనియేగదా వారిపక్షమున నుండకుండ విశేషద్రవ్యము లంచముగా నిచ్చి యాతనిఁదనకు సహాయార్థము రప్పించుకొన్న సలకముతిమ్మయ వారిని ద్రోహులనియు వారినిఁ జేర్చక మరలవారిని వారిస్థానములకుఁ బంపివేయవలసిన దనిజాబు వ్రాసినపు డయ్యాదిమోసమని తెలిసికొనఁజాలక యేలయెనుబదిలక్షలహొన్నులసమర్పించు

కొని పంపివేయవలసివచ్చెనో యారయరైరి? రామరాయునిచే లంచము గొనినప్రభువులు నిస్సహాయుఁడై యున్నవానిని రామరాయలకు నప్పగించక, సలకముతిమ్మయసామ్రాజ్యములోనిరత్నరాసులను నుగ్గునూచముగావించునపుడును, ఏనుగులుఁ గుఱ్ఱములు మొదలగువానితోఁ గలుకోయించునపుడును మౌనము వహించి యేలయూరకొనవలసివచ్చెనో యదియును విచారింపరైరి? అనేకసందర్భములలో ఁ ఫెరిస్తా కోరియా, కోయుటో ' లు వ్రాసిన వ్రాఁతలలో శుద్ధాబద్ధములగు విషయములు పెక్కులు గలవని యొకప్రక్క నొప్పుకొనుచు నీప్రాధాన్యవిషయమునఁ దదితరు లైకకంఠ్యముగా వ్రాసిన వానికి భిన్నములుగాఁ గన్పట్టినను వీరివ్రాఁతలయందే సత్యము గలదని విశ్వసించుటకుఁ బ్రబలహేతువు లేవిగలవో వానిని వివరింప నక్కరలేదా? చరిత్రకారులు ముఖ్యముగా సమకాలీకులై సమీపముననుండి వ్రాసినవిషయముల కెక్కువప్రాధాన్యమీయవలసి యుండును. పిమ్మట సమకాలికులు కానివారి వ్రాఁతలను సమకాలికులు వ్రాసిన వ్రాఁతలతోఁ బోల్చుకొని సత్యచరిత్రమును దీయుటకుఁ బ్రయత్నింపవలయును. అట్లుగాక సమకాలికులయినవారు కవులగునంత మాత్రముచేఁ వారు చెప్పినవిషయముల నమ్మరాదని త్రోసిపుచ్చి సమకలికులుకాని వారొకరికొకరికిఁ బొందికలేక పరస్పరవిరుద్ధముగ వ్రాసిన వ్రాఁతలనమ్మి చరిత్ర మల్లఁబోయినఁ బరిహాసపాత్రులగుట నిశ్చయము. అచ్యుతదేవరాయని యాస్థానము

నున్నరాజనాథ డిండిమకవి రచియించిన యచ్యుతరాయాభ్యు దయమను గ్రంథమునను, ఆతని యాస్థాన కవయిత్రి యగు తిరుమలాంబ రచియించిన వరదాంబికాపరిణయ మను గ్రంథ మునను సలకము తిమ్మయ యచ్యుతదేవరాయల భార్యయగు వరదాంబికతోడఁబుట్టినవాఁ డని తెలుపఁబడియుండ నేతద్గ్రంథ కర్తలు కవులయినమాత్రముచేత వానినివిశ్వసింపక ‹ సలకము తిమ్మయ యచ్యుతదేవరాయల తోఁబుట్టువుపెనిమిటి ’ యని ‹ కోఁడియా ’ వ్రాసిన దానిని విశ్వసించినయెడల నెంతహాస్యా స్పదముగనుండును ? సమకాలికులైనకవులు వ్రాసినవర్ణనాంశ ములలో నతిశయోక్తు లుండిన నుండవచ్చునుగాని వారుసత్య మునే వ్రాయలేదని నిరాకరించుట సత్యచరిత్ర నిర్మాణము నకుఁ దోడ్పడుమార్గ మగునా ?

విజయనగరములో క్రీ. శ. 1542 వ సంవత్సర ప్రారం భమున విప్లవము పుట్టినది. 1547 లో దోనూరుకోనేరునాథ కవి ద్విపదబాలభాగవతమును రచియించి యళియరామరా యలపెదతండ్రికుమారులలో నొక్కఁడగుచిన్నతిమ్మరాజున కును, తరువాత పద్యప్రబంధముగారచించి యతనితండ్రికి నం కితముచేసినయాగ్రంథములపీఠికలలో నారవీటివంశమును వర్ణిం చుచు నళియరామరాయలను గూర్చియిట్లుప్రశంసించి యున్నాఁడు.

“ శ్రీసదాశివరాయ క్షేమరమణికి
భాసురసామ్రాజ్యపదవి నొసంగి

అమితకర్ణాటరాజ్యస్థాపనాంక
రమణీయ్యుఁ డగునట్టి రామభూపతియు "
(ద్విపదబాలభాగవతము)

" ఉ. ఏపునద్రోహిభావమువహించినసల్కయతిమ్మరాజుఁ ద
త్పాపసహాయు సల్కయయుతంబుగ శౌర్యము మీఱఁ
ద్రుంచి వి
ద్యాపురియందు చాలఘనుఁ డయ్యె సదాశివరాయ రా
జ్యసం
స్థాపకుఁ డై సిరంగవసుధావర రామనరేంద్రుఁ డున్నతిన్."
(పద్యబాలభాగవతము)

ఆరవీటిశ్రీరంగరాజుపుత్త్రుఁడగురామరాజు ద్రోహియైనసలకముతిమ్మరాజును నాపాపికిసహాయుఁడుగా నుండిన సలకరాజును సంహరించికర్ణాటసామ్రాజ్యమునకు సదాశివరాయనిఁ బట్టాభిషిక్తునిఁ జేయుటచేతనే సదాశివరాజ్యసంస్థాపకుఁ డని ప్రఖ్యాతిఁ గాంచి విద్యాపురమునందు మిక్కిలి ఘనుఁ డయ్యె నని దెలిపి యున్నాఁడు. కృష్ణదేవరాయని కల్లుఁడై నను వానికాలమునఁగాని, అచ్యుతదేవరాయుల కాలమునఁగాని రామరాయలు విద్యానగరమునం దొకప్రముఖుఁడుగా నున్నట్టు ప్రమాణము గానరాదు. ఈఘనకార్యమును జయప్రదముగా నిర్వహించిన కారణముచేతనే బాలభాగవత గ్రంథకర్త వ్రాసినరీతిని విద్యాపురియందు గొప్పఘనుఁడుగాఁ బరిగణింపఁ బడినది వాస్తవమని చెప్పఁదగును.

21

ఇదియునుంగాక రామరాయనిపక్షము వారికిని సలకము తిమ్మయపక్షమువారికి మాత్రమెగాక రామరాయనిపక్షము వారికిని సలకముతిమ్మయపక్షము వహించివచ్చిన విజాపుర విదర్భసుల్తానులకుంగూడ యుద్ధము జరిగినటుల దెలుపు నొకటి రెండు విషయములను ద్విపదబాలభాగవత గ్రంథములం బేర్కొని యున్నవాఁడు. ద్విపదబాలభాగవతమును నంకితము నొందినట్టి యారవీటిచినతిమ్మరాజు క్రీ. శ. 1542 వ సంవత్సరములో చంద్రగిరిరాజ్యమును పరిపాలించుచున్నట్లు తిండివనశాసనము దెలుపుచున్నది.(1) అచ్యుతదేవరాయలు 1541 లో మరణించెను. వానివెనుక వానికుమారుఁడు చిన్నవేంకటాద్రి 6 మాసములు పరిపాలనముచేసినవెనుక వానిమేనమామ సలకముతిమ్మయ వానిసంహరించి సామ్రాజ్య మాక్రమించుకొన్నవిషయ మిదివరకె తెలుపఁబడినది. ఇట్లుండగా ద్విపదబాలభాగవతమునందుఁ దత్కృతిభర్త యైనయారవీటి చిన తిమ్మరాజు.

"పరిస్పృపుల్ ప్రజలును జయవెట్ట చంద్ర
గిరిముఖ్యదుర్గముల్ గినిసి కైకొంటి"

---

(1) A Topographical list of the Inscriptions by Rangacharya Vol. I. p. 402, 717; 33 of 1905; 250 of 1910; other records of Prince China Timma will be found in Rangacharya, 11 p. 915, 60 and 70; p. 976, 608.

అని తనతోడిరాజులును ప్రజలును జయఘోషసలుపుచుండ చంద్రగిరిమొదలుగా ముఖ్యదుర్గములను కోపముతో స్వాధీనపఱచు కొన్నట్లు వ్రాయఁబడి యున్నది. అనాదిగా చంద్రగిరిదుర్గమును, తద్రాజ్యమును విజయనగరసామ్రాజ్య ప్రభుత్వమునకు వశములై యున్నవి. అచ్యుత దేవరాయని కాలమున చంద్రగిరిదుర్గమును, రాజ్యమును విజయనగరసింహాసనమును ప్రతిఘటించి యుండ లేదు. చిన్నవేంకటాద్రి మరణానంతరము సలకముతిమ్మయ పక్షముననుండ నతనిప్రతిస్పర్థి యైనయళియ రామరాయల పెదతండ్రికుమారుఁ డైన యీయారవీటి చినతిమ్మరాజు రామరాయలపక్షమున నుండి సలకముతిమ్మయపక్షమువారితోఁ బోరాడి గైకొని, యళియ రామరాయనిచేఁ బట్టాభిషిక్తుఁడుగాఁ గావింపఁబడిన సదాశివ దేవరాయలరాజ్య ప్రారంభకాల మనఁగానా 1542 వ సంవత్సరము నుండియుఁ జంద్రగిరి రాజ్యమునకుఁ బ్రభువుగా నుండెనని నిర్ధారణము సేయవచ్చును. కావున నారవీటి చిన తిమ్మరాజు చంద్రగిరిదుర్గమును వశ్యపఱచుకొన్నవాఁ డనఁ దప్పక సలకముతిమ్మరాజు పక్షమువారితో బోరాడి గెల్చుకొన్నవాఁ డని చెప్పవలయునేగాని మఱియొకవిధముగాఁ జెప్పుటకు సాధ్యముగాదు. ఈయారవీటి చినతిమ్మరాజు తండ్రియగునొకుతిమ్మరాజు గూడ సలకముతిమ్మయగావించిన యీ మహావిప్లవము నడంచుటయందుఁ దనతమ్మునికుమారుఁడయిన

యళియరామరాయలకుఁ దోష్పడినట్లుగా పద్యబాలభాగవత మునందలి యీక్రిందిపద్యమువలన విదితము కాఁగలదు.

పద్యబాలభాగవతము :—

" పలకముతిమ్మాసురదు
ర్విలసితవిలయాబ్ధిలగనవిహ్వలవసుధా
వలయస్థితికృతివివృతో
జ్వలతరధరణీవరాహవరబిరుదాంకా ! "

మఱియు నింకొకవిషయమునుగూడఁ జేర్చఁగాని యున్న వాఁడు. ఈయారవీటి చినతిమ్మరాజునకు సవతియన్న యగు అప్పలరాజునాతండు (అనఁగా జెొకుతిమ్మరాజునకు మఱియొక భార్యవలనఁ బుట్టినవాఁడు) కూరకచెర్లయొద్ద సవాబరీదుల యుద్ధములో జయించియు మృతినొందినటులగూడ ద్విపదబాల భాగవతములోని యీక్రిందిద్విపదలవలనఁ దెలియుచున్నది. చూఁడుఁడు.

" అమితవైభవుఁడైన యప్పలరాజు
రమణీయమైనకూరకచేర్లయొద్ద
కడుమించు నాజిరంగంబునఁ గడిమి
దొడరినసవాబరీదుల నిర్జయించి
తరణిమండలవిభేదనపూర్వకముగ
సురలోకములకు రాజులు మెచ్చ నరిగె. "

అప్పలరాజు కూరకచెర్లకడ ఆదిల్‌షాహా, బరీదుషాహా లతో జరిగినయుద్ధమున జయముపొందియు మరణించె నని వ్రాసి

యున్నాఁడు. కృష్ణదేవరాయలకాలమున బరీదుషాహాతో యుద్ధము జరుగలేదు. అదియునుంగాక ఆదిల్‌షాహాకు బరీదు షాహాకు మైత్రియున్నట్లు తోఁచదు. మఱియు నచ్యుతరాయలకాలమునఁ గూడబరీదుషాహాకు విజయనగరసామ్రాజ్యముతో యుద్ధముపొసఁగి యుండలేదు. కనుకకూరకచెర్లకడ నప్పలరాజునకు నాదిల్‌షాహాబరీదుషాహాలకు జరిగినయుద్ధము 1542 లో పై సుల్తానులు సలకముతిమ్మయపక్షము నవలంబించి వచ్చినప్పుడే జరిగియుండు ననియు, ఆయుద్ధముననే యాకు తిమ్మరాజుకుమారుఁ డప్పలరాజుమరణించినవాఁడనినిశ్చయింపవచ్చును. అప్పలరాజుతండ్రియగునోకుతిమ్మరాజునుగూర్చి వ్రాయునపుడుద్విపదబాలభాగవతమునందు,

"కడిమిమై మానునకడ రణక్షోణి
గడుసరి నేదులఖాను జయించె" ననియు,

పద్యబాలభాగవతమునందు :—

"మానునకడ సవాబూని పోరను బరా
జయము నొందించె నేశౌర్యశాలి"

అనియు వ్రాసియుండుటచేత సలకముతిమ్మయపక్షము వహించి వచ్చినవిజాపురసుల్తానాదులతో నళియరామరాయల పక్షమువారు యుద్ధము చేసియోడించినారని యీబాలభాగవతములలోఁ జేర్కొనఁబడినవిషయములే వేనోళ్లఁ జాటుచున్నది.

మఱియు దోనూరికోనేరునాథుఁడు 1542 లో వ్రాసిన దానిని 1549 లో రామరాయలమంత్రులలో నొక్కఁడును కొండవీడు రాజ్యాధిపతిగా నియమింపఁబడినరామయామాత్యతోడర మల్లనునాతఁడు తానురచియించిన 'స్వరమేళకళానిధి' యను గ్రంథమున 'రామరాయలు' తనయిర్వురుతమ్ములతోను విద్యాపురమును విడిచి గుత్తిదుర్గమునకుఁ బోయి నిస్సహాయుఁడుగా నున్న సదాశివమహీపాలుని గొనివచ్చి స్వామిద్రోహకృతులయిన ప్రతీపనృపతులను జయించి కర్ణాటసింహాసనమునందుఁ గూరుచుండఁ బెట్టి కీర్తిస్థాపకుఁ డయ్యెనని వ్రాసి బలపఱచుచున్నాఁడు. (1) ఇతఁడొక్కఁడేకాదు; రామరాయలయాస్థానికవిగనుండి యాతనిచే రామరాజభూషణుఁ డనుబిరుదము గాంచినభట్టుమూర్తి తాను రచియించిననరసభూపాలీయమునందును, వసుచరిత్రమునందును నీవిప్లవప్రశంసను గావించి రామరాయలను వినుతించియున్నాఁడు.

"సీ. ఖలునతిద్రోహి సల్కయ తిమ్మనిహరించి
సకలకర్ణాటరాజ్యంబు నిలిపె"

(నరసభూపాలీయము)

---

(1). స్వరమేళకళానిధి :—

"ఖడ్గైకసఖః సహానుజయుగో నిర్గత్య విద్యాపురాత్
లబ్ధ్వా గుత్తిగిరౌ సదాశివమహీపాలం నిరాలమ్బ సమ్
స్వామిద్రోహకృతః ప్రతీపనృపతిం నిర్జిత్య భద్రాసనే
కర్ణాటే భగవానివ ధ్రువమయం కీర్త్యా సహాస్థాపయత్."

"సీ. పట్టాభిషేకవిపర్యయంబునఁ బ్రోలు
వెడలి ప్రియానుజ లెన్వెంటఁ గొలువఁ,
చిత్రకూటాభిఖ్యఁ జెలఁగు పెన్గొండ సా
ద్రహారిద్విపేంద్ర నాదవనిఁ జేరి,
ఖలజనస్థానవాసులఁ బల్వుర వధించి
మహామసలకఖరస్మయ మడంచి,
హరివీరభటమహోద్ధతినబ్ధి గంపింప
దురమునఁ గదిసి తద్ద్రోహి దునిమి,
యనఘతరపార్థివేందిర నధిగమించి
సాధుకర్ణాటవిభవసంస్థాపనంబు
పూని శరణాగతుల నెల్లఁ బ్రోచె రాముఁ
డతఁడు నిజచరితంబు రామాయణముగ."

(వసుచరిత్రము)

పయిపద్యములలో వివరించినరీతినిబట్టి యళియరామరాయలు సలకముతిమ్మయ సైన్యములతోఁ బోరాడి యుద్ధములో నాతని సంహరించి సకలకర్ణాటరాజ్యము సుస్థిరముగా నిలుచు నట్లుచేసి శరణాగతుల నెల్లరను రక్షించి ప్రోచి కీర్తిఁ గాంచె ననిబట్టుమూర్తి (రామరాజభూషణకవి) స్పష్టముగాఁ దెలుపుచున్నాఁడు. ఇంతియగాదు; సలకముతిమ్మయకుఁదోడ్పడవచ్చిన నిజాముషాహా, కుతుబ్షాహా, ఏదిల్షాహా తమ తమసైన్యములతోఁ, బలాయనులై యడవులకుఁ బారిపోవ

రామరాయ లనుజద్వయముతోడను, తదితరసైన్యములతో డను వారిని వెంటాడించి పోరి యోడింప వారువిధేయులై యణకువను జూపిరనికూడ నీక్రిందివిధమున వర్ణించియున్నాఁడు.

"మ. హరిశౌర్యం డగురామభూవిభుని తీవ్రాటోపవద్వాహినీ
శరవేగంబున నాత్మమూలబలము ల్జారం దలాడంబరం
బరుగం గొమ్మలువోవ లావరినిజామాదు ల్వజీరుల్భజిం
తురు సమ్రత్వముఁ గానలో ముసలిమానుల్గా వితర్కిం
(పఁగన్."

"గీ. అనుచు శిరములు దాల్తు రెవ్వనిసమగ్ర
సైన్యధుతధూళి చకితులై చనుసపాద
కుతుబశాహినిజామాదికుతలపతు ల
తండు నృపమాత్రుఁడే రామ ధరణివిభుఁడు."

తన 'స్వరమేళకళానిధి' యందు రామయామాత్యతో డరమల్లుగూడ రామరాయలు భీమార్జునలం బోలినసోదరద్వితయము యొక్కసాహాయ్యముతో సర్వపారశీకులను (మహమ్మదుమతస్థులయినవారిని) జయించి భూమియందు గొప్ప కీర్తిని ప్రతిస్థాపించెనని చెప్పియున్నాఁడు. *

ఇట్లే యందుగులవెంకయ్య యనునాతఁడు గూడ తాను రచించి యారవీటికోదండరామరాజున కంకితము గావించిన

* విజిత్యసర్వానపిపారశీకాన్ రణేషుతత్కీర్తిపటచ్చరాణిఆధూయ
భూయోహరితోవధూటీఃవిశోభయత్యేషయశోదుకూలైః
(స్వరమేళకళానిధి)

‘రామరాజీయ’ మనునామాంతరము గలనరపతివిజయ మను గ్రంథమున,

“సలకవిభుతిమ్మరాజుసేనలను ద్రుంచి
గుత్తి, పెనుగొండ, మఱిగండికోటకంద
నోలుపుర మాదవే నవలీల గెలిచి
తొలుదొలుత రామనృపతి దోర్బలము మెరసె.”

అనిస్పష్టముగావివరించి వ్రాసినవాఁడు. అళియరామరాయలకుఁ బ్రత్యర్థిగానుండి విజయనగరంబున నీమహాభయంకరమైన విప్లవమును గల్గించి సంక్షోభపెట్టిన ‘సలకముతిమ్మయ’ అచ్యుతదేవరాయల మరదులిర్వురలోను రెండవవాఁ డయిన చినతిమ్మరాజుగాని “విజయనగరచరిత్రమునకుమూలప్రమాణము” లను గ్రంథములో పీఠికాకారులు వారియుపోద్ఘాతములోఁ దెలిపి నట్లుపెదతిమ్మరాజుగాఁడు రంగపరాజవిరచితమైనసాంబోపాఖ్యానపీఠికలో నళియరామరాయలకుఁ బ్రతిస్పర్థిగ నుండి వ్యవహరించి సంహరింపఁబడినవాఁడు సలకముచినతిమ్మరాజనియె స్పష్టముగాఁ దెలుపఁబడినది. (1)

---

(1) Finding himself unequal to the three brothers, the elder Tirumala, who is discribed as a madman invited his Mahammadan neighbours to his assistance. According to the annals of Hande Anantapuram the three brothers overpowered the madman first and killed him, and marched forward to meet the allied Sultans

ఆకాలమునఁ బుట్టినయీగ్రంథములన్నియు నళియరామరాయలు సలకము చినతిమ్మరాజు సైన్యములతో యుద్ధము చేసి యోడించి యుద్ధములో నాతనిసంహరించి సదాశివరాయని సామ్రాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిగాఁ జేసి జగత్ప్రఖ్యాతిఁ గాంచినట్లు దెలుపుచున్నవి. ఇవిమాత్రమే గాపు; ఇటీవల కర్నలుమెకంజీదొరగారిచే సేకరింపఁబడి సంపుటీకరింపఁ బడిన స్థానికచరిత్రములుగూడ పయిగ్రంథములలో వక్కాణింపఁ బడినవిషయములను బలపఱచుటయెగాక మఱికొన్ని నూత్న విషయములనుగూడఁ దెలుపుచున్నవి. సొన్నలాపురముహాండే హనుమప్పనాయఁడీవిప్లవకాలమున నొక ప్రధానపాత్రమును గైకొని యళియరామరాయలకుఁ దోడ్పడినట్లు హాండేవారిఅనంతపురచరిత్రమునందును, అళ్లేపెమ్మసాని యెఱ్ఱతిమ్మానాయఁడు తోడ్పడి నట్లుతాడిపత్రికైఫియత్తునందును, అళ్లే

---

of Ahmadnagar, Bedar, and Golkouda. Having defeated them in the field the brothers returned to headquarters and installed Sadasiva duly as the emperor.

(Sources of Vijianagara History by Ranganadha Saraswati and edited by Dr. L. Krishnaswami Aiyangar Introduction. page, 15.)

" మ. మహి నెవ్వారెనసల్కరాజచినతిమ్మక్ష్మాపకంఠారుణాం
బుహవిశ్వర్యణతర్పితాసిశిఖికిం బుష్పాయుధస్నిగ్ధని
గ్రహసౌభాగ్యపరంపరాపరిధికిం గర్ణాటకైశ్వర్యని
ర్వహణావార్యభుజద్వయాయుధపరీవారుండు రామప్పకున్."

మెసాపెద్దానాయఁడు, పెమ్మసానియెఱ్ఱతిమ్మానాయఁడు, హాండే హనుమప్పనాయఁడు తోడ్పడినట్లు నడిమిదొడ్డిపాలెగాండ్లకయ ఫియత్తునందును వివరింపఁబడియుండెను. (1)

ఈకడపటికయిఫియ్యతులోవివరము లెంతమనోహరములుగా వ్రాయఁబడినవో చదువరులు తెలిసికొనుటకై యీభాగమిచట నుదాహరించెదను.

"అళియరామనాయణ్ణి కొట్టివేయవలె నని విజయనగరానకు కూచుదరకూచుచేయించి ఫౌజుతో వస్తువుండగా యీ వర్తమానం అళియరామరాయలు విని మొహారుతీసుకొనిరాతో రాతువచ్చి పెనుగొండకు దాఖలుఅయి అక్కడనుండి పెమ్మసానితిమ్మానాయణ్ణి, హాండేవారిని, మెసాపెద్దనాయణ్ణి ఇంకాజహాగీరుదార్లకు శిఖాపత్రాలుపంపించి మీమీయావత్ఫౌజులతోకూడా యెకాయెకీవచ్చే దనివ్రాయించి వున్నందున అదే ప్రకారముగా సకలమైనవారితో కూడా మెసాపెద్దప్పనాయఁడు పోయినంతలోగా రామరాయలవారు సలకయతిమ్మని దుర్మార్గాలు అందరికి చెప్పి తరతరాలనుంచీ మీరుస్వామికార్యములో బహుశా మెహన్నతుచేసి కష్టపడి సకలబహుమానాలు బిరుదులు సంపాదించుకొన్నారు. ఇపుడున్ను యీకార్యం నిర్వాహకంచేసి శత్రుఖండనచేస్తిరా యనా మీకు విశేషించి బిరుదులు బహుమానాలు యిప్పిస్తున్నా మని చెప్పి సలకయతిమ్మ

(1) Sources of Vijianagar, p. 179–180; Local Records, Vol. 12, p. 213, L. R. Vol. 39. p. 16.

యవుండేపూర్వోత్తరము, వాడుయక్కడవుండేది, ఫౌజువుండే రీతి ముందరయేతట్టుసాగివచ్చేసంగతి తెలుసుకొని వచ్చేవారు యెవ్వరు చాతమీతహాకీకు వర్తమానంవచ్చేటందుకు చోరు హరకార్లనుపంపించుమనఁగా అప్పుడుమెసాపెద్దనాయఁడు ముందుపడి తహాకీకు ఖబురు నేను తెప్పిస్తున్నానని తాంబూలంతీసుకొని సలకయతిమ్మయఫౌజులోనికి అంపతగినవారిని పంపించి నిజమానం వర్తమానం తెప్పించి యావత్ఫౌజును వెంటఁదీసికొని ఘండికోటవారు సొన్నలాపురంహాండేహనుమప్ప నాయఁడు మెసాపెద్దప్పనాయఁడు తనజమియ్యతుతో ఫౌజు నడిపించి రాత్రోరాత్రు ఆదవానికి వచ్చి వుత్తరభాగం తుంగభద్రాతీరమందు సలకంతిమ్మనిఫౌజుమీద చవ్వాబడి నరికి హతాహతం చేసినందున హతశేషులయిన ఫౌజుతో సలకయతిమ్మఁడు పారిపోతూయుండగా పెమ్మసానివారు హాండేవారు, మెసావారు యీముగ్గురు ఖాసాగుఱ్ఱాలు వేసికొని పోయి సలకయతిమ్మణ్ణి శిరచ్ఛేదనం చేసి ఝూండాకుకట్టి........"

ఈరీతిగా నాంధ్రగ్రంథములయందును స్థానికచరిత్రములయందును అళియరామరాయలు సకలకర్ణాటసామ్రాజ్యసముద్ధరణోద్యోగియై, సామ్రాజ్యద్రోహిగఁ బ్రవర్తించిన సలకముచినతిమ్మరాజును బ్రతిఘటించి యుద్ధము చేసి వానినాశనము గావించి కృష్ణదేవరాయలసోదరపుత్త్రుఁ డయినసదాశివదేవరాయలను బట్టాభిషిక్తుని గావించి మహోన్నతప్రతిష్ఠాప్రతిభలఁ గాంచినవాఁ డనిదెలుపుచుండ మహమ్మదుఖాసిం

ఫెరిస్తా యళియరామరాయలు యుద్ధమే చేయలే దనియు, నలకముతిమ్మయను మోసపుచ్చఁగా నతఁడు పిచ్చఁబట్టి రాజధనాగారమంతయుఁ గొల్లపెట్టి నాశనముగావించి విద్యానగరము నంతయు వైభవశూన్యముగాఁ జేసి తుదకు విశ్వాసానర్హమై భయంకరమైన యాత్మహత్యఁ జేసికొని చచ్చెనని వ్రాసినదానిని 'హీరాసుఫాదరి' వంటి విదేశీయుఁడైన చరిత్రకారుఁడు విశ్వసించినను దేశీయులయిన చరిత్రకారు లెవ్వరును విశ్వసింపఁ జాలరు. తెలుగు గ్రంథములలో నళియరామరాయలు యుద్ధమున నలకముతిమ్మయను సంహరించినవాఁ డని చెప్పినమాత్రముచేత నాతఁడు స్వహస్తములతోఁ జంపినవాఁడని భావింప నక్కఱలేదు. ఆతనిపక్షమున నెవ్వనిచే జంపఁబడినను యుద్ధములోఁ జంపఁబడె ననుట సత్యమని సందేహింపఁ బనిలేదు.

'కోయుటో' తానువ్రాసిన చరిత్రమునందు 'నలకము చిన్నతిమ్మరాజు తన ప్రజలచేఁ జంపఁబడినవాఁ' డని వ్రాసియున్నాఁడనియు, మీర్జా ఇబ్రహీముజబిరియను నాతఁడు తానువ్రాసిన 'బసాతిన్-ఉస్-సలాతిన్' అనుచరిత్రమున నలకముచిన్నతిమ్మరాజు యుద్ధములోనే చంపఁబడినట్టు వ్రాసియున్నాఁ డనియు, హీరాసుఫాదిరి తనయారవీటివంశచరిత్రమునందుఁ జేర్కొనియుండియు వీనినెల్లను విస్మరించి యొక్క ఫెరిస్తా వ్రాఁతలనే యేల విశ్వసింపవలసివచ్చెనో దురూహ్యముగా నున్నది. (1)

(1) The Aravidu Dynasty of Vijiayanagar p. 11, F. N. No. 2. Couto O. C. p. 382; F. N. No. 5. Busatin-us-Salatin. p. 52.

ఇంక సలకముచినతిమ్మరాజునకుఁ దోడ్పడవచ్చిన దక్కనుసుల్తానులతో నళియరామరాయ లెట్టియుద్ధములు గావించి విజయముఁ బొందినదియు మూఁడవ ప్రకరణమున వివరింతును.

# మూఁడవ ప్రకరణము

## సదాశివరాయలపట్టాభిషేకము

ఎంతబలవంతుఁడయ్యును దుష్ప్రతాపమువలన విగత విభవుం డగుట నిశ్చయము. రాజ్యలక్ష్మి వివేకవిహీనులఁ జిర కాలము నాశ్రయించి యుండదని పెద్దలునుడివెడుమాటయు సత్యము. ఇట్లవివేకియు, దుష్ప్రతాపమువలన మదోన్మత్తుఁడయినద్రోహియు నగునాసలకముచినతిమ్మరాజు, ఆయతభుజ వీర్యులును, మహాయోధులును, అనిర్జేయులును, పరస్పరస్నేహాయత్తచిత్తులును, మహాసేనాన్వితులు నగునాయారవీటిసోదర త్రయమును బ్రతిఘటించి ఘోరసంగ్రామమునలిపియు నిలువఁ జాలక వెన్నిచ్చి పాఱి శిరచ్ఛేదనము గావింపఁబడిన సమాచారము విన్నమీఁదట దక్కనుసుల్తానులు యుద్ధరంగము నుండి తొలఁగి పోయిరి. అంతఃపురమున నున్నకృష్ణదేవరాయలవారిరాణులీవార్త వినివిద్యానగరద్వారములను దెఱువ నాజ్ఞాపించిరి. అళియరామరాయ లేయడ్డంకునులేక విద్యానగర ప్రవేశము గావించి యంతటితోఁ దృప్తిఁజెందక దక్కను సుల్తానులవలన నెట్టియుపద్రవమును మరల గలుగకుండుటకై తగుసేనానులకు వలసినంతసైన్యము నొసంగివారలను దఱుము కొనిపోయి పోరాడి జయించి వశ్యులను గావించుకొనవలసిన

డిగా నాజ్ఞనిచ్చి సంతుష్టాంతరంగుఁడగుచుఁ గాలయాప
నము సేయక యొకశుభముహూర్తమున బాలుఁడగునసదాశివ
దేవరాయని విద్యానగరరత్నసింహాసనముపైఁ గూరుచుండఁ
బెట్టి మహావైభవముతో సకలసామంతమంత్రిపురోహితవిద్వ
జ్జనబంధుజనసమక్షమునఁ బట్టాభిషేకము గావించి తాను కార్య
కర్తగా నుండి వీరప్రతాపకఠారిసాళువవీరసదాశివరాయదేవ
రాయమహారాయలే సామ్రాజ్యసార్వభౌముఁ డని ప్రకటించి
మున్ముందువిధేయప్రణామంబులాచరించి శ్వేతచ్ఛత్రమును
బట్టుకొనియెను. తమసమ్మతమునుజూపుచు మహామండలేశ్వరు
లయినసామంతనృపతు లెల్లరును మహానందముతో విధేయులై
కృతప్రణాము లయిరి. సదాశివదేవరాయ లిదివఱకు విజయ
నగరసామ్రాజ్యమునుబరిపాలించి ప్రఖ్యాతులైనకృష్ణదేవరాయ
లకును, అచ్యుతదేవరాయలకును తమ్ముఁడైనరంగరాయలకు
తిమ్మాంబయందుజనించినపుత్త్రుఁడు. అళియరామరాయల పెద
తమ్ముఁ డైనతిరుమలరాజునకు భార్య యైనవెంగళాంబకుఁ
దమ్ముఁడు* సామ్రాజ్యసింహాసన మధిరోహింప నర్హు లయిన

* ఈవెంగళాంబ కృష్ణదేవరాయలకు చిన్నాదేవియందుఁ బుట్టిన
కూతు రని 'హాండే అనంతపురచరిత్ర' మను నొకస్థానికచరిత్రమునందుఁ
దెలుపఁబడి యుండెను గాని, బాలభాగవతమునగాని, వసుచరిత్రమునఁ
గాని, నరపతివిజయము నందుగాని మరియెచ్చటను దెలుపఁబడి యుండ
లేదు. అళియరామరాయలను కృష్ణదేవరాయని యల్లుఁడని వ్రాసినవా
రిది వాస్తవ మయినయెడ తిరుమలరాయనిగూడ నతనియల్లుఁడనియె

వారిలోమిగిలినవాఁడితఁడొక్కఁడే యగుటచేతను, మేదాశక్తియు రాజ్యతంత్రజ్ఞానము నతిశయించినవాఁడగుటచేతను, అళియరామరాయ లీరీతిగా సదాశివరాయలను దగ్గరకుఁ జేరఁదీసి తొలుత తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి సాన్నిధ్యమునఁ బట్టాభిషేకము జరిగించియు రెండవమారు సామ్రాజ్యరాజధానియగు విద్యానగరమున సకలరాజ సమక్షమున యథోచితవిధానమునఁ బట్టాభిషేక మహోత్సవమును గావించెను.

ఈపట్టాభిషేకమహోత్సవ మేనాఁడు జరిగినదియుఁ దెలియ దగు ప్రమాణమేదియు నింతవఱకు మనకు లభింపకపోయినను క్రీ. శ. 1542 వ సంవత్సరములో ప్రథమభాగమున జరిగియుండు ననినిశ్చయింప వచ్చును. ఎందుకన, 1542 వ సంవత్సరము జూలై 27 వ తేదీ గలయొకశాసనము సదాశివదేవరాయలపేరుతోఁ గన్పట్టుచున్నందున నంతకుఁ బూర్వమెపట్టా

---

వ్రాసియుందురు. సదాశివరాయల సోదరియగు వెంగళాంబను అళియ రామరాయల తమ్ముఁడు తిరుమలరాయలు వివాహమైనట్టు హంపీక్షేత్రమునందలి చండేశ్వరీదేవాలయమునందలి యొకశాసనమువలనఁ దెలియవచ్చుచున్నది. కృష్ణదేవరాయనికూఁతురైనను, అతనితమ్ముఁడు రంగరాయలకూతురైననుసదాశివదేవరాయల సోదరియని చెప్పవచ్చును. ఎట్లయినను నీయిర్వురును పూర్వరాజకుటుంబమున కల్లుండ్రని విశ్వసింపఁదగును.

(See A. D. V. p. 22 Notes 6 and 7

భిషేకము జరిగియుండవలయు నని స్పష్టమగుచున్నది. (1) వీరప్రతాపకర్ణాటసార్వభౌమ వీరసదాశివరాయ దేవరాయ మహారాయలు బాలుఁడై నందున నాతని ప్రధానకార్యకర్తగానుండి యళియ రామరాయలవారా సంవత్సరముననే సామ్రాజ్య పరిపాలనా భారమువహించి కృష్ణదేవరాయలనాటి కీర్తి వైభవముల పునస్థాపనము గావించి యఖిలకర్ణాట సామ్రాజ్యము యొక్క విజృంభణము మఱికొంతకాలము భూమిపై సుస్థిరముగావించి శత్రుపక్షమువారి విద్వేషములకు నపనిందలకుఁ బ్రధానకారణ భూతుఁ డయ్యెను అశేషసామ్రాజ్య ప్రజల మన్ననలకుఁ బాత్రుఁడై మించెను. అజేయపరాక్రమంబునఁ గృష్ణదేవ రాయలను, అమేయబుద్ధికౌశలమునఁ దన్మంత్రి శేఖరుఁడగు తిమ్మరుసును మించిన ప్రతిభాశాలిగాని సామాన్యుఁడు గాఁడు.

## —♦ దక్కనుసుల్తానులనుజయించియదపులోనుంచుట ♦—

విప్లవసమయమున నలకమతిమ్మయకుఁ దోడ్పడవచ్చిన విజాపురసుల్తానగు ఇబ్రహీమ్ఆదిల్‌షా, బీదరుసుల్తానగు అమీర్ బరీదుషా, అహమ్మదునగరసుల్తానగు బురహాన్‌నిజామ్‌షా, గోల్కొండసుల్తానగుజమ్షీదుకుతుబ్‌షా, అను దక్కనుసుల్తానులు నల్వురును స్వసైన్యములతో నేతెంచి విద్యానగరమునకు నొక క్రోసుమేరదూరమున దండువిడిసిరిగాని విద్యానగరమును బ్రవే

(1) Epigraphia Carnatika III. Sr. 42.

శించి యుండలేదని హాండేవారిఅనంతపురచరిత్ర మనుస్థానికచరిత్రమును బట్టి దెలియుచున్నది. వీరుసలకము తిమ్మయను వాని సైన్యములను ముందుఁ బెట్టుకొని వాని వెనుక తాము తమ సైన్యములతో నిలువంబడి యుద్ధసన్నద్ధులైరి. అళియరామరాయల సైన్యములం దలపడి తిమ్మయసైన్యములు హతముకాఁగాఁ దిమ్మయ రణరంగమును విడిచి పాఱుచుండ శిరచ్ఛేదనము గావింపఁబడె నన్నవార్త చెవినిబడినతోడనే వీరును యుద్ధభూమిని విడిచి తొలఁగిపోవ విడిచిపెట్టక, అళియరామరాయలసైన్యములు వీరిని వెంబడించిపోయె ననియింతకుఁ బూర్వము దెలిపి యున్నాఁడను.

ఇక్కడ విమర్శనీయ మగునొకముఖ్యాంశము గలదు. దక్కనుసుల్తానులనుజయించినతరువాత సదాశివరాయనికిఁ బట్టాభిషేకము జరిగినదా ? అంతకుఁబూర్వమే పట్టాభిషేకముజరిగినదా ? ఇందునుగూర్చి చరిత్రపరిశోధకులలో భిన్నాభిప్రాయములు గలవు.

" విజయనగరచరిత్రమునకు మూలప్రమాణము " (Cources of Vijayanagar History) లను గ్రంథమునకు నవత్యార్ణికను వ్రాసినవారు మొదట నొకచోట నిట్లువ్రాసిరి. " హాండేవారిఅనంతపురచరిత్రమునుబట్టి సోదరత్రయము మొదట పిచ్చివానిని గెల్చి వానినిసంహరించి తరువాతఅహమ్మదునగరముఁబీదకు, గోల్కొండసుల్తానులసైన్యములఁగలిసికొనుటకు ముందునకు సాగిపోయి యుద్ధములో వానినిజయించి

సోదరులు రాజధానికి వచ్చి సదాశివరాయనిఁ బట్టాభిషిక్తుని గావించిరి."

పై విధముగ వ్రాసినవీరే తరువాతి పేరాలో నిందుకుభిన్నముగా నిట్లు వ్రాసిరి.

"వారువిజయనగరముపై దండెత్తి పోయి, రాజధానికి వెలుపల సలకముతిమ్మయను నోడించి నగరములోఁ బ్రవేశించి క్రమముగా సదాశివరాయనిసింహాసనముపైఁ గూరుచుండఁ బెట్టిరి. ఇదిజరిగినవెనుక నదివఱకుఁ దిమ్మయచే నాహ్వానింపఁబడివచ్చినయహమ్మదునగరముఁబీదరు, గోల్కొండసుల్తానుల సైన్యములను విజయనగరసామ్రాజ్యసీమలనుండి తఱిమివేయుటకై వారిసైన్యములను గలిసికొనుటకుగాను ముందు నకుసాగిపోవలసి యుండెను." (1) హెండేవారి అనంతపురచరిత్రమునందు సదాశివరాయనిపట్టాభిషేకముసంగతి యెత్తికొని యుండలేదు. సలకముతిమ్మయసమరములోసంహరింపఁబడిన వెనుక విద్యానగరము కృష్ణరాయలరాణులయాజ్ఞాప్రకారము స్వాధీనపఱుచఁబడినదనియుఁ దరువాతనే యళియరామరాయలు దక్కనుసుల్తానులపై యుద్ధములు సాగించె ననియుమాత్రము దెలుపఁబడి యున్నది. ఇట్లుండినను నిందుకుభిన్నముగా తాము మొదట వ్రాసినవిధముగా నందున్న దని తెలుపుట వారికిఁ బరిశోధనమునందలియలక్ష్యభావమును సూచింపుచున్నది.

(1) Sources of Vijayanagar History, Intrs. p. 15 and 16.

కావున వారుసత్య మిదియని నిర్ధారించి వ్రాసినవ్రాఁతలు గావు. ఆరవీటివంశచరిత్రమును వ్రాసినహీరాసుఫాదిరి తనగ్రంథములో విజయనగరమునకును మహమ్మదుమతస్థులకును పోరాటము సదాశివరాయని పరిపాలనాప్రారంభకాలమున దాదాపుగా నతనిపట్టాభిషేకదినముననే ప్రారంభ మయ్యె ననివ్రాయుచు, "రాజ్యమాక్రమించుకొన్న సలకము తిమ్మయను సింహాసనమునుండి తొలగించుటకై విజయనగరమునందు సంభవించిన విప్లవమును, తరువాత విజయనగరచక్రవర్తిగా సదాశివరాయని నెన్నికొనుటయు విన్నవాఁడై యయ్యది తనకు మంచిసమయ మనియోజించి విజాపురసుల్తా నగుఇబ్రహీమ్ ఆదిల్ షా ప్రాముఖ్యతఁ గాంచినయాదవానిదుర్గమును స్వాధీనపఱచుకొనుటకై అసాదుఖానుని నియోగించి వానిసైన్యములో నధికభాగము వానిపరముచేసె" నని ఫెరిస్తావ్రాసినవాక్యముల నుదాహరించి యున్నాఁడు. (1) ఇయ్యది షడ్రసోపేతమైన భోజనము భుజింపుమని సమస్తమధురపదార్థములతోఁ గూడినవిస్తరిని గృహయజమాని తనముంగట నుంచఁగాఁ గాలఁదన్ని వీధిలోనికి గిరవాటు వేసినవిస్తళ్లలోని యెంగిలినాకుటకుఁ బఱుగిడినబిచ్చగాని కథను జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది. అళియరామరాయలు సోదరద్వయముతో విజయనగరము నుండి పాఱిపోయియున్నప్పుడు సలకముతిమ్మయ తన్నాహ్వానించి విద్యానగరమునకు రప్పించి లక్షలకొలది హొన్నుల ద్రవ్యమును సమర్పించుకొని విజయ

(1) The Aravidu Dynasty of Vijiayanagar, p. 74.

నగర రత్నసింహాసనముపైఁ గూరుచుండఁ బెట్టి సకలసామంతసమేతముగాఁ దనకుభృత్యుఁడనయి యుందునని చెప్పి పాదాక్రాంతుఁడై యుండి యామహానగరమున నేఁడుదినములు మహోత్సవములు సలిపి, సకలసామ్రాజ్యము సమర్పించినవాఁడిది మంచిసమయముగాఁ దోఁచక విడిచివచ్చిన మహనీయునకు సకలసేనాసమన్వితుఁడై యళియరామరాయలు భీమార్జునులం బోలిన వీరసోదరద్వయముతో సలకముతిమ్మయసైన్యమును జయించి, సమరంబున వానిఁజక్కాడి, విద్యానగరమునఁ బ్రవేశించి, సదాశివదేవరాయనిఁ బట్టాభిషిక్తుని గావించి, యజేయుఁడై తనకీర్తిని నల్గడలఁ బ్రసరింపఁ జేయుకాలము మంచిసమయముగాఁ దోఁచి, యాదవానిదుర్గముపై దండయాత్ర సాగించినాఁడనిరామరాయలకుఁ బ్రబలద్వేషియైన ఫెరిస్తా వ్రాసిన వ్రాయుఁగాక! నిష్పక్షపాతముగ నారవీటివంశచరిత్రమును వ్రాయఁగడంగిన హీరాసుఫాదిరి వంటిచరిత్రకారుఁడు ఫెరిస్తాస్వభావము నెఱింగినవాఁడయ్యు నిట్లసంగతముగ జరిత్రము తలక్రిందుఁజేసి వ్రాయుట యత్యాశ్చర్యకరముగానున్నది. అచ్యుతదేవరాయలకుమారునిఁ బట్టాభిషిక్తుఁ డయిన వానిఁ దనమేనల్లుఁడయినచిన్నవేంకటాద్రిని వానిపినతండ్రియగు రంగరాయుని సంహరించి తానురాజ్య మాక్రమించుకొని సామ్రాజ్యమునకు శత్రువుఁగువారిని జేరఁదీసి హిందూసామ్రాజ్యమును భ్రష్టముగావింపఁ దలపెట్టిన సలకముచిన్నతిమ్మరాజు విప్లవకారకుఁడనిపించుకొనునా? చిన్నవేంకటాద్రికిఁ

భిమ్మటఁ బట్టాభిషిక్తుఁడు కాఁ దగినహక్కుఁగలవాఁడు, చిన్న వేంకటాద్రికిఁ బినతండ్రి కుమారుఁ డునగు సదాశివదేవరాయనిఁ బట్టాభిషిక్తుని గావించిన యళియరామరాయలు విప్లవకారకుఁ డనిపించుకొనునా ? సలకముతిమ్మయను సింహాసనభ్రష్టునిగాఁ జేయుటకై యళియరామరాయలు విప్లవము కల్గించినాఁ డని వ్రాయుట యెంతవిపరీతమైనవిషయముగా నున్నది ? అళియ రామరాయలు సదాశివరాయనికిఁ గలన్యాయ్యమైనహక్కు నిప్పించినవాఁడుగాని వానిసార్వభౌమునిగా నెన్నుకొని లేనిహక్కును గల్పించినవాఁడు గాఁడు.

కారణ మెవ్వరేవిధముగా వక్కాణించినను అళియ రామరాయలసైన్యములకును, దక్కనుసుల్తానులసైన్యముల కును 1542 వ సంవత్సరమునఁ బోరాటము ప్రారంభమైనసం గతి సత్యము. విజయనగరమున సదాశివరాయనిఁ బట్టాభిషి క్తుని గావించినవెనుక నళియరామరాయలు నగరరక్షణమునకు మూలసైన్యముగాఁ గొంతవిజయనగరమున నిలిపి సార్వభౌ మునిరక్షణమునకుఁగా విశ్వాసపాత్రులయినసేనానుల నియో గించి మఱికొంతసైన్యముతోఁ దానుగూడ వెడలిపోయి దక్కను సుల్తానులజయించుటకై యిదివఱకే పంపఁబడిన తన సైన్యములదక్కనుసుల్తానులసైన్యములతోఁ దలపడియుద్ధముఁ జేయుచుండఁ గలిసికొనియెను. విజయనగరసైన్యములకును దక్కనుసుల్తానులసైన్యములకును ఘోరయుద్ధము జరిగినది. ఆకాలమున విజయనగరసామ్రాజ్య మలంకరించి ప్రఖ్యాతిఁ

జెందియున్న మేటియోధులలో మొదట నెన్నఁదగినవాఁడు రామరాయల కడగొట్టుతమ్ముఁడు వేంకటాద్రి. ఇతఁడు వీర పురుషలక్షణములతో నొప్పెడు సుందరదేహము గలవాఁడు. 'ఆహవగాండీవి' యని ప్రతిపక్షయోధవరులుగూడ బ్రశం సించునట్లుగా నాహవరంగమున నశదృశశౌర్య ప్రతాపములఁ జూపుచు విజృంభించి శత్రుసైన్యముల నురుమాడి భీభ త్సముసేయు వారలు యుద్ధరంగమున నిలువఁ జాలక చెల్లా చెదరై పాఱిపోవ మొదలుపెట్టిరి. నరపతి విజయము నందలి యాతని తొలియుద్ధమునఁ గొన్న జయము మీఁక్రింది విధమున వర్ణింపఁబడినది.

"సీ. కందుకక్రీడగాఁ గదనరంగస్థలిఁ
గడువజీరులమస్తకములఁ దునిమి
హరులను బొఱిగొని కరులను దునిమి త
దారోహకులఁ ద్రుంచి వీరభటవి
దళనంబుసేసి దుర్భరపతాకలఁ గూల్పఁ
గనుఁగొని కాందిశీకత వహించి
పీడుబట్టనునాస విడిచి నిజాము యే
దులఖాను కుతుపశాహులదళంబు

తే॥ విచ్చు వెన్నిచ్చి కనుకని యిచ్చఁ బఱచి
మెచ్చఁ జొచ్చిన సభయంబు నిచ్చి విజయ
కాహళులు మ్రోయ నియమించి ఘోౢజనంబు
లభినుతులొనర్పఁగా వేంకటాద్రిరాజు."

అంత దక్కనుసుల్తానులు తమతమరాజ్యముల సంర క్షించుకొనవలయు నన్నయాతురముతోఁ దమదమ సైన్యము లతో విడిపోయి యెవరిమార్గముల వారుపలాయనులై పోవు చుండిరి. అళియరామరాయలు వారుపోయెడినిధమును గాంచి తనసైన్యములను మూఁడువిభాగములుగఁ జేసి తనసోదరులతో నొక్కొకభాగమున కాధిపత్యమువహించి తానుగోలకొండ సుల్తా నగుజమ్షీదుకుతుబ్షాను, తిరుమలరాయలు అహమ్మదు నగరసుల్తా నగుబురహాన్‌నిజాముషాను, వేంకటాద్రి విజా పురము బీదరుసుల్తానులగు ఇబ్రహీమ్‌ఆదిల్‌షా, అమీరాన్ బరీదుషాలను వెంబడించిపోయి వారలను జయించివారలతో సంధిగావించు కొనవలయు నని నిశ్చయించుకొని వారలను వెంబడించి యడవులమార్గముల తఱుముకొని పోవుచుండిరి.

## వేంకటాద్రి నవాబరీదుల యుద్ధము

నవాబరీదులను దఱుముకొనిపోవుచుండిన వేంకటాద్రి సైన్యములతో నాతని పెదతండ్రియు, వృద్ధుఁడును నొకు దుర్గాధ్యక్షుఁడును నగుతిమ్మరాజును, వానిపుత్రులగు నప్ప లరాజాదు లున్నట్టి బాలభాగవతమున వర్ణించిన విషయము లను బట్టి గ్రహింప నగును. వీరిసైన్యములకును నవాబరీ దులసైన్యములకును ఆదవానికడనొకయుద్ధమును, కూరకచెర్ల కడ నొకయుద్ధమును, మానువకడ నొకయుద్ధమును జరిగినట్లుగఁ దెలియుచున్నది. సలకముతిమ్మయకుఁ దోడ్పడ వచ్చినప్పుడే

విజాపురసుల్తాను ఆదవాని దుర్గమును స్వాధీనముఁ జేసికొని కొంతసైన్యమచటనిలిపి అసాదుఖాను సంరక్షణముననుంచెను. ఆదవాని సమీపించినతోడనే ఇబ్రహీమ్‌ఆదిల్‌షా, అమీర్ బరీదుషా సైన్యములు వేంకటాద్రిసైన్యముల మరలయెదుర్కొని యుద్ధముసేయ సాహసించెను. విజయనగర సైన్యాధిపతియగు వేంకటాద్రి దమసైన్యములను దఱుముకొనివచ్చుచున్నాఁ డనివిని అసాదుఖాను ఆదవానిదుర్గమును విడిచి కొంత యాశ్వికసైన్యమును మాత్రము దనతోనుంచుకొని తక్కిన సైన్యములను ఇబ్రహీమ్ ఆదిల్‌షా సైన్యములతోఁ గలిసికొన నుత్తరువుచేసెను. తరువాత వేంకటాద్రిసైన్యము లాదవానిదుర్గము నాక్రమించుకొనిరి గాని అసాదుఖాను కానుపింపకపోయెను. అతఁడు ఆదిల్‌షాను గలిసికొనియుండు ననినిశ్చయించి విజాపురసైన్యములను దఱుముచునే యుండెను. ఒకనాఁటిరాత్రి ఆదిల్‌షాసైన్యము లొకచోట విశ్రమింప విడిచిన వనివిని తానును వానికి వెనుక నెనిమిదిమైళ్ల దూరములో విశ్రమించి వేంకటాద్రిసైన్యము లేమరియుండెను. వారితోఁ గొనిపోయిన వస్తువాహన సామగ్రియు, స్త్రీజనబృందముతో వేంకటాద్రి మొదలగు సేనానుల కుటుంబములును డేరాలలో విశ్రమించియున్నకాలమున పగలాసమీపమున నెచటనో దాగియున్న అసాదుఖాను మూఁడువేల గుఱ్ఱపుదళముతో వచ్చి పైఁబడియెను. వెనుకప్రక్కనున్న వేంకటాద్రిసైన్యములావైపరీత్యమును గాంచి బెదరి చెల్లాచెదరై పోయెను. వాహన

వస్తుసామగ్రియు, రాచకుటుంబములు వారివారి డేరాలతోఁ గూడ నసాదుఖానుపాలయ్యెను. అంతఁదెల్లవాఱిన పిమ్మట వేంకటాద్రి చెదరిపోయిన సైన్యముల మరలసమ్మేళనము గావించి అసాదుఖానును వానిసైన్యములను ముట్టడింపవలయు నని ప్రయత్నింపఁగా నతఁడునవాబరీదులను జేరుకొనియెను. అసాదుఖానుచేసిన ద్రోహము నకుఁ గుపితుఁడై వేంకటాద్రి వానిము న్ముందు నడ్డగించి వానిని శిక్షించి తమకుటుంబముల కేవిధమైన నపకారముజరుగకయున్న వారిని చెఱనుండి విడిపింపవలయు ననునాతురముతో నారవీటిరాచవీరకుమారవర్గముఁ దోడ్పడఁ బదివేలగుఱ్ఱపురౌతులతో శత్రుసైన్యములను వెన్నంటివచ్చి కూరకచర్లకడఁ దలపడియుద్ధము చేసెను. కూరకచర్లయెచట నుండెనో దెలియరాదుగాని బాలభాగవతమునందు కూరకచర్ల కడ నవాబరీదులతో యుద్ధము జరిగియున్నటుల చెప్పఁబడి యుండుటచేత నుభయసైన్యములు మరలఁగలిసికొని పోరాడిన ప్రదేశము కూరకచర్లయై యుండునని నేనుతలంచుచున్నాను. వేంకటాద్రి పెదతండ్రి కుమారుఁడు అప్పలరాజిచట నవాబరీదులతోజరిగినఘోరాహవమునవారినిజయించియు మృతినొందిన టుల బాలభాగవతమునఁ జెప్పఁ బడియెను.* ఈయుద్ధము

* "అమితవైభవుఁడయినయప్పలరాజు
రమణీయమైనకూరకచర్లయొద్ద
కడుమించునాజరంగంబునఁగడిమి
దొడరినట్టినవాబరీదులనిర్జయించి
తరణిమండలవిభేదనపూర్వకముగ
సురలోకమునకురాజులుమెచ్చనరిగె." బా. భా. (ద్విపద)

నప్పలరాజొక్కఁడే జయింపినదికాదు. ఇతఁడును, ఇతనితండ్రియుఁ గూడ వేంకటాద్రిని వెంబడించివచ్చినవారగుటచేతను వారుగూడ నీయుద్ధమును జరిపిజయముగొన్నవా రగుటచేతను అప్పలరాజు జయముగొనియు యుద్ధములో మరణముఁ జెందెనని బాలభాగవత గ్రంథకర్త చెప్పియున్నాఁడు. ఇక్కడగూడ వేంకటాద్రికి సంపూర్ణవిజయము లభించిన దనిచెప్పక తప్పదు.

వేంకటాద్రితోఁబుట్టువులక్కమాంబపుత్త్రుఁడును, తొంగంటిదుర్గాధ్యక్షుఁడు నగుపోచిరాజునరసింహరాజు కూడవేంకటాద్రికిని నవాబరీదులకును జరిగినయీయుద్ధమునఁదోడ్పడియున్నట్టు నరసభూపాలీయములోనియీక్రిందిపద్యమువలనవిదితముకాఁగలదు.

" క. గర్వితబరీదసేనా
సర్వస్వహరానివార్యశౌర్యనకుసమి
ద్ధూర్వహసపాదభయదా
ఖర్వమహావిజయభేరికాభాంకృతికిన్. "

ఈయుద్ధమునందు వేంకటాద్రి పరిపూర్ణవిజయమును బొందెను. గర్వితుఁడగుబీదరుసుల్తాను అమీరాన్ బరీదుషా యోడింపఁబడి బిరుదుమేళంబుతోఁ గూడఁబట్టువడినట్లుగా నరసభూపాలీయము, వసుచరిత్ర, నరపతివిజయములవలనఁ దెలియుచున్నది.

" సీ. అనుచుయవనులఁ దెగడితన్నాశ్రయించు
వారిసామ్రాజ్యలక్ష్మినెవ్వాఁడుగొనిమె

నాహూవోగ్రబరీదసప్తాంగహారణుఁ
డతఁడువిలసిల్లుశ్రీవేంకటాద్రివిభుఁడు. ”

(న. భూ.)

ఇచట బరీదును బట్టుకొనుటయె గాదు, అసాదుఖాను చెఱగొన్నరాజకుటుంబములనుగూడఁ జెఱనుండివిడిపించుకొనియె ననిభట్టుమూర్తి తనవసుచరిత్రములో వేంకటాద్రిని నభివర్ణించుచుఁ జెప్పినయీక్రిందిసీసపద్యములో సూచించియున్నాఁడు.

“ సీ. నిరతంబు దుర్మార్గనిరతులౌ తురకల
సతులసన్మార్గసంగతులఁ జేసె
ననియత మోహాంధులౌ పారసీకుల
స్వస్త్రీసుఖైకనిశ్చలులఁ జేసె
నతినిర్దయాత్ములౌ యవనుల భూత
సంతానతృప్తిప్రదాత్మకులఁ జేసె
ద్విజపక్షపాతంబు దెగడుపాశ్చాత్యుల
ద్విజపక్షపాతభావితులఁ జేసె
గీ. ననుచుఁ గడుమెచ్చి జయలక్ష్మి యాజిరంగ
కాతరబరీదకేతనఘటితభద్రకలశ
మెదురుగఁ బూని యేఘనునిఁ జెందె
నతఁడుసామాన్యుఁడే వేంకటాద్రివిభుఁడు. ”

(వ. చ.)

" ఆ. అసదృశోరుశౌర్యు(డాహవగాండీవి
వేంకటాద్రిరాజవిబుధరాజు
అనిబరీదుగెలిచియాతనిబిరుదుమే
కమ్ము(గొనియెభూజనమ్ము వొగడ."

ఇట్లు బీదరుసుల్తానగు అమీరు బరీదుషా విజితుడై శరణాగతుడై వశ్యు(డగునవెనుక విజాపురసుల్తాను స్వసైన్యయుతముగ( బలాయను(డయ్యెను. ఇట్లు పలాయనుడై ఇబ్రహీమ్ఆదిల్‌షా పఱువిడుచున్నను వేంకటాద్రి వానిని విడిచిపెట్టక యాతనిసైన్యముల వెన్నంటి కూడ(బోయెను. అట్లు పఱువిడిపోయి విజాపురసుల్తాను తుంగభద్రానదికి నుత్తరభాగమున రాచూరుదుర్గమునకు నైఋతిమూలను ముదిగల్లుదుర్గమునకు నాగ్నేయమూలను రెండుదుర్గములకునడుమ నున్న మానువదుర్గముకడ సుస్థిరముగా నిలిచి తనసైన్యముల మోహరింప(జేసికొని మరలనెదుర్కొని యుద్ధము చేసెను. ఇచట వీనినివేంకటాద్రిపెదతండ్రియగునోకుతిమ్మరాజు జయించి విజయముగొన్నవా(డనికోనేరునాథకవి విరచితములయినద్విపదబాలభాగవతము, పద్యబాలభాగవతములలోనియీక్రింది వాక్యములనుబట్టిమనము తెలిసికొన(గలుగుచున్నాము.

" కడిమిమైమానువకడరణక్షోణి
గడుసరినేదులఖానుజయించె." ద్వి. బా.

" మానువకడ సవాబూనిపోరను బరా
జయము నొందించె నేశౌర్యశాలి." ప. బా.

ఇట్లు వేంకటాద్రియు వాని సైన్యములును శత్రురాజ్యమునఁ బ్రవేశించి జయములుగొనుచు దండయాత్రను ముగింపక వెంటాడించి విడిచిపెట్టక యిబ్రహీమ్ ఆదిల్ షా శరణాగతుఁడై వచ్చి సంధిచేసికొనువఱకును వేంకటాద్రి దీక్షతోఁ బోరాడుచునే యుండెను. బలవంతుఁడగు ఇబ్రహీమ్ ఏదిల్ షా కడసారి భీమరథీనదీ ప్రాంతమున వేంకటాద్రి సైన్యము నెదిరించి భయంకరమైన సమరము సలిపియు గెలుపుగొనలేక పోయెను. ఇచట వేంకటాద్రికిఁ బరిపూర్ణవిజయము లభించె నని భట్టుమూర్తి తన నరసభూపాలీయ మను గ్రంథమున నీక్రింది రెండుపద్యములలో విస్పష్టముగా వర్ణించి యున్నాఁడు.

"మ. బంధుర్యుం డగు వేంకటేంద్రుని మహాబాహాబలాటోపవి
హ్వాలుఁడై మున్న తిథావన క్రియ సపాదాభిఖ్యుఁడై నట్టియే
దులఖానుం డిదె నేఁడుఁ గ్రమ్మఱ సపాదుం డయ్యె నా
(నర్నిలిన్
దలఁ దత్పాదముఁ దాల్చె భీమరథిప్రాంత స్థాన విత్యోర్వి
(న్నతిన్."

"మ. స్థిర సంగ్రామజయాభిరాముఁడగు నా శ్రీవేంకటక్ష్మావరుం
డరయ న్రాజశిఖావతంసుఁ డగుఁ దద్యంబుఁ గాకున్న నీ
ధరణీపాలుర నెల్ల మెచ్చఁగ సపాదక్ష్మోని భృత్ప్రాప్తి భా
సుర దుర్గాధిపతిత్వమై భవభవస్ఫూర్తి న్విజృంభించునే."

ఇట్లు వేంకటాద్రితోనైన యుద్ధములయందుఁ బరాజయము నొంది విహ్వలుఁడై పోయి విజాపురసుల్తాను శరణాగ

తుఁడై వేంకటాద్రి కాళ్లుపట్టుకొని సంధిచేసికొనవలసి వచ్చెను. అప్పుడు "సపాదక్షోణిభృత్ప్రతిభాసురదుర్గాధిపతిత్వవై భవ" మనఁగా విజాపురరాజ్యములోని రాచూరు ముదిగల్లు మొదలగు దుర్గముల నొసంగి సంధిచేసికొని తనరాజ్యము పరాధీనము గాకుండఁ గాపాడుకొనఁ గలిగెను. వేంకటాద్రికిని సవాబరీదులకును జరిగినయుద్ధ మీవిధముగా ముగింపఁబడి యుండఁగా ఫెరిస్తా యీచరిత్రమునంతను దలక్రిందుగా మార్చి యెట్లు వ్రాసినాఁడో దానింగూడ దెలిసికొన్నయెడల చదువరులకిందలి సత్యము గ్రాహ్యముగాక మానదు. సలకముతిమ్మయను సింహాసన భ్రష్టునిగావించుటకై యళియరామరాయలు విద్యానగరమున మహావిప్లవమును గలిగించి సదాశివరాయని పట్టాభిషిక్తునిఁ జేసినకాలము తనదండయాత్రకు మంచికాలము వచ్చె నని తలంచి యాదవానిదుర్గమును బట్టుకొనుటకై అసాదుఖానుని విజాపురసుల్తాను పంపించినాఁ డనిఫెరిస్తా వ్రాసినదానిని నింతకుఁ బూర్వము దెలిపి యున్నాను. అట్లు అసాదుఖాను ఆదవేనిదుర్గమును ముట్టడింప నావార్త విద్యానగరముననున్న యళియరామరాయలకుఁ దెలియవచ్చి యాముట్టడిని విడిపించి యసాదుఖానుని జయించుటకై కొంతసైన్యముతోఁ దనతమ్మునివేంకటాద్రిని బంపె నఁట. అసాదుఖాను వేంకటాద్రి వచ్చుచున్నాఁ డనివిని యాదవాని దుర్గమును ముట్టడించుట మాని వేంకటాద్రి నెదుర్కొనియె నఁట. అంతఁగొంచెము కాలము యుద్ధముజరిగినది గాని తనకునోటమి కలుగు నన్నభీతి

చేత సక్రమముగా వెనుదీయఁ బ్రారంభించె నఁట. ఒకనాటి రాత్రి అసాదుఖా నొకచోట విశ్రమించినాఁడట! అతఁడు పాఱిపోకుండఁ జూచుటకుగాను వేంకటాద్రికూడ ఆ మైళ్లదూరములో దండువిడిసి విశ్రాంతిగొనుచుండె నఁట. ఆమఱునాఁడు సూర్యోదయముకాకపూర్వమే అసాదుఖాను ప్రశస్తమైన నాలుగువేల యాశ్వికసైన్యముతో వచ్చిపైఁబడి యాశ్చర్యము గొలిపె నఁట. ఆత్మవిశ్వాస మెక్కువగాఁ గలవాఁడగుటచేత వేంకటాద్రి యేమరియుండె నఁట! వారుగన్నెత్తి చూచునప్పటికి తురకరౌతులు హిందూగుడారముల నడుమనుండిరఁట! వేంకటాద్రి కెంతమాత్రము తప్పించుకొన నావకాశము లేక తనధనాగారమును, కుటుంబమును, ఏనుగులు మొదలుగాఁగల వాహనాదికములను వారికి విడిచిపెట్టి పాఱిపోయె నఁట. తెల్లవారి సూర్యోదయమైన తోడనే వేంకటాద్రి చెల్లాచెదరై పోయినసైన్యములను నొక్కచోటికి మరలచేర్చుకొని యుద్ధముచేయుటకు సంసిద్ధుఁడై యున్నవానివలెనటించుచుఁ బ్రయత్నించినను, తనకుటుంబమునకు నేమివిపత్తు కలుగునో యన్నభయముచేత యుద్ధముచేయుటకు నిష్టపడక కొన్నిమైళ్లదూరముగా వెనుకకుఁ బోయి యచట నివసించి తనదురవస్థను దెలుపుచుఁ దనసోదరుఁడైన రామరాయలకుఁ గొంతసైన్యముఁ బంపుమని వర్తమానముచేసె నఁట. అంతరామరాయ లతఁడు కోరినప్రకారము ధనమును సైన్యములను బంపి యుద్ధముచేయవలసినదని బహిరంగముగా నాజ్ఞాపించుచు రహస్యముగా

నొక జాబు వ్రాసె నఁట. ఆజాబులోనివిషయ మిట్లుండె నఁట! ఇబ్రహీమ్ ఆదిల్‌షా బుద్ధిపూర్వకముగా దండెత్తిరావలె నని వచ్చి యుండఁడు. అచటిజమీందారులెవ్వరో కుట్ర చేసియతనిరప్పించి యుందురు. నీసైన్యములోనివారు కూడ వారిపక్షమునఁ బనిచేయ వచ్చును. కావున నేదో సామోపాయముచేత ప్రస్తుతము సంధిచేసికొని భార్యను బిడ్డలను అసాదుఖానునుండి విడిపించు కొనవలయునని వ్రాసె నఁట.

ఇట్టిసలహా ననుసరించి వేంకటాద్రి అసాదుఖానునకు విశేషముగా లంచమొసంగి వానిని మధ్యవర్తిగాఁ జేసివాని ద్వారా విజాపురసుల్తానుతో మాట్లాడింపఁగా నాతఁడు సంధి చేసికొన ననుజ్ఞ నొసంగె నఁట! ఆసంధిషరతు లెట్టివో ఫెరిస్తా దెలుపలేదు గాని యుభయపక్షములకు సంతృప్తికరములుగా నున్న వఁట! ఇది ముగిసిన వెనుక అసాదుఖాను తనయజమానిని గలిసికొని విజాపురమునకును, వేంకటాద్రి తనకుటుంబమును దీసికొని విజయనగరమునకును వెడలిపోయి రఁట. ఈపయి చెప్పినది ఫెరిస్తావ్రాఁతవైఖరిని దెలుపుచున్నది. విజయనగర విప్లవమున ద్రోహియైన సలకముతిమ్మయకుఁ దోడ్పడవచ్చి యారీతిగాఁ బరిభవమునొందినాఁ డనిభావిప్రపంచము చేయు నిందనుండియు నపకీర్తినుండియుఁ దప్పించుటకై మహమ్మదు ఖాశింఫెరిస్తా పై రీతిగాఁ గల్పనముచేసి వ్రాసినవ్రాఁతగాని మఱియొండుగాదు. భీమరథివఱకు వేంకటాద్రిపోయి యుద్ధములు చేసి యున్నట్లుగా హిందువుల గ్రంథములు ఘోషించుచుం

డఁగా వీనిని విస్మరించి హీరాసుఫాదిరి ఫెరిస్తాను విశ్వసించి వ్రాయుట తెలుఁగుభాషనాతఁ డెఱుఁగకుండుట యేకారణము. ఈగ్రంథకర్తలు కవు లయినపాపముచేత వీరుచెప్పిన సత్యాంశములనుగూడ ద్రోసిపుచ్చ నగునా? వర్ణనాంశములలో నతిశయోక్తు లుండిన నుండుగాక! వారుసమకాలికులై యుండి చెప్పినవిషయములను గూడఁ ద్రోసిపుచ్చ నగునా? ఆరవీటివంశచరిత్రము నందునెచ్చట సత్యచరిత్రాంశమునకు గౌరవము ముఖ్యముగా నీయఁదగియుండెనో యాగౌరవము నచటనుండి హీరాసుఫాదిరి తొలగించివేయుట మిక్కిలి శోచనీయము.

ఇట్లు సంధిచేసికొని విజాపురసుల్తాను దనరాజధానిఁ జేరినకొలదికాలములోనే అహమ్మదునగరసుల్తా నగుబురహాన్ నిజాముషావలన నాహ్వానింపఁ బడియతనితోఁ గుట్రకావించి బీదరు, విజయనగరములపై దండయాత్రలుసాగించుటకు నిశ్చయించుకొని రఁట! ఆప్రకారము బురహాను బీదరురాజ్యముపై దండెత్తివచ్చె నఁట! బీదరుసుల్తా నగుబరీదుషాయీ సంధివిషయ మెఱుంగక బరీదుషా తనపూర్వమిత్రుఁ డగు ఇబ్రహీమ్‌ఆదిల్‌షాకడకు సహాయార్థ మఱిఁగె నఁట! అతఁడు వెంటనే యాతనిఁ జెఱఁబెట్టె నఁట! ఆదిల్‌షా తరువాతవిజయనగరరాజ్యముపై దండెత్తి విజయముగాంచి విజయనగరరాజ్యములోని పెక్కుభాగములను తనరాజ్యములోఁ గలుపుకొన్నాఁడనిఫెరిస్తావాక్యముల నుదాహరింపుచు హీరాసు విజయనగరరాజ్యములోని భాగములను కలుపుకొన్నదిమాత్ర మసత్యా

మనివ్రాయుచున్నాఁడు. ఆకాలమున విజయనగరమునకు నట్టి దేశనష్టము కలిగిననంగతి వినరాదని యీవిషయములకుఁ దరువాత రామరాయల వామ్మదునగరసుల్తా నగుబురహాన్ నిజాముషాతో యుద్ధమునకుఁ దలపడియున్నవాఁడు గనుక ఫెరిస్తా వ్రాసిన దతిశయోక్తి యనిమాత్ర మొప్పుకొనుచున్నాఁడు.

అసలు హీరాసుయెత్తిన యెత్తుగడయె సక్రమమైనది గాదు. విజాపురసుల్తాను సంధిచేసికొన్న తరువాత బురహాన్ నిజాముషాతోఁజేరి బీదరువిద్యానగరములపై యీసంవత్సరమె మరల దండయాత్ర సాగించినాఁ డనుటసత్యవిరుద్ధము. ఫెరిస్తా వ్రాసిన వాక్యముల మర్మములోఁ దగుల్కొని చరిత్రబద్ధములు కానివిషయములకుఁ బ్రాముఖ్యానొసంగి తనతో యుద్ధముచేయ ఇబ్రహీమ్ ఆదిల్ షాను ప్రేరేపించినవాఁ డని యూసుగలిగి బురహాన్ నిజాముషాపై రామరాయలు దండెత్తిపోయినవాఁ డనిహీరాసువ్రాసినది సత్యముకాదు. సలకముతిమ్మయ సంభవింపఁజేసిన విప్లవకాలమున నాశనికిఁ దోడ్పడవచ్చినవా రనితక్కినసుల్తానులపై దండయాత్ర సాగించి నట్లే రామరాయలీతనిపైఁగూడ దండయాత్ర సాగించినవాఁడుగాని మఱియన్యకారణముచేతఁ గాదనిభట్టుమూర్త్యాదులు వ్రాసిన వ్రాఁతలవల్లనే తెలియుచున్నది. అళియరామరాయలును వాని తమ్ముఁడు తిరుమల దేవరాయలును, జమ్షీదు కుతుబ్ షాను బురహాన్నిజాముషాను వెంబడించిపోయి యుండిరని యింతకుఁ బూర్వము దెలిపియున్నాను. అళియరామరాయలు జమ్షీదు

కుతుబ్షా సైన్యములను పానుగల్లుదుర్గముకడ సంధించి యాతని నోడింపఁగా నాతఁడుగోలకొండకుఁ బాఱిపోయెను. అంతటితోఁ దృప్తినొందక గోలకొండవఱకుఁ దఱుముకొనిపోయి యాదుర్గమును ముట్టడింపఁగా జమ్షీదు సంధిచేసికొనుట యుక్తముగా భావించి యళియరామరాయలతో రాయభారములు జరుప దూరదృష్టితో నతఁడందుల కంగీకరించి సంధి గావించుకొనియెను. తిరుమలరాయల సైన్యములు కళ్యాణ నగరదుర్గముకడ బురహాన్ నిజాముషా సైన్యములతోఁ దలపడిపోరాడుచున్నకాలమున నళియరామరాయల సైన్యములు తూర్పుదిక్కునుండియు, వేంకటాద్రి సైన్యములు పడమటిదిక్కునుండియుఁ దమతమ విజయయాత్రలను ముగించుకొని మధ్యభాగమున నున్నతిరుమలరాయల సైన్యములను గలిసికొనియెను. ఇట్లుగలిసికొన్నసోదరత్రయముతోఁ బోరాడుట బురహాన్నిజాముషాకు దుర్భరమై పోయి కళ్యాణినగరమును శత్రువులకు విడిచిపెట్టి పలాయనుఁడై యహమ్మదునగర మార్గమునుబట్టెను. కళ్యాణిఁ బట్టుకొన్నవిషయము వసుచరిత్రమునం గానరాదని హీరాసుఫాదిరితలంచినది సత్యముకాదు. (1) వసుచరిత్రమునందావిషయము వక్కాణింపఁబడినది. చూడుఁడు.

---

(1) (The Vasucharitramu does not give any information about the capture of Kalyani, which belonged to the Sultan of Ahmadnagar). The Aravidu Dynasty of Vijayanagar, p. 76.

"శా. విశ్వామిత్రుఁడుఁ గొల్చి రాముఁ డతఁ డుర్విం జెండెఁ
(గళ్యాణము
న్విశ్వామిత్రులు గొల్వ రాముఁ డితఁ డుర్విం జెండెఁ
(గళ్యాణముల్
శశ్వత్కీర్తులు రాము లియ్యిరువురున్ సాధించు కళ్యాణలా
భైశ్వర్యంబులు ధర్మనిర్మథనధర్మాలంబనవ్యగ్రముల్."

అళియరామరాయలకు కళ్యాణనగరమును బురహాన్ నిజాముషానుండి బలాత్కారముగాఁ గైకొనియుండుటచేతనే యాతని బిరుదుగద్యములో 'కళ్యాణనగరసాధక' యన్న బిరుదముగూడఁ జేర్పఁ బడినది. ఇంతటితోఁ దృప్తినొందక బురహాన్ నిజాముషా వంటి శత్రువును స్వాధీనపఱచుకొనక యుండ విడిచిపెట్టుట ప్రమాదహేతు వగునని చింతించి యళియరామరాయలు తనసోదరులతోఁ బర్యాలోచించి యహమ్మదునగరముపై దండెత్తిపోవుటకు నిశ్చయించుకొని సోదరత్రయమును దమ తమ సైన్యములతో వానిని దఱుముకొనుచుఁ బోయిరి. అహమ్మదునగరసమీపమున బురహాన్ నిజాముషా ఘోరసంగ్రామమును జరిపెను. ఇచట బురహాన్ నిజాముషాకుఁ బరాజయము సంభవించుటయె గాక యీయుద్ధమునుండి పాఱిపోవుచున్న వానిని కొన్నలాపురము హండే హనుమప్ప నాయఁడు పట్టుకొని వాని సైన్యములు జయఘోష మిడుచుండ వానిఁ గొనివచ్చి యళియ రామరాయలకు ముందుఁ బెట్టెను. అళియరామరాయల సైన్యము లహమ్మదునగరమునఁ బ్రవేశించి కోటలనాశనము గావించి

నగరమునాగళ్లఁగోఁ దుక్కిదున్నించి యాముదాలుచల్లించి రని యాంధ్రకవులువర్ణించిరి. ఇతఁడహమ్మదునగరమునువిడిచి యచటికి నలుబదియేబదిమైళ్ల దూరమున నున్నగోదావరినిదాటి పోయె ననియు నచటికి నీసోదరత్రయమును శత్రువర్గమును నురుమాడుటవలన రక్తసిక్తములయినతమఖడ్గములను గోదావరిలోఁగడిగి రనికవులు వ్రాసిరి. బహుశః హుండేఅనుస్వనాయఁడుగోదావరినిదాటి పారిపోవుచున్నకాలముననే బురహాన్ నిజామువాను బట్టుకొని యుండు నని విశ్వసింప వచ్చును. అహమ్మదునగరవినాశము నరపతివిజయ మను గ్రంథమున నిట్లువర్ణింపఁ బడినది.

“ సీ. హరిశౌర్యుఁడగుతిర్మలాధీశ్వరుండు ద
దవరజుం డగువేంకటాద్రి రాజు
భుజయుగంబుగ బలస్ఫురణతోఁ గరిహరి
వరవీరభటులతో దొరలతోడ
దనయాజ్ఞ మీఱినకినుక నిజాముపై
దండెత్తి తఱిమి యుద్దండవృత్తి
నతఁ డేలుచున్నట్టి యామదానగరంబు
చాలెత్తి మఱి యాముదాలు వేసి.

ఆ. సేతుకాశిమధ్యభూతలనుతజయ
శ్రీవరించివేడ్కఁ జెలంగె
రామమూర్తియైనరామరాజేంద్రుఁడు
సాంద్రవిభవజిత సురేంద్రుఁ డెలమి. ”

* * * * *

"మ. కడిమిన్వేంకటరాయశౌరినెదురంగాలేక సత్యాహితం
జడరన్ గౌతమిదాటువేళ నిజకాంతాశ్రుప్రవాహాప్తిగా
ల్నడఁ దప్పన్ జడుఁడై నిజాముఁడుఁడుపాలంబంబున
(దాటి యు
క్కడఁగన్న స్పజయించు నయ్యుడుపరేఖన్నామమో
(హంబునన్."

※ ※ ※ ※ ※

"ఉ. తయనుజు ల్విసుద్ధహరిదంత మహాకరిదంత కాంతిరే
ఖాయతకీర్తులై కొలువ గౌతమినీటనరాతిఘాతి కౌ
షేయకరక్తము ల్గడిగి శ్రీరమణీవరమూర్తి రామభూ
నాయకుఁ డుర్వి నేలె భువనస్తనీయ జయాభిరాముఁడై."

ఈకార్యముల నిర్వర్తించుటచేతనే యీతని బిరుదు గద్యములో 'ఆమదానగరసాలభంజన' యనియు, 'గౌతమీస్నానపావనాకార' యనియు బిరుదములు చేర్పఁబడినవి.

అళియరామరాయలు బురహాన్ నిజాముషా స్వాధీనుఁడయినవాఁడుగనుక నతనికి నిభరామునకుఁ గలమైత్రి మాన్పుకొన వాగ్దత్తముగైకొని యాతనినిర్బంధమునుండి విడిచిపెట్టెను. ఇట్టివిజయములనుగాంచి నట్టితనప్రభువగు నళియరామరాయలను భట్టుమూర్తి తన వసుచరిత్రమునం దట్లభివర్ణించియున్నాఁడు.

"సీ. ప్రజలావలేపవిగ్రహజాయమానాగ్ర
హముడించి బహుదానవాప్తిఁగాంచుఁ

బరమొల్లఁ బ్రత్యగ్రభూతిపాలుఁగఁ జేసి
యచలాసనాభ్యాసియై కృశించు
రతినిభరామానుగతమైత్రిపై రోసి
కలనైనఁగళ్యాణ కాంక్షయుడఁడు
సరవిఁ బ్రాణాయామసంసిద్ధికై సారె
సారెకుఁగుండలిస్థాన మంటి
గీ. మానసనిజాముఁడపవర్గమార్గవృత్తిఁ
బెరయుపరబుద్ధినెవ్వాని పేరుఁదలఁచి
యతఁడు శ్రీరాముఁ డఖిలసన్నుతికిఁ దగడె
సేతుకాశీతలాంతర ఖ్యాతయశుఁడు. ”

ఈ ప్రథమ సంవత్సరమున జరిపినదండయాత్రల నన్నిటి యందు మహావిజయములను గాంచి యళియరామరాయలును వానిసోదరు లిర్వురును సకలకర్ణాట సామ్రాజ్యమును సముద్ధరించి జగన్నుతి గన్నవారలగుచు సుఖముగా మరలి రాజధానియగు విద్యానగరము బ్రవేశించిరి.

రామరాయలు సుల్తానులపట్ల చూపిన రాజనీతి పద్ధతి దక్కనుసుల్తానులకుఁ దమతమ సరిహద్దులలో నుండుదుర్గములనుగూర్చిన తగవులచే నైకమత్యము లేక పరస్పరాసూయలతోను గలహములతోను గాలము గడపుటయేగాక యప్పటప్పట యుద్ధములుగూడఁ జేయుచుండిరి. అళియరామరాయలీదక్కను సుల్తానులెల్లరు నైకమత్యముతోనున్న నెప్పటికైన

హిందూ సామ్రాజ్య మగువిద్యానగర సామ్రాజ్యము నకు ముప్పుగలుగకమాన దనినిశ్చయించుకొని వారిపోరాటము లలో పాలుకూడఁబాలుగొని తనపరిపూర్ణమైన రాజ్యతంత్రజ్ఞానము తోఁగూడిన రాజనీతినంతయు వినియోగించి తనశత్రురాజ్యములలో నైకమత్యము లేకుండఁ జూచుటయే వృత్తముగా గలిగి యుండెను. తక్కినసుల్తానులతో యుద్ధముచేయుటకై యొకప్పు డొకనితోను, ఇంకొకప్పుడు మఱియొక్కనితోను జేరుచు యుద్ధములు సలిపెను. ఈరీతిగాఁ దనయిరువదియూఁడు సంవత్సరముల పరిపాలనములోను నెల్లరతోను బోరాడి మహమ్మదుమతస్థులయిన యాసుల్తానుల నోడించుచు నెప్పుడునువిజయభేరీ మ్రోగించుచు విజయనగరమునకు మరలి వచ్చుచుండెను.

అహమ్మదునగరసుల్తాను ఒకసంవత్సరకాలము మానము వహించి యూరకున్నవాఁడై 1544 వ సంవత్సరప్రారంభమున గోల్కొండసుల్తానగు జమ్షీదు కుతుబ్షాకడకు 'షాతహీర్' అను రాయబారిని విజాపుర సుల్తానుతో యుద్ధము చేయుటకై రహస్యముగా రామరాయలుతో నొడంబడిక చేసికొనవలసినదిగా మాట్లాడుటకై పంపించెను. ఎన్నడో తన రాజ్యమునుండి విజాపురసుల్తాను గైకొన్న యైదుమండలములను తిరిగి స్వాధీనము చేసికొనవలయు ననిబురుహాన్‌నిజాముషాయొక్క తలంపట. అహమ్మదునగరసుల్తాను, గోల్కొండసుల్తాను, అళియరామరాయలు సంధిపత్రములపై సంతకములు చేసిరి.

విజాపుర రాజ్యముయొక్క దక్షిణభాగమును విద్యానగరసై న్యములును, తూర్పుభాగమును గోలకొండ సైన్యములును, పశ్చిమోత్తరభాగమును అలీబరీదుషా, క్వాజాజహానుల సైన్యములతో బురహానన్ నిజాముషాయును ముట్టడించుటకు నిశ్చయించుకొని రఁట !

ఇట్టియొడంబడిక జరిగినవెనువెంటనే బురహాన్ నిజాము షాతన సైన్యములతో విజాపురరాజ్యమునఁ బ్రవేశించి చాల ప్రజకు నష్టము గలిగించుటయేగాక ఇబ్రహీము ఆదిల్ షాను యుద్ధములలోఁ బెక్కుతడవులు జయింపుచు వచ్చె నఁట ! ఈకాలముననే గోలకొండసైన్యములు తూర్పు భాగమును ముట్టడించి కాక్నిమండలమును స్వాధీనపఱచుకొని యచటనొక కోటను నూతనముగా నిర్మించి కలుబరిగి దుర్గప్రాకారముల వఱకుఁ గలదేశమంతయు నాక్రమించుకొని కడపట నగరదుర్గమునకు సమీపమునం దున్నయాతగిరిదుర్గమును ముట్టడించె నఁట ! అళియరామరాయల పక్షమున వేంకటాద్రి రాచూరు దుర్గమును ముట్టడించుటకై దండయాత్ర వెడలి భీమరథిప్రాంతమున విజాపురసుల్తానును దలఁపడి యాతనినోడించి తఱిమె నఁట ! ఈయుద్ధవర్ణనమె నరసభూపాలీయము నందు కలదని హీరాసుఫాదిరి వక్కాణించెనుగాని నరసభూపాలీయము నందలి యుద్ధ మింతకుఁబూర్వ మనఁగా 1542 వ సంవత్సరములో జరిగినదిగాని 1544 వ సంవత్సరమున జరిగినది కాదని యిది వఱకే తెలిపి యున్నాను. ఇట్లు చిక్కులలోఁ దగుల్కొని

తన్నూతనరాజ్యమును సంరక్షించుకొనుటకు వెరపుగానక దూరమున బెల్గాముమండలమున నున్న తనవృద్ధసేనాని యగుఅసాదుఖానుని జనకడకు రప్పించుకొని యింక ముందు చేయఁదగు కార్యమునుగూర్చి యతనితో నాలోచించెను. అనుభవజ్ఞుఁడగు నామహాసేనాని దీనికంతకుఁ గారణభూతుఁడైన శత్రువు గోల్కొండసుల్తానుగాని తదితరులుగా రనియు, వీని ప్రేరేపణచే తనే తదితరులు శత్రుత్వమున వహించినవారుగా నుందురని యూహించి యతనితో సంధిచేసికొన్నఁ దక్కినవారిని నేయుపాయముచేతనైన వశ్యపఱచుకొనవచ్చు నని చెప్పెను. ఈయుద్ధమునకుఁ గారణములుగా నెన్నఁబడు సోలాపురమండలముతోఁ జేరిన యైదుమండలములను బురహాన్ నిజాముషాకు నిచ్చివేయుచు వెంబనే రామరాయలకుఁ గొంతధనము నొసంగి వానితోఁగూడ సఖ్యము గావించుకొనవలసినదనియు, ఈయిర్వురు శత్రువులతాకిడి నుండి తప్పించుకొన్న యెడలఁ దాను కుతుబ్షానెదుర్కొని విజాపురరాజ్యమునుండి యాతఁ డాక్రమించుకొన్న దేశము నంతయు జయించి యిప్పించుటకు బాధ్యతను దాను వహింతు నని విన్నవించెను. విజాపురసుల్తాను వాని సలహాను మన్నించి యతఁడు చెప్పిన విధముగా బురహాన్ నిజాముషాతోను రామరాయలతోను సంధి చేసికొనియెను. అసాదుఖాను తానుచేసిన వాగ్దత్తము ప్రకారము గోల్కొండ సుల్తానుపై దండెత్తిపోయి గోల్కొండదుర్గ ప్రాకారములకడ కుతుబ్షా సైన్యముల నోడించి విడిచి పెట్టెను. ఇట్టీయుద్ధము

ముగిసినను పిమ్మట నొకప్పుడు రామరాయలచేఁ బ్రేరేపింపఁ బడి బురహాన్ నిజాముషాహ ఇబ్రహీమ్ ఏదిల్‌షాపై దండె త్తిపోయి కలుబరఁగిదుర్గమును ముట్టడించియు జయింపలేక విజా పురసుల్తానుచే నోడింపఁబడి మరలి యహమ్మదు నగరమునకు వచ్చెనని యును, దక్కనుసుల్తాను లెప్పుడు నైకమత్యముతో నుండకుండునటుల చూచెడు రామరాయల తంత్రములు నెఱ వేఱుచు వచ్చిన వని ఫెరిస్తా వ్రాయుచున్నాఁడు. తరువాత విజ యనగర రాజ్యమునకును దక్కనుసుల్తానుల రాజ్యములకును 1549 వ సంవత్సరము వఱకును యుద్ధము లేవియు జరిగియు న్నట్టు గానరాదు.

## —♦ కళ్యాణికలుబరిగి దుర్గములముట్టడి ♦—

ఆసంవత్సరమున విజాపురమునందు బెల్గాముదుర్గాధిపతి యును, సుల్తానుకార్యకర్తయు, సైన్యాధ్యక్షుఁడును వృద్ధసేనా నియు నగుఅసాదుఖాను మరణముఁ జెందెను. ఈవార్త అహ మ్మదు నగరమునఁ దెలియఁగనే అహమ్మదు నగరసుల్తాను కుట్ర ప్రారంభించి తనపక్షమున నుండుటకై రామరాయల కడకు రాయబారులను బంపెను. ఈసుల్తానులలో నైకమత్యము లేకుండఁ జూచుటయే రాజనీతిగాఁ బరిగణించుచున్నవాఁ డగు టవలన సంతోషించి యతనితోడిమైత్రి కంగీకరించి యొడం బడిక గావించుకొనె నఁట. ఈసంగతి విజాపుర సుల్తానునకుఁ దెలియవచ్చి యతఁడు తనయాస్థానమునం దున్నవిజయనగర

రాయబారుల నవమానించెనఁట. వార లెట్లో తప్పించుకొని విజ
యనగరమునకు విచ్చేసి యాదుష్కృత్యమును రామరాయలకు
విన్నవించి రఁట. (1) అంతరాయలాగ్రహముతో బీదరుసుల్తా
నగుఆలీబరీదుషా విజాపురసుల్తానగు ఇబ్రహీము ఆదిల్‌షాతో
సఖ్యము చేసికొన్నాఁడు గనుక మున్ముందు కల్యాణి దుర్గమును
ముట్టడించుట మంచి' దని అహమ్మదునగర సుల్తానుకుఁ దెలియఁ
జేసెనఁట. ఈ యుద్ధమును గూర్చి వ్రాయుచు ఫెరిస్తా రామరా
యలుగాని హిందువులుగాని నిర్వహించిన కార్యమును లేశ
మాత్రమైన నుదాహరించిన వాఁడుకాఁడు. శివతత్త్వరత్నా
కర మను గ్రంథమున నీయుద్ధమును గూర్చి ప్రస్తావించుచు
నహమ్మదునగరసుల్తానున కిందు ప్రవేశ మున్నట్లే యాగ్రంథ
కర్త చెప్పి యుండలేదు. ఇక్కేరిమండలాధిపతి యగుసదాశివ
రాయకుఁ డీయుద్ధమును సాగించుటకై అళియరామరాయనిచే
నియమితుఁడై విజయనగర సైన్యముల కాధిపత్యము వహించి
తొలుత కలుబరగిదుర్గమును ముట్టడింపఁగా విజాపురసుల్తాను
బహుళసేనాసమన్వితుఁడై యెదుర్కొని యుద్ధము చేసెనఁట.

---

(1) ఇచ్చట హీరాసుఫాదిరి క్రొత్తవిషయమును చేర్కొనుచున్నాఁడు. విజాపురసుల్తాను రామరాయలకడ రాయబారిని బంపఁగా రామరాయలు వానిని జోళ్లతోఁ గొట్టించి చంపించె నని కోరియా వ్రాసినాఁడని 'కుక్కకాటుకు చెప్పుదెబ్బ' యన్నట్లు విజాపురసుల్తా నట్లుజరిగించినాఁడని హీరాసుఫాదిరి వ్రాయుచున్నాఁడు. తనరాయబారులను దప్పించుకొనకముందే రామరాయలు విజాపురసుల్తాను రాయబారిని జోళ్లతోఁ గొట్టి చంపించినాఁ డని చెప్పుట విశ్వాసపాత్రము గాదు.

ఈయుద్ధమున సదాశివనాయకుఁడు సంపూర్ణ విజయమును గాంచెను. విజాపురసుల్తాను పలాయనుఁడయ్యె నఁట. ఇట్లు మొదటియుద్ధమున విజయమును గాంచిన సదాశివ నాయకుఁ డుత్సాహ సంభరితుఁడై కళ్యాణిదుర్గమును ముట్టడింపఁ బోవు చుండ మార్గమధ్యమున నళియరామరాయలువచ్చి వానినిగలి సికొనెనఁట. అటుపిమ్మట విజయనగర సైన్యములును, అహమ్మ దునగర సైన్యములును కళ్యాణిదుర్గమును ముట్టడింపఁగా విజా పురసుల్తాను చెదరిపోయిన సేనలను మరల సమకూర్చుకొని మఱి కొంతమూలసైన్యముతోఁ బరలివచ్చి కళ్యాణిదుర్గమును ముట్ట డించిన శత్రుసైన్యములకును, శత్రుస్కంధావారమునకు నమఁ ప్రవేశించి శత్రుసైన్యములకుభోజనపదార్థములుగాని యాయుధసామగ్రిగాని లభింపకుండునటుల ప్రయత్నించెను. ఈకార్యమును నిర్వహించుటకై ప్రశస్తమైన విజాపురాశ్వీక సైన్యమును నియోగించె నఁట. ఆహారపదార్థము లేవియుఁజేర కుండ మార్గము నరికట్టుటవలన శత్రువులసైన్యములకు దుర్భ రమైన దుస్థితి సంభవించెను. అప్పుడు సుల్తానుపక్షమునను విజయనగరపక్షమునను ప్రతినిధిప్రముఖులు కొందఱు సమా వేశమై ముట్టడి వీడి వెడలిపోవుట యుక్తమా? సాహసించి శత్రువులతోఁ బోరి జయముగొనుట యుక్తమా యని యోజింప మొదలుపెట్టిరి. అహమ్మదునగర సుల్తానుపక్షమున నున్న 'షాజాఫర్, ఖాశింబేగు' అనువీరులును, విజయనగర మువారిపక్షమున సైన్యాధిపతి యగుసదాశివ నాయకుఁడును

రెండవమార్గ మనుసరించుట యుక్తమని తెలుపఁగా నెల్లవా
రంగీకరించిరి. ఒకనాఁడు సూర్యోదయమైన వెంటనే యాయు
భయసైన్యములవారు నాకస్మికముగాఁ బోయి, ఇబ్రహీమ్
ఆదిల్‌షా సైన్యములపైఁ బడిరి. అప్పుడు విజాపుర సుల్తాను
అభ్యంగన స్నానము చేయుచున్నవాఁ డగుటచేతఁ దప్పించు
కొని పాఱిపోవుట కడుఁగష్టసాధ్యమయ్యెను. వానిసైన్యము
లాశ్చర్యమును వెఱపునుగొని మందుగుండు సామాను సయి
తముఁ యావద్వస్తుసామగ్రిని శత్రువులకు విడిచిపెట్టి చెల్లాచె
దరై పాఱిపోయి రఁట. ఈసమయమునందే సదాశివనాయ
కుఁడు ధైర్యసాహసములఁ జూపి శత్రువులతోఁ బోరాడి కళ్యా
ణిదుర్గమును వశపఱచుకొని అళియరామరాయలవలన 'కోటి
కోలాహల' బిరుదమును గాంచె ననిశివతత్త్వరత్నాకర మను
గ్రంథమువలనఁ దెలియుచున్నది. (1) ఇప్పటినుండి యీదు
ర్గము రామరాయలవశమునం దున్నట్లే కనంబడు చున్నది.

### జమ్షీదుకుతుబ్షామరణము

క్రీ. శ. 1550 సంవత్సరమున గోల్కొండసుల్తా నగు
జమ్షీదుకుతుబ్షా యనారోగ్యస్థితి యందుండి చంచలస్వభా
వుఁడై చీటికిమాటికిఁ జిరాకుపడుచు స్వల్పదోషములకై ప్రజ
లననేకుల జంపించ నారంభించెను. వీనిదౌర్జన్యమును గాంచి

(1) Sources of Vijayanagar History p. 195, 199.

ప్రజలు కంపిల్లు చుండిరి. వీనిసోదరు లయిన ' హైదరుఖాన్, ఇబ్రహీమ్ ' అనువారు బీదరునకుఁ బఱు కిడిరి. అచట హైదరుఖాను మరణముఁ జెందెను. ఇతఁడు మరణించుటకుఁ బూర్వము బీదరుసుల్తా నగు ' ఖాశింబరీదుషా ' అహమ్మదు నగరము, గోల్కొండ, సుల్తానులతో యుద్ధముచేయుచు నోడి పోయి పాఱివచ్చుసందర్భమున ఇబ్రహీముయొక్క దుస్థితిని సందుగాఁ జేసికొని యాతిథ్యమర్యాద నతిక్రమించి యాతని యేనుగలను, ధనమును చూఱఁగొనఁ బ్రయత్నించెను. వీని దురాలోచనమును విని వెంటనే యిబ్రహీము విజయనగరము నకుఁ బాఱిపోయి రామరాయలమైత్రి నపేక్షించెను. ఇబ్రహీము విజయనగరము ప్రవేశించినపుడు వీనితో నయ్యదుహై అబీసినియాదేశస్థుఁడును, హమీదుఖా ననుబిరుదమువహించిన రైహాన్, బ్రాహ్మణుఁ డగుకాణాజియు, మఱికొందఱు సేవకులును కూడ నుండిరి. అళియరామరాయలు మిక్కిలిసంతోషించి యీగోల్కొండరాజకుమారుని సర్వోచితమర్యాదలచే నాదరించి వానిజీవనార్థ మదివఱకు అబీసినియాదేశస్థుఁ డగుఅంబరుఖాను క్రింద నున్నజమీని ఇబ్రహీమున కొసంగెను. ఈకార్యము వలన ఇబ్రహీమునెడ అంబరుఖానుకు ద్వేషమును బుట్టించెను.

ఇట్లంబరుఖాను తనసంస్థానమునుగోల్పోయి విచారముతోఁ దిరుగుచు నొకనాఁడు విజయనగరవీధులలో ఇబ్రహీమురాజకుమారునిం గలిసికొని తనజమీ నపహరించినవాఁ డని దూషించెను. ' చక్రవర్తులు తమసొత్తును తమయిచ్చవచ్చి

సతుల వినియోగించుకొందురు. రామరాయలుజమీనా కిచ్చుటకు నిచ్చగించె' నని ప్రత్యుత్తర మిచ్చి వెడలిపోవుచుండ నాయబ్బునియాదేశస్థుఁడు ఇబ్రహీమును జూచి ' నీహక్కును కత్తితో సాధించి స్థాపించుకొనలేనిపిఱికిపంద' వని మరల దూఱెను. అంత నారాజకుమారుఁడు వానిని వివేకవిహీనునిగా గ్రహించెను. వీనిశాంతము వానికోపము నినుమడింపఁ జేసెను. అంబరుఖా నధికదూషణమునకుఁ గడంగి వానిమనస్సు నొప్పింపఁ జేసెను. ఆవెనువెంటనే ఇబ్రహీము గుఱ్ఱమునుండి క్రిందికి దుమికి కత్తి దూసెను. అంబరుఖాను వానిపైఁ బడెను. ఇబ్రహీము తనప్రతిపక్షిని ఖండించి వైచెను. అంబరుఖానుసోదరుఁడుకూడ నిబ్రహీముపైకి లంఘింప నాతనిగూడ మట్టుపెట్టెను.

ఆసంవత్సరమె జమ్షీదుకుతుబ్షా గోల్కొండనగరములో మృతిఁ బొందెను.

## ఇబ్రహీముపట్టాభిషిక్తుఁడగుట

గోల్కొండనగరములోని ప్రభుపుంగవులు జమ్షీదుకుమారుఁడైన ' సుఖాన్‌కూలీ' అనువానిని వానితల్లికోరిక ననుసరించి పట్టాభిషిక్తుని గావించి ' సెయిఫ్‌ఖాను' పాలనకర్తగా నియమించిరి. ఈపాలనకర్త యదివఱకు జమ్షీదుకుతుబ్షాచే నొకప్పుడు ప్రవాసశిక్షను బొంది యహమ్మదునగరమునకుఁ బంపఁబడినవాఁడు. ఇతఁడు ' సుఖాన్‌కూలీ' కి సంరక్ష

షుఁడుగ నుండుటఁ గొండఱ కిష్టము లేకుండెను. ఈ క్రొత్తసుల్తాను పదేండ్లయిన వయస్సులేని బాలుఁడు. అందువలనఁ గొండఱు ప్రభుపుంగవు లందుముఖ్యముగాఁ బ్రధానమంత్రి యగు 'ముస్తఫాఖాను' వెంటనే బయలుదేఱి గోల్కొండకు రావలసినదిగా నిబ్రహీమున కొకజాబు వ్రాసి విజయనగరమున కొకరాయబారిని బంపెను. ఇబ్రహీ మాజాబును గైకొని కష్టకాలమునఁ దనతోఁగూడ నున్న తనయిర్వురుమిత్రు లయిన సయ్యదుషై, హామీదుఖానులకుఁ జూప వారలును సంతోషముతో గోల్కొండకుఁ బోవ సమ్మతించిరి. ఇబ్రహీము తనకు మిత్రుఁడుగానుండి యాదరించినరామరాయలతోఁగూడ నాలోచింప నతనియభీష్టమున కనుకూలముగానే ప్రత్యుత్తరమిచ్చుటయెగాక యాతనికిఁ దోడ్పాటుగ నుండుటకై పదివేలయాశ్వికసైన్యమును ఇరువదివేలపదాతిసైన్యమును దీసికొని యిబ్రహీమువెంటఁ బోవలసిన దనితనసోదరుఁ డయినవేంకటాద్రికుత్తరు వొసంగెను. ఈసందర్భమునఁగూడ ఫెరిస్తావ్రాయుచుఁ దనకు రామరాయలయెడఁ గలయసూయను ద్వేషమును జూపక మానలేదు. ఇబ్రహీముమిత్రు లిర్వురును “రామరాయలు రాజ్యము నపహరింపఁగోరి యింతగొప్పసైన్యముతో సోదరుని పంపుచున్నాఁడుగావున నాతనిసాహాయ్యమును దిరస్కరించి రావలసినదిగా నిబ్రహీమునకు బోధించి రనియు నతఁడట్లే గావించె ననియు వ్రాయుచున్నాఁడు. అతనివ్రాఁత విశ్వాసపాత్ర మైనదికాదు. హీరాసుఫాదిరి ఫెరిస్తావ్రాఁతను ఖండిం

చినవాఁడయినను, ఇబ్రహీము వెంటవేంకటాద్రి విజయనగరసైన్యములతో వెంబడించిపోయినను పానుగల్లుచేరినవెనుక 'విరాక్ జుమ్లా' యను 'ముస్తఫాఖాన్' మూఁడువేలయాశ్వికసైన్యముతో 'సలాబత్ ఖాను' వచ్చి కలిసికొనుటచేత హిందూసైన్యములసహాయముతో నింకనిమిత్తములే దని వేంకటాద్రిని వానిసైన్యములను వెనుకకుఁ బంపివేసె నని క్రొత్తయూహను గల్పించి వ్రాయుచున్నాఁడు. ఏవిధమైనయుద్ధంకను లేకుండ ముస్తఫాఖానున కుండుజనరంజకత్వముచేత నిబ్రహీము పట్టాభిషిక్తుఁ డయ్యెనఁట ! (1)

అయినను భట్టుమూర్తి తన 'నరసభూపాలీయము' నందు

"నతుని వర్ధితునిఁ దత్సుతునిఁ బట్టముఁ గట్టి
కుతుపనమల్కున క్షోణి నిలిపె" అని

తనరక్షణకోరివచ్చినవాని సంరక్షించి కుతుపనమల్కును పట్టాభిషిక్తునిఁ గావించె నని చెప్పి యున్నాఁడు. ఈమహాకార్యము రామరాయలసౌశీల్యమును దెలుపుటయగాక యాతఁడెంతటియుదారహృదయుఁడో తేటపఱుపక పోదు.

విజాపురసుల్తానుతో మఱియొకయుద్ధము విజయనగరము అహమ్మదునగరసుల్తానుతోఁ జేరి విజాపురసుల్తానుపైఁ గడపటిదండయాత్ర సలిపినవెనుక శాంతి నెక్కువకాలము బడియుండ లేదు. 1551 సంవత్సరాంతమున విజాపురసుల్తాను

(1) The Aravidu Dynasty of Vijayanagar, p. 83, 84, Note No. 1.

కల్యాణిదుర్గమును స్వాధీనపఱచుకొనుటకై పునః ప్రయత్నము సేయ మొదలుపెట్టెను. ఈసమాచారము బురహాన్‌నిజాముషాకుఁ దెలియవచ్చినతోడనే యతఁడు రామరాయలకుఁ దెలియఁ జేసెను. అంతరామరాయలు తాను రాచూరుదుర్గముకడ బురహాన్‌నిజాముషా సైన్యములతోఁ గలిసికొందు ననియు నచటినుండి యుద్ధసన్నాహములు జరుపవచ్చు నని రాయబారులకుఁ బ్రత్యుత్తర మొసంగి వారలను బంపివేసి తనవాగ్దత్తము నెఱవేర్చుకొనుటకై తనసేనలను సమకూర్చుకొని దండయాత్ర నాగించి రాచూరుకడ నహమ్మదునగరసుల్తానుసైన్యములను గలిసికొని తాను రాచూరు, ముదిగల్లుదుర్గములను వశపఱచుకొనుటకును, షోళాపురము, కలుబరిగెదుర్గములను వశపఱచుకొనుటకై బురహానుకుఁ దోడ్పడుటకు నేర్పాటు చేసికొనియెను. ఉభయసైన్యములును రాచూరుదుర్గమును వశపఱచుకొన్నవెనువెంటనే ముదిగల్లుదుర్గముకూడ నెట్టియాటంకమును నిరోధమునుజూపకయె స్వాధీన మయ్యెను. రామరాయలు తనపిన్నతమ్ముని వేంకటాద్రిని నిజాముషాకుఁ దోడ్పడ నియమించి తానుమాత్రము విజయనగరమునకు మరలి వచ్చెను. బురహాన్‌నిజాముషా వేంకటాద్రితోడ్పాటుతోఁ గొలదికాలము షోళాపురమును వశపఱచుకొని యాదుర్గమును బలపఱచుకొని యహమ్మదునగరమునకు మరలిపోయెను. విజాపురసుల్తానులచరిత్రమును వ్రాయునపుడు ఫెరిస్తా కలుబరిగె సమాచారమునెత్తియుండలేదుగాని యహమ్మదునగరసుల్తా

నులచరిత్రము వ్రాయునప్పుడు నిజాముషా కలుబరిగెను జయింపలేదనియుఁ గారణము హిందూసేనాని వేంకటాద్రి తొలఁగిపోవుటయే యని తెలిపియున్నాఁడు. ఏదియెూ అభిప్రాయభేదము గలిగి వేంకటాద్రి విజయనగరమునకు మరలి యుండును. అందువలన నిజాముషా తనకోరికను నెఱవేర్చుకొనలేకపోయి యుండును. అయినను బురహాను నిజాముషా యావెనుక స్వల్పకాలములోనే మరణముఁ బొందెను. అతనివెనుక సింహాసనమధిష్ఠించిన హుస్సేనునిజాముషా విజాపురసుల్తా నగు ఇబ్రహీముఆదిల్ షాతో సంధి చేసికొని స్వస్థచిత్తుఁడుగా నుండెను. అహమ్మదునగరము, విజాపురము నడుమ జరిగినయుద్ధములలో రామరాయలు తొరగల్లుదుర్గమునుగూడ వశపఱచుకొనియెనని ఫెరిస్తా వ్రాసి యున్నాఁడు.

ఇంతవఱకు విజాపురాహమ్మదునగరసుల్తానుల నడుమ జరుగుచువచ్చిన యుద్ధములలో నహమ్మదునగరసుల్తానుపక్షమునఁ జేరి రామరాయలు విజాపురసుల్తానుతో యుద్ధములు చేయుచుండెనుగాని 1551 సంవత్సరాంతము నుండి విజాపురసుల్తానుపక్షము నవలంబించి గోలకొండసుల్తా నగుకుతుబ్షాతోను, అహమ్మదునగరసుల్తా నగునిజాముషాతోను యుద్ధములు సలుపుచుండెను.

## కలుబరిగె యుద్ధము

1555 సంవత్సరమున గోలకొండసుల్తానగుఇబ్రహీమ్ కుతుబ్షా అహమ్మదునగరసుల్తా నగు హుస్సేనునిజాముషా

విజాపుర రాజ్యములోని కలుబరిగెదుర్గమును ముట్టడించుటకును, అందుకొఱకుఁ దానుదోడ్పడుటకు నాతనితో నొడంబడికచేసి కొన్ని యుభయులును గలిసి కలుబరిగెదుర్గమును ముట్టడించిరి. కలుబరిగెదుర్గము సమభూమియందు నిర్మింపఁబడిన దయినను బలాఢ్యమైనదిగ నుండెను. ఒకనెలదినములు మాత్రము దుర్గములోనిసైన్యములు శత్రువులదాడిని నిలువరింపఁ గలిగినవి గాని యటుపిమ్మట సుస్థిరముగా నిలుచుండి పోరాడుటకు శక్తి హీనులై తమదుస్థితి నంతయు సుల్తానునకు విన్నవించుచు దుర్గమును సంరక్షించుకొనవలసిన దనివర్తమానము పంపిరి. అంత నతఁడు తానొంటరిగ వారితోఁ దలపడిన ప్రయోజనము లేదని తలపోసి తనకుఁ దోడ్పడవలసినదిగాఁ గోరుచు రామరాయల కడకు విజయనగరము రాయబారులను బంపెను. అతఁడు పంపినబహుమానములను గైకొని రామరాయ లశేషసైన్యములతోఁ దానేయాధిపత్యమును వహించి ఇబ్రహీముఆదిల్ షాకుఁ దోడ్పడ బయలుదేఱెను. అట్లుబయలుదేఱిపోవుచు నీక్రింది జాబును గోలకొండసుల్తా నగుఇబ్రహీముకుతుబ్షాకుఁ బంపించె నఁట !

"అనేకసంవత్సరములనుండి విజాపురరాజ్యమువారును అహమ్మదునగరరాజ్యమువారును దమలోఁ దాము పోరాడుచుండెడివా రనియు, వారెదుగుబొదుగులు లేక సమానబలము గలవార లయి ప్రతిసంవత్సరము వారిలో నెవ్వరో యొకరు ప్రతిపక్షమువారి సరిహద్దులలో యుద్ధమునకు సంసిద్ధులై యుం

మఱియు, అట్లయ్యు నదియెవ్వరికి లాభకారిగా నుండకుండుటయు మీ రెఱుంగనిది కాదు; ఇదివఱ కెన్నఁడును మీపూర్వు లెవ్వరు నిట్టివివాదములలో నెట్టిజోక్యమును కలిగించుకొన లేదు. అయినను ఇప్పుడు మీరు విజాపురసుల్తాను ఇబ్రహీమ్ ఆదిల్ షా మీకుశత్రువుగాకపోయినను అహమ్మదునగరసుల్తాను హుస్సేనునిజాముషాను గెలిపించుటకై వానిపక్షము వహించినారు. ఇబ్రహీమ్ ఆదిల్ షా మాసహాయ్యమును కోరెను. మీరును మేమును కొంతకాలమునుండి సఖ్యతగా నుంటిమి. మీరీదండయాత్రలో హుస్సేనునిజాముషాకుఁ దోడ్పడక శాంతముగా మీరాజధానికి మీరు మరలిపోయినయెడల యీయుభయరాజ్యములవారును వైరములను బెంచుకొనక సంధిచేసికొని సుఖముగా నుందు రనుతలంపుతో మాయీవాదమును ముందుగామీకు నివేదించుచున్నాము.”

ఇట్టిభావమును దెలుపుజాబు తనమిత్రుఁ డయినరామరాయలవద్దనుండియును, అట్టిదే మఱియొకజాబు విజాపురసుల్తానువద్దనుండియును, ఒక్కమాఱుగా వచ్చుట సంభవించి యిబ్రహీమ్‌కుతుబ్షామనస్సును గలవరపఱిచెను. ఇంతియగాక రామరాయలతమ్ముఁడు తిరుమలరాజు తనయాశ్వికసైన్యముతో విజాపురసైనికులఁ దోడుచేసికొని పానుగల్లుమండల మాక్రమించుకొను చున్నాఁ డనుసమాచారముగూడఁ దెలియవచ్చెను. అంతధైర్యము చెదరి గోలకొండసుల్తాను తనదండయాత్రను విరమించి యర్ధరాత్రమువేళ తానదివరకుహుస్సే

నిజాముషాతో జరిపిన సంధిషరతులతోఁగూడి యున్న ప్రమాణపత్రమును భంగపరచి తనరాజధానియైనగోలకొండదారిఁ బట్టెను. ఉదయమున నీవార్త అహమ్మదునగర సుల్తానునకుఁ దెలియరాగానే యింకనుయుద్ధముసాగించుట నిష్ప్రయోజనమనియెంచి యాతఁడు తనసైన్యములను మరలించుకొని యహమ్మదు నగరమునకు వెడలి పోయెను. ఇందు పైనివివరించిన జాబు వాస్తవ మయినదిగా మనము విశ్వసింపరాదు. గోలకొండసుల్తాను దర్బారులో నున్నయొక యనామక చరిత్రకారుఁడు తనప్రభువుగౌరవమును నిలువఁబెట్టుటకై కల్పించినదిగాఁ గన్పట్టుచున్నది. తిరుమలదేవరాయలు తనరాజ్యమును (గోలకొండ) నాక్రమించుకొను నన్నభయముచేత ఇబ్రహీముకుతుబ్షా కలుబరిగె ముట్టడినివిడనాడి స్వరాజధానికిఁ బఱువెత్తె ననుట నిశ్చయ మని చెప్పవచ్చును. (1)

మఱియు విజాపురసుల్తానుపైఁ దిరుగఁబడిన ‘ ఐన్-ఉల్ ముల్కు’ ను విజాపురరాజ్యమునుండి తఱుముటకై రామరాయలు తనతమ్ముని వేంకటాద్రిని నియోగించెను. ఇట్లు నియోగింపఁబడి వేంకటాద్రి యాతనినోడించి రాజ్యమునుండి వెడలఁగొట్టగా నతఁ డహమ్మదునగరమునకుఁ బాఱిపోయెనుగాని హుస్సేనునిజాముషా యచట వానిఁ జంపించెను. 1557 వ సంవత్సరమున విజాపురసుల్తాను ఇబ్రహీమ్ఆదిల్షా మరణముఁ

(1) The Aravidu Dynasty of Vijayanagar, p. 86 Note 1.

జెందుటయు, వానికుమారుఁడు 'ఆలీఆదిల్‌షా' పట్టాభిషిక్తుఁ
డగుటయు సంభవించెను. ఈయువకుఁడు తనతండ్రికాలమున
రాజ్యమునకు సంభవించిన నష్టములను కూడఁదీసికొని రాజ్య
మును బలపఱచుకొనుటకై రామరాయలతో నత్యంతమైత్రి
నెఱపుటకుఁ బ్రయత్నించెను.

ఆలీఆదిల్‌షాపిన్నవాఁ డగుట సందుచేసికొని హుస్సేను
నిజాముషా యసంఖ్యాకము లగుసైన్యములతో విజాపురరా
జ్యముపై దండయాత్ర వెడలెను. యువకుఁ డయినవిజాపుర
సుల్తాను భయపడి స్వరాజ్యసంరక్షణమునువీడి నూర్గురురౌతు
లతో రామరాయలరక్షణము నాశించి విజయనగరమునకు వెళ్లె
నఁట. ఆకాలమున రామరాయలపుత్త్రుఁ డొకఁడు మరణించుట
చేత నాసమయమును బురస్కరించుకొని పుత్త్రదుఃఖోప శాం
తికై తానే స్వయముగా వచ్చితి ననిచెప్పి దుఃఖోప శమనవాక్య
ముల రాయల నోదార్చె ననియు, ఆతఁడు దయతో నాదరించె
ననియు, ఆతనిపట్టమహిషి ఆలీఆదిల్‌షాను దత్తపుత్త్రునిగా స్వీ
కరించె ననియు, సమ్మానార్థ సంభాషణంబులతోడను పరస్పర
బహుమాన సత్కారములతోడను మూన్నాళ్లు ముచ్చటలు
ముగిసినవెనుక తనయావద్విశిష్ట సైన్యములతో నహమ్మదు
నగరముపై దాడివెడలఁ బ్రేరేపింపఁ బడెననియు ఫెరిస్తా వ్రాసి
యున్నాఁడు. కాని యింతచేసినను రామరాయలు వానికిఁదో
డ్పడలే దనియు, ఆలీఆదిల్‌షా యొక్కఁడే విజయనగరమును
విడిచివచ్చె ననియు, అప్పటినుండి విజాపురసుల్తాను దానిని

మనస్సులోనుంచుకొని వానిపై పగవహించి యుండెనని ఫెరిస్తా వ్రాసియుండెను. ఇదివట్టియబద్ధమైనది. వానచినుకుల సంఖ్య కంటె నధికసంఖ్యకల సైనికులతో వారిరువురును నిజాముషా రాజ్యముపై దాడివెడలి రనియు, వానిరాజ్యమునంతయునాశనము చేయఁగా దేశములోని ప్రజలు పరస్థలములకు వలసపోవుటచేఁబెక్కుమైళ్లు బీడుపడిపోయె ననియు, హుస్సేనునిజాముషా వారల నెదుర్కొనలేక అహమ్మదునగరమును విడిచి పైఠనునకుఁ బాఱిపోయె ననియు, తరువాత కొంతకాలమునకు, కళ్యాణి దుర్గమును ఆలీఆదిల్‌షాకు సమర్పించుకొని సంధిగావించుకొనె ననియు, 'బురహాన్—ఈ—మాసీర్' అను గ్రంథమున వక్కాణింపఁబడి యుండెను. మఱియు

"పదిలుఁడై రాచూరుముదిగల్లుగప్పంబు
సేయఁ గాంచ సపాదు సీమనిలిపె"

నని, రాచూరు, ముదిగల్లుదుర్గములు గప్పముగాఁగైకొని విజాపురసుల్తానును మరల నిజరాజ్యమున నిలిపె నని భట్టుమూర్తి కూడ తన 'నరసభూపాలీయ' మను గ్రంథమున స్పష్టముగనుడివి యున్నాఁడు.

## మఱియొకయుద్ధము

శత్రుసైన్యము లహమ్మదునగరమును విడిచి వెళ్లినతోడనే హుస్సేనునిజాముషా ఇబ్రహీమ్‌కుతుబ్షాతో సంధిగావించుకొని తనశత్రువుని కర్పించినకల్యాణిదుర్గమును స్వాధీనపఱచు

కొనుటకై దండయాత్ర సాగించెను. అలీఆదిల్‌షా యీవార్త
విన్నవాఁడై రామరాయలసాహాయ్యమునకై వెంటనే కిష్వర్
ఖానును, అబూ తురాబును విజయనగరమునకుఁ బంపించెను.
అంతరామరాయ లుపేక్షవహింపక గొప్పసైన్యముతో విజా
పురసుల్తానును గలిసికొనుటకై బయలుదేఱి వచ్చెను. అప్పుడు
రాయలును, విజాపురసుల్తానును గలిసి తమపూర్వసంధినిబంధ
నల ననుసరించి తమకు వచ్చితోడ్పడవలసిన దనిగోల్కొండ
సుల్తానగుఇబ్రహీమ్‌కుతుబ్షాకు నొకజాబును బంపిరి. ఇబ్ర
హీముకుతుబ్షా తనమిత్రుఁడగు నహుస్సేనునిజాముషాకు ప్రతి
కూలముగ వ్యవహరించుటకు తనకెంతయిష్టములేకున్నను సంధి
షరతులను నిరాకరించి ప్రవర్తించినాఁ డన్ననిందనుబొందుట
రాజనీతిలక్షణము కాదని తలంచి తానుగూడ కొంతసైన్య
ముతో బయలుదేఱివచ్చి రాయలసైన్యములను గలిసికొని
యెను. వీరలతో బీదరుసుల్తానగుఆలీబరీదుషాకూడ వచ్చి
చేరుకొనియెను. ఇట్లసంఖ్యాకము లగుమిత్రసైన్యము లహ
మ్మదునగరమును ముట్టడించుటకై బయలుదేఱెను. విజయ
నగరసైన్యములు దారిపొడవునను పట్టణములనక పల్లెలనక
యహమ్మదునగరరాజ్యము నంతయు ధ్వంసముచేయు చుండి
రఁట. ఇట్టిబలాఢ్య మగుశత్రుసైన్యమును నిరోధించుట తనకు
సాధ్యముకాకపోవుటచేత హుస్సేనునిజాముషా రాజధానీసంర
క్షణార్థము తగినంతసైన్యమును, సమృద్ధికర మైనయాహారసా
మాగ్రిని కోటలో నుంచి తాను తప్పించుకొనిపోయి జూనారు

దుర్గమున డాగి యుండెను. ఇట్లుండ నతనియాంతరంగికమిత్రుఁ
డయిన ఇబ్రహీమ్కుతుబ్షా తాను రాజనీతిప్రాముఖ్యత ననుస
రించి వానిశత్రుపక్షమున జేరినను తనహృదయము హుస్సేను
నిజాముషాపక్షముననే యుండె ననియు, తాను శత్రుపక్షమున
నున్నను వానికిఁ దోడ్పడుదు ననియు, సాధ్యమగునంతవఱకు దన
శక్తియుక్తులను బ్రయోగించి శత్రువులను యుద్ధవిముఖులను
గావించి మరలిపోవు నట్లుచేయుదు ననియురహస్యముగా నొక
జాబువ్రాసి నిజాముషాకుఁ బంపించెను. ఇట్లే అహమ్మదు
నగరదుర్గమును గాపాడుచున్న సేనాధిపతికి వ్రాయుచు, దుర్గ
మును వశపఱచక కడవఱకుఁ బట్టుదలతో సంరక్షింపవలసిన దని
ప్రోత్సాహపఱచుచు మఱియొకజాబుఁ బంపించెను.

మిత్రసైన్యము లహమ్మదునగరదుర్గమును ముట్టడించి
మిక్కిలిపట్టుదలతో రెండుమాసములవఱకు విడువకయుండుట
చూచి ఇబ్రహీముకుతుబ్షా యుపేక్షాపరుఁడై యూరకుండక
విజయనగరసేనానులకు లంచముల నొసంగుచు వర్షాకాలము
సమీపించుచున్నదిగావున ముట్టడిమాని వారివారిసైన్యములు
వారివారిదేశములకుఁ బోవుటమంచి దనిరామరాయలకుఁ జెప్పి
మరలింపవలసిన దనిప్రోత్సాహపఱచుచుండెను. మొదటరామ
రాయలు తనసేనానులుచెప్పెడుసలహాలనుబాటించి వెనుదీ
యుట కంగీకరించెనుగాని విజాపురసుల్తాను దీని నంతనుగ్ర
హించి రామరాయలకడకువచ్చి ముట్టడివిడనాడిపోవల దనియు,
దుర్గములోనివారికి భోజనపదార్థములు సన్నగిలిపోవుచున్నం

మునఁ ద్రొక్కులుపడుచున్నారనియు, కనీసపక్షమింకొకమాస మయినముట్టడివిడువక కృషిసలుపవలయు ననియు బహువిధ ముల బ్రార్థింపఁగా రామరాయ లంగీకరించి దుర్గమును స్వాధీనపఱచుకొనుటకై గట్టిప్రయత్నము సేయవలసిన దనితన సేనానుల కెల్లరకు నుత్తరు వొసంగెను. అంతటితో నిరుత్సాహముఁ జెంది యూరకొనక గోలకొండసుల్తా నగుఇబ్రహీము కుతుబ్షా అహమ్మదునగరమునుండిదుర్గములోనివారికి నాహార పదార్థములు తనసైన్యమునమునుండిచేర్చుటకును, ఫిరంగులు కాల్చెడుమనుష్యులు దుర్గములోనికిఁ బోవుటకును రహస్య ముగా మార్గముల నేర్పాటు గావించెను. కాని విజయనగర సైన్యములు మిగులదీక్షతోఁ బోరాడుచు దుర్గప్రాకారములను సమీపించుటనుగాంచి సహింపఁజాలక అహమ్మదునగరమును గొప్పవిపత్తునుండి తప్పించవలయు నన్నదృఢనిశ్చయముతో ఇబ్రహీమ్కుతుబ్షా కడపటిప్రయత్నముఁ గావించెను. తనకు ముఖ్యమంత్రియు సైన్యాధ్యక్షుఁడును నగుముస్తఫాఖానుని రప్పించి యెట్లయినను ముట్టడిమాను నట్లురామరాయలను ప్రేరేపింపవలసిన దనియు, వినకున్న తమసైన్యములు ముట్టడిని మాని గోల్కొండకు మరలిపోగల పనిచెప్పి రావలసినదిగా రాయలకడకుఁ బంపించెను. అట్లారాయబారమును శిరసావహించి రాయలకడకుఁ బోయి శక్తికొలఁదియుక్తివాదములను సర్వవిధముల గావించి తుదకురహస్యముగాఁ దన ప్రభువుపక్షమునముట్టడిమాని మరలిపోయినపక్షమున కొండపల్లిసర్కారును

త్తద్దుర్గము నొసంగుదు మని వాగ్దత్తముచేసెను. రామరాయ లందుకకు సమ్మతించి వెంటనే ముట్టడిమాలివేయవలసిన దని సేనానుల కాజ్ఞచేసి యావిషయమును విజాపురసుల్తానుకుఁ దెలియఁజేసెను. అంతరామరాయలును, విజాపురము, గోల్కొండ, బీదరుసుల్తానులును తమతమసైన్యములను మరల్చుకొనిపోయి సురక్షితముగాఁ దమతమరాజధానులను జేరుకొనిరి.

కాని యిట్టిసాహాయ్యము నిబ్రహీమ్‌కుతుబ్షా చేసినందుకు హుస్సేనునిజాముషా పరమానందమునుబొంది యామరుచటిసంవత్సర మనఁగా 1558 సంవత్సరమున కుతుబ్షాతో వివాహసంబంధము కలిగించుకొనఁ గోరి మౌలానా ఇనాయతుల్లాను గోల్కొండనగరమునకుఁ బంపించెను. ఉభయసుల్తానులు నాసంవత్సరమున కళ్యాణిదుర్గసమీపమునఁ గలిసికొనుటకును, అచ్చట తనకొమార్తెను హుస్సేను ఇబ్రహీమునకిచ్చివివాహము చేయుటకును, ఆమహోత్సవము ముగిసిన వెనుక నుభయులసైన్యములును కల్యాణిదుర్గమును ముట్టడించి స్వాధీనపఱచుకొనుటకును మఱియొకసంధి గావించుకొనిరి.

ఆప్రకార మేర్పాటుచేసికొన్న కాలమునకు సరిగానుభయసుల్తానులు సదివఱకే సమకూర్చుకొన్న సైన్యములతో వచ్చి నియమితస్థానమున గలిసికొనిరి. అచటవారనుకొన్న రీతిని హుస్సేనునిజాముషా తనపెద్దకొమరిత 'బీబీజామల్లీ' అనునామెను మహావైభవముతో ఇబ్రహీముకుతుబ్షాకు నొసంగి వివాహముగావించెను. ఇట్టిమహోత్సవములతో నొక

నెల పోసిచ్చి యుభయసుల్తానులును కల్యాణదుర్గమును ముట్టడించుటకై ప్రయాణభేరి మ్రోగించిరి. ఈవృత్తాంతము సంతయుఁ జారులవలన విన్నవాఁడై విజాపురసుల్తాను నగుఅలీ ఆదిల్‌షా భయకంపితచిత్తుఁడై వెంటనే విజయనగరమునకుఁ బోయి రామరాయలను దోడ్పడరావలయు నని ప్రార్థించెను. రామరాయ లెంతమాత్రమును జాగుసేయక యసంఖ్యాకములగుసైన్యములతో బయలుదేఱి వచ్చెను. మార్గమధ్యమున నదివఱకే యాహ్వానింపఁబడిన బీడరుసుల్తాను నగుఅలీబరీదుషాయును, బీరారుసుల్తాను నగుబురహాన్ ఇమద్‌షాయును, తమతమసైన్యములతో వచ్చి గలిసికొనిరి. వీరిస్థితి యిట్లుండఁగా నచట నహమ్మదనగర గోల్కొండసుల్తానులు నానావిధములయినవగు 700 ఫిరంగులతోడను, ఏనూ రేనుంగులతోడను బయలుదేఱి కల్యాణిదుర్గమునకు ౧౨ మైళ్లదూరమున దండు విడిసిరి. వీరలాదుర్గమును సమీపించి శిబిరముల నేర్పాటుచేసికొనకపూర్వమె దైవవశమున నొకగొప్పగాలివాన సంభవించి నల్లరేగడభూమితోఁ గూడియున్న యాప్రదేశము నంతయుఁ జెనురొంపిగ మార్చివేసెను. బండ్లు, పశువులు, ఫిరంగులు మొదలగునవి బురదలోఁ గూరుకొనిపోయి కదల్పుటకు సాధ్యముగాక నిరుపయోగము లయ్యెను. గుడారము లన్నియు నెగిరిపోయి బురదనేలను బొరలాడు చుండెను. ఇట్టిస్థితియందుండగానే రామరాయలసోదరుఁడు ప్రసిద్ధ సేనాధిపతి వేంకటాద్రియు, జగదేవరావును, పదునైదువేల యాశ్వికసైన్యము

తోడను ముప్పదివేలు పదాతిసైన్యములతోడను గోల్కొండపై దండెత్తి వచ్చుచున్నా రన్నవిషయము ఇబ్రహీముకుతుబ్షాకుఁ దెలియవచ్చెను. అతఁడుభయకంపితచిత్తుఁడై కాలమనుకూలముగ లేదనిచింతించి హుస్సేనునిజాముషాతోఁ జక్కఁగా నాలోచించి కల్యాణిదుర్గమును ముట్టడించుట మానుకొని స్వరాజధానులకుఁ జేరుకొనుట క్షేమదాయక మనినిశ్చయించుకొనిరి. అయినను హుస్సేనునిజాముషా రామరాయలతో సంధి గావించుకొనుటకై ఖాసింబేగును, మౌలానాఇనాయతుల్లాసం రామరాయలకడకుఁ బంపెను.

అప్పుడు రామరాయ లీక్రిందినిబంధనలకు నిష్టపడిన మొదల సంధి కుదురు ననివక్కాణించె నఁట.

(౧) కల్యాణిదుర్గమును విజాపురసుల్తానుకు విడిచిపెట్టి యందునిమిత్తము మరల వివాదము సలుపకుండుట.

(౨) దురియాఇమ్మదుముల్కుసైన్యముల కధిపతిగానున్న జహంగీరుఖానును సంహరించుట.

(3) హుస్సేనునిజాముషా రామరాయలయాధిక్యత నంగీకరించి నట్లుగాగ్రహించుటకుగా నతఁడు రామరాయలను సందర్శించుటకును,అతఁడు తనహస్తములతో నొసంగిన తమలపాకులను వక్కలను (తాంబూలమును) హుస్సేనునిజాముషా స్వహస్తములతో గైకొనుట.

తనరాజ్యమును సంరక్షించుకొనుటకై హుస్సేనునిజాముషా యీషరతుల కంగీకరించెను. ఇట్లంగీకరించి జహంగీరుఖానుని వానిగుడారములోనే సంహరించుటకై హంతకులను నియమించి యాకార్యమును ముగించెనట. ఒకపాషండుని మాట విశ్వసించి తనకు మిక్కిలి విశ్వాసపాత్రుఁడైన భక్తుని సంహరించి హుస్సేనునిజాముషా రాజులనెన్నఁడువిశ్వసింపరా దన్న లోకసామెతను సార్థకపఱచినాఁ డనిఫెరిస్తా నిందించినాఁడు. తరువాత హుస్సేనునిజాముషా రాయలను సందర్శించి మూఁడవనిబంధనను నెఱవేర్చెను.

కాని యతఁడు దురహంకారముతో హిందూరాజగు రామరాయల హస్తస్పర్శవలనఁ దనహస్తమునకుఁ గలిగినమాలిన్యమును బోగొట్టుకొనుటకై వెంటనే నీళ్లు తెప్పించుకొని చేతులు కడుగుకొనె నఁట.

రామరాయలును హుస్సేనునిజాముషా నాకతిథియైనందున సహించితినిగాని లేనియెడల నాతనిచేతులను నఱికి వానిమెడకు వ్రేలాడఁగట్టియుందు ననితనభాషలో పలికి తాను గూడ నుదకములను దెప్పించుకొని చేతులను కడుగుకొనెనఁట. ఇదియెట్టిదైనను వారియుభయులకు బద్ధవైషమ్యము గలదని చదువరులకుఁ దేటపఱుచక పోదు. హుస్సేనునిజాముషా పక్షమున ఖాశింబేగు, మౌలానాఇనాయతుల్లాయును, విజయనగరము పక్షమున తిరుమలవేంకటాద్రులు నుండి సంధిపత్రమును వ్రాసి చేవ్రాళ్లు చేసి ముగించిరి.

విజయనగర హిందూపాషండు నిదివఱ కెన్నఁడును జేయని ఘోరకృత్యముల నీరెండు దండయాత్రల యందును గావించి రని ఫెరిస్తా వ్రాసి యున్నాఁడు.

మహమ్మదీయ దండయాత్రలలో మహమ్మదీయులు హిందువులపట్ల చూపిన దుష్టమార్గములనే విజయనగర హిందువులును ఈదండయాత్రలలో మహమ్మదీయులపట్లఁ జూపి యుందు రనిమనము విశ్వసింపవచ్చును. ఇట్టిపద్ధతులు మహమ్మదీయు లవలంబించినను హిందువు లవలంబించినను నర్హనీయములే యనుసత్యమును ఫెరిస్తా గ్రహించి యుండినయెడల తానువ్రాసినచరిత్రమున కెంతో మెఱుఁగు గల్పించినవాఁ డయి సర్వజనశ్లాఘాపాత్రుఁడై యుండును. హింసహింసను వృద్ధి గావించును. ద్వేషముద్వేషమునే పెంచునుగాని సఖ్యత నొనఁగూర్పఁ జాలదు.

## అబ్దుల్లాతో యుద్ధము

ఈకాలముననే విజాపురసుల్తానునకు పక్కలో బల్లెముగా నుండి భయమునుపుట్టించెడు జ్ఞాతిసంబంధమయిన వివాదము మఱియొకటి విజయనగరమువారితోడ్పాటువలనఁ దుదముట్టినది. ఇబ్రహీమ్ఆదిల్ షా బ్రదికియున్న కాలముననే వానియన్న కుమారుఁడు, ‘అబ్దుల్లా’ యను నాతఁడు తనసోదరుఁడు పెట్టుబాధలనుండి తప్పించుకొని గోవానగరమునకుఁ బోయినవెనుక వానిమిత్రులచే విజాపురసుల్తానుగాఁ బ్రకటించుకొనవలసినదని

ప్రేరేపింపఁ బడియెను. ఆదిల్ షా సామంతులలోఁ బ్రముఖుఁ డుగా నున్నవాఁడును బెల్గాముదుర్గాధిపతియు నగునసాదఖాను వారిలో నొకఁడుగా నుండెను. ఇతఁడు గోవాకెప్టెనగు 'డోమ్ గర్సియా' (Dom Garcia) తో నిందువిషయమై యుత్తర ప్రత్యుత్తరములు జరుపు చుండెను.

విజాపురసుల్తా నగు 'ఇబ్రహీముఆదిల్ షా' కు బదులుగా ఘూర్జరమునకు (Guzarat) వలసపోయిన 'అబ్దుల్లా' రాకొమరుని రప్పించి విజాపురమునకు నిజమైనసుల్తానుగా నిలిపినయెడల కొంకణదేశము నంతయు బుడతకీచులకు (Portuguese) వశపఱుతు ననివాగ్దత్తము చేసెను. ఇందుకునాతఁడు మిక్కిలిసంతోషించి కాంబేలో నున్నయాతనికి నొకలాతీన్ చే కబురు పంపెను. అంత అబ్దుల్లా కొంతకాలమునకుఁ దనకుటుంబముతో గోవానగరమునకు వచ్చెను. ఆకెప్టెను ఒకమహారాజునకుస్వాగత మొసంగి నట్లుగానాతనికి మనఃపూర్వక మైనస్వాగతము నొసంగి జెస్యూటుకాలేజీకి సమీపమున నున్నయొక దివ్యసుందరభవనమున నాతనిఁ బ్రవేశపెట్టి యొకగొప్పవిందు గావించెను. ఎవ్వనిస్థానమున డోమ్ గర్సియాకెప్టెనుగా నియమింపఁబడెనో యాస్థానాధిపతి యైన 'డోమ్ మార్టిన్ ఆఫాంచోడిసౌజా' (Dom Martin Affonso De Souza) గోవానగరమునకు వచ్చి తనయుద్యోగమును మరల వహించెను. ఇబ్రహీముఆదిల్ షా తనపూర్వస్నేహమును బాటించి తనసోదరుని గోవానగరమునుండి వెడలఁ జేయవలయు నని వెంటనే

రాయబారులను బంపెను. ఆవెనువెంటనే అసామఖానుగూడ తనపూర్వవాగ్దత్తమును జ్ఞప్తికిఁ దెచ్చుచు రాయబారులను బంపెను. అందువిషయమై వారిరాజ్యాంగసభలో తీవ్రమైనచర్చ జరిగెను. విజాపురసుల్తానుతోఁ గలపూర్వసాంగత్యమును బురస్కరించుకొని 'అబ్దుల్లా' వ్యవహారమును వదలుకొనుటయె పర్యవసానముగ నేర్పడియెను. ఇయ్యది ఇబ్రహీమునకు సంతృప్తికలిగింపఁ జాల దయ్యెను. అబ్దుల్లా గోవానగరముననుండుటయె తనకపాయకర మనియెంచి తనసోదరుని తనవశముచేయవలసిన దనియతఁడు కోరెను. అతఁడు తన ప్రభుత్వమున కతిథిగా నుండుటవలన వారందుల కియ్యకొన రైరి. అతనిదూరదేశమునకునైనఁ బంపివేయవలసిన దనియిబ్రహీము ప్రార్థించెను. అందునకు వారంగీకరించి విజాపురరాజ్యమున కెట్టియపాయము కలుగకుండునటుల వానిని కన్ననూరునకుఁ బంపిరి. అప్పుడు విజాపురసుల్తాను 1546 వ సంవత్సరము ఆగష్టు 22 వ తేదీని సాల్సెట్టి, బర్డెజ్, పర్గణాలను పోర్చుగీసు వారికి నొసంగెను. అయినను కొంతకాలమైనవెనుక అబ్దుల్లా గోవానగరమున మరల గానిపించెను. అబ్దుల్లాను మలాకాద్వీపమునకు బంపెద ననిసుల్తానుకు గోవాగవర్నరు వాగ్దత్తము చేసెను గాని యెన్నఁడును నెఱవేర్పఁ దలంపలేదు.

కొన్నిసంవత్సరములయినవెనుక 'డోమ్ పెడ్రోమాస్కెరెనుహాసు' గోవాగవర్నరుగా నియమింపఁ బడెను. అహమ్మదునగరసుల్తా నగుబురహాన్‌నిజాముషా దురదృష్టవంతుఁడయిన

అబ్దుల్లాను విజాపురసుల్తానుగా బట్టాభిషిక్తుని గావించి పెండా
దుర్గమును స్వాధీనపఱచు కొనవలసిన దనిగవర్నరును కోరెను.
ఎట్లయిన తనపొరుగువాఁ డయినవిజాపురసుల్తానుని నాశనముఁ
జేయవలయు ననినిజాముషా తలపోయు చుండెను. ఈపద్ధతిగో
వాగవర్నరు తలకెక్కిన వెంటనే యాతఁడు తనమందిరమున కెదు
టనున్న యొకచదరమున బంగారుపూతవేయఁబడిన యొకపట్టు
వస్త్రమును బరిపించి మహోన్నత మైనయొక రంగమును
నిర్మాణముచేసి గోవాపౌరులను, పోర్చుగీసువారిని, ఇంకను
అబ్దుల్లామిత్రు లయినవిజాపుర సామంతులను నాహ్వానించి
వారలసమక్షమున రాజకుమారుఁ డయినఅబ్దుల్లా ఆదిల్ షా
విజాపురసుల్తా ననివక్కాణింపుచు తానేకిరీటమును వానిశిర
స్సున నిడెను. ఇందునకు క్రొత్తసుల్తాను తనకృతజ్ఞతను దెలు
పుచు 'సాల్ సెట్టి, బర్డెజ్' పరగణాలపైఁ దనకుఁగలహక్కు
నంతయు వదలుకొంటి ననిఉచ్చస్వరమునఘోషించెను. ఈయ
పూర్వమహోత్సవము ముగిసినవెనుక గవర్నరుగారు 3000
పదాతిసైన్యమును 200 గుఱ్ఱపుదళముతోడ్పాటుతో విజాపుర
సుల్తానుస్వాధీనమం దున్న పెండాదుర్గమును వశపఱచుకొనవలసి
నదిగాఁబంపెను. అశ్వికసైన్యము గోవాకెప్ట నగుగస్పారు
'డిమెల్లో' గారియాధిపత్యమున మొదట పంపఁబడెను. అటుపి
మ్మటపదాతిసైన్యము "ఫెర్నాండోమార్టిన్సుఫ్రీరి, మార్టిమ్
అఫాంసోడిమిరాండా, డోమ్ఫెర్నాండోడిమాన్‌రాయ్, డోమ్
అంటానియోడినొరోన్హా, సెబాస్టియోడిసా," అనునైదు

సురుసేనానుల యాధిపత్యము క్రింద నుంచి పంపఁ బడియెను. క్రీస్తైన్యము లు వెడలిపోయి పెండాదుర్గమును ముట్టడించిరి. ఆదుర్గములోనివారు పెక్కుదినములవఱకు దానిని గాపాడుకొన లేక కొన్నిదినములుగడిచినవెనుక దుర్గమును వశపఱతు మని వర్తమానము పంపిరి. ఈవర్తమానమును వారలుగవర్నరునకుఁ దెలియఁజేయఁగా నాతఁడు క్రొత్తసుల్తానును వెంటఁబెట్టుకొని వచ్చెను. అబ్దుల్లాయాదుర్గమును స్వాధీనపఱచుకొని తక్కిన రాజ్యము నాక్రమించుకొనుటకై దండయాత్ర సాగించెను. పోర్చుగీసుగవర్నరు పెండాదుర్గమున 600 సైనికుల 'నొరోన్హా' యాధిపత్యమున నిలిపి తాను గోవానగరమునకు మరలివచ్చెనుగాని స్వల్పకాలములోనే మరణించెను. 1555 సంవత్సరమున 'డోమ్‌ఫ్రాన్సిస్కోబర్రెటో' గవర్నరుగాఁ బూర్వప్రభువువలెనెఅబ్దుల్లాకుఁ దోడ్పడు చుండెను.

ఈసమాచార మంతయుఁ దెలిసికొని పోర్తుగల్‌దేశపు రాజు చాలసంతోషించి యాసంతోషమును గోవానగరములోనితన ప్రతినిధికి 1557 వ మార్చి 20 తేదిగలజాబుమూలముసఁ దెలియఁజేసె నఁట. ఇట్లుండ అబ్దుల్లా పోర్చుగీసువారి సహాయముతో విజాపురముపై దండెత్తి వచ్చుచుండెను. విజాపురములోనిసామంతప్రభువు లీసమాచారముఁ దెలిసికొని క్రొత్తసుల్తానుపక్షమునసుండు మని వెల్లడింప సాగిరి. ఇంతకు ముందే విజాపురసుల్తాను మృతిఁజెందుటయు ఆలీఆదిల్‌షా రాజ్యమునకువచ్చుటయు నీతఁడుబాలుఁ డగుటయు వారిసాహ

సమును రెట్టింపఁ జేసెను. అలీఆదిల్‌షా రామరాయలకు శరణువేడుచు రాయబారులను బంపెను. రామరాయలు పదునైదువేలసైన్యములను బంపఁగా నాసైన్యములతో అలీఆదిల్‌షా అబ్దుల్లాను పూర్తిగా నోడింప నాతఁడు అహమ్మదునగరమునకుఁ బాఱిపోయెనుగాని నిజాముషా నూతనముగా రామరాయలతోను, ఆదిల్‌షాతోను ఇంతకుఁ బూర్వమునసే సంధి గావించుకొనియుండుట చేత అబ్దుల్లాను బ్రూలాకొండలలోఁ జెఱఁబెట్టి యుంచెను. బురహాన్‌నిజాముషామరణానంతరము గోల్కొండసుల్తాను కోరికమీఁద హుస్సేనునిజాముషా యాతనిచెఱనుండి విడిచిపుచ్చెను. అతఁడు గోవానగరమునకు వెడలిపోయి యచట మరణించెను. 1611 లో నతనిమనుమఁడు క్రైస్తవమతమును స్వీకరించె నఁట! ఈవిధముగా అబ్దుల్లాచరిత్రము కడముట్టినది. (1)

## విజయనగర గోల్కొండ యుద్ధము.

ఇబ్రహీముకుతుబ్షా నాఁడువేంకటాద్రిజగదేవరావుతో గోల్కొండరాజ్యముపై దండయాత్ర సాగించుచున్నవాఁ డని విన్నమాత్రమున భయకంపితగాత్రుఁడై కల్యాణీదుర్గమును ముట్టడించుట మానుకొని వేగమున స్వరాజధానికిఁ బఱుగిడివచ్చి తనసేనానులలో సుప్రసిద్ధుఁడుగా నున్న ముజాహిదుఖానుని వారల నెదుర్కొనఁ బంపెను. ఇతఁ డింతగాభయపడుట కొక

(1) The Aravidu Dynasty of Vizianagar page. 93, 94

ముఖ్యకారణము గనుపట్టుచున్నది. రాణవంశీయుఁడును సుప్రసిద్ధనాయకుఁడును, సేనాని యగుజగదేవరావు తనకుసామంతుఁడుగానుండియు విజయనగరపక్షమునఁ గుట్రసాగించి తాను లేనికాలమున విజయనగరసైన్యములోఁ జేరి వేంకటాద్రితోఁ గలిసి తనరాజ్యముపై దండెత్తి వచ్చుటయె యని తలంప నవకాశ మిచ్చుచున్నది. ఇట్లు తోరగల్లుసమీపమున ముజాహిూదుఖానుసైన్యములకును, వేంకటాద్రిసైన్యములకును ఘోరమైనసంగ్రామము జరుగుచుండెను. ఇంతమాత్రమున సంతృప్తిఁ జెందనివాఁడై అళియరామరాయలు తనమేనల్లుఁడును, కొండవీటిరాజ్యమున కధిపతియు నగుసిద్ధిరాజుతిమ్మరాజును కొండపల్లిసర్కారు నాక్రమించుకొనుటకై ఏబది వేలయాశ్వికసైన్యములతోఁ బంపించె నట. మఱియొక మేనల్లుఁ డగుజయతిమ్మరాజును ఇరువదివేలయాశ్వికసైన్యముతో దేవరకొండ, ఇంద్రకొండదుర్గములను బట్టుకొన నియమించెను. తాను తన సైన్యములతో గోల్కొండచుట్టు నున్నప్రదేశము నంతయు నాక్రమించుకొని యుండెను. సుల్తానుసైన్యములకును రాయల సైన్యములకును పోరు ఘోరముగా నుండెను. రాజమహేంద్రవరమునుండి సీతాపతియు వేదాద్రియు నెల్లూరుసర్కారు నాక్రమించుకొను చుండిరి. వెలుగోటిచిన్నప్పనాయుఁడు, వాని కుమారుఁడుతిమ్మానాయుఁడు గండికోటదుర్గము నాక్రమించిరి. ఇట్లన్నిదిక్కులను సుల్తానుసైన్యములకును, రామరాయల

సైన్యములకుఁ బోరాటము జరుగుచు కుతుబ్షాగోల్కొండ సామ్రాజ్య మస్తమించు దైన్యస్థితి యేర్పడియెను.

ఈవిధముగా నాలుగుమాసములు గడచినవెనుక జగ దేవరావు పానగల్లు, రాచెలకొండ, గణపురదుర్గములను రామ రాయలకు వశపఱుపుఁ డనితద్దుర్గాధిపతు లగుతెలుఁగునాయ కులఁ బ్రోత్సహించెను. ఇంద్రకొండదుర్గముయొక్కబీగము లను తద్దుర్గాధిపతి యగుకాశీరావు రాయల కొసంగివేసె నఁట.

అప్పుడురామరాయలపక్షమున నున్నబీదరుసుల్తా నగు ఆలీబరీదుషాకుఁ గూడభయము పుట్టి సంధిగావింతు ననియు, నతనిప్రధానమంత్రి యగుముస్తఫాఖానుని తనవద్దకుఁ బంపవ లసిన దనియు రహస్యముగా నొకలేఖనువ్రాసి ఇబ్రహీమ్కుతు బ్షాకుఁ బంపెనఁట. ఆప్రకార మాపత్తులోమునిగియున్నఇబ్ర హీము ముస్తఫాఖానుని ఆలీబరీదుషాకడకుఁ బంపెను. అప్పుడు జగదేవరావును నెట్లయినసామవిధానమున వశ్యపఱచుకొనవల సిన దనిహితోపదేశము గావింపఁబడియె నఁట. ముస్తఫాఖాను వానియుపదేశమును బాటించి జగదేవరావుతోడిమైత్రిని సంపా దించె నఁట. అతఁడువానిని ఆలీఆదిల్షాకడకుఁ గొనిపోవ వారెల్లరు నాలోచించి ముస్తఫాఖానును, ఆలీబరీదుషాయును, ఆలీఆదిల్షాయును, జగదేవరావునురామరాయలకడకుఁ గొని వచ్చి సంధికార్యమునుగుఱించి ప్రశంసలు జరిపి రట. మన స్సులో నంతగా నిష్టములేకున్నను రామరాయలు గణపురము,

ఖానుగల్లుసీమలనువిజయనగరమునకొసంగుపద్ధతిని సంధికొడం బడియె నఁట. ఇట్లీవిధముగా యుద్ధము సమాప్తిఁ జెందినది.

ఇట్లాపత్తునుండితప్పించుకొని యిబ్రహీము ముస్తఫా ఖానుతోఁ దనరాజ్యమును బలపఱచుకొనుటకు సాధనముల నారయుచుండెను. తనసైన్యమంతయుఁ దెలుగునాయకుల స్వాధీనముననుండుటయు వారలతోఁ బ్రముఖుఁడైన జగదేవ రావు రాజద్రోహియై పన్నినపన్నుగడకు రామరాయలుసమ్మ తించుటయు, అందువలన తెలుఁగునాయకు లందఱుఁదనకుద్రో హులై ప్రవర్తించి రని తెలిసికొని యెట్లయిన వారి నాయాధి పత్యములనుండి క్రమముగాఁ దప్పించవలయు ననిదృఢమైనసం కల్పముఁ బూనిముస్తఫాఖానుతో గుట్రచేసి తొలుదొల్త తాను చేయవలసినకృత్యము ఇంద్రకొండదుర్గాధిపతి యగు కాశీ రావును సంహరింపవలయు నని నిశ్చయించుకొనిరి. ఈసంగతి గోల్కొండదుర్గములోనిసైన్యముల కధికారిగ నున్నసూర్యా రావు దెలిసికొనితక్కిననాయకులతో నాలోచించి యీక్రింది విధానము తనలో నిశ్చయించుకొనె నఁట.

ఇబ్రహీముకుతుబ్షా వేటకుఁబోయినప్పుడు దుర్గముల భద్రపఱచుకొనుటకును, సూర్యారావు సుల్తాను ధనాగార మును ముట్టడించి దుర్గములోనిమహమ్మదీయుల నెల్లరనుసంహ రించుటకును తీర్మానించుకొని రట. ఈతీరుమానమును రామ రాయలకుఁ దెలియఁజేయఁగా నాతఁడు వారిసహాయముకొ ఱకుఁ గొంతసైన్యమునుబంపుదు ననివాగ్దత్తము చేసె నఁట.

అట్లు వేటాడుకాలము సమీపింపఁగా నొకనాటివేకువ వేటకాండ్రతో నిబ్రహీము గోలకొండదుర్గమును విడిచిపోయె నట. అతఁడు వెడలిపోయినవెంటనే దుర్గద్వారములు మూసివేయఁబడిన వఁట. నాయకు లెల్లరును తమసంకల్పము నెఱవేర్చుకొనఁ గోరిమహామ్మదీయుల నెదుర్కొని సంహరింప మొదలుపెట్టి రఁట. మహామ్మదీయులలోనిరువు రెట్లో తప్పించుకొనిపోయి యాదుఃఖసమాచారమును సుల్తానుకు నివేదింపఁగా ఇబ్రహీము తక్షణమె తనతోనున్నసైన్యములకు రాజధానికి మరలవలసినదని యుత్తరువుచేసి తనసైన్యములతో మరలివచ్చి దుర్గముచుట్టును విడిసియుండె నఁట. కుట్రదారులగునాయకులు బురుజులపైకివచ్చి యాసైన్యము నంతయునుగాంచి వార లీవిధముగా నిబ్రహీమునకువర్తమాన మంపిరఁట.

“సుల్తానుముస్తఫాఖానుని తమవశ్యముగావించినయెడల వెనుకటివలెనె యాతనికి విధేయులమై తమవిధులను నెరవేర్పనున్నార మనియు, ముస్తఫాఖాను మంత్రిత్వపదవికి వచ్చినప్పటి నుండియు కొండఱునాయకులపట్ల బహుక్రూరముగాఁ బ్రవర్తించి హింసించె ననియుఁ దమగతియు నట్లేయగు ననిభయపడుచున్నార మనియుఁ గావునముస్తఫాఖానునిఁ దమపరము చేయవలసినదిగాఁ గోరుచున్నాము.”

అప్పుడుసుల్తాను ముస్తఫాఖానుని రప్పించి నీపరిపాలన మెట్టిదుస్థితికిఁ దెచ్చినదో చూచితివా యని యావిషయమును వానికి వినిపించె నఁట.

అపుడు ముస్తఫాఖాను "మహాప్రభూ! నామరణము నీసామ్రాజ్యమునకు క్షేమదాయక మని దేవరవారు తలంతురేని యిదిగో నేను కుట్రదారులకు లోఁబడుటకు సిద్ధముగా నున్నా" ననిసుల్తానుకునివేదించుకొనియె నఁట. కాని సుల్తాను నాయకుల ప్రార్థనము నంగీకరింపకుండె నఁట. మఱికొన్నిదినములకు బలాత్కారముగా నాయకు లెల్లరులోఁబడవలసివచ్చె నఁట. అప్పుడు సూర్యారావుమొదలగునాయకులెల్లరు సంహరింపఁబడి రఁట. ఇయ్యవి ఫెరిస్తావ్రాసినవ్రాఁతలు. ఇందెంతసత్యమున్నదో భావిపరిశోధనలమూలమునఁ దెలిసికోవలసియుండును.

# నాలుగవప్రకరణము

## రాయలఁగూర్చిన యపనిందలు.

అళియరామరాయలు సార్వభౌముఁడై నసదాశివరాయలపట్ల సగౌరవముగాఁ బ్రవర్తింపక పదుమూఁడుసంవత్సరము లాతనిఁ జెఱసాల యందుంచి తరువాతను దానే పట్టాభిషిక్తుఁడై చక్రవర్తి నని ప్రకటించుకొని విజయనగరసామ్రాజ్యభాగ్యము నంతయుఁ దానే చూఱగొని పరిపాలనముచేసె ననియొకగొప్పయపనిందకు 'అరవీటివంశచరిత్రము' వ్రాసిన హీరాసుఫాదిరి గుఱిచేసి యాతనియశమున కొకకళంకము నాపాదించుచున్నాఁడు. ఈయనవిమర్శజ్ఞానము స్థూలమైనది గాని సూక్ష్మమైనది కాదు. సదాశివదేవరాయలశాశనములు 1542 మొదలు 1570 వఱకు సామ్రాజ్యమునందుఁ గన్పట్టుచుండుటచేత నిరువదియెనిమిదిసంవత్సరములు పరిపాలనముచేసినట్టు యొప్పుకొనక తప్పదు. అళియరామరాయలు 1565 సంవత్సరములోఁ దల్లికోటప్రాంతమున దక్కనుసుల్తానులతో జరిగినమహాఘోరయుద్ధమున వీరమరణము నొందినవిషయము సుప్రసిద్ధమైనచరిత్రాంశము. ఇట్లుండ దేశీయుల (హిందువుల) వచనరచనాసంప్రదాయరీతుల నెఱుంగనిఖండాంతరవాసులయిన తనజాతివారివ్రాఁతలయం దెక్కుడువిశ్వాసము గలవాఁడగుట

చేత వారివ్రాతలతో హిందూరాజులకుఁ బ్రతిపక్షు లయిన దక్కనుసుల్తానులదర్బారులలోనుండి యెప్పుడును రామరాయని పట్ల సౌమనస్యతఁ జూపఁజాలనిచరిత్రకారుల స్వవచనావ్యాఘాతములను జతపఱచి హిందూరాజులశాసనములలోనిభావములతోను హిందూకవులకవితారచనములలోనిభావములతోను సమన్వయింపఁ బ్రయత్నించి హీరాసుఫాదిరి స్వచ్ఛములయిన భావములకు విరుద్ధములయినట్టియు, అపార్థముల నిచ్చునట్టియు వ్యాఖ్యానములనుగావించి యాభాససిద్ధాంతములను జేసి యిమ్మహాపురుషవర్యునిజీవితమును యశమును గళంకపఱచుటకు సాహసించెను. సదాశివరాయలమరణానంతరము నూఱు సంవత్సరములకు వెనుక నీదేశమున సంచారముసలుపు చున్న పోర్చుగీసుబాటసారి యగు "ఆంక్విటిల్-డు-ఫెర్రాన్" అను నాతఁడు "సదాశివరాయల మరణానంతరము రామరాయలు రాజుగాఁ బేర్కొనఁబడియె" నని వ్రాసినాఁ డఁట! ఫ్రెడరిక్కనునాతఁడు రామరాయలు రాజసింహాసన మధిష్ఠించినాఁ డనియు రాజనివ్యవహరింపఁబడినాఁ డనియు వ్రాసినాఁ డఁట! అందువలన రామరాయలు రాజధానీనగరమునఁ బట్టాభిషిక్తుఁ డైనట్లు గన్పట్టుచున్న దని, హీరాసు' వ్రాయుచున్నాఁడు.(1) మొదటిబాటసారి యీదేశమునసంచారముసలిపినకాలముననే యిసఁగాఁ గొంచెమించుమించుగా 1687 మొదలు 1704 వఱకుఁ గల నడిమికాలమున నున్నమైసూరుప్రభు వగుచిక్క

(1) The Aravidu Dynasty of Vijianagar, p. 37

దేవరాయని కంకితముగావింపఁబడినచిక్కదేవరాయవంశావళి యనుగ్రంథమునఁ దిరుమలార్యుఁ డనుకన్నడకవి.

"తుళవకుళదీశ్వరసరసవీరనరసింగకృష్ణాచ్యుతంబరాయ ద్రుపరతఱువాయిం ముదదోళిళయం పూటిది సదాశివరాయంగె సేనానియెనిసిదఆంధ్రకులదరామరాజం, నిజరాజంగె ద్రవిడాంధ్రకర్ణాట సామ్రాజ్యమం సౌర్జ్య పతికార్య్యదోళర్పిత ప్రాణ ననిసి, ఒర్మయుత్తరదిగ్విజయదోళుద్వృత్త యవనసేనాచక్రమ నొక్కలిక్కి యశశ్శేషనప్పిను,......"

అనఁగాఁ దుళువకులములోనివారయిన యచ్యుతరాయాదులకుఁ బిమ్మటసదాశివరాయలు రాజ్యమునకు వచ్చెననియు వానిసేనాధ్యక్షుఁడును, ఆంధ్రకులము వాఁడయినరామరాజు ద్రవిడాంధ్ర కర్ణాటసామ్రాజ్యమును బరిపాలింపుచుఁ బతి కార్యముకొఱకుఁ బ్రాణము లర్పించి యుత్తరదిగ్విజయసందర్భమున మహామ్మదీయులతో జరిగినయుద్ధములో మృతిఁ జెంది యశశ్శేషుఁ డయ్యెననియు వ్రాసియున్నవాఁడు. ఈతిరుమలార్యకవి చిక్కదేవరాయనికిఁ బ్రధానమంత్రి. ఆరవీటివంశమునకుఁ బ్రతిస్పర్ధులుగా నుండి తద్వంశీయుఁ డైనమూఁడవ శ్రీరంగరాయలతో యుద్ధముచేసి జయించి స్వాతంత్ర్యమును బొందినవాడు.(1) సదాశివరాయలను త్రోసిరాజని పరిపాలనచేసినవాఁడు రామరాయలుగాక వానితమ్ముఁ డయినయెఱతిమ్మరా

(1) Sources of Vijianagar History, p. 302–303

రాజని (తిరుమలదేవరాయలు) కూడ వ్రాసియున్నవాఁడు. ఈయభిప్రాయముకూడ సత్యముగాఁ గనుపట్టదు. ఎందుకన 1568 సంవత్సరములో సదాశివదేవరాయలు తనసామ్రాజ్యములోని దక్షిణభాగమున సంచారముచేసి యనేకసామంత నృపతులవలన కట్నములను కానుకలను బొందినవాఁడు. వానిలో ముఖ్యుఁడు మధురమండలాధీశ్వరుఁ డయినకృష్ణప్పనాయకుఁడు. పవిత్రమైన కావేరీతీరమున శ్రీరంగనాథస్వామివారి సన్నిధిని అనేకసామంతనృపతులతోడను, విద్వజ్జన పరివారజనంబులతోడను, మంత్రులతోడను, గురుజనంబులతోడను సదాశివదేవరాయలుగొలువుదీర్చియుండఁ గృష్ణప్పనాయకుఁడు శ్రీవేంకటేశ్వరస్వామివారి కైంకర్యములకొఱకు కృష్ణాపురమును వానిసమీపమున నుండుమఱితొమ్మిది గ్రామములతోఁగూడ సమర్పింపవలసినదిగాఁ బ్రార్థింప నతఁడంగీకరించి యట్లుగావించె నని కృష్ణాపురశాసనమువలన స్పష్టముగాఁ దెలియుచున్నది. (1) దీనినిగుర్తించియుఁ దనగ్రంథమున నుదాహరించియు, హీరాసు ఫాదిరియిందునకొకవిపరీతమైన వ్యాఖ్యానము చేయుచున్నాఁడు. విజయనగరసామ్రాజ్యనిర్వహణ ప్రచారమునకై యనేకసంవత్సరములక్రిందట ఖైదుగావింపఁబడినచక్రవర్తి విగ్రహమునుసామ్రాజ్య ప్రజలకుఁ జూపింపవలసివచ్చినదఁట ! ఇయ్యది తిరుమలదేవరాయల రాజనీతినైపుణ్యతను మాత్రమే దెలుపు

(1) Ep. Ind., IX, p. 340–341. V. V. 44–45, 70 96 and 102–4.

నఁట ! 1568 సంవత్సరములో తిన్నెవెల్లిమండలమున మరి యొక్కటియు, 1569 లో కోయంబత్తూరుమండలమున నొకటియు, 1570 లో మధురమండలములో నొకటియు, నెల్లూరు మండలములో నొకటియు, సదాశివదేవరాయలుచక్రవర్తిగా నున్నట్టుగ నాతనిపేరిటశాసనములు గన్పట్టుచున్న వఁటగాని దురదృష్టవంతుఁడయినయాచక్రవర్తి యంతకుఁబూర్వమే మరణముఁ జెందియుండెననియు, అప్పటి కాతనిమరణవార్త యాదూరప్రదేశములకుఁ జేరియుండలే దనిహీరాసు వ్రాయుచున్నాఁడు. ఇరువదిఎనిమిది సంవత్సరములపరిపాలనానంతరము సదాశివరాయలెట్టిమరణముఁ జెందె నని ప్రశ్నించుచు తనకుఁ దానె యిట్లు ప్రత్యుత్తరము నిచ్చుచున్నాఁడు. మనకాలము ననున్న సూయల్‌దొరగారు సదాశివరాయలను సంహరించి తిరుమలదేవరాయల సామ్రాజ్యమాక్రమించి పరిపాలించినాఁ డనివ్రాసినాఁ డఁట ! వెంకయ్యకృష్ణశాస్త్రిగా ర్లంగీకరించినా రఁట ! కాని తిరుమలదేవరాయలకాలమున నున్న ఫ్రెడరిక్కను పోర్చుగీసుబాటసారి సదాశివరాయలను సంహరించినవాఁడు తిరుమలదేవరాయనికొడు కనివ్రాసినాఁ డఁట ! ఈరాజహత్య గావించినవాఁడు తిరుమలరాయలే యనిచెప్పుటకు సమకాలీనమగు ప్రత్యక్షప్రమాణ మేదియులేకపోయినను, ఈహత్య కాతనినొకప్రోత్సాహకునిగా నేవిధ మయినసందేహములేకుండ నిశ్చయముగాఁ జెప్పవచ్చు నఁట ! ఎందుకన: అంక్విటిల్-డు-ఫెర్రాన్ అనునాతఁడు తిరుమలరాయనికొడుకు సదాశివరాయుని

వానికుమారునిఁ జెరలో నుంచి సదాశివరాయుని కుమారునిఁ జంపినాఁ డనివ్రాసినాఁ డఁట ! చంపఁబడినవాఁడు కుమారుఁడో తండ్రియో తెలియరా దఁట ! హీరాసునకు మరియొక చిక్కు గన్పట్టినది. తిరుమలదేవరాయలకు నల్వురుకొమాళ్లు గలరు. ఏకుమారునిపై నేరమారోపించవలయునో బాగుగా నాలోచింపవలసివచ్చినది. తిరుమలదేవరాయని కుమారులలో నెవనిపై యీరాజహత్య మోపవలసియుండునో సరిగా నిర్ణయించి చెప్పుట సులభసాధ్యము కాదఁట ! వానినల్వురుకొమాళ్లలోను బెద్దవాఁ డయినరఘునాథరాయల పేరు రక్షస్తగిడి (తల్లికోటసమీపమున రక్షసు-తగిడియను రెండుగ్రామములు గలవు) యుద్ధానంతరము వినంబడ కున్నందునను, ఆయుద్ధమున నాతఁడుగాయపడినందునను తిరుమలదేవరాయలకుఁ బూర్వమె యాతఁడు మృతినొంది యుండు నని యూహింపవచ్చు నఁట. రంగరాయలు రామరాయలు, వేంకటపతిరాయలు మూవురు మాత్రము బ్రదికియుండిరఁట ! సదాశివదేవరాయలను ఖైదుగానుంచిన చెరసాల చంద్రగిరిదుర్గమే యైనయెడల నా చెఱసాలకు వేంకటపతిరాయలే జైలరుగా (కారాగృహాధికారి) నుండుటచేత భావికాలమున నారవీటివంశీయుఁడై మహాప్రఖ్యాతితోఁ బరిపాలనముచేసిన రెండవవేంకటపతి దేవరాయలనే కడపటరాజ్యముచేసిన తుళువకుల ప్రతినిధి యగుసదాశివదేవరాయలమరణమునకు నుత్తరవాదిగాఁ జేయవచ్చునఁట ! ఎందుకన, నూరేండ్లతరువాత నున్న ఆంక్విటిల్-డు-ఫెర్రాన్ రెండవ

వేంకటపతిరాయలే సదాశివరాయనికుమారుని జంపించుటకును హక్కుదారుఁడైనరాజును సింహాసన భ్రష్టునిజేయుటకును కారకుఁ డని వ్రాయుటచేత తమయూహను స్థిరపఱచుచున్నట్లు గన్పట్టుచున్న దఁట. తుంటిమీఁదఁ గొట్టిన మూతిపండ్లు రాలిన వన్న ట్లున్నది. సదాశివరాయనికుమారుని జంపినవాఁడని వ్రాసినవ్రాఁత వీరివాదమున కనఁగా సదాశివరాయలను జంపినవాఁ డని నిర్ధారించుటకు పరమ ప్రమాణముగాఁ గైకొనుట యెట్లు ? ఇవన్నియు వట్టిదుర్భ్రమతోఁ గూడినయూహాకల్పనలే గాని నిజముగా సదాశివరాయ లెట్లుమరణముఁ జెందెనో సత్యమైనట్టియు, లిఖితమూలక మైనట్టియుఁ బ్రమాణముగాఁ గైకొనఁదగినసాక్ష్య మేమియు లేకున్నప్పుడు విదేశీయులు పరస్పరముఁ బొందికలేకుండ వ్రాసినవ్రాఁతలను విశ్వసింపరాదు. ఏదియెట్లున్నను 1570 సంవత్సరమువఱకు సదాశివరాయలు బ్రదికియున్నట్లు శాసనములవలన స్పష్టముగాఁ దెలియుచున్నది. దీని నెందుకువిశ్వసింపరాదో బోధపడ కున్నది. ఈవిషయ మటుండనిచ్చి రామరాయలు సదాశివదేవరాయలను నిజముగా ఖైదుచేసియుండెనా యనువిషయమును విమర్శింపవలసి యున్నది.

సామ్రాజ్యభారమువహించి పరిపాలనము చేయుటకు యుక్తవయస్సువచ్చినవెనుక రామరాయలు సదాశివదేవరాయలనుఖైదులోనుంచెనఁట! ఇటాలియాదేశస్థుఁ డయిన ఫ్రెడరిక్కు రామరాయలును వానిసోదరులిర్వురు నిందులకు నుత్తరవాదు

లని యనుచుండఁగా ‘ కోటో ’ యనునాతఁడు రామరాయలా క్రమకారకుఁ డనివ్రాయుచున్నాఁ డఁట. కోటోవ్రాసినదే నిజము కావచ్చునని హీరాసు వ్రాయుచున్నాఁడు. ఎందుచేత ననఁ దమయన్న గారిట్లుచేయుటకిష్టపడక యాతనిపై తిరుగుబాటు చేసియుద్ధముచేసి రట. ఇందెంతసత్యము గలదో వెనుక విమర్శించి చూతముగాక ! సురక్షితమై, బలాఢ్యమై యినుపతల్పులచే నొప్పెడునొకదుర్గములో నుంచి కావలివాండ్రను గాపుంచెనఁట. కాని యతఁడాదుర్గ మెక్కడనున్నదో వ్రాసి యుండలే దట. ఇట్టిపని 1550—1552 సంవత్సరములనడుమ నెప్పుడో జరిగియుండె ననిఅంక్వెటిల్—డు—ఫెర్రాన్ తెలుపుచుఁ దరువాత నిట్టిఖైదులో ౧౩ సంవత్సరము లుంచఁబడె నవివ్రాసి యున్నాఁ డఁట ! సదాసివదేవరాయలమరణానంతరము రామరాయలాక్రమించి రాజ్యము పరిపాలించె ననివ్రాసినవాఁ డితఁడే ఇతనిమాటలను నమ్మిహీరాసుఫాదిరి 1550 మొదలు 1563 వఱకు సదాశివదేవరాయలు రామరాయలచే ఖైదుగావింపఁబడి యుండె నని వ్రాయుచున్నాఁడు. ఈదురదృష్టవంతుఁ డయిన రాజు సంవత్సరమునకొకతూరి మాత్రము రత్నసింహాసనము పైఁగూర్చుండఁ బెట్టఁబడి ప్రజలకుఁ బ్రదర్శింపఁ బడుచుండె నని ఫ్రెడరిక్కు వ్రాసి యున్నాఁ డఁట ! (1) అట్లు చక్రవర్తిని ప్రదర్శించుపద్ధతి 1563 వ సంవత్సరము తరువాత విరమింపఁ బడిన దఁట ! కాని సంవత్సరమునకొకసారి మూఁవురుసోదరు

(1) The Aravidu Dynasty of Vijianagar, p. 31-32.

లాతనిచక్రవర్తినిగా శిరసావహించి పరిపాలనచేయుచున్నట్లు దెలుపుటకుఁగాను నాతనిసందర్శించి నమస్కరించు చుండిరని 'కోటో' వ్రాయుచున్నాఁడఁట ! 1565 లో జరిగినతల్లికోట యుద్ధములో రామరాయలు మరణముఁజెందెనుగదా. ఇంక నడుమనున్న దొక్కసంవత్సరము, 1564 మాత్రమె గదా. అట్లు మూవ్వురుసోదరులు చక్రవర్తిని సందర్శించి పాదాక్రాంతు లయిన దీయొక్కసంవత్సరమె కాఁబోలు ! ఈహీరాసు ఫాది రియె మఱియొకచోట "తల్లికోటయుద్ధములో రామరాయలు మరణము నొందుటయు దమకు నపజయముఁ గలుగుటయు విని పాఱివచ్చి తిరుమలదేవరాయలు తనయొక్కయు, తనసో దరులయొక్కయు భార్యలను పుత్త్రికాపుత్త్ర సంతానమును, మంత్రివర్గమును, సామ్రాజ్యములోని సామంతప్రభువర్గమును సేనానులను, సైన్యములను, అదివఱకు 6 సంవత్సరములనుండి కఠినకారాగారశిక్ష ననుభవించుచు నదియె ప్రథమపర్యా యము ప్రజలకుఁగన్పఱచఁబడిన చక్రవర్తి సదాశివదేవరాయ లను వెంటఁగొని విజయనగరమునుండి తరలించుకొనిపోయి నట్లు ఫ్రెడరిక్కుదెలిపి యున్నాఁ" డని వ్రాసియున్నాఁడు. (1) ఎవరివ్రాఁతనమ్మవలసినది ?

ఇట్లుపరస్పరముపొందికలేక విదేశస్థులువ్రాసినవ్రాఁతలను సరిగావిమర్శింపక తనకిష్టమువచ్చినట్లుగా జతపరచి దుర్భ్రమ లపాలయి రామరాయల శీలమును గుఱించి దురభిప్రాయము

(1) I bid p. 221.

గలుగునటులు చేయఁ బ్రయత్నించుట మిక్కిలిశోచనీయముగా నున్నది. తాము స్వయముగా నెఱిఁగియుండి వ్రాసినవిగాక యెవ్వియో లోకప్రవాదముల నార్వీటివంశప్రభువుల నసూయతో జూచువారినుండిగాని సామ్రాజ్యవైరులుగ నుండిన విమతస్థులగు హైందవేతరజాతివారలనుండిగాని విని పరస్పరవిరుద్ధము లగువ్రాఁతలువ్రాసిన విదేశస్థులవ్రాఁతలను నమ్మి విదేశస్థుఁడై నయీచరిత్ర కారునకు సదాశివదేవరాయని కాలమున వ్రాయఁబడిన శిలాతామ్రశాసనములలోని వాక్యములసత్యత్వ మెట్లుబోధపడఁగలదు ? అందుచేతనే హీరాసుఫాదిరి యిట్లు వ్రాయసాహసించెను. (1)

" తనపరిపాలనకాలములో రెండవభాగమున, అనఁగాఁ దానుఖైదులోనున్నప్పుడు నయితము కేవలము తనమంత్రిచేత నేగాక సదాశివరాయలతాను స్వయముగనే యాదేవాలయాదులలో వ్రాయించిన దానశాసనము లనేకములుగల వనుటకు యెంతమాత్రము సందేహములేదు......ఈమతధర్మములకై లిఖింపఁబడిన శాసనములలో నధికసంఖ్యాకములు సదాశివ రాయలపక్షమునఁ జేయఁబడిన వైనను బహుశః రామరాయల యుత్తరువునే పురస్కరించుకొని చేయఁబడి యుండును. "

సదాశివదేవరాయలవారు వజ్రసింహాసనా రూఢులై భూమిని పరిపాలించుచుండఁగా నళియరామరాయలవారి ధర్మ

(1) The Aravidu Dynasty of Vijianagar page 41.

పరిపాలనమున విఠలేశ్వరుని దేవాలయమునఁ బ్రతిష్ఠాపింపఁ బడిన యొకశిలాశాసనము యొక్క ప్రతినితెప్పించి యందు 1519 సంవత్సరములో కృష్ణదేవమహారాయలవారు కొన్ని గ్రామములలో కైంకర్యములకుగాను గొన్నిసుంకములవసూలుచేయుట కనుజ్ఞ నిచ్చియుండుటనుగాంచి యవి చాలకకైంకర్యములు వెనుకబడి నిలిచిపోయినందున భైరవదేవుని కైంకర్యములకుఁగాను సుంకములకై సదాశివరాయలవారు దానశాసనము వ్రాయించెనని 1557 సంవత్సరములోని యొకశాసనము దెలుపుచున్నది. (1)

ఇట్టిదానశాసనము వ్రాయించినచక్రవర్తి ఖైదులో నుండి యీశాసనమును వ్రాయించె ననిమనము విశ్వసింపవలయునా ? ఎంతవిపరీతవిషయము ? ఇట్టిశాసనములు పెక్కులు గలవని 'హీరాసుఫాదిరి' యొప్పుకొనుచునే యున్నవాఁడు గావున గ్రంథవిస్తరభీతిచే వాని నిచటనుదాహరింప విరమించుచున్నాను. ఇతఁడు 1550 లో సదాశివరాయలు ఖైదులోనుంచబడి నట్లును, ఇతనిఖైదుచేసి నందులకై రామరాయలసోదరు లయినతిరుమలరాయలును వేంకటాద్రియు రామరాయల యధికారమును ధిక్కరించి 1551 సంవత్సరమునఁ దిరుగుబాటుచేసి యుద్ధముచేసి రఁట ! ఈసత్య విషయమును గోల్కొండదర్బారులో నుండునొకయనామధేయ చరిత్రకారుఁడు వ్రాసినాఁ డఁట ! కీర్తిశేషు లయినకృష్ణశాస్త్రిగారుసత్యవిరుద్ధ

(1) Ep. Carn, XI, Mk. 1.

మయినదిగావున విశ్వాసపాత్రము కాదనిత్రోసిపుచ్చినారఁట ! కాని మనమందుసత్యముకలదని యొప్పుకొనక తప్పదని హీరాసుఫాదిరి నొక్కి వక్కాణించుచున్నాఁడు.

"అహమ్మదునగరసుల్తానుతోఁ బోరాడుచున్న విజాపురసుల్తానుకుఁ దోడ్పడుటకై రామరాయలు రాజధానీ నగరమును విడిచిపోయినపుడు, ఆదవానిప్రభుత్వమున నియోగింపఁబడిన తిమ్మరాజు, గోవిందరాజు ననుసోదరు లిర్వురును నాతఁడు లేకుండుట సందుచేసికొని యాదవానియాధిపత్యము నాక్రమించుటయెగాక" "కొంతసైన్యమును సమకూర్చుకొని తమయధికారమునకు ననేకమండలములవారిని లోఁబడునట్లు చేసి వశ్యులను గావించుకొని రఁట. రామరాయలు విజయనగరమునకుఁ దిరిగివచ్చినతోడనే తనసోదరులకు జాబులుపంపెనఁట ! కాని వారు తమబలమునే యాధారపఱచుకొని యాతని జాబుల నలక్ష్యభావముతో నుపేక్షించి రఁట ! వారల జయించుటసాధ్యముగాక రామరాయలు గోల్కొండవారి సాహాయ్యమపేక్షింపఁ బురికొల్పఁ బడె నఁట ! అంత రామరాయలు గోల్కొండకు సహాయముకొఱకు రాయబారులను బంపఁగా ఇబ్రహీమ్కుతుబ్షా యారువేలపదాతి సైన్యముతో కాబూల్ ఖానుని పంపె నఁట! ఈసైన్యము విజయనగరముచేరినతోడనే రామరాయలు సిద్ధిరాజు తిమ్మరాజును, నూరుఖానుని, బిజ్లీ ఖానుని వారిసైన్యములతో కాబూల్ఖానుని సైన్యములను గలిపికొని పితూరీదార్లపై దండయాత్ర సాగించి జయించి పట్టి

తీసికొని రావలసిన దనియుత్తరువుచేసె నఁట ! వారు ప్రభుత్వ సైన్యములను గెలువఁజాలక యాదవానిదుర్గములో దాఁగొని యుండ నాఱుమాసముల వఱకు ముట్టడించి వారిని విడువక పోఁగా నాహారపదార్థములు చిక్కనందున వారుక్షమింపవలసిన దని విజయనగరమునకు విజ్ఞాపనలను బంపుకొని రఁట ! వార లను క్షమించి రామరాయలు తనసైన్యములను రప్పించుకొని కాబూల్ ఖానునకు బహుమానము నొసంగిపంపెనఁట. అతఁడు గోలకొండఁ జేరినుల్తానువలన 'ఐన్-ఉల్-ముల్కు' అనుబిరు దము ను గాంచె నఁట ! "

ఈపైవిధ మంతయు నాయనామధేయచరిత్రకారుఁడు దెలిపినది. (1) ఈయనామధేయచరిత్రకారునకు రామరాయల తమ్ముల పేరు లయినను సరిగాఁ దెలియ కుండెను. తిరుమల రాజు, వేంకటాద్రి వారిపేరు లయియుండఁగా వానిం దెలిసికొనం జాలక తిమ్మరాజు, గోవిందరాజు నని వక్కాణించినాఁడు. తిరుమలరాజునుతిమ్మరాజనివ్యవహరింపఁగూడదా యని యందు రేని గోవిందరా జనుపేరుగలవా రారవీటివంశమువారిలోనే గానరారే ? విజయనగరసామ్రాజ్యమునందు లక్షలకొలదిసై న్యము లుండఁగా వీనితో జయింపలేక రామరాయ లంతటి వాఁడు గోల్కొండవారిసహాయమును గోరవలసివచ్చినదా ? వారుపంపినదియాఱువేలసైనికులనా ? ఈయాఱువేలసైనికులు వచ్చినతోడనే శత్రువులు వీరిని జయించుట సాధ్యముకా దని

(1) The Aravidu Dynasty of Vijianagar p. 33

శత్రుసైన్యము లావవానిదుర్గమున దాఁగొన్నారా? పాప మీయనామధేయచరిత్రకారుఁ డావవానిదుర్గ మెంతిసైన్య మును దనలో నిముడ్చుకొనశక్తిగలిగియున్నదో తెలిపియున్న యెడల నెంతో చక్కఁగా సత్యము బైటఁబడియుండునుగదా! ఈయనామధేయచరిత్రకారుఁ డిట్టియబద్ధమును గల్పించి వ్రాసి నందుకు మాకు వింతలేదుగాని హీరాసుఫాదిరి యీయబద్ధము లను సత్యములని నొక్కి వక్కాణించుట వింతగొల్పుచున్నది.

1551 సంవత్సరమున విజాపురసుల్తానునకును, అహ మ్మదునగరసుల్తానునకును జరిగినయుద్ధములో అహమ్మదునగ రమునకుఁ దోడ్పడుటకయి రామరాయలు దండయాత్రకుఁ బోయియుండె ననియు, అట్లుపోయి విజాపురసుల్తాను వగు రాచూరు, ముదిగల్లుదుర్గములను జయించి అహమ్మదునగర సుల్తానుతో జరిగినయొడంబడికప్రకారము వానిని స్వాధీనపఱ చుకొని కొంతసైన్యముతోఁ దనతమ్ముఁడయినవేంకటాద్రి నచట నిలిపి తానువిజయనగరమునకు మరలివచ్చె ననియు, తరువాత వేంకటాద్రిసాహాయ్యముతో నహమ్మదునగరసుల్తా నుషోలాపురమును ముట్టడించి కొలదికాలములోనే స్వాధీనము చేసికొనియె ననిఫెరిస్తా మొదలగువారిగ్రంథములనుండియె హీరాసుఫాదిరి యెత్తి వ్రాసి యుండియుఁ బైయనామధేయచరి త్రకారునివ్రాఁతలోసత్య ముండె ననియెట్లువిశ్వసింపఁగలిగెనో యదియే వింతగా నున్నది. (1)

(1) The Aravidu Dynasty of Vijianagar p. 84.

వీరివిమర్శజ్ఞాన మల్పమైన దనిచూపుట కీయొక్క విషయమే చాలును. ఇట్టివి వీరిగ్రంథము నందుఁ బెక్కులు గలవు. హీరాసువ్రాఁతలప్రకారము రామరాయ లెప్పుడు పట్టాభిషిక్తుఁ డయ్యెనో సత్యము తెలిసికొనఁ బ్రయత్నింతము. 1563 సంవత్సరాంతమువఱకుఁ బదుమూఁడు సంవత్సరములు పరిపాలనముజరిపిన వెనుక రామరాయలపాలనము తృప్తికరమగు నట్లుగా దృఢపడినందున సదాశివదేవరాయలుమృతినొంది నట్లు వదంతులువ్యాపింపఁజేయఁబడిన వఁట. పిమ్మట దురాశాయుక్తుఁ డగునీతఁడుతనంతటతానే రాజపట్టము గైకొనియె నఁట! ఆంక్విటిల్, సీజరు ఫ్రెడరిక్కు వ్రాసినదానినిబట్టి రామరాయలు విజయనగరములోఁ బట్టాభిషిక్తుఁడయినట్లే తమకుఁ గన్పట్టుచున్న దఁట. ఒకశతాబ్దమునకుఁ దరువాత ననఁగా 1688 లో 'మనుచ్చి' అనునతఁడు రామరాయలను నరసింగరాజ్య (విజయనగర రాజ్య) చక్రవర్తి యని వ్రాసినాఁ డఁట! 1565 లో ముద్రింపఁబడినయొకపూలవరహాపై రామరాయలపే రొకప్రక్కనఁ గన్పట్టుచున్న దఁట. 1562–63 సంవత్సరమునాటి దేవదుర్గతామ్రశాసనములో రామరాయలు సర్వాధిపత్యము వహించి విజయనగరములోఁ బరిపాలించుచుండె నని వ్రాయఁబడిన దఁట. ఆసంవత్సరములోనే యొకసామాన్యగృహస్థునిశాసనములోసదాశివరాయలపే రెత్తకుండ రామరాయలు సామ్రాజ్యమును బరిపాలించుచుండెనని వ్రాయఁబడినఁ దట. రామరాయలు చక్రవర్తిబిరుదములు వహించినట్లుగా సూచించునవి

తామ్రశాసనములు గలవనియు వానిలో నొకటి 1543 లో పెను
గొండనగరమున "రత్నసింహాసనా రూఢుఁడై రాజాధిరాజ
రాజపరమేశ్వరవీర ప్రతాపమహారాయ రామదేవ అయ్యంగారు
పరిపాలనము చేయుచుండఁగా" అని వ్రాయఁబడియున్న దని తె
ల్పుచు నియ్యది కల్పితశాసన మనియుఁ గల్పితశాసన మయ్యును
రామరాయలను విజయనగరచక్రవర్తియని తెలుపుచున్న
దనియు, మఱియొకటి 1565 సంవత్సరములోనిది సదాశివ
రాయలపేరెత్తక విద్యానగరసింహాసనాధిపతులయిన కుంతలాధి
పతి రాజాధిరాజరాజపరమేశ్వర వీరప్రతాపవీరరామదేవరాయ
మహారాయలు రత్నసింహాసనారూఢులై శాంతియుతులై
విశ్వమును బరిపాలించుచుండె నని వ్రాయఁబడియుండె నఁట.
ఈశాసనములతోఁ బాటు అనంతాచార్యకవి తన ప్రపన్నా
మృత మను గ్రంథమున కృష్ణరాయలతరువాత పరిపాలనము
చేసినరామరాయలను విజయనగరచక్రవర్తి యని వ్యవహరిం
చినాఁడఁట! ఇన్ని ప్రమాణములు చూపినప్పుడు హీరాసు
గారియభిప్రాయము నిరాకరించు టెట్లని చదువరులకు సంశ
యము కలుగవచ్చును. కాని వీనిని జాగరూకతతోఁ బరిశీలిం
చినయెడల దుర్భ్రమలపాలుకాఁ జాలము. అనంతాచార్య
కవి తన ప్రపన్నామృతమున రామరాయలను విజయనగర
సార్వభౌమునిగా వర్ణించియుండలేదు. అతఁడు కృష్ణరాయల
యనంతరము గురుభక్తిపరాయణుఁ డైనరామదేవరాయా

ఖ్యుఁడు ధర్మముతో రాజ్యపరిపాలనము చేసె ననిమాత్ర మీక్రిందిశ్లోకమునఁ జెప్పి యున్నాఁడు.

"శ్లో. శ్రీరామదేవరాయాఖ్యః కృష్ణరాయాదనంతరమ్
శశాసరాజ్యంధర్మేణాగురుభక్తిపరాయణః"

ఈక్రిందనే ఒకప్పుడు రామరాయలు తనగురువయిన తాతార్యుని వెంటఁదీసికొని చంద్రగిరికి వెళ్లె ననిమఱియొక శ్లోకమున నిట్లుచెప్పియున్నాఁడు.

"శ్లో. సభూపతిర్మహాతేజాః యయౌచంద్రగిరింప్రతి
గురుంతాతార్యమాదాయ రామరాయాభిధస్తదా"

ఇంకొకశ్లోకములో రామరాయలసహాయముచేత మహాయశుఁడయినదొడ్డయాచార్యుఁడు శైవశాస్త్రవిదులనుజయించె నని యిట్లుచెప్పియున్నాఁడు.

"శ్లో. రామరాయసహాయేనమహాచార్యోమహా
యశాః దుర్జయానపినిర్జిత్యశైవాన్‌శాస్త్రవిదుత్తమః"

హీరాసుఫాదిరివీనినివిజయనగరచరిత్రమునకుమూలప్రమాణము లనియర్థమిచ్చు "సోర్సెస్ఆఫ్విజయనగర్‌హిస్టరీ" అను గ్రంథమునుండి యెత్తికొని చూచి వ్రాసి యున్నారు. అంతవీని నింగ్లీషునకు తర్జుమాచేసినవారు రామరాయలను విజయనగరచక్రవర్తిగాఁ బేర్కొనియుండుటచేత నితఁడట్లు వ్రాసియుండెనే కానిమూలమున నట్లుగానరాదు. (1)

(1) Sources of Vijianagar History, p. 202.

పూర్వకాలమున నొకసామ్రాజ్యములోని సామంతప్రభువులుమండలాధిపతులుకూడఁ దమపేరిటనాణెములు ముద్రించుకొనుసంప్రదాయానుకరణము గలదు. అందువలన నొక నాణెముపై రామరాయలపేరు కన్పట్టినంతమాత్రమున రామరాయలు విజయనగరసామ్రాజ్యమునకుఁ బట్టాభిషిక్తుఁ డయిన సార్వభౌముఁ డనుటకుఁ బరమప్రమాణము కాఁజాలదు.

ఇంకశాసనములనుగూర్చి చెప్పవలసినది కొంత గలదు. రామరాయలయెడ దోషారోపణముఁ జేయఁ దలంచినవారు రామరాయలమరణానంతరమును, సదాశివదేవరాయలమరణానంతరమును, లిఖింపఁబడిన శాసనములనుండిగాని గ్రంథములనుండిగాని సాక్ష్యమును జూపఁ బ్రయత్నించుటకంటె నాతని కాలమున నాతనిచేవ్రాయింపఁ బడిన శాసనములనుండి గాని గ్రంథములనుండిగాని సాక్ష్యప్రమాణములను జూపఁ బ్రయత్నించుట యుత్తమమార్గము. ఏదేనియొకశాసనములో సదాశివదేవరాయలపేరు లేకరామరాయలపే రుదహరించినంతమాత్రముచేత నద్దాని నాధారపఱచుకొని వానిపేరిటిశాసనములు సామ్రాజ్యము నలుప్రక్కలఁ గన్పట్టుచుండఁగా వానినెల్లను విస్మరించి సదాశివరాయని కారాగృహవాసశిక్షకుఁ బాల్పఱచి యాతనిఁ బ్రపంచము మఱచిపోయినతరువాత రామరాయలు దనంతటతానే పట్టాభిషిక్తుఁడై రాజాధిరాజని రాజపరమేశ్వరుం డని ప్రకటించుకొనియె నని సిద్ధాంతము చేయసాహసించుట సంభావ్య మగునా? ఈసందర్భమున వీరుచూపఁ

గలిగినవి యొక్కటి. కర్ణాటికాశాసనసంపుటములనుండి యెత్తి చూపఁ గలిగినారుకాని యది యేసందర్భమున నెవ్వనిచే నేప్రదేశమునఁ బుట్టఁబడినదో వివర మేమియుఁ దెలిపి యుండలేదు. 1564 సంవత్సరములో వీరప్రతాప సదాశివదేవరాయలు తానుసింహాన ద్వీపమును కొల్లఁగొట్టితి ననిచిత్తూరుమండలములో తిరుత్తనిగ్రామమున లిఖింపఁజేసినశాసనము నేలయెత్తికొనరు ? విజయనగరసామ్రాజ్యమునకు లోఁబడినమధురమండలాధీశ్వరు లగువిశ్వనాథనాయకుఁడును, వానికుమారుఁడు కృష్ణప్పనాయకుఁడును 1560 సంవత్సరముమొదలుకొని 1570 సంవత్సరమువఱకు ప్రతిసంవత్సరము వ్రాయించిన దానశాసనములు సదాశివదేవరాయలు రాజ్యముచేయుచున్నట్టు లాతని నామము గన్పట్టుచుండఁగా వానిం బెడచెవిం బెట్టనేల ? పెడచెవినిఁ బెట్టుటయెగాదు; విజయనగరసామ్రాజ్యములోనిహిందూప్రజలు సదాశివదేవరాయలు మరణముఁజెందె ననియూహించి యాతని మఱచిపోయి రామరాయలనే విజయనగరచక్రవర్తిగాఁ బేర్కొని రప్పుడు ఫేరిస్తా మొదటివానినిగుఱించి యేమియుఁ జెప్పక రామరాయలనే ప్రత్యర్థిసామ్రాజ్యప్రభు వనివ్రాయుట వింతయేమియులే దఁట ! నిజాముశాహి రాజులచరిత్రగ్రంథ మగు ‘ బురహాన్_ఇ_మాసీర్ ’ అనుగ్రంథమునువ్రాసిన ‘ ఆలీఇబుఅజీజ్ అల్లాతపతాబాయి ’ హిందువులు మఱచిపోయినను తానుమాత్రము మఱువక యెచటనో యొకటి రెండుప్రదేశములం దక్క గ్రంథమునంతటను రామరాయల

పేరునకుమాత్రముగా సదాశివదేవరాయల నామమునే వ్యవహరించు చుండుట వింతగాఁ గన్పట్టలేదు కాఁబోలు !

'ఫరియా—యి—సౌజా' అనునాతఁడు సదాశివరాయలు కర్ణాటరాజని ప్రశంసించినాఁడఁటగాని 1559 లో తనకుఁ దెలిసినవిజయనగరరాజు రామరాయ లొక్కఁడేయని తెలిపినవాఁడఁట !

రామరాయలమంత్రియు అనుకూలమిత్రుఁడు నగురామయామాత్య తోడరమల్లు తన 'స్వరమేళకళానిధి' యను గ్రంథమున నుదాహరించిన విషయము బహుశః ఈకాలమునె దెలుపు నఁట.

అతఁడు తనమంత్రి చేవినిర్మితమైన 'రత్నకూట' మను రాజభవనము గలిగియుండెను. దేవతాభవన మగు వైజయంతమును మించి నిర్మింపఁబడుటచేత నాతని కాశ్చర్యమును గొల్పుచుండె నఁట ! ఈరాజభవనము హంసలతోఁగూడి చల్లనైనసలిలసరస్సులనుగలిగి చిత్రప్రతిమలచే నలంకరింపఁబడినట్టి విశాలములయిన యారామములతోఁ జుట్టుకొనఁబడియుండె నట.

ఈకాలముననే 1559 రామరాయలు రాజ్యాంగవ్యవహారముల నన్నిటిని తనసోదరుల కప్పగించి తాను సంగీతసాహిత్యగోష్ఠిలో నుండె నఁట.

"ఈరత్నకూట భవనమున నాసీనుఁడై యుండి సంగీతసాహిత్యాదివిద్యలం దాఱితేఱిన పండితులతోఁ దనకాలమును

వినియోగించుచుండెనని రామయామాత్యుఁడు నుడువుచున్నాఁడు. రామరాయలు సంగీతమునందును వీణావాద్యమునందును నత్యంతాభిలాషకలవాఁడని 1589 నాటి రెండవవేంకటపతిరాయల శాసనము దెలుపుచున్నదఁట. మఱియు నీకాలమున నేకాఁబోలు తనగురువును శ్రీనివాసార్యుని పుత్రుఁడు నగుతాతాచార్యులతో చంద్రగిరిదుర్గమునకుఁ బోయితనవిరామకాలమును శాస్త్రార్థచర్చల నాలించుటయం దంకితముచేసి యుండు నఁట. విరామకాలమునందుఁ గడపినయీ కడపటిసంవత్సరము లోకశతాబ్దముదాటినవెనుక 'మనుస్సి' వ్రాసిన తన 'Memoirs' అను గ్రంథమున నుదాహరించి యున్నవాఁడఁట!"

ఈవిభాగమైనవెనుక దొరతనమువిషయమైగాని మఱియేవిషయమైగాని యేమిజరుగుచున్నను జోక్యముకలిగించుకొనక సుఖతరమైనజీవితమును గడపె ననియాతఁడు వ్రాసియున్నాఁడఁట! తల్లికోటయుద్ధమునకుఁ బూర్వపు దినములలో సర్వాధికారముగల మంత్రిత్వ పదవియు, రాజ్యాంగమును తిరుమలరాయలహస్తగతము గావింపఁబడె నట. ఇతఁ డిట్టిపదవికివచ్చుటచేత కొండవీటిరాజ్యప్రతినిధిప్రభుత్వపదవి రామయామాత్యునికి బహుశః సమర్పింపఁబడియుండు నట. ఈనూతన ప్రభుత్వపరిణామము నందువేంకటాద్రి సకలసామ్రాజ్యపై న్యాధిపత్య మందుంచఁబడె నఁట.

ఈపై విషయములను వ్రాయుచు హీరాసు మరలతల క్రిందుగ బోల్తా కొట్టుచున్నాఁడు.

స్వరమేళకళానిధి గ్రంథము రచింపఁబడినది 1559 గాక 1549 అయి యున్నది. ఈసంగతియందే తెలుపఁబడి యున్నది. (1)

"శ్లో. శాకేనాత్ర ధరాధరాబ్ధిధరణీగణ్యే చసాధారణే
వర్షే శ్రావణమాసినిర్మలతరేపక్షే దశమ్యాంతిథౌ
రామామాత్యవినిర్మితస్వరదళోద్భూతరత్నాకరాత్
సోయం మేళకళానిధిర్మతిమతామాకల్పమాకల్పితాన్."

అనుశ్లోకము గ్రంథముచివరను జేర్చఁబడి యున్నది.

సదాశివదేవరాయలు పట్టాభిషిక్తుఁ డయినవెనుక నేఁడె నిమిది సంవత్సరములలోపలనే స్వరమేళకళానిధి ప్రారంభింపఁబడి 1549 లో ముగింపఁబడియుండఁగా మఱిపదిసంవత్సరములతరువాతనే రచింపఁబడినట్టు తలంచుచున్నాఁడు. వైజయంతమును మించినసౌధరాజ మనివర్ణింపఁబడిన రత్నకూటము 1549 సంవత్సరమునకుఁబూర్వమె రామయామాత్యునిచే నిర్మింపఁ బడినది. అంతకుఁబూర్వమె రామయామాత్యుఁడు కొండవీటిరాజ్యమునకుఁ బాలకుఁడుగా నియమింపఁబడి బ్రాహ్మణులకు నగ్రహారము లొసఁగుట కధికార మీయఁబడినవాఁడు గావున నందుకుఁ దనకృతజ్ఞతను జూపుటకుగాను సంగీతశాస్త్రమునందు వివాదాస్పదములుగా నుండువానివిషయమైయొక

(1) Sources of Vijianagar History p. 190

సంగీతశాస్త్రగ్రంథమును 'స్వరమేళకళానిధి' యనుపేరిట రచించి రామరాయల కంకితము చేయుటకు నిశ్చయించుకొంటి ననియాగ్రంథమునందే వక్కాణించి యున్నాఁడు. ఇయ్యదిరామరాయలు తనసామ్రాజ్యపరిపాలనమును ముగించి విశ్రాంతి గైకొన్నకాలముగా దనిస్పష్టముగా నాగ్రంథమె తెలుపుచున్నది. సత్యమిట్లుండఁగా సమస్తసామ్రాజ్య పరిపాలనాభారము నంతయుసోదరులభుజములపైనిడి రామరాయలు 1559 నుండి విశ్రాంతిగైకొని పండితగోష్ఠితోఁ గాలము గడపెనని యొకమూలవ్రాయుచు మఱియొకమూల 1563 లో దురాశాప్రేరితుఁడై రాజ్యమాక్రమించి పట్టాభిషిక్తుఁడై తానేచక్రవర్తిగాఁ బ్రవర్తించె ననుట యెంతహాస్యాస్పదమై యుండెనో చదువరులె గ్రహింపఁగలరు. ఇట్టిదురభిప్రాయములను ప్రకటించుట నాఁటి హిందూసామ్రాజ్యసంరక్షణకొఱకు రామరాయాదులవలంబించిన ప్రాచీనసంప్రదాయపద్ధతులమార్గ మెఱుంగని విదేశీయుఁ డగుటయే ముఖ్యకారణముగా గ్రహింప దగియుండును. ఇవన్నియు హీరాసుస్వకపోల కల్పనలేగాని యిందెంతమాత్రమును సత్యముగానరాదు. రామరాయలు సదాశివదేవరాయని నెన్నఁడును జెఱసాలం ద్రోచి యుండలేదు. సామ్రాజ్యములోపలను వెలుపలను సామ్రాజ్య శత్రువులు బలిసియుండుటచేత చక్రవర్తిని గాపాడుకొనుట తనకు విధ్యుక్తధర్మ మనుకొనియె రామరాయలు తనప్రాణ మున్నంతవఱకు భద్రముగాఁ గాపాడుకొనుచు వచ్చినాఁడు. ధర్మరాజు

నకు భీమార్జును లట్లు రామరాయలకు తిరుమలరాజును వేంకటాద్రియు భక్తివిశ్వాసములతో సామ్రాజ్యసంరక్షణము నందుఁ దోడ్పడుచువచ్చిరేగాని యెన్నఁడు నాతనిధిక్కరించి యుద్ధములు సలుపుటకుఁ బ్రయత్నించి యుండలేదనుట సత్యము.

# ఐదవప్రకరణము

## విఠలునిదక్షిణదేశదండయాత్ర.

సదాశివదేవరాయునికిఁ బూర్వము విజయనగరసామ్రాజ్యమును బరిపాలించిన యచ్యుతదేవరాయలు జయించినది మొదలుకొని తిరువడిరాజ్యము (Travancore) విజయనగరసామ్రాజ్యమునకుఁ గప్పముగట్టుచుండెను. 1541 సంవత్సరమున నచ్యుతదేవరాయలు మరణముఁ జెందుటయును, విజయనగరమున సలకముతిమ్మరాజు రాజ్యము నపహరించుటకుఁ బ్రయత్నించుటయు నేతన్మాలమున సంభవించిన విప్లవమును బురస్కరించుకొనియుఁ దిరువడిరాజ్యమును బరిపాలించుచున్న 'ఉన్ని కేరళవర్మ' యను నామాంతరము గలభూతలవీరశ్రీవీరకేరళవర్మ యను రాజు కప్పమును గట్టుట మానుకొనియెను. అదియునుంగాక యాకాలమున విజయనగరసామ్రాజ్యసామంతనృపతులలో నొక్కఁడగువిశ్వనాథ నాయకుఁడు మధురాపురము రాజధానిగాఁ బాండ్యమండలమును బరిపాలించుచుండెను. ఈతనిపరిపాలనమునకు లోఁబడి తెంకాశి రాజధానిగాఁ దిన్నెవెల్లిసీమను బరిపాలించు పంచపాండ్యులనువా రాతనికి శత్రువులై యలజడి కలిగించు చుండిరి. మఱియుఁ దూర్పుసముద్రతీరమున సముద్రమునుండి ముత్తెపు

చిప్పలను దేవి తెచ్చుట కులవృత్తిగాఁ గలపరవజాతివారు లబ్బె లతో విరోధము పెట్టుకొనిరి. మధురనాయకుఁడు లబ్బెలపక్ష మునవుండుటచేత పరవజాతివారాకాలమున దక్షిణదేశమునకుఁ జేరిన పోర్చుగీసువారి యండఁజేరి క్రైస్తవమతము నవలంబించి మహమ్మదుమత మవలంబించిన లబ్బెలతో జరుగుపో రాటములందు పోర్చుగీసువారి తోడ్పాటును బొందుచు మధు రనాయకుని నలక్ష్యభావముతోఁ జూచుటయెగాక పాండ్య దేశమునఁ గలవరము పుట్టించు చుండిరి. ఇంతియగాక మొద టవచ్చిన ఫ్రాన్సిస్కాను క్రైస్తవ సన్యాసులును, జెస్యూటు క్రైస్తవ సన్యాసులును హిందూదేవాలయములను బగులఁ గొట్టి క్రైస్తవ దేవాలయముల గట్టుటకుఁ బ్రారంభించిరి. ఇందు మొదటివారు సెంటుథోము (మైలాపురము) నందును నా గూరు నాగపట్టణమునందును గట్టించిరి. 1542 వ సంవత్స రములో నిట్టి క్రైస్తవాలయములు నాగపట్టణమునంధు రెండు నిర్మింపఁ బడినవి. ఆసంవత్సరమున మూఁడువేలమంది కాథ లిక్కుమతము స్వీకరించిరి. ఈపరవజాతివారు క్రైస్తవుల యినది మొదలుకొని హిందూప్రభువయిన విశ్వనాథనాయ కునిక్ లొంగియుండక కప్పముగట్ట నిరాకరించిరి. విజాతీయు లయినపోర్చుగీసువారి సాహాయ్య ముండుటవలన వారిని వశ్యు లనుగాఁ జేసికొనుట సాధ్యముగాక యాతఁడు విజయనగర

సామ్రాజ్యాధీశ్వరులకు విజ్ఞప్తి పంపించుకొనియెను. అప్పుడు రామరాయలు దక్షిణదేశమున సామ్రాజ్యము బలపడునట్లుగా జేయు టత్యావశ్యక మయినదిగా భావించి పెనుగొండరాజ్యమును బరిపాలించుటకై నియమింపఁబడీన విఠలరాయలను దనపెదతండ్రి (అ.ప్రకుతిమ్మరాజు) కుమారుని సైన్యాధ్యక్షునిగాను చంద్రగిరిరాజ్యమును బాలించుటకు నియమింపఁబడిన వానితమ్ముని చినతిమ్మరాజు నుపసేనాధ్యక్షునిగను నియమించి కొంతిసైన్యముతో దక్షిణదేశమునకుఁ బంపెను. అప్రపరాక్రమవంతు లగునీయిద్వరుసోదరులును విజయనగర సైన్యములతో దండయాత్ర సాగించి యాసంవత్సరము జూలయిమాసారంభమున దక్షిణమధురాపురమును జేరుకొనిరి. పాండ్యమండలాధీశ్వరుఁ డయినవిశ్వనాథ నాయకుఁడు వారలకు భక్తిపూర్వకమైన స్వాగతము నొసంగి తానుగూడ గొంతసైన్యము నొసంగుటయెగాక తనకుమారుఁ డైనకృష్ణప్పనాయకుని వారికిఁ దోడుగా నొసంగెను వీరికి ఇక్కేటినాయకుఁడయిన సదాశివప్పనాయకుఁడు గూడఁ దోడ్పడియెను. వీరు తొలుదొల్తఁ దిరువడిరాజ్యముపై దండయాత్ర వెడలుటకు నిశ్చయించుకొని స్వసైన్యములతో బయలుదేఱి 'ఆఱవామొటి' (Arawboly) యను కనమమార్గమునఁ దిరువడిరాజ్యములోఁ బ్రవేశించి జయభేరి మ్రోగింపఁ జేసిరి. ఇట్లు విజయనగరసైన్యములు తమరాజ్యముపై దండెత్తివచ్చిన వను వార్త తిరువడిరాజ్యము నందంతటవ్యాపించి. యారాజ్యము

లోని ప్రజలను భయకంపితులను గావించెను. ఉణ్ణికేరళవర్మ యీభయంకర మైనవార్తను విని కొంతసైన్యమును సమకూర్చెను గాని యాసైన్యము తెలుగుసైన్యములముందు దివిటీ ముందు దీపమువలె నుండెను. విజయనగరసైన్యములు యుద్ధముల యందాఱితేఱినవిగ నుండెను. తిరువడిరాజ్యాధిపతి విజయనగర సైన్యములను జయించుట కష్టసాధ్య మనియెంచి "ఫ్రాన్సిస్‌గ్జేవియర్" అను ఫాదిరిద్వారా పోర్చుగీసువారితో నొడఁబడిక చేసికొని వారిసాహాయ్యమును బడసి విజయనగరసామ్రాజ్యాధి పత్యమును ధిక్కరింపఁ బ్రయత్నించెను. ఫాదిరి ఫ్రాన్సిస్‌గ్జేవియరును రప్పించుకొని యాతని సాహాయ్యమునకై వేడుకొనఁగా నాతఁ డిట్లు ప్రత్యుత్తర మిచ్చె నఁట !

"నేను మతప్రచారకుఁడనేదాని యోధుఁడనుగాను. నేనుచేయు సాహాయ్య మంతయు నీకువిజయము కలుగుటకై ప్రార్థనలు సేయుటతప్ప మఱియొండు లేదు."

అయిన నతఁ డిట్లుతనవాగ్దత్త మీక్రింది విధముగా నెఱవేర్చు కొనియె నఁట !

అట్లు విజయప్రదము లగుశంఖారావములతోను, జయభేరి ధ్వనులతోను విజయనగర సైన్యములు 'కొట్టా' లను గ్రామమును సమీపించునప్పటికి మున్ముందుగ నడచుచున్న ముంగటిసేన యాకస్మికముగా నిలిచిపోవుట చూచి వెనుకనున్నవారు సైనికుల 'నడువుం' డని యాజ్ఞాపించినను

వారు కాళ్లు కదల్పలేకపోయి రట. అంతటవారికిఁ గారణము దెలియ వచ్చెనఁట ! నల్లనిమస్తులనుధరించి గాంభీర్యతను గన్ప ఱచెడు నొకమహానుభావుఁడు మాయెదుట ప్రత్యక్షమై మమ్ము చీవాట్లుపెట్టి తక్షణమె మరలిపొండని పలికె ననివారు చెప్పిరఁట ! అప్పుడు సేనాధిపతులు, అందుముఖ్యముగా విఠలరాయలు మొదలగువారువచ్చి రాజధానికిఁ బోకుండ దారి నడ్డగించినఫాదిరి ఫ్రాన్సిస్ గ్జేవియరుయొక్క యాగాంభీర్య దృశ్యమును గాంచి వారుచెప్పిన దంతయు సత్యమేయని భావించి రఁట. అటువంటిమహాపురుషుని నోటనుండి వచ్చిన యుత్తరువు నాపరాక్రమవంతుఁ డయినమహాశూరుఁ డెట్లతిక్రమింపఁగలఁడు? వెంటనే సైన్యముల వెనుదీయుఁ డనియాజ్ఞాపించె నఁట ! ఈ ప్రకారముగా గ్జేవియరు తన ప్రార్థనలమూలమునను కోరికమూలమునను విజయనగరసైన్యముల దండయాత్రనుండి తిరువడిరాజ్యమును సంరక్షించె నఁట ! (1)

ఇయ్యవి పోర్చుగీసుఫాదిరీల దంభోక్తులు ! వీనిని విశ్వసించి హీరాసుఫాదిరి తనగ్రంథమున నెంతోగౌరవ భావముతో నెక్కించి పయిగ్జేవియరుగారిమహిమ నంతయు లోకమునకుఁ బ్రదర్శింపు చున్నారు. విజయనగర సేనాపతులెల్లరును మహావీరులుగాని యజ్ఞగుడ్డను జూచి బెదరి పాఱి పోవు పసరముల వంటివారు కారు. ఇయ్యదివట్టి యసత్యకల్పనమని నిస్సంశయముగా నుడువ వచ్చును. ఇంతకు నీఫాదిరి

---

(1) The Aravidu Dynasty of Vijianagar, p. 143–144

గ్వెవియరు తనజాబులలో నెచ్చటను నీమహత్తర విషయము నుగూర్చి యొక్కమాటయైన వ్రాసి యుండలేదట! అయిన నిదియెంతవిపరీతముగాఁ గన్పట్టినను నిష్పక్షపాత మైనట్టియు, విమర్శాపూర్వక మైనట్టియు చరిత్రముకా దనితిరస్కరింపఁజాల దఁట! ఇందలిసత్య మేమనఁ దిరువడిరాజ్యాధిపతి యైన 'ఉన్ని కేరళవర్మను' వశ్యునిఁజేసికొని ఫాదిరి ఫ్రాన్సిస్ గ్జేవియరే వానిని గప్పము గట్టకుండవిజయనగర సామ్రాజ్యము నెదుర్కొనఁ జేసి యుండవలయును. ఉన్నికేరలవర్మకు నీఫాదిరి యత్యంత మిత్త్రుఁ డుగానుండి యుండెను. ఈపోర్చుగీసుఫాదిరీలు కొందఱు విజయ నగరసామ్రాజ్యమునకు గర్భశత్రువులుగానుండి రనికొందఱి వ్రాఁతలవలన స్పష్టపడఁ గలదు. వీరిదుర్బోధనలను వినియు, వీరిసాహాయ్యమును నమ్ముకొనియుఁ బరవజాతివారు సుఖ ముగా నున్నతమస్థితిని జెఱచుకొని యాకాలమున విజయన గరసామ్రాజ్యము నెదుర్కొని కష్టములపాలయిరి. ఈయు ద్ధములలో విజయనగరసైన్యము లెచ్చటను నపజయముఁ బొందియుండలేదని స్పష్టముగా వక్కాణించుటకుఁ దగినయా ధారములు లేకపోలేదు. 1547 వ సంవత్సరమున (శా. శ. ౧౪౬౯ ప్లవంగనామసంవత్సరము) ద్విపదబాలభాగవత మును దోనూరికోనేరునాథకవి రచించి యీదండయాత్రలో నుండి విజయము గాంచినయారవీటిచినతిమ్మరాజున కంకితము గావించెను. ఈకవి యీమహావీరునితోఁ గూడ నుండినవాఁ డగుటచేతనే యీదండయాత్రాసందర్భమున చినతిమ్మరాజు

పొందినవిజయములను, చేసినఘనకార్యములను సంవర్ణించి యున్నాఁడు.

" నిలిచి వెంటాడి తానెమ్మెలుదిరుగు
ఖలశత్రురాజమృగశ్రేణి శిఖాద
శ్రీరంగనాథుని సిరినిల్పఁ జేసి
తారసి పలుదుర్మదాంధుల నణచి
నాగూరు గైకొని నవమౌక్తికములఁ
ద్యాగంబుఁ బెట్టితి తనియ నర్థులకు
పరమత లగ్గలు వట్టించి బోన
గిరిఁ గొంటి వృష్టాంగికీర్తిదై వార
తలఁచినయంతలో దన్నరుసునాట
గలమహీపతులచే గప్పంబు గొంటి
శరణన్న యాపాండ్యజననాథు రాజ్య
పరినిష్ఠితుని జేసి పాలించిఁ రక్షి
బెడిదంబు గలబెట్టుపెరుమాళిమదము
ముడిగించి తెలుగోలుమూకలచేత
పంచతిరుపతుల దర్పంబుల చెరిచి
పంచబంగాళమై పరగంగఁ జేసి
శరణన్న తిరుపతి జక్కఁగా నిలిపి
తరుదుగామున్నటియట్ల రాజ్యమున
తోవాళఘట్టాఖ్య దుర్గంబు దాటి
సావిజేరియనంతశయను సేవించి

అక్షీణగతి నిల్పి తాకన్నె కుమరి
దక్షిణాశాజయ స్తంభంబు మెఱయ
రణసమాగమ వైరి రాజశార్దూల
గణకంఠనవర క్తకణసిక్తమైన
యడిదంబు గడిగితి వంబోధిలోన

* * * *

ఈ చినతిమ్మరాజేంద్రచంద్రముని
రాచర్కమేటికిఁ బ్రణుతింపఁదరమె
ధీరులు కేరళతిరువడిపాండ్య
చేర-చోళాధికక్షితినాధవరులు

* * * *

తెలివిమీరఁగజినతిమ్మభూపాలు
కొలువువేళలఁగాచుకొనియుందురర్థి
శ్రీరాఘవుఁడుదక్షిణదిగంతమున
నారూఢియున్నశౌర్యముపెంపునెఱపి
పౌలస్త్యులంకలో పట్టంబు గట్టి
యాలీల నిల్పలే దయ్యె దిరువడిని
పదపడి యారామభద్రుఁడే తనదు
కొదువ దీర్చుటకునై గొబ్బున మరల
చినతిమ్మనృపతియై సిరిమించఁ బుట్టి
ఘనత నిద్దిశయెల్ల గ్రమ్మర గెలిచి

బలిమిమై దిరువడి బట్టంబు గట్టె

* * * *

కృతకృత్యునకు చంద్రగిరి దుర్గముఖ్య
వితతమహైశ్వర్యవిలసితాత్మునకు

* * * *

తిరువడిరాజ్యప్రతిష్ఠాపకునకు
విరచితపాండ్యభూవిభుశాసనునకు
చేరచోళాదికక్షితినాథమకుట
హీరనీరాజనహృద్యపాదునకు."

* * * *

తిరువడిరాజ్యము పంచతిరుపతు లనుపేరుతో నైదు భాగములుగా నుండె ననియు, వానినెల్లను జయించి కన్యాకుమారికడ జయస్తంభము పెట్టించె ననియు, తిరువడిరాజ్యమును జయించియు నారాజు శరణాగతుఁ డగుటచేతమరల నారాజ్య మతనికి నొసంగి తిరువడిరాజ్యప్రతిష్ఠాపకుఁ డన్నబిరుదము గాంచినట్టు పైకవి వర్ణించి యున్నాఁడు. (1) (2)

ఈచినతిమ్మరాజుకడఁ గొంతకాల మాస్థానపండితుఁడుగా నుండినమహామహోపాధ్యాయబిరుదాంచితులగు నప్పయ్యదీక్షితులవారు సయితము తనప్రభువుకోరిక ననుసరించి

(1) భారతిసంపుటము ౬ సంచిక ౬ పేజీలు ౭౬౦, ౭౬౧, ౭౬౨, ౭౬౩.

(2) Sources of Vijianagar p. 207, 208, 209.

యాదవాభ్యుదయ మను కావ్యమునకు వ్యాఖ్యరచించి యందుఁ దనప్రభువు వంశమును బ్రశంసించి యాతఁడు తనవిజయము లనుసూచించుటకుగాను మలయాద్రి (తిన్నెవెల్లి, ట్రావన్కూరు మండలములలోని పడమటికనుమలు) సమీపమున జయస్తంభమును నెలకొల్పె నని వక్కాణించి యున్నాఁడు. (1) ఇక్కేరి నాయకుఁ డయినసదాశివనాయకుఁడుగూడ చక్రవర్తియాజ్ఞను శిరసావహించి కేరళముపై దండెత్తిపోయి విజయమునుగాంచి జయస్తంభమును నాటించె నని శివతత్త్వరత్నాకర మనుగ్రంథమున వర్ణింపఁ బడియుండెను. (2)

ఈశివతత్త్వరత్నాకర మనుగ్రంథము మఱియొకగొప్ప సత్యమును వెల్లడించు చున్నది. కృష్ణదేవరాయలకాలమునుండి విజయనగర సామ్రాజ్యమునకు మిత్రులుగా నుండినపోర్చుగీసువారు సదాశివదేవరాయని పట్టాభిషేక కాలమునుండి బిజాపురసుల్తానుతోడిమైత్రివలననో లేక స్వప్రయోజనముకొఱకో సామ్రాజ్యముతోడి సఖ్యతను విడనాడి శత్రువులుగ నేర్పడి దక్షిణదేశమునందలి సామంతనృపతులను గప్పము కట్టకుండఁ జేసి సామ్రాజ్యమును భగ్నపఱచుటకై పన్నాగములు పన్నుచు విశ్వప్రయత్నములు చేసియున్నట్టు మన మూహించుటకుఁ దగినప్రమాణములు గలవు.

---

(1) Sources of Vijianagar, p. 210.

(2) I bid, p. 195, 200.

ఇక్కేరి నాయకుఁ డయిన సదాశివనాయకుని కుమారుఁడు దొడ్డసంకణ్ణనాయకుఁడు జంబూరదేశపాలకుఁ డగు విఠ్ఠపణ్ణనాయకుఁడు సామ్రాజ్యమునకుఁ జెల్లింపవలసిన కప్పమును చెల్లింపక శత్రుత్వమును వహించుటను సహింపఁజాలక వానిపై దండెత్తి వానినోడించి ఖైదిగాఁ బట్టుకొని చక్రవర్తికి నొప్పగించెను. అందుకు సంతోషించి రామరాయలు వానిరాజ్యమును వానిసోదరుని కప్పగించి వానిని దనకొల్వుకూటమున రాజధానీనగరమున నుండ నియమించెను. అతని యాజ్ఞకు బద్ధుఁడై యతఁ డట్లు గావించెను. అతనికొక్క కుమారుఁడు కలుగఁగా నాతనికి రామరా జనిపేరు పెట్టెనఁట. అళియరామరాయలు తనపేరు వానికుమారునకుఁ బెట్టుటకు సంతోషించి వానిరాజభక్తినిమెచ్చి హాలాశెహోన్నూరు, మాంశూరు, బేళమల్లూరును వానిపాలనమునకుఁ జేర్పించుటయే గాక యాతనినాతనిరాజ్యమునకుఁ బంపివేసెను. కాని పోర్చుగీసువారికిని సామ్రాజ్యమునకు వైరములు పొసఁగినందున నత్యల్పకాలములోనే వానిని సామ్రాజ్యసంరక్షణసేవకై మరల రప్పించి వానిని వానిసైన్యములను విఠలరాయనికిఁ దోడుగా నుండున ట్లుత్తరు విచ్చివారలనిర్వురను గోవానగరమునందలి పోర్చుగీసువారిని జయించుటకై పంపెను. వారలిర్వురును గోవానగరముపై దండెత్తిపోయి యుద్ధములో వారినోడించుటయెగాక గోవాగవర్నరును బంధీకృతుని గావించి చక్రవర్తికొల్వుకూటమునకుఁ గొనివచ్చిరి. విఠలరాయనికిఁ

దోడ్పడి యిట్టిమహాకార్యమును నిర్వహించినందుకు సంతోషించి చక్రవర్తివానికి మహాదేవపురమును బహుమానముగా నొసంగెను. ఈవృత్తాంతము శివతత్త్వరత్నాకరమునఁ దెలుపఁబడినది. *

విఠ్ఠలరాయలు వేంకటాద్రివంటిమహాయోధుఁడుగాని సామాన్యుఁడు గాఁడు. అప్రతిమాన ప్రతాపాఢ్యుఁడు. ఇతఁడు కృష్ణదేవరాయల పూర్వదిగ్విజయయాత్రలోఁ బాల్గొనియుండినవాఁ డగుటచే నప్పటినుండియు సామ్రాజ్యమున వన్నెగాంచిన యోధులలో నొక్కఁడుగా నుండెను. ఇతఁడు రామరాయలకుఁ బెదతండ్రి కుమారుఁ డగుటచేత వారలతో సమానవయస్సుగలవాఁ డయియుండు ననుటకుసంశయింపఁ బనిలేదు. ఇతఁ డట్టివాఁడగుటచేతనే దోనూరికోనేరునాథకవి తనపద్యబాలభాగవతమున నిట్లభివర్ణించి యున్నవాఁడు.

---

* "సచప్రాప్యానుజాభ్యాశం తేనసాకమవర్తత|
అనంతరంపరంజైషసార్వభౌమవిరోధిషు||
పునరేవసమానాయ్య మేశయిత్వానుచేతనమ్|
నామ్నా విఠ్ఠలరాజేనయాపయామాసతాన్ప్రతి||
తతస్తాన్వైరిణో రాజాగోవాదేశనివాసినః|
పరాభవకాన్సార్వభౌమాఽనుజేనసహసజ్జితః||
తతోగోవాపురాధీశంతస్మైజిత్వార్పయత్యతి|
అస్మిన్ప్రముదితఃప్రాదాన్మహాదేవపురస్థలమ్||"

(శివతత్త్వరత్నాకరమ్)

Sources of Vijianagar History, p. 340.

" సీ. కటకాఖ్యకటకస్థకరటిరాడ్గజఘటా
సంభూతమదభరస్తంభకంబు,
పాండ్యభూమీభృత్సభాసభాజితభటో
ద్భటభుజాబలగర్వభంజకంబు,
మఖ్ఖామహాదుర్గతుఖ్ఖారపతివపు
స్థాయివేపథుసముద్ధానదంబు,
ఢిల్లీపురాధీశపల్లవోష్ఠీభావి
విప్రలాభకదాభయప్రదంబు,
రామనరనాథతిమ్మభూరమణపుత్ర
విఠలేశాభిధానపృథ్వీకళత్ర
ధాటికారంభసంభ్రమధ్వనితపటహ
గణసముత్థితధణధణంధణరవంబు "

ఇటువంటిమహాపరాక్రమశాలి యని వెంటంగియే యళియరామరాయలీకార్యభారము నంతయు నీతనిపైఁ బెట్టి తానును తనసోదరులును దక్కనుసుల్తానులతో నుత్తరదేశమున నాకాలమునఁ బోరాడుచుఁ దనరాజనీతిచాకచక్యత నంతయును గనుబఱచఁగలైను. విజయనగరసామ్రాజ్యమునకును పోర్చుగీసు వారికి మనస్పర్ధలు విరోధము లున్నట్లుచూపున దీగ్రంథమొక్కటియె గాదు. ఇయ్యది హిందూపక్షమును దెలుపుప్రమాణగ్రంథము. విఠలుఁడుదక్షిణదేశములో దండయాత్రలునడపుచుఁ దిరువడిరాజ్యాధిపతితోను పోర్చుగీసువారిసాహాయ్యమునఁబడసినపరవజాతివారితోను, తదితరసామంతశత్రువర్గము

తోడను బోరాడుచున్నకాలమున ననఁగా 1544 సంవత్సర
మున గోవాగవర్నరుగా నున్న 'మార్టిమ్అఫ్ఫానోన్సిడిసౌజా'
అనునాతఁడు తిరుమలదేవస్థానమున దేవుని విగ్రహము క్రిం
దను బంగారము ధనము విశేషముగా స్థాపితమై యున్న దని
తెలిసికొని దాని నపహరించుటకై ౪౫ యుద్ధనావలను ౨౭
గురుకెప్టనుల యధికారమున నుండువానిని సిద్ధముగావించి
పూర్వతీరమునకుఁ బంపుటకై ప్రయత్నించె నని ఫెరియాయి-
సౌజా వ్రాసియుండె నని హీరాసుఫాదిరిమె తెలిపి యున్నాఁడు.
కాని వీరిప్రయత్నము సఫలీకృతముకాక మఱియొకవిధముగాఁ
బరిణమించిన దట ! ఈవార్త యళియరామరాయలకుఁ దెలియ
వచ్చి నందున నాతఁడు దానికిం దగినరక్షకసైన్యమును వెం
టనే పంపియుండె నన్నవార్త గోవాగవర్నరునకుఁ దెలియ
వచ్చెనఁట. అందుచే నాతఁ డాప్రయత్నమును విడిచి యా
నావికాబలమును తిరువడిరాజ్యమునకుఁ బంపఁగా వారారాజ్య
ములోనిదేవాలయములను దోఁచుకొని రఁట ! ఇట్లని కోరియా
దెలుపు చున్నట్టుహీరాసుఫాదిరియే తన గ్రంథమున వక్కా
ణించి యున్నాఁడు. ఇప్పుడు విఠలుఁడు గోవానగరముపై దం
డయాత్ర సాగింపవలసివచ్చినకారణమును చదువరులు
చక్కఁగా గ్రహింపఁ గలరు. శివతత్త్వరత్నాకరమునఁ జెప్పఁ
బడినవృత్తాంత మసత్య మనుటసమంజసముగాఁ గన్పట్టదు.
ఇక్కడ చదువరులకు మఱియొకశంక కలుగవచ్చును. తిరువడి
రాజ్యాధిపతి తమకుమిత్రుఁ డైయున్నపుడు వీరేల యిట్టిదా

ష్ట్రమునకుఁ బూనుకొనవలసి వచ్చెను? ఆకారణము గూడ
స్పష్టపడఁ గలదు. ఉన్ని కేరళవర్మ విఠ్ఠలునకు స్వాధీనుఁడు గాక
పోర్చుగీసుఫాదిరీలయండను జేరియున్నను తిరువడిరాజ్యము సం
పూర్ణముగా జయింపఁబడినతరువాత మూఁడుసంవత్సరముల
కాలము, విజయనగరసేనానులవశమై యున్న దనియే
యూహింపవలసి యుండును. ఆకారణముచేతనే పోర్చుగీసువా
రారాజ్యములోని దేవాలయములను కొల్లగొనుట సంభవించినది.
ఈవిపత్తునుండి దేశము నుద్ధరించుటకై 1545 సంవత్సరాంత
మునందో ప్రారంభమునందో చక్రవర్తియాజ్ఞానుసారము విఠ్ఠలుఁడు
గోవానగరముపై దొడ్డసంకన్ననాయకునితోడ్పాటుతో దండెత్తి
పోయియుండును. అట్లు వెడలునపుడు దక్షిణదేశము నంతయుఁ
బరిపాలించుభారము తనతమ్ముఁడయినచిన్నతిమ్మరాజుపైఁ బెట్టి
యుండును. ఆదండయాత్ర విఠ్ఠలున కనుకూలముగాఁ బర్యవ
సించినందువలనను గోవాగవర్నరు ఖైదిగాఁ బట్టువడినందువల
నను పోర్చుగీసువారు 1546 సంవత్సరము ఫిబ్రవరినెలలో సంధి
చేసికొనవలసివచ్చినది. ఉన్ని కేరళవర్మయు, అతనిమిత్రుఁ డయిన
ఫాదిరి ఫ్రాన్సిస్ గ్జేవియరును విఠ్ఠలునితో సంధిచేసికొనవలయు
నని యెంత ప్రయత్నించినను వీరు చెప్పినపద్ధతులకు నాతఁ డొప్పు
కొనకపోవుటకుఁ గారణము పోర్చుగీసుఫాదిరీలదుస్తంత్రమార్గ
ములేగాని యన్యములు గావు. తుదకు సంధికార్యము నెఱవే
ఱుటకుఁ బూర్వమె ఉన్ని కేరళవర్మ మృతినొందుట సంభవించి
నది. తుదకు గత్యంతరము లేక వానికుమారుఁడు విఠ్ఠలుని

శరణు వేఁడఁగా నాతఁడు సంధి కొప్పుకొనియెను. ఈసంధికా
ర్యము 1545 సంవత్సరములో జరిగియుండు నని నాయభి
ప్రాయము. తుదకు ఫలితమేమనఁగా తిరువడిరాజ్యాధిపతి
యైనరామవర్మ తిరువడిదేశము (తిన్నెవెల్లిమండలము) విజయ
నగరసామ్రాజ్యమున కొసంగుటకును, ఎప్పటివలెఁ దాను బ్రతి
సంవత్సరము సామ్రాజ్యమునకుఁ గప్పము చెల్లించుటకును,
ఇఁకముందెన్నఁడు విజయనగరమువారు తిరువడిరాజ్యముపై దండ
యాత్ర నెఱపి యలజడి పుట్టింప కుండుటకును నొప్పుకొని
తానుస్వయముగా తిన్నెవెల్లికి వెళ్లి విఠలునిసమ్ముఖమ్మున సంధి
పత్రముపై సంతకము చేయవలసివచ్చినది. ఇయ్యది తిరువడి
రాజ్యము పోర్చుగీసువారియండను జేపట్టి సామ్రాజ్యాధికార
మును ధిక్కరించుటవలన గలిగినఫలితము. ఇయ్యదియె యీర
వీటిచినతిమ్మరాజును తిరువడిరాజ్యప్రతిష్ఠాపకుఁ డనిద్విపద
బాలభాగవతము వర్ణించుటకు ముఖ్యకారణము. తిరువడి
రాజ్యము సామ్రాజ్యసైన్యములచే సంపూర్ణముగా జయిం
పఁబడక యున్ననిట్టిసంధి కొడంబడుట యెట్లుసంభవించును?
కావునఫాదిరీలవ్రాఁత లన్నియు వట్టియసత్యకల్పనము లని
త్రోసివేయవలసినదే. ఈహీరాసుఫాదిరియె మఱియొకవిపరీత
విషయమును దెలుపుచున్నాఁడు. చూడుఁడు 1558 లో
రామవర్మ తాను చెల్లింపవలసినకప్పము చెల్లింప కుండెనట!
విఠలరాయలు వానినుండి కప్పము గైకొనుటకై యాఱువేల
సైనికులతోఁ దిరువడిరాజ్యముపై మరల దండెత్తి వచ్చెనఁట.

రామవర్మకడ వేయిసైనికులకన్న నెక్కువలే రఁట. ఇంతస్వల్ప సైన్యముతో నాతని నెదుర్కొనఁ జాలక తిరువడిరాజ్యము కొరకై సవమతబోధసంఘమునకుఁ బెద్దయధికారి యగుఫాదిరి ‘ఫెరేజ్’ అనునాయనకడకు నొకదూతను బంపితనసేనకు జయము కలుగునట్లుగా దేవుని బ్రార్థింపవలసినదిగాఁ గోరె నఁట! కాల్కుల మనుప్రదేశమునం దున్నయాఫాదిరి యట్లు చేయుటకు వాగ్దత్తముచేసి యాతఁడొకజెండానడుమ జీసస్సుని నామమును రంగుతో వ్రాయించి దీనిని సైన్యమునకుముం దుంచుకొని యుద్ధముచేయునపుడు జీసస్సునామమును స్మరించు చుండవలసిన దనిచెప్పి యాదూత కిచ్చిపంపె నఁట! అట్లు కావింపఁబడె నఁట! ఈస్మరణఘోష విని తెలుఁగుయోధులు బెగ్గడిలిపోయి పఱువిడఁగా రామవర్మసైనికులు వారిని వెంటా డించి తఱిమి యనేకులను నఱికి వైచి రఁట! ఈజెండారాజు గారిధనాగారమున నుంచఁబడిన దఁట. ఈకథను వ్రాసిన ఫాదిరి సౌజాకథాంతమున నిట్లు వ్రాసె నఁట! “ఈరాజ్య మునుగుఱించి యిఁక నేనేమియుఁ జెప్పఁదలంచుకొనలేదు. ఎందుచేత నన లిఖితపత్రములలో నేమియుఁ నేను గనుపెట్ట లేకుండుటయే.”

ఈవాక్యములను గ్రంథస్థము గావించి హీరాసుఫాదిరి యీదిగువను ‘ట్రావెన్కూరునుండి తనసైన్యముతో వెను దీయునపుడు విఠ్ఠలుఁడు చంపఁ బడెనా?’ యని ప్రశ్నించి

"అదిమే మెఱుంగముగాని హిందూశాసనములలోఁగాని, పాశ్చాత్యచరిత్రలలోగాని యుదాహరింపఁ బడియుండలే దని మెఱుంగుదుము" అని తమకుఁదామే ప్రత్యుత్తర మిచ్చియున్నారు. ఎట్లయిననేమి? ఈ 1558 సంవత్సరముతో నాతని దక్షిణదేశపాలనాధికారప్రభుత్వము తుదముట్టెన దనివకాక్షించిరి. పైకథను వ్రాసినఫాజాగారే 1560 సంవత్సరములో విఠలుఁడు దక్షిణదేశమున నున్నవాఁడని వ్రాసియున్నప్పటికిని యితరపోర్చుగీసుగ్రంథములకు భిన్నముగానుండుటచేత హీరాసుఫాదిరి తానువిశ్వసింపఁ జాలఁ డఁట! (1) ఆహా! ఎట్టి నిష్పక్షపాతమైనచరిత్రమును వ్రాయసమకట్టిరి? ఇట్టికథలు కల్పించి చెప్పెడువారు చెప్పినను వినువారికైన మతు లుండ వని హీరాసుఫాదిరితలంపు గాఁబోలు! ఈవిఠలుఁ డీదండయాత్రలోఁ బొందినజయ మంతవిశేషమైనదిగాకపోయినను రామరాజీయ మనుగ్రంథములో నళియరామరాయలను "కన్యాకుమారీభీమరథీతలాంతనిక్షేపవిజయస్తంభ" యని స్తుతింపఁ బడినాఁ డట! అళియరామరాయలనుగూర్చినయీపొగడ్త లేక యూయనకిచ్చిన యీబిరుదము హీరాసుఫాదిరి వెటకారమున కేలగుటి గావలసివచ్చినదో? స్టైవియరు, ఫెరేజ్ ఫాదిరీలవాక్కుల కారోపింపఁబడినమంత్రశక్తి దీనిలో లేదని వీరితలంపు గాఁబోలు. అళియరామరాయలపేరు చెప్పిన వీరి కింతయసహ

---

The Aravidu Dynasty of Vijianagar, p. 162-163.

హానమెందుకో? హీరాసుఫాదిరియింకొక విచిత్రచరిత్రమును గ్రంథస్థము చేసి యున్నాఁడు.

## — సెంటుథోముపై దండయాత్ర —

అళియరామరాయలజీవితచరిత్రములో 1558 సంవత్సర మత్యంతప్రాముఖ్యత వహించినదిగా నున్నది. ఎందుకన నింతకుఁ బూర్వము రామరాయ లహమ్మదునగరసుల్తానుపక్షము ను వహించి విజాపురసుల్తానుతోఁ బోరాడుచుండు వాఁడు. అట్లుగాక యీసంవత్సరము విజాపురసుల్తానుపక్షము నవలంబించి యహమ్మదునగరము, గోల్కొండసుల్తాను లగుహుస్సేనునిజాముషా, ఇబ్రహీమ్‌కుతుబ్షాలతో ఘోరమైనయుద్ధము చేసి విజయము గాంచినాఁడు. ఈవిషయమును తనగ్రంథమున హీరాసుఫాదిరి తెలిపియే యున్నాఁడు. ఇందలివివరణ మీగ్రంథములోనిమూఁడవప్రకరణమునఁ దెలుపఁ బడినది. కానియీసంవత్సరమే అళియరామరాయ లైదులక్షలసైన్యముతోఁ దూర్పుతీరమున మైలాపురమునకుసమీపమున నున్న 'సెంటుథోము' అనుచిన్నపట్టణముపై దండయాత్ర వెడలెనని హీరాసు వ్రాయుచున్నాఁడు. ఇయ్యది పోర్చుగీసువారి చరిత్రలలోఁ గాన్పించుచున్న దఁట! మహమ్మదీయచరిత్రకారులుగాని హిందూగ్రంథకర్తలుగాని యీదండయాత్రను గూర్చి తెలిపి యుండలేదు.

ఈపోర్చుగీసుకై స్వమతగురువులు చేసినదుండగములను గూర్చి బ్రాహ్మణు లప్పటప్పట రామరాయలకు విజ్ఞప్తులు పంపుచున్నను నాతఁ డుపేక్ష వహించె నఁట! పోర్చుగీసు వారు గుఱ్ఱములవ్యాపారముచేయువర్తకులగుటచేతను, రామ రాయలకు గుఱ్ఱము లత్యావశ్యకములై యుండుటచేతను, వారితోవిరోధముపెట్టుకొనుట కిష్టములేకుండె నఁట! అయినను మహమ్మదుమతస్థు లగుదక్కనుసుల్తానులతో యుద్ధములు జరుపుచుండినవాఁ డగుటవలన నాతనికి ధనము కావలసివచ్చె నఁట! తనదేశమునకును తనమతమునకును ద్రోహియైన యొక పోర్తుగల్ దేశస్థుఁడు దుర్మార్గుఁడై సెంటుథోమునందు నివసించు పోర్చుగీసువారికడ విశేషముగా ద్రవ్యముగలదనియు వారిని ముట్టడించినయెడల వారివలన నిరువదిలక్షలబంగారుపూలవర హాలు లభింపఁ గలవని దండయాత్ర నడపు మని ప్రోత్సహించె నఁట. సామ్రాజ్యసంరక్షణముకొఱకును, దక్కనుసుల్తానులతో యుద్ధములు నడపుటకును ద్రవ్యాపేక్ష కలిగియున్నవాఁ డగుట చేత రామరాయ లాతనిదుస్సలహా నంగీకరించి యైదులక్షల సైన్యముతో సెంటుథోముపై దండెత్తి వచ్చె నఁట! ఫాదిరి హ్లెవియరు తెలిపినదానినిబట్టి సెంటుథోమునందు నివసించుపోర్చు గీసువారు వివాహములు చేసికొన్నవారుకలుపుకొని నూర్గురు కన్న నెక్కువమందిలేరు. 'పిచ్చుకమీఁద బ్రహ్మాస్త్ర' మన్నట్టు వీనిని సాధించుటకై రామరాయ లైదులక్షలసైన్య ముతో దండెత్తవలసివచ్చిన దనిపోర్చుగీసులేఖకులు వ్రాయు

చున్నారు. ఆసమయమున నాపట్టణమున నున్నయొకగోవా
వర్తకుఁడు (వానిజాతివాఁడే) గ్రామములోనిపెద్దలను, నాయ
కులను రప్పించి రాయలకు మందుగుండుసామానుతక్కువ
గనుక రాయలసైన్యము నెదురించుట సాధ్య మనియు నాతని
కంటె వారలకు సముద్రము కూడ సదనముగా నున్నదిగావున
నాతనిసైన్యముల నిరోధించుటయె తగుమార్గ మనికూడ
బోధించె నఁట! తమపట్టణము విజయనగరసామ్రాజ్యములోని
దిగావునను, సామ్రాజ్యభారమును వహించినపాలనకర్తనుధిక్క
రించుట సమంజసము కానందునను ధిక్కరించినను సుస్థిరముగా
నిలుచుట సాధ్యముగా దనియు వారుతలంచి యాతనిసలహా నిరా
కరించి రఁట! తనసలహాను వారాదరింపలే దనికోపించి యావ
ర్తకుఁ డొకవర్తకపునావనెక్కి గోవానగరమునకు వెడలిపోయె
నఁట. అటుపిమ్మట గృహస్థులలో ముఖ్యులగువారిని నల్వురను
నాలుగువేలవఱకువరహాలకాన్కతో రామరాయల కెదురుగ
రాయబారము నడపుటకై పంపి రఁట. రామరాయలు పోర్చు
గీసువారు పంపినకాన్కను, రాయబారమునకు మిక్కిలిసంతో
షించె నఁట! ఈలోపల నాతనికి స్వాగతము నొసంగుటకై!
తమపట్టణము నంతయుఁ జక్కఁగా నలంకరించి రఁట! అట్లు
రామరాయలు పట్టణమునకు విచ్చేసి యొకవిశాలమైన ప్రదేశ
మున నందువిడిసి పురములోని యాబాలవృద్ధులుసహా యావ
త్ప్రజలను రప్పించి తనసంతోషమును తెలుపుటకుఁగాను వార
లకు నొకగొప్పవిందు గావించి యాసమయమునఁ దనసేనాను

లను బెక్కండ్రను పురములోనికిఁ బోయివారివారియిండ్లు వరి శోధించి ద్రవ్యమునంతయుఁ గొనిరావలసిన దనియుత్తరువుచేసె నఁట! అతనియాజ్ఞను శిరస్సునఁ బెట్టుకొని వారెల్లరును వారి కొయ్యకంపలనుగూడవిడువక కొంత ద్రవ్యమును గూడ గొని వచ్చిరఁట. వారుగొనివచ్చిన దంతయు నూఱువేలవరహాల మొత్త మయినలేదని 'కోటో' తెలుపుచున్నాఁడు. దానిని జూచి రామరాయలు తానుమోసపుచ్చఁ బడితి ననిభావించి యాగ్రహమహోదగ్రుఁడై తనకు సలహాచెప్పినపోర్చుగీసు వాని శిక్షించుటకు నిశ్చయించుకొనె నఁట! అదివఱకే యాతఁడు సైన్యమునుండి తప్పించుకొని పాఱిపోయె నఁట! తుదకాతఁడు 'కలితురె' యనుప్రదేశమునఁ బట్టువడి వాని సన్నిధికిఁ గొనిరాఁబడె నఁట! అతఁడు తరువాత వానినేనుఁగు లచేఁ ద్రొక్కించి చంపించె నఁట! ఈమహాద్రోహమును గావించిన యావ్యక్తి పేరేమో యేపోర్చుగీసుచరిత్రకారుఁ డును నుడువ సాహసింపలేదు.

పిమ్మట రామరాయలు నూఱువేలవరహాలిచ్చినవారిని మరల వారిపురమునకుఁ బంపుదు ననియు, అందుసగము ముందుచెల్లింపవలెననియు, తక్కినసగము సంవత్సరముజరిగిన వెనుక చెల్లింపవలసినదనియు శాసింపఁగా వెంటనే సగము చెల్లింపఁ బడెనఁట! తక్కనసగము చెల్లించువఱకును వారిలో ముఖ్యుల నైదుగురను తాకట్టుగఁ దనతో నుంచుకొనుట కొప్పుకొనిమె నట! వారిసొత్తు నంతయు వారలకుఁ దిరుగ నిచ్చి

వేసెనఁట. అట్లిచ్చినపు డొక వెండిగరిటె కానుపింపకపోయెనఁట. దానిని వెదకించి తెప్పించి దానియజమానికిప్పించువఱకు నాతఁడు కదలలేదట! రామరాయలు పట్టణము విడిచిపోయి విజయనగరముఁ జేరినవెనుక వారుచేసినసేవకు సంతోషించి రాయలా పోర్చుగీసుగృహస్థుల నైదుగురను వారిస్వస్థలము నకుఁ బోవుట కనుజ్ఞ నొసంగెనఁట!

ఈపై కథ నిర్వురు పోర్చుగీసు లేఖకులు వ్రాసినారని నుదాహరించుచు హీరాసుఫాదిరి "రామరాయల కుండు ద్రవ్యము నెడఁగలదురాశవలన నిట్టిది సంభవించెనేకాని విజయనగరమునకును పోర్చుగీసువారికిని తరువాతిసంవత్సరములు స్నేహముతోనే గడుపఁ బడిన" వని వ్రాయుచున్నాఁడు.

కాని, తిరుపతిదేవస్థానమును కొల్లగొనుటకై పోర్చుగీసువారు ప్రయత్నించియు భగ్నమనోరథులై వారు దీనిని విడిచిమలయాళదేశమునందలి దేవాలయములను దోచుకొనిరను నప్రఖ్యాతినికప్పిపుచ్చుటకై యాపోర్చుగీసులేఖకులే దీని నెవ్వరోకల్పించి యుందురు. ఎక్కడనోయుత్తరదేశమున నహమ్మదునగరగోల్కొండసుల్తానులతోఁ బోరాడురామరాయలైదులక్షలసైన్యములతోఁ దూర్పుతీరమునకు దండెత్తివచ్చుట యెట్లుసంభవించును? రామరాయలు దురాశాపాత్రుఁ డనిలోకు లనుకొనుటకై పోర్చుగీసువారు కల్పించినకల్పనాకథగాని యిది సత్యమైనచరిత్రాంశముగా దని మనము విశ్వసింపవచ్చును.

ఉత్తరదేశమున దక్కనుసుల్తానులతోఁ బోరాడుచు రామరాయాదు లెట్లుజయమును బొంది సామ్రాజ్యములోని యుత్తరభాగమున నెట్లుశాంతి నెలకొల్పి పాటుపడిరో యట్లే విఠలరాయలు, చినతిమ్మరాజు మొదలగువారు దక్షిణదేశములోనియుల్లరులను మాన్పి శాంతి నెలకొల్పిరి. విఠలరాయలు వృద్ధుఁ డగుటవలనఁ దరువాత మృతినొంది యుండును. ఇతఁడు పరవజాతివారితోను, వారికి సాహాయ్యముఁ జేసిన పోర్చుగీసుఫాదిరులతోను జేసినయుద్ధములు బహుస్వల్పమయి నవిగను, ప్రాముఖ్యతఁగాంచనివిగ నున్నవిగావున వానివివరణ మిటనుదాహరింపఁ బూనకొనలేదు. తుదకు పరవజాతివారు కప్పము చెల్లించుట కొప్పుకొని మధురాపురాధీశుఁడైన విశ్వనాథనాయకునితో నొడంబడికఁ జేసికొనిరి.

---

# ఆఱవప్రకరణము

## రక్షస్థగిడియుద్ధము.

అళియరామరాయ లింతవరకు దక్కనుసుల్తానులతో నడపినయుద్ధములలో నెపుడును నపజయమును బొందియుండ లేదు. తానుసామ్రాజ్యభారము వహించిన యిరువదిసంవత్సర

ములకాలములో దక్కనుసుల్తానులైదుగురిలో నొక్కఁడైనను హిందూసామ్రాజ్యముపై దండెత్తి రాకుండునటులు రామరాయలు మిగులభయంకరమైన యొకరాజనీతిపద్ధతి నవలంబించి యాప్రకారము నడచుచుండెను. ఈదక్కనుసుల్తానులలో నైకమత్యము లేకుండుటఁ గనిపెట్టి వారికలహములలోఁదాను జోక్యము కలిగించుకొని యొకపక్షముననో యొకపక్షమునుండి వారికిఁ దోడ్పడుచుఁ బ్రతిపక్షము వారినిఁ గదనరంగమున నోడింపుచు వారలను గ్రుక్కఁద్రిప్పుకొనకుండఁజేసి యెప్పుడును దానులాభముపొందుచుఁ దనసామ్రాజ్యమును గాపాడుకొనుచు వచ్చెను. ఇతఁ డవలంబించిన యిట్టి రాజనీతియె తుదకు దక్కనుసుల్తానులు పరస్పరకలహములను విడిచి యెల్లరు నేకీభవించి హిందూసామ్రాజ్యము నెదుర్కొనునట్లు గావించెను. ప్రతిసుల్తానుకుఁ దాను ప్రత్యేకముగా విజయనగరసామ్రాజ్యముపై దండెత్తిపోయి రామరాయలను జయించుట సాధ్యముకాదని గ్రహింపఁ గలిగిరి. మఱియుఁ దమలోఁ దా మైకమత్యములేక పరస్పరవిరోధములతో నుండి యుద్ధములు చేయుచున్నంతవఱకు రామరాయలను జయించు నట్టిశక్తి కలుగదనికూడఁ దోఁచినది. ఇంక వారు చేయవలసినపని యేమి? ఐకమత్యము సంపాదించుకొనఁ బ్రయత్నింపవలయును. వారిలో ముఖ్యముగా నహమ్మదునగరసుల్తా నగుహుస్సేను నిజాముషాకును, విజాపురసుల్తా నగుఅలీఆదిల్‌షాకు సరిహద్దుదుర్గములవిషయమై వివా

దములు కలుగుచునే యుండెను. అళియరామరాయలపై హుస్సేనునిజాముషాకుఁ గలద్వేష మత్యంతరోషా నలపూరిత మైయుండెను. 'ఎప్పుడు రామరాయలనుజంపి వానిసామ్రాజ్యమును భగ్నముచేయఁ గలుగుదునా' యని త్రాఁచుఁబామువలెఁ బగఁబట్టి బుస్సలుకొట్టుచున్నవాఁ డగుటవలన నీమహాకార్యమును నిర్వహించుటకై శక్తివంచనలేకుండఁ దొలుదొల్తఁ బ్రయత్నించిన వాఁడితండనుటకు లేశమాత్రము సందియము లేదు. ఆలీఆదిల్ షా మొట్టమొదట నీమార్గమాలోచించినవాఁడని ఫెరిస్తావ్రాసినది విశ్వాసపాత్రము కాదు. ఆలీఆదిల్ షాకును, ఇబ్రహీమ్ కుతుబ్షాకును ప్రాణరక్షణము నొసంగి వారిరాజ్యములపై నిలువఁబెట్టినవాఁడు రామరాయలని వారెఱింగి యుండకపోలేదు. కాని హుస్సేనునిజాము షాతోఁ జేసినయొడంబడికలమూలమునను సంబంధబాంధవ్యములమూలమునను వీరు వానితోఁ గలియవలసిన వారయిరి గాని వాస్తవముచేత రామరాయలను వానిసామ్రాజ్యమును నాశనము గావింపవలయునంతద్వేషము వారికున్నట్లు గానరాదు. మఱియును గొందఱుచరిత్రకారులు వ్రాసినట్లు లీయుద్ధము కేవలము మతావేశపరవశత్వము వలనఁ గలిగినదని చెప్పుటకును సాధ్యపడదు. ఆనెగొందిపురములో హిందువులకుఁ బవిత్రమైనయొకకోనేటిలో తురకఫకీరును వానియనుచరులిద్దరును స్నానముచేయఁగా వారినిఁ జావఁగొట్టి పంపుటయె కారణమని వ్రాయుటకూడ నంతవిశ్వాసపాత్రమైనదిగాఁ గను

పట్టెను. ఇయ్యవి వట్టికల్పనలుకాని సత్యములగు కారణములు గావు. హీరాసుఫాదిరివ్రాసినట్లు కడపటజరిగిన యుద్ధములలో హిందువులు మహమ్మదుమతస్థుల మశీదులు మొదలగువానిం జెఱచి యవమానపఱచుటయుంగూడఁ గారణములు గావు. దక్కనుసుల్తానులరాజ్యాంగ వ్యవహారములలో నితఁడు జోక్యము కలిగించుకొని తానుజయశీలుఁడై వారినదిమిపట్టియుంచుటయె ప్రధానకారణముగా గ్రహింపవలసియుండును గానిమఱియన్యము కాదు.

కారణమెద్దియైనను అలీ-ఇబు-అజీజువ్రాసినట్లు హుసేనునిజాముషాయైననేమి, మహమ్మదుకాశిం ఫెరిస్తావ్రాసినట్లు ఆలీఆదిల్‌షాయైననేమి దక్కనుసుల్తానుల నేకీభవింపఁజేయుటకై గోల్కొండసుల్తానగు ఇబ్రహీమ్‌కుతుబ్షా యిందుకుఁ బ్రయత్నించునటుల ప్రేరేపించిరి. ఇబ్రహీమ్‌కుతుబ్షా ప్రయత్నములు తుదకు ఫలించినవి. హుసేనునిజాముషా తనకూతురు చాందుబీబీని విజాపురసుల్తానగు ఆలీఆదిల్‌షాకిచ్చి పెండ్లిచేయుటకును, ఆదిల్‌షా చెల్లెలగు 'ఫలాబీబీహద్యాసుల్తానా' అనునామెను హుసేనునిజాముషా పెద్దకుమారుఁడగు షహజడామూర్తజాకు నిచ్చి పెండ్లిచేయుటకును, షోలాపురము కట్నముగా నిచ్చుటకు నేర్పాటుచేసి గోల్కొండసుల్తాను అహమ్మదునగర విజాపురసుల్తానుల కిర్వురకుఁ బొత్తు కలిపెను. అహమ్మదునగరసుల్తానగు హుసేనునిజాముషా తన కొమార్తెలలో మరియొకకొమార్తెను గోల్కొండసుల్తానగు

ఇబ్రహీమ్‌కుతుబ్షా కిచ్చిపెండ్లి చేసినటుల కోటో వ్రాయుచున్నాఁడు. వానిలో వారికైకమత్యము బలపడుటకును, రామరాయలవిజృంభణము నడంచుటకును నిట్టిసంబంధబాంధవ్యములోనఁగూర్పఁబడినవి. ఇంక బీదరు, బీరారుసుల్తానులుగూడ వీరితోఁ జేరిరి. గోల్కొండసుల్తానుపక్షమున ముస్తఫాఖాను, అహమ్మదునగర సుల్తానుపక్షమున మౌలానాఇనాయతుల్లాయును, రాయబారులుగా విజాపురమునకుఁ బోయి యచట కిష్వరుఖాను మొదలగువారితో నాలోచించి వివాహసంబంధములను స్థిరపరచుటయెగాక ప్రమాణపూర్వకముగా సంధిపత్రములపై సంతకములు చేయఁబడినవట. అటుపిమ్మట యథావిధిగా వివాహములుజరుపఁబడి విజాపురమునను, అహమ్మదునగరమునను మహోత్సవములు జరుపఁబడినవట! బీరారుసుల్తా నిందుచేరలేదని ‘ బసాతిన్‌_ఉస్_సలాతిన్ ’ అను గ్రంథము తెలుపుచున్నది. బీదరుసుల్తా నిందుచేరలేదనిఫెరిస్తా వ్రాయుచున్నాఁడు. ఐదుగురుసుల్తానులు చేరినారని కోటో వ్రాయుచున్నాఁడు. అందరుసుల్తానులు నేకీభవించిరని మనము విశ్వసింపవచ్చును.

వీరిసమాచారము నంతయుఁ జారులవలనవిని యెంతమాత్రమును జాగుసేయక సామ్రాజ్యములోని సామంతమండలాధిపతుల కందఱకును దెలియఁజేసి యుద్ధసన్నాహప్రయత్నములను జేయ మొదలుపెట్టెను. కృష్ణానదిమొదలుకొని సింహళమువరకుఁ గలయావద్దేశమునుండియు సామంత

మండలాధిపతులు, దుర్గాధిపతులు తమతమసైన్యములతో విజయనగరమున కరుదెంచిరి. మధురాపురమండలాధీశ్వరుఁడయిన విశ్వనాథనాయకునికుమారుఁడు కృష్ణప్పనాయకుఁడు తాను రాజ్యాభిషిక్తుఁ డయినకాలము స్వల్పకాలమైయుండుట వలనఁ దానుబోక తనసైన్యాధ్యక్షుఁడయిన అరియనాథ మొదలారిని ససంఖ్యాకసైన్యములతోఁ బంపెనఁట! సామ్రాజ్యసంరక్షణకై వీనితోఁ 'బసవరా' జను మఱియొకముఖ్యనాయకుఁడు వెడలియుండె నఁట. అళియరామరాయ లిట్లుయుద్ధప్రయత్నములో నున్నకాలముననే విజాపురసుల్తానునుండి యొకరాయబారినిబంపి అదివరకు విజాపురసుల్తానునుండి వేర్వేఱుకాలములందు గైకొనిన యాతగిరి, బగ్గకోట, రాచూరు, ముదిగల్లు దుర్గములను విడిచిపెట్టవలసినదని యడిగించె నఁట! ఇదియె విజాపురసుల్తాను విజయనగరముతోఁ గలమైత్రిని విడిచిపెట్టినట్లుగ సూచించుచున్నదని ఫెరిస్తా వ్రాయుచున్నాఁడు. రామరాయలారాయబారిని నవమానించి పంపివేసెననియు నిదియెకారణముగాఁ జేసికొని యిబ్రామునకుశత్రువయిన రామరాయలను సాధించుటకై వారలత్యంతవేగముతో సైన్యముల సమకూర్చుకొనఁ బ్రోత్సహించెనని ఫెరిస్తా తెలుపుచున్నాఁడు.

ఎట్లయిననేమి? దక్కనుసుల్తానులు సమరోత్సాహసంభరితులై తమతమసైన్యములతో విజాపురప్రాంత దేశము నందలిబయళ్లలోఁ గలిసికొనిరి. అచట విజాపురసుల్తానగు

ఆదిల్‌షా వారికి గొప్పవిందు గావించెను. అచటనుండివారు 1564 సంవత్సరము డిసెంబరు 26 తేదీని దక్షిణముగా నడచుటకుం బ్రారంభించిరి. వీరందఱును తల్లికోటసమీపము నకుఁ జేరుకొనిరి. వీరిలో గోల్కొండసుల్తానగు ఇబ్రహీమ్ కుతుబ్షా యొక్కమంత్రియు, సైన్యాధ్యక్షుఁడునగు 'కమల్ ఉద్దీన్‌హుసేను' ఆతనికి 'ముస్తఫాఖా' ననుబిరుదము గలదు. ఇతఁడు రాజకార్య తంత్రజ్ఞుఁడు మాత్రమెగాక మహాయోధుఁడుగూడ నైయున్నవాఁడు. మహాసమర్థుఁడు. అహమ్మదు నగరసైన్యములకు మౌలానాఇనాయతుల్లా సైన్యాధ్యక్షుఁడు. విజాపుర సైన్యములకు 'కిస్వర్ ఖాన్' సైన్యాధ్యక్షుఁడు. గోల్కొండసైన్యములతో 'రిఫత్ ఖాన్' అనుగొప్పసేనాని యొకఁ డుండెను. వీరిచే సైన్యములు పాలింపఁబడుచుండెను. మఱియు విజాపురసైన్యములతో నాలువేలమహారాష్ట్రాశ్వికసైనికులు గలరు. ఈసైన్యమునకు ముఖ్యనాయకులు 'యశ్వంతరావు, భోజమల్లనాయక్, దేవనాయక్, బస్వంతరావు, విశ్వేశ్వరరావు, కాళీరావు' అనువారలని తెలియుచున్నది. ఈదక్కనుసుల్తానులసైన్యములు మహారాష్ట్ర కర్ణాటాంధ్రదేశములను బాలించువారుగనుక వీరిసైన్యములోఁ గేవలము మహమ్మదీయులే గాక హిందువులుగూడ నుండిరని మనము విశ్వసింపవచ్చును. పోర్చుగేసుగ్రంథకర్తలు తురకసైన్యములో నేబదివేలయాశ్వికులును, మూఁడువేలపదాతు

లును గలదనిహీరాసుఫాదిరి వ్రాసినది సత్యమని విశ్వసింప రాదు. లక్షలకొలదిపదాతిసైన్యము గలదు. హిందూసైన్యము డెబ్బదివేలయాశ్వికులతోడను, తొంబదివేల పదాతులతోడను గూడుకొని యుండెనని ఫెరిస్తావ్రాయుచు నుజేయొకత్తాప్రస నింతకన్నసధికముగా నున్నట్లువ్రాసియున్నాఁడు. ఒకఅనామధేయచరిత్రకారుఁడు లక్షయాశ్వికులును, మూఁడులక్షలపదాతులును గలరనివ్రాయుచుండఁగాఁ గొందఱుపోర్చుగీసుగ్రంథకర్తలు గుఱ్ఱపుదళముసంఖ్య నొప్పుకొనుచు పదాతిసైన్యము లాఱులక్షలుండెనని వాక్రుచ్చుచున్నారు. (1) ఈసైన్యము నంతయు మూఁడువిభాగములను· జేసిరామరాయలు, తిరుమలరాయలు, వేంకటాద్రి మువ్వురును మూఁడుభాగముల కాధిపత్యము వహించిరి. రామరాయలు యుద్ధమునాటికి మిక్కిలివృద్ధుఁడుగా నున్నట్లు చరిత్రములన్నియు నైకకంఠ్యముగాఁ దెలుపుచున్నవి. రామరాయలుడెబ్బదేండ్ల వయస్సువాఁడని ఫెరిస్తాగ్రంథమును ఎనుబదేండ్లవయస్సువాఁడని ‘ బురహాన్–ఈ–మాసీర్’ అనుగ్రంథమును దెలుపుచుండఁగాఁ బోర్చుగీసు చరిత్రకారులు రామరాయలు తొంబదియాఱు సంవత్సరముల వయస్సుగలవాఁడని కంఠోక్తిగాఁ దెలుపుచున్నారు. వీరుచెప్పినదానిలో సంఖ్యయెట్టిదైనను రామరాయా

(1) The Aravidu Dynasty of Vijianagar p. 200, 201.

దులు వృద్ధులనుట సత్యమని మనము విశ్వసింపవచ్చును. వారుత్తమరాజవంశములలోఁ బుట్టినవారుగనుక వయోవృద్ధు లయినను, దేహదార్ఢ్యము, మనోధైర్యము, పౌరుషముగలిగి పరాక్రమశక్తిసంపన్నులరై యుండిరనుట కెంతమాత్రమును సంశయింపఁ బనిలేదు. ఈయుద్ధమునుగూర్చి చండావర్కరు గారు మరాఠీభాషలోఁ బ్రకటించిన 'విజయనగరవినాశన' మను గ్రంథమునుండి యెత్తి హీరాసుఫాదిరి తనగ్రంథము నందుఁ బ్రకటించిన విషయములు గొన్ని కేవలము నసత్యములని స్పష్టముగాఁ జెప్పవచ్చును.

"ఈయుద్ధమునకై రామరాయలు విజయనగరము నుండి బయలుదేరుటకుముందు స్వకీయాంతఃపురమునకుఁజని తనపట్టమహిషియగు సత్యభామాభాయికి విలువగల యాభరణములను బహుమానము చేసెనఁట! పిమ్మట దేవచింతామణి త్రివేగల యనుభార్యకడకుఁ బోయి యామెతో సంతోషమునఁ గొంతకాలము గడపి కొన్నిబహుమానములను గావించెనఁట! అటుపిమ్మట 'మానమోహిని నిజస్వరూపి' యను మూఁడవభార్య మందిరమునకుఁ బోయెనఁట! అనేక విధములుగా నామె రాయలను సంతోషపఱచుటకై ప్రయత్నించెనఁట! అతఁడు తనయారామములనుండి యిరువదివిధములయినఫలములను దెప్పించి భార్యలకుఁ బంచిపెట్టించెనఁట! తరువాత నతఁడు తనతల్లియగుచంద్రశాల గదికిఁ బోయి యామెను సందర్శించెనఁట! అతనికి చెడుగు కలుగ

కొందుటకై యామెవెంటనే పెక్కునగలను తలచుట్టు దిగ దుడుపు తుడిచెనఁట! అప్పుడు రామరాయ లామెకు సామ్రాజ్యవ్యవహారములను విశదపఱచి యెట్లు దక్షిణసుల్తానులునల్వురు నేకమై తన్ను నెదుర్కొన నున్నారో, ఎట్లుదేవళములు, ధర్మశాలలు, బ్రాహ్మణులు వారిపాలఁబడి కడగండ్లఁబడ సిద్ధముగ నుండెనో యావిధమునంతయుఁ బూసగ్రుచ్చినటుల నివేదించి వారినిశిక్షించి వారిప్రయత్నములను భగ్నపఱచుటకుఁ దా నవలంబించినమార్గమును వినిపించి యుద్ధమున కనుజ్ఞనీయవలసినదని యామెకాళ్లపైఁ బడి ప్రార్థించెనఁట! అందున కామె యియ్యకొనక ‘మనమువారికి హానికలిగింపలేదు; అయినను వారెల్ల నేకీభవించి మనపైదండెత్తి వచ్చుచున్నారు; వారితో సంధిచేసికొనుట తగు’ నని పలికెనఁట! ఆమె చెప్పిన దాతనికిష్టములేక వెడలిపోయెనఁట! అందుమీఁద నామె తనకుమారునిసంతోష పెట్టుటకై ప్రయత్నించె నఁట! ఆరాత్రి రాయలుతనగదిలో విశ్రాంతిగైకొనియె నఁట! అతఁడారాత్రి తనచెవికుండలము లెవరో చూఱఁగొని తన్ను సింహాసనమునుండి పడఁద్రోచినట్లుగా స్వప్నము గాంచె నఁట! అప్పుడాతఁడు దైవజ్ఞశిఖామణులను రప్పించి వారలకుఁ దనస్వప్నవృత్తాంతమును విన్పింపఁగా వారలుభయములేదనియు శత్రువులను జయించి బహుకాలము రాజ్యపరిపాలనము చేయఁగలవని యాతనినోదార్చి మనశ్శాంతి గలిగించిరఁట. పిమ్మట వారలకు నూతనవస్త్రములను గట్టఁ

బెట్టి కొబ్బరిముక్కలను, ఐదువేలహొన్నులను బ్రాహ్మణులకుఁ బంచిపెట్టెనఁట !"

ఇయ్యవి పట్టిపిచ్చికూఁత లనివిశ్వసింపవచ్చును. అళియరామరాయల భార్యలలో "సత్యభామాభాయి, దేవచింతామణి, త్రివేగల, మానమోహిని నిజస్వరాపి" యనువారలు లేనేలేరు. అళియరామరాయలకు నల్వురుభార్యలు గలరనియు నందొకామె కృష్ణదేవరాయలకొమార్తయగుతిరుమలాంబయనియు, ఇంకొకయామె జిల్లెళ్ల పెదనందిరాజయ్యదేవమహారాజుకూఁతురగు నప్పలాంబయనియు, తక్కినయిర్వురును పోచిరాజు తిమ్మరాజయ్యదేవమహారాజు కూఁతుండ్రగు కొండమ్మ, లక్ష్మమ్మయనువారనియు, రామరాజీయాదిగ్రంథములవలనఁ దెలిసికొనఁ గలుగుచున్నాము. అళియరామరాయలతల్లి తిమ్మాంబకాని చంద్రశాలకాదని మనమెఱింగియె యున్నాము. తొంబదియేండ్లవయస్సుగలరామరాయ లామెకు మూఁడవకుమారుఁడుగాని మొదటివాఁడు కాఁడు. అప్పటికాతనితల్లి బ్రతికియున్నదని కాని భయంకరమైనయుద్ధమాసన్నమైయున్నకాలమున భార్యలతో సరసల్లాపములాడుచు విలువగలనగల బహుమానము చేయుచుండెనని చెప్పెడివారు చెప్పినను విశ్వసించెడివారెకి మతు లుండవనుకొనిరి కాఁబోలు ! ఇట్టిపిచ్చికూఁతలనే హీరాసుఫాదిరి ప్రామాణ్యములుగఁ బరిగణించి గ్రంథస్థపచేయుట మిక్కిలి

శోచనీయముగ నున్నది. స్వప్నవృత్తాంతముతోఁ గూడి నిక్ష నవిశ్వసనీయమని చదువరులు గ్రహింపవలయును.

తల్లికోట కృష్ణానదికుత్తరభాగమున నిరువదియైదుమైళ్ల దూరమున నుండుటచేతను, యుద్ధము కృష్ణానదికి దక్షిణ భాగమున 'రక్షస్సు, తంగడి' యనురెండు గ్రామములసమీపమున జరిగియుండుటచేతను తల్లికోటయుద్ధ మనుటకుమారుగా 'రక్షస్తంగడి' యుద్ధమని హీరాసుఫాదిరి పేర్వెట్టుట యెంతయు సమంజసముగా నున్నది.

అట్లు రామరాయ లసంఖ్యాకము లగుసైన్యములతో యుద్ధయాత్రసాగించి మున్ముందిరువదివేల యాశ్వికులతోను, వేయియేనుంగులతోను, లక్షమందికాల్బలముతోను బోయి కృష్ణానదియొక్క యుత్తరపుటొడ్డు నాక్రమింపవలసిన దని తనపెద్దతమ్ముఁ డయినతిరుమల రాయుని కాజ్ఞనిచ్చి పంపెను. వానివెనుక నంతేసంఖ్యగలసైన్యముతోఁ బోయి తిరుమలరాయనికిఁ దోడ్పడవలసినదిగాఁ గనిష్ఠసోదరుఁడైన వేంకటాద్రికి నుత్తరవుచేసి కొదువసైన్యమును దాను నడిపించుకొనిపోయెను. వీరిసైన్యములు కృష్ణానదిచేరునప్పటికే సుల్తానులసైన్యములు కృష్ణానది కుత్తరభాగమున విజయనగరసామ్రాజ్యమునకు సంబంధించినప్రదేశములను నాశనము గావించి కృష్ణాతీరమునకుఁ జేరుకొనియెను. తిరుమలరాయలును, వేంకటాద్రియు దక్షిణపుటొడ్డున దండువిడిసిరి. నదిని దాటుటకు ననుకూలమైనరేవు హిందూసైన్యములచే నాక్రమింపఁబడి

యుండుటచేత శత్రుసైన్యము నదిని దాటుటకై తగినరేవు నకై పరిశోధింప వలసివచ్చెనుగాని హిందూసైన్యముల కెదురుగనున్నదియె ముఖ్యమైన రేవుగనుండుటచేత వారినాయకులెల్లరు నొకచోట సమావేశమై యాలోచించి యానదిని దాటుటకై యొకయుక్తిని బన్నిరఁట ! మఱియొకరేవున దాటుటకై తాము ప్రయత్నించుచున్నట్లుగా శత్రువులకుఁ గన్పట్టుటకై తమసైన్యములతో నదిపొడుగునఁ బ్రయాణము సల్పుటకును, హిందూసైన్యములు తమస్థానములను విడిచి తమ్మెదుర్కొనుటకు వచ్చునపుడు తమవెనుకవచ్చెడుసైన్యము వెంటనే వెనుదిరిగివచ్చి యాముఖ్యమయినరేవుననే నదినిదాటుటకు నిశ్చయించుకొని మరునాఁడుదయమునఁ దమసైన్యములతో బయలుదేఱి మూఁడుదినములు ప్రయాణముసాగించిరఁట ! ఈమోసమునకు లోనయి హిందూసైన్యములు వారికెదురుగ దక్షిణపుటొడ్డునఁ బ్రయాణము సాగించినవఁట. మూఁడవనాటిరాత్రి హిందూసైన్యములు తమస్థానము విడిచిపోవుటను గాంచి హుస్సేనునిజాముషా సైన్యములు గ్రక్కున వెనుకకు మరలి తమ్మెదిరించు హిందూసైన్యములు గానరానందున నత్యంతవేగముతో నదినిదాటి మఱునాఁటియుదయమున సుస్థిరముగా నిలిచిపోయిరఁట ! ఇట్లని ఫెరిస్తా వ్రాయుచున్నాఁడు. ఎట్లయిననేమి ? సుల్తానులసైన్యములు కృష్ణనుదాటి దిగువనకు వచ్చినవి.

అయినను దక్కనుసుల్తానులు తాము రామరాయల యసంఖ్యాక సైన్యములనుజయించుట కష్టసాధ్యమని భావించి తమతో సంధిచేసికొన్నయెడల తామదివఱకు నాక్రమించుకొన్న ప్రదేశములను మరల యాతనికిచ్చివేసెదమని రామరాయలకుఁ దెలియఁ జేసిరఁట కాని యాతఁడు సంధికార్యమున కొడంబడలేదని ఫెరిస్తాతన గ్రంథమునందు వ్రాసియున్నాఁడుగాని యిదివట్టియసత్యమని 'హీరాసుఫాదిరి' యెఱయొప్పుకొనుచున్నాఁడు.

ఇంతలో రామరాయలు తనసైన్యములతోవచ్చి సోదరసైన్యములను గలిసికొనియెను. శత్రుసైన్యములు కృష్ణను దాటివచ్చినసంగతి దెలిసికొని రామరాయ లొకింతసంభ్రమముఁజెందినను ధైర్యముతోఁ దనసైన్యములోఁ గదనరంగమున నారితేఱినబంట్లగు రాచవారె నెల్లరను ముంగలిమునుముగా నేర్పాటుగావించి ముంగలిప్రదేశమున శత్రుసైనికులు చేరకుండఁ జూడవలసినదని యుత్తరువు గావించెను. అట్లే దక్కనుసుల్తానులు ఖురాసానియాశ్వికదళముతో 'ఇఖాన్ ఖాను' ముంగలిమునుముగా నుండునటుల యేర్పాటు చేసిరఁట. ఈరెండుముంగలిమునుములకు ప్రప్రథమున యుద్ధము ప్రారంభ మయ్యెననియు నీతొలియుద్ధమున ఖురాసానియాశ్వికదళము హిందూసైన్యములను దాకి పామంతుల ననేకులను మట్టుబెట్టెనని 'బురహాన్—ఈ—మాసీర్' అను గ్రంథమున వ్రాయఁబడియుండఁగా చండావర్కరుగారి 'విజయన

గరవినాశ' మను గ్రంథమునందు తురుష్కుల మునుమునం
దును రాచవారి మునుమునందును బెక్కండ్రు మడిసిరిగాని
తుదకు తురుష్కులమునుము వెనుదీసె నని వ్రాయఁబడి యు
న్నది. అదియెట్టిదైనను భయంకరమైనసంగ్రామము ప్రారంభ
మయ్యెను. రామరాయ లెంతమాత్రమును భయపడక
వృద్ధుఁ డయ్యును నొకయువకునివలె నావేశపరవశుఁడై తన
సైన్యములను బ్రోత్సహింపఁ జేయుచు యుద్ధోన్ముఖుఁడై
యుండెనని ఫెరిస్తా వ్రాయుచున్నాఁడు. రామరాయలు తన
సైన్యములను మూఁడుభాగములుగా విభజించి కుడిభాగ
మును తిరుమలరాయలును, ఎడమభాగమును వేంకటాద్రి
యును, మధ్యభాగమును దానును గైకొని యెదురుగ రెండు
వేలయేనుంగులను, అచటచట వేయిఫిరంగులను మొదటి
పంక్తిలో నుండునటుల నియమించె నఁట. విజయనగరసైని
కులు దిగంబరులుగనుండి శత్రువులపైఁ జులకనఁగాఁ బట్టువడ
కుండునటుల యొడలినిండ నూనె పూసికొనియుండిరని ఫెరిస్తా
వ్రాయుచున్నాఁడు. వీరివలెనె సుల్తానులసైన్యములు మూఁడు
భాగములుగా విభాగింపఁబడి కుడిభాగమున ఆలీఆదిల్‌షా
యుండి వేంకటాద్రి సైన్యముల నెదిరించుటకును, ఎడమభా
గమున ఇబ్రహీమ్‌కుతుబ్షాయును, ఆలీబరీదుషాయును నుండి
తిరుమలరాయలసైన్యముల నెదిరించుటకును, మధ్యభాగమున
హుస్సేనునిజాముషాయుండి రామరాయల నెదురించుటకును
నేర్పాటుచేసికొని నిలిచిరఁట. ఖురాసానీవిలుకాండ్రధిష్ఠించిన

యాశ్వికదళముతో ఇఖ్లాస్‌ఖానుని, ఆఱువందలపిరంగులతో ఏశియామైనారు యూరోప్రదేశములలో ప్రఖ్యాతిఁగాంచిన ‘ చల్బీరుమీఖా ’ యనువానిని హుస్సేనునిజాముషా తనముం దుంచుకొనియె నఁట! ఈయుద్ధము ప్రారంభ మగుటకుఁ బూర్వమె తిరుమలరాయలును, వేంకటాద్రియుఁ దమయన్నను సమీపించి ‘ మీరు వయోవృద్ధులరు ’ ఈభయంకరయుద్ధమున మీరు నిలుచుట ప్రమాదకరమని మేము భావించుచున్నాము. సైన్యాధిపత్యమును మాకు విడిచిపెట్టుఁ డని ప్రార్థించినను రామరాయలు వినక ముప్పదేండ్లయువకునివలె లేచి మాఱుమాటాడక మీమీమానములను గాపాడుకొనుఁడని యాజ్ఞాపించెనట. అంతటితోఁ దనివిచెందక జయము సంపాదింప దృఢమనస్కులరై సుస్థిరముగా నిలిచి తురకలతోఁ బోరాడవలసిన దనితనసైనికులను హెచ్చరింపుచు, ఎనుబదేండ్లునిండియు జీవితాంత్యకాలమునఁ బిఱికిదనముతోఁ దన బ్రదుకును నవమానపఱచుకొనఁజాల ననియు, ఎవరైనను సరే యుద్ధరంగమున నిలుచుటకు భయపడిరేని వారు తత్క్షణమె తొలఁగిపోయి తమప్రాణములను రక్షించుకొనుటకు స్వేచ్ఛ నొసఁగుచున్నానని బిగ్గరగాఁ బలికెనఁట. వానిసోదరులును ముప్పదివేల యాశ్వికులును తాముమరణము పొందునంతవఱకుఁ బోరాడుచుందుమని ప్రతిజ్ఞఁ బూనినట్లుగా ‘ బురహాన్–ఈ–మాసీర్ ’ అను గ్రంథమునఁ జరిత్రకారుఁడొకఁడు వ్రాసియున్నాఁడు.

భీష్మాచార్యునివలె నీవృద్ధవీరుఁ డిట్టిపౌరుషవచనంబు లాడుచుండినపుడు వీరుఁడై నయునకయోధుఁ డెవ్వఁడు వెను దీయుటకు సాహసించును ?

ఈవృద్ధవీరుఁడు యుద్ధరంగమునఁ బల్లకినెక్కియుండుట కంటె హయారూఢుఁడై యుండుట సురక్షితమని వీరవర్గ మును తనసేనానులు నెంత ప్రార్థించినను వినక, బిడ్డలతోఁ బోరాడునపుడు సురక్షితస్థానములకై వెదకికొన నక్కరలేద నియు, ఇదియు నొకయుద్ధమేనా యనియు, మొదటిదెబ్బ తోనే యీఁగలవలెఁ జెల్లాచెదరై యెగిరిపోవుదు రనియుఁ బలికె' నని ఫెరిస్తా వ్రాయుచున్నాఁడు.

రామరాయలును వానిసోదరులును తురుష్కసైన్య ములను జూచి భయపడిపోయి యాదినమున వారితోఁ బోరా డుట కిష్టపడక మరలిరనియు, అదిసందుచేసికొని హుసేను నిజాముషాయును తక్కినవారును యుద్ధమునకు డీకొనక తాము తమసైన్యములును కొంతవిశ్రాంతిని తీసికొన నిశ్చ యించి మఱునాటియుద్ధమున కెదురుచూచుచు నారాత్రి సుఖముగా విశ్రమించిరని, ఆలీ-ఇబు-అజీజు వ్రాసియు న్నాఁడుగాని యిదియంతగా విశ్వాసపాత్రముకాదు. మఱు నాఁడు మధ్యాహ్నముపండ్రెండు గంటలకు యుద్ధము ప్రారం భింపఁబడినది. వేంకటాద్రి యధ్యక్షతక్రింద నడుపఁబడు చున్న యెడమపార్శ్వమునున్న హిందూసైన్యములు తొలు దొల్త విజాపురసుల్తానుసైన్యముల నెదుర్కొనియెను. వేంక

విఘటుకై సంసిద్ధుఁడై యుండ హుస్సేనునిజాముషా మరల తనసైన్యములను బురికొల్పుకొనివచ్చి హిందూసైన్యముల మఱియొకమా రెదుర్కొనఁ బోరుఘోర మయ్యెనఁట ! రుమీఖాను నాధిపత్యముక్రిందనున్న ఫిరంగులవారు తాముఁగా నుపింపకుండ ' ఇఖాసుఖాను ఖురాసాను' సైన్యముల వెనుకనుండి శతఘ్నులవర్షము గురిపింపఁగా రాయలసైన్యములు తెఱుముకొనివచ్చి పైఁబడఁగా ఖురాసానుసైన్యములు వెనుకకుఁబాఱి హిందూసైన్యములు ఫిరంగులసమీపమునకు వచ్చినతోడనే యాకస్మికముగా ఫిరంగిగుండ్లను వ్రేల్చఁ బ్రారంభించిరఁట ! అప్పుడురాయలసైన్యములు విశేషనష్టముతో వెనుదీయ వలసి వచ్చెను. ఈసందర్భమున ఇఖ్లాస్‌ఖాను, రుమీఖానులధైర్య సాహసములను మెచ్చుకొనఁదగినదని ఆలీ_ఇబూ_అజీజు వ్రాయుచున్నాఁడు. ఈసమయమున హుస్సేనునిజాముషా తన గుడారమును శత్రువులకెదురుగ నెలకొల్పి జయముకలుగు వఱకుఁ బోరాడ నిశ్చయించుకొనియె నఁట. ఇంతియగాక హుస్సేనునిజాముషా తనభార్యలను, ఉంపుడుకత్తెలను తన స్కంధావారమునకు రప్పించి తనకపజయముకలిగి మరణము సంభవించినపక్షమున వారలనుసంహరింప వలసినదిగా ఖోజాలకు నుత్తరువుచేసి వారలకుఁ గాపు పెట్టెనఁట.

రామరాయలు తనకియ్యది యవమానకరమనిభావించి తానుగుఱ్ఱమునుండిదిగి యచట నొకరత్నకంబళమును బఱపించి రత్నసింహాసనమునుబెట్టి దానిపైనధిష్టించి తనయెదుట

నగలరాసులను, ధనరాసులను, ముత్యముల రాసులనుపోయించి జయము పొందుచుండిన సైనికులకు బహుమానములుగ నొసంగుచుండె నఁట. రాయలయౌదార్యమునకు సైనికు లత్యంతసంతోషమును జెంది ఫిరంగి ప్రేటులవలనఁ గలిగినకల వరమునుండి శాంతినిబొందినవారై శత్రువుల కుడియెడమ ప్రక్కలనుండు సైన్యములనుదాకి భీభత్సముసేయ ఆదిల్ షాయు, కుతుబ్షాయు నింకజయము కలుగుట దుస్సాధ్యమని తలంచిరని ఫెరిస్తా వ్రాయుచున్నాఁడు. తమకింక నపజయము తప్పదని తలఁచిరని ఆలీ_ఇబూ_అజీజు వ్రాయుచున్నాఁడు. తురకలసైన్యములోఁ బార్శ్వములనున్న రెండుభాగములును బూర్తిగా నోడింపఁబడినవని హిందువులువ్రాసిన చరిత్రము వలనఁ దేటపడుచున్నది. ఫరియా_డి_సౌజా యను నాతఁడు గూడ రామరాయలు శత్రువుల దాదాపుగా నోడించెనని వ్రాయుచున్నాఁడు. వేసవికాలమునఁ జెట్లయాకులు రాలి కుప్పతిప్ప లయినట్లుగా తురకసైనికులశవములు కుప్పలుకుప్ప లుగఁ గూలిపోయి రాసులగుచుండెననియు, పాషండులు (హిందువులు) తమయాధిక్యతయుఁ బరాక్రమంబును నెఱపిరని 'మిర్జాఇబ్రహీమ్‌జబిరీ' యనునాతఁడు 'బసాతిన్_ఉస్_సలాతిన్' అను గ్రంథమున వ్రాసియున్నాఁడు. (1)

అయినను హుస్సేనునిజాముషా సుస్థిరముగా మధ్య భాగమున నిలిచియుండెనని ఫెరిస్తా వ్రాయుచున్నాఁడు. ఫిరం

(1) The Aravidu Dynasty of Vijianagar p. 210

ఘలయధికారి యగుకురుమీఖాను రాగినాణెముల ఫిరంగులలోఁ
జోయించి హిందూసైన్యములు సమీపించినతోడనే ప్రేల్చు
చునమిత నష్టమును గలిగించుచుండెను. ఇందువలన ఫిరంగుల
సమీపమున నైదువేలహిందూసైనికుల శవములు పడియుండె
నఁట. అప్పుడుహిందూసైనికులుచెదరి పరువిడుచుండ విజా
పురసుల్తానుసేనాధిపతియగు 'కిశ్వర్ ఖానులారీ' యను నాతఁ
డాఱువేలయాశ్వికులతో వచ్చి హిందువులపైఁ బడి తఱుమ
నారంభించె నఁట. ఇట్టిసమయముననే హిందూసైన్యములో
నొకగండరగోళము పుట్టినది. ఇంతవఱకు విజయనగరసామ్రా
జ్యము క్రిందసేవకులుగ నున్నయిర్వురు తురకసేనానులు
రాజద్రోహులై తమప్రభువయిన రామరాయలను విడిచి
తమమతస్థులయిన సుల్తానులపక్షమునకుఁ దమతమసైన్యము
లతోఁ బోవుట సంభవించెను. ఈద్రోహవృత్తాంతమును ఫెరి
స్తాగాని, ఆలీ-ఇబూ-అజీజుగాని తెలిపియుండలేదు గాని
యుద్ధముజరిగిన యొకసంవత్సరమునకు విజయనగరవీథులలోఁ
దానుసంచరించునపు డచటివారు చెప్పఁగాఁ దాను వినియుం
టినని ఫ్రెడరిక్కను నొకపోర్చుగీసు లేఖకుఁడు వ్రాయుచు
న్నాఁడు. ఈతురకసేనాను లిరువురును చిక్కుసమయములో
ద్రోహులై శత్రుపక్షములోఁ జేరి యాకస్మికముగాఁ దమ
ప్రభువు నెదుర్కొని పోరాడుట మూలముననే రామరాయ
లపజయముగాంచెనుగాని లేకున్న నపజయము గాంచువాఁడు

గాడని ఫ్రెడరిక్కు తెలుపుచున్నాఁడు. (1) ఈవిషయమును 'ఆంక్విటిల్—డు—పెర్రాన్' అనునాతఁడుకూడఁ దెలుపుచున్నాఁడని హీరాసుఫాదిరి తెలుపుచున్నాఁడు. ఈయిర్వురిలో నొకఁడు రామరాయలు తనసోదరునిగా భావించి కొనెడు 'ఎయిన్—ఉల్—ముల్కు' అనునతఁడయి యుండునని హీరాసు తలంచుచున్నాఁడు. ఇయ్యదినిజమై యుండవచ్చును. ఇతని ప్రేరేపణమూలముననే సదాశివదేవరాయలు బెవినిహల్లి గ్రామమును బ్రాహ్మణులకు దానముచేసి యుండెను. (2)

వీరుచేసిన ద్రోహమువలననే రామరాయల సైన్యములోఁ బెద్దకలవరము పుట్టుటయు, రామరాయలకుఁ గాయముతగులుటయు సంభవించెను. అతఁడు వెంటనె రణరంగమునుండి తొలఁగిపోవలయునని పల్లకినెక్కెనఁటగాని పల్లకి మోయుబోయీలు హుస్సేనునిజాముషా సైన్యములోని యొకమదపుటేనుగ ఘీంకారము సేయుచు పైఁబడ భయపడి పల్లకి నచటవిడిచిపెట్టి పాఱిపోయిరఁట. అట్టిసంకులసమరమున నావృద్ధవీరుఁడు కాలినడకను పప్పించుకొనిపోదమని తలంచి పల్లకినుండి దిగుచుండఁగా నాయేనుగ రాయలను తొండముతోఁ బట్టుకొని పైకెత్తెనని ఫెరిస్తావ్రాయుచుండఁగా 'ఆలీ—

(1) The Aravidu Dynasty of Vijianagar p. 211, 212

(2) Ep. and XIV p. 231, V. 64, 68.

ఇబు—అజీజ్' రామరాయలు గుఱ్ఱముమీఁదనుండఁగాఁ బట్టు వడె నని వ్రాయుచున్నాఁడు. ఎక్కడపట్టుబడిననేమి ? పట్టుబడిన మాటవాస్తవము. అంత రాయలు చలబీరుమీఖాను కడకుఁ గొనిపోఁబడెను. అతఁడు వానినిచంపఁబోఁగా వానిసమీపమున నున్నహిందూదేశవాయియగు 'దళపతిరాయి' యనుబ్రాహ్మ ణసేనాని యాయనను జంపకుమాతఁడేరామరాయలు; దివా నుజాకేమకడకుఁ గొనిపొమ్మని పలికెనఁట ! ఇయ్యది తెలిసికొని రుమీఖాను రామరాయలను హుస్సేనునిజాముషాకడకుఁ గొనిపోయెనఁట. అతనితల వెంటనే కొట్టివేయుఁడని హుస్సేను నిజాముషా యాజ్ఞాపించినట్లుగా మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసియున్నారుగాని 'కోటో' యను పోర్చుగీసుచరిత్రకా రుఁడు హుస్సేనునిజాముషా తానుస్వయముగాఁ దనఖడ్గముతో నాతనితలఁ ద్రుంచివైచెనని వ్రాయుచున్నాఁడు. ఈదుష్కా ర్యమును జేయునపుడు 'హుస్సేనునిజాముషా' 'ఇప్పుడునీ మీఁదనేను బగఁదీర్చుకొనుచున్నాను; నాకు దేవు డేమిచే యునోచేయ నిమ్ము' అనియుద్ఘోషించెనఁట. ఇట్లు శత్రు వులదుర్మంత్రముల వలనను మాయోపాయముల వలనను 1565 సంవత్సరము జనవరి 25 తేదీని నీమహావ్యక్తి తన తొంబదియాఱవయేట రణరంగమున వీరస్వర్గమును గాంచెను. పాపము హుస్సేనునిజాముషా యిట్లక్రమముగాఁ దనచేతఁ జిక్కిన వృద్ధశత్రువును తలద్రుంచినందుకు మిక్కిలిపశ్చా త్తాపముఁ జెందియుండును. ఇట్టిమహావిజయమును బొందిన

సంతోషవైభవము నేమియు ననుభవింపకయే మనోవిచారముతో సంవత్సరమైన గడవకమునుపే వ్యాధిగ్రస్తుఁడై మరణముఁ జెందుట తటస్థించెను. ఆహా! విధిచోద్యముల రహస్యములం దెలిసికొనుట నెట్టివారికి సాధ్యముగదా?

# ఏడవప్రకరణము

## రామరాయల ధర్మపరిపాలనము.

కృష్ణదేవరాయలు వానితమ్ముఁ డచ్యుతదేవరాయలు విజయనగరసామ్రాజ్యమును బరిపాలించు కాలముననే సామ్రాజ్యమున భూమిశిస్తు మొదలగునవి క్రమపద్ధతులపై స్థిరముగా నేర్పాటుచేయఁబడియుండుటచేత నాపద్ధతులనే సదాశివదేవరాయని కాలమునఁగూడ రామరాయలచే నవలంబింపఁబడియుండుటచేత రామరాయలకాలమున సామ్రాజ్యమున నెన్నఁడు నార్థికదారిద్ర్యము సంభవించి యుండలేదు. అర్థికాభివృద్ధికై యాతఁడెన్నఁడును సామ్రాజ్యప్రజలను బాధించి యుండలేదు. సామ్రాజ్యమునకు లోఁబడినసామంతనృపతులు అమరనాయకులు మొదలగువారు ప్రతిసంవత్సరము తాము చెల్లింపవలసిన కప్పములను వరుసదప్పక సకాలమునఁ జెల్లించుచుండుటయే తటస్థింపుచువచ్చెనుగాని యన్యథా జరిగి యుండలేదు. అందువలన ధనలోభముచే ధర్మపరిపాలనమునకు భంగము కలుగలేదు. ఇతనిపరిపాలనమున ముఖ్యముగా సంరక్షింపఁబడినది హిందూమతధర్మపరిపాలనమె. చక్రవర్తియగు సదాశివదేవరాయలును, వానిమంత్రియగు రామరాయలునుగూడ

సామ్రాజ్యప్రజలు తమజాతీయమతము నందభిమానము వీడ కుండునట్లు ప్రోత్సాహపరచుచుండునటుల వారికాలమునాటి దానధర్మములను లిఖింపఁజేసినవారి శిలాశాసనములే వారి తామ్రశాసనములే వేనోళ్ల వక్కాణించుచున్నవి. సదాశివ దేవరాయనిపేరిఁటి దానశాసనములు పెక్కులు కనంబడుచు న్నను నవియన్నియు రామరాయలు ప్రోత్సహించిన వనియే మనము విశ్వసింపవచ్చును.

## —♦ దేవాలయపోషకత్వము ♦—

నల్లచెర్వుపల్లెలోని పురాతనభైరవేశ్వరాలయము సదా శివదేవరాయనిచే విశాలపఱుపఁబడుటయెగాక సొగసుగా నలంక రింపఁబడినది. గోపాలకృష్ణదేవునియాలయమునుండి యెట్టి సుంకమును గైకొనకుండఁ జేసెను. తానుపట్టాభిషిక్తుఁడయిన ప్పుడు మార్కాపురములోనిదేవునకు నొకగ్రామమును దాన ముచేసెను. సచ్చిదానంద స్వామివారికి పుదూరుగ్రామము నిచ్చెను. పొత్తపినాఁడులో పులుపటగ్రామముతో సహా మూఁడుగ్రామములను, ఒంటిమిట్టలోఁ గొంతభూమిని ఒంటి మిట్టగ్రామములోని కోదండరామస్వామివారికి దానముచేసెను. కృష్ణాపురములోని విష్ణ్వాలయమునకు ననేకగ్రామము లొసం గఁబడియెను. హిందూపురముతాలూకాలోని తిమ్మసముద్ర మనుపేరుతో కాగల్లుగ్రామము మల్లికార్జునస్వామివారి కర్పిం పఁబడియెను. జమ్ములమడుగు తాలూకాలోని కోసానెపల్లె

గ్రామము చెన్నూరుసీమలోని తిరువేంగళనాథుని యుత్సవ కైంకర్యములకై సమర్పింపఁబడినది. శ్రీవిల్లిపుత్తూరులోని యమ్మవారికి రామనాథమండలములో పులియంగుల మను గ్రామము నొసంగెను. కోడూరు గ్రామములో దుర్గాదేవి పూజాకైంకర్యమునకై సంవత్సరోత్సవమునాఁడు తిరునాళ్లకు వచ్చు ప్రజలనుండి సుంకములను గైకొనుటకై యనుమతి యిచ్చెను. మఱియు సిద్ధేశ్వరభోజేశ్వరస్వాములకు గడగిరే లను గ్రామము నొసంగుటయెగాక వారిమహోత్సవములకై స్వాంతధనసహాయము చేయుటకు నేర్పాటు గావించెను. ఉదయగిరిదుర్గసీమలో నుండు గ్రామములనుండి తేఁబడుచిల్లర వస్తువులనుండి వసూలుచేయఁబడు సుంకముల మూలమున శ్రీరంగనాథస్వామివారికి మంచిరాబడిని కలుగఁజేయుటయె గాక సూర్యగ్రహణకాలమున సువర్ణదానమునుగూడఁ జేసి యుండెను. 'యథారాజాతథా ప్రజా' యన్నట్లు సామ్రాజ్య ప్రభువులమార్గమును వారిసామంతులును, ప్రజలుగూడ నవలంబించిరి. సదాశివదేవరాయల చక్రవర్తిగా నున్నకాలమున ననేకనూతన దేవాలయములు నిర్మింపఁబడినవి. శిథిలముల యినవి విశాలపఱుపఁబడుటయెగాక నూతనాలంకారముల తోను చిత్రములతోను చిత్రింపఁబడినవి. మహామండలేశ్వర జిల్లెళ్ల రంగపతిరాజయ్య దేవమహారాజుగారి కార్యకర్తయగు అమరనాయనివేంగళ నారాయనింగారు రాయచోటి గ్రామములోని వీరేశ్వరస్వామివారి ప్రాకారములోపల నడుమ

నున్నదేవాలయమును బాగుచేయించెను. దేశాంతరినరసింగ దాసు తిరువళ్లిక్కేణిలోని పార్థసారథిదేవాలయము ననేకవిధ ములుగా నభివృద్ధిపఱచెను. తిరుమలరాయనిదళవాయి యగు జంగమయ్య యొకనూతనదేవాలయమును నిర్మించెను. గుత్తి తిరుమలరాజయ్యగారు మన్నూరుగ్రామములోనిచెన్నకేశవస్వా మివారిదేవాలయములో మంటపనిర్మాణము గావించెను. తిమ్మ రంగరాజనువారు విజయనగరములోనిమహాదేవాలయములో ౨౧౪ భాగములుతో నొప్పునొకధర్మశాలాభవనమును నిర్మించి దానికిరంగమంటపమని పేరిడెను. చిన్నఓబలరాజనునాయని ఆరకటవేములయగ్రహారములో నొకదేవళమును గట్టించి యందుగోపాలకృష్ణదేవునివిగ్రహమును ప్రతిష్ఠాపించి గండి కోటదుర్గసీమలోవచ్చు నాదాయమునుండి సాలునకు ౩౧½ వరహాలు సమర్పించుటకు నేర్పాటుచేయుటయేగాక యాయగ్రహారములోనిశివార్లనుగూడ నాదేవుని కర్పించెను. ఓబలరాజయ్యదేవమహారాజు కడప, వెలదుర్తిగ్రామములలో లోహవిగ్రహములను బ్రతిష్ఠాపించి చెన్నకేశవపెరుమాళ్ల భోగకైంకర్యములకై పండ్రెండువరహాలు సమర్పించుటకై యనుజ్ఞచేసెను. ఆత్రేయగోత్రజుఁడును చంద్రవంశ్యుఁడును నైనరాచిరాజదేవమహారాజు దేవాలయమును నిర్మించియందు మదనగోపాలవిగ్రహమును బ్రతిష్ఠాపించి భూదానములు మొదలగువానిఁ బెక్కింటిని గావించెను. పెమ్మసానిచినతిమ్మా నాయఁ డనునొకసామంతమండలేశ్వరుఁడు తాడిపత్రిలోనితిరు

వేంగళనాథస్వామివారికి నెనుములచింతలయను గ్రామమును దానము చేసెను. యలదుర్తిలోని శ్రీరంగనాథస్వామివారి యర్చకత్వమును సలుపుటకై తమ్మయగౌడునకు మహానాయకాచార్యనాగినాయకుండను నాయన గొట్టెకుంటయను గ్రామమును దానము చేసెను. గుంమర్తి పాపయ్యయనునతఁడు వేల్పుచర్ల లోనియమ్మవారికి మూడు గ్రామముల నొసంగెను. నంద్యాల తిరుమలయ్యదేవమహారాజు చెన్నకేశవస్వామివారికి కోడూరు గ్రామము నొసంగుటయెగాక నందపాడు గ్రామమునఁ గొంత భూదానముగూడ చేసియుండెను. కొండ్రాజుచిన్నతిమ్మరాజు అహోబలనృసింహస్వామివారి కొక గ్రామము సమర్పించెను. ఒంటిమిట్టరఘునాయకదేవునికి నాగరాజయ్యగారు గంగపేరూరను గ్రామము నొసంగెను. నంద్యాలతిమ్మయ్యదేవమహారాజు, చిన్నఔబళేశ్వరదేవమహారాజు ఘండికోటరఘునాయకదేవునకు భూదానములను గావించిరి. నంద్యాలయాబలరాజునందలూరు సౌమ్యనాథస్వామివారికి భూదానములను చేసెను. బొల్లవరము లోనివేణుగోపాలస్వామివారికి పాపతిమ్మయదేవమహారాజుగా రొక గ్రామము నిచ్చిరి. ఇమ్మడిబసవనాయఁడు త్రిపురాంతక దేవరకు ముప్పదిటూముల మెట్టపొలమును సమర్పించెను.

ఇట్లుధనరూపకముగా నిచ్చినశాసనములు పెక్కులు గనుపట్టుచున్నవి.

పెద్దముడియము సోమేశ్వరస్వామివారి కొక ప్రభువు వసూలుచేయుసుంకములలో నొకసుంకమును సమర్పించెను.

విప్రవినోదివీరముష్టివీరప్పయనునాతఁడు గ్రామమునుండితనకు వచ్చునాదాయమునంతయు విశ్వేశ్వరదేవునికి సమర్పించెను. అగ్రహారము బ్రాహ్మణులనుండి తనకువచ్చెడునాదాయమునంతయు విప్రవినోదిసిద్ధయ చెన్నకేశవస్వామివారిమహోత్సవమునకై సమర్పించెను. కంబదూరుమల్లికార్జునదేవరకు విరూపణ్ణనాయకుఁడు ౫౦ వరహాల నొసంగెను. విప్రవినోదిబ్రాహ్మణులు తాము బ్రాహ్మణులనుండి సంపాదించినసొమ్మును దేవళ్లకు సమర్పించెడివారు పెక్కండ్రు కలరు. గారిడివాండ్రు వేలమూరినుండివచ్చెడునాదాయమునంతయు చెన్నకేశవస్వామివారికైంకర్యములకు వినియోగించుచుండిరి. మహామండలేశ్వరచినతిమ్మరాజకొండయదేవమహారాజు జిల్లేళ్ల గ్రామములోఁ దానువసూలుచేసెడుకొన్నిసుంకముల నాయూరిలో వీరభద్రదేవునకు సమర్పింపుచుండెను. ఇట్టివే పెక్కులుదానశాసనములు గనుపట్టుచున్నవి.

## —♦ బ్రాహ్మణవిద్వాంసుల పోషకత్వము. ♦—

ఇట్లు రామరాయలప్రభుత్వకాలమున దేవాలయధర్మాలయపోషకత్వమెగాక విద్వాంసులయిన బ్రాహ్మణులపోషకత్వముగూడఁ జక్కఁగా నిర్వహింపఁ బడుచు వచ్చినవి. 1545 సంవత్సరములో సదాశివదేవరాయలు కొందరుబ్రాహ్మణులకు దానములను పెక్కులు చేసెను. గోవిందవామపురమనుగ్రామము నొకబ్రాహ్మణున కొసంగెను. రెండుసంవత్స

రముల కనంతరము రెండు గ్రామములను బ్రాహ్మణుల కనేకులకు దానముచేసెను. 1548లో కనుమయను గ్రామమును బ్రాహ్మణవిద్వాంసులకు దానముచేసెను. వేదాంగపారగులైన పెక్కండ్రు బ్రాహ్మణులకు బెవికహళ్లి గ్రామమును దానము చేసెను. 1544 మొదలుకొని 1546 వఱకు వరుసగా మూఁడు గ్రామములను ఒంగోలుపురవాస్తవ్యుఁ డయినతాళ్లపాక తిరుమలయ్యగారికుమారుఁడు చిన్నకోనేటి తిరువేంగళనాథయ్యగారికి సగ్రహారములుగా నొసఁగఁబడెను. వీరు వేదవేదాంతమార్గ ప్రతిష్ఠాపనాచార్యులయినవారు. మఱియు బ్రాహ్మణులకుఁ జేయఁబడిన భూదానశాసనములుగూడ వందలకొలది గలవు.

## సరిహద్దులతగవుల పరిష్కారము

వీరిపరిపాలనమున సరిహద్దులనుగూర్చిన వివాదములు పుట్టుచు వచ్చెను. అట్టితగవుల నన్నిటిని సామ్రాజ్యకార్యకర్తలవలన పరిష్కారము లగుచు వచ్చెన వని కొన్నిశాసనములనుబట్టి తెలిసికొన నగును. అనంతపురమండలములో రెండు గ్రామములవారికి నీటిహక్కులనుగూర్చి 1553 లో వివాదము తటస్థించినప్పుడు రామరాజుకోనప్పదేవమహారాజు గారివలనఁ బరిష్కారము గావింపఁబడినది. ఆదేమండలములోఁ బెదమల్లెపల్లెయను గ్రామమున సరిహద్దులనుగూర్చి వివాదములు పొసఁగినపుడు దానప్పనాయఁ డనునాతఁడు తానుస్వయముగాఁబరిశోధించి వారివివాదములను బరిష్కరించి సరిహద్దులలో ఱాళ్లు

పాతించెను. అదేవిధముగా బుక్కరాయపురము బ్రాహ్మణపల్లె గ్రామములవివాద తటస్థించినపుడు సరిగా కొలతలుకొలువఁబడి స్పష్టముగాఁ దెలియునటులు సరిహద్దుగుర్తు లేర్పఱచఁబడినవి.

## వ్యవసాయాభివృద్ధి

వ్యవసాయాభివృద్ధినిగుఱించి యెట్టిశ్రద్ధ వహించినది మనకుఁ దెలిసికొనుట కంతగా సాధ్యముగాకపోయినను కొన్ని దృష్టాంతములనుబట్టి కొంతవఱకు గ్రహింపవచ్చును. పొత్తపి యను గ్రామమున వ్యవసాయముకొఱకు వరదరాజు, ఎల్లమరాజు ననువారు ౬౦ కుంటలభూమి నిచ్చి యొకకాలువను త్రవ్వించిరి. అదే గ్రామమున మట్లవరదరాజనునాతఁ డంతరంగకాలువ యనుపేరితో మఱియొకకాలువను త్రవ్వించెను. మొలకల మూఱుసీమలో చవిటిమన్ను తొలఁగించుటకై యుప్పరవాండ్లకు సదాశివదేవరాయలు పన్ను చెల్లింపకుండుపద్ధతిని కొంత భూమి నిచ్చినట్లు గనుబట్టుచున్నది. అనేకవిషయములనుబట్టి వ్యవసాయాభివృద్ధి సంరక్షింపఁబడుచున్నదనియె తలంపవచ్చును.

## కులవృత్తులు

ఈకాలమున విజయనగరసామ్రాజ్యమునందు కులవృత్తులు చక్కగాఁ బోషింపఁబడుచువచ్చిన వనేకదృష్టాంతములను జూపవచ్చును. విజయనగరసామ్రాజ్యమునం దీకాలమున

నరువది రేవు పట్టణములు సంరక్షింపఁబడుచు విదేశములతో వ్యాపారములు జరుపుచుండుటచేత కులవృత్తు లభివృద్ధిలో నున్నవని వేఱుగఁ జెప్పవలయునా? అన్నివృత్తులమాటయటుం డనిచ్చి యొకమంగలివృత్తిమాట విచారించినఁ దక్కినవృత్తుల యందుఁ గూడ నెట్టియభిమానము గలిగియుండురో చదువరులు చక్కఁగా గ్రహింపఁ గలరు. అళియరామరాయలు మంగలివృత్తిని నీచవృత్తిగను, మంగలివృత్తిగలవారిని నీచులనుగను జూచినట్లు గనుపట్టదు. అంతియగాక వారిని దుర్భరదారిద్ర్యమునుండి తప్పింపఁ బూనినట్లుకూడఁ గానఁబడును. అళియరామరాయలకాలమున నీవృత్తియందు నేర్పరులయిన పనివాండ్రు పెక్కండ్రు కలరు. వారిలో బాదామికాపురస్థుఁడగు మంగలతిమ్మోజుకొండోజుగారు చాల ప్రఖ్యాతుఁడై యుండెను. ఇతఁడు గడ్డముగీయునపుడు తననేర్పరితనము నంతయుఁ జూపించునఁట! ఇతఁడు రామరాయల సొంతమంగలి యని చెప్పవలసి యున్నది.

ఏవృత్తియైనను శ్రద్ధతో నభ్యసించిన నావృత్తియందే గొప్పఖ్యాతిని సంపాదింపవచ్చుననుటకు మంగలికొండోజుగారిని నిదర్శనముగాఁ జూపవచ్చును. యళియరామరాయ లీవృత్తినేర్పరితనమును మెచ్చుకొని చక్రవర్తితోఁ గూడ నీతనిగురించి ప్రశంసింపుచు వచ్చెనఁట. అందువలన రామరాయలకుమాత్రమెగాక చక్రవర్తిదయకుఁ గూడపాత్రుఁడయ్యెను. ఇట్టిదయను సంపాదించుటవలననే యితఁడు తనకులమువారి

క్కెల్లరకు మహోపకారముచేయఁ గలిగెను. అళియరామ రాయలు 1545 సంవత్సరము కొండోజు పనివానితనమును మెచ్చుకొని మంగలివారు చెల్లింపవలసిన కులపన్ను, వృత్తి పన్ను, యితరములయినపన్నులనేమియు నాతఁడు చెల్లింప నవసరములేదని యుత్తరువు చేసెను. 1554 సంవత్సరములో రామరాయలకు గొప్పసేవచేసి ప్రభువునకు విజ్ఞప్తిపంపుకొన నాతఁడు దయతో విశ్వసించి మంగలివాండ్రపైఁ గలసుం కమును దీసివేయవలసిన దనిశాసనమును బ్రకటించెను. అతఁ డును, అతనికుటుంబమువారును 1556 వ సంవత్సరమునుండి సామ్రాజ్యము నాలుగుసరిహద్దులలోపల నిర్బంధసేవనుండియు విరద, స్థిరముగాఁ బన్నులను జెల్లింపవలసిన నిర్బంధములనుం డియుఁ దొలగింపఁ బడియెను. అళియరామరాయల దయకుఁ బాత్రుఁ డయినదికొండోజు మాత్రమెగాదు. అళియరామ రాయలు ‹ తిమ్మోజు, హామ్మోజు, భద్రోజు ' ననుమూవురు మంగలుల పనితనమునుగూడ మెచ్చుకొని పన్నులనిర్బంధము నుండి వారినివిముక్తులను గావించి నట్లుగా హిరెకెరూరుశాస నమువలనఁ దెలియుచున్నది. చక్రవర్తికిని, మంత్రికి నిట్టి మంగలనాయకులతోడిపొత్తువలన సామ్రాజ్యములోని మంగల వాండ్ర క్కెల్లరకు మహోపకారము కలిగినది.

ఎప్పుడుసామ్రాజ్యప్రభుత్వమువారియుత్తరువు రామ రాయలసంతకముతో బయలువెడలినదో అప్పటినుండి సామ్రా జ్యోద్యోగస్థులును, తదితరసామంతమండలాధిపతులును ప్రభు

త్వశాసనముచే సహింపహించి యాంగలకులమువారెల్లరు నెట్టి పన్నును చెల్లింపవలసినపనిలేదని శాసనములం బ్రకటించినట్లనే కశాసనములవలనం దెలియంగలదు. ఇట్టిమహోపకార మాంగలమువారికి విజయనగరసామ్రాజ్యమున మరేపూర్వప్రభువుకాలమునను జరిగియుండలే దనుట సత్యము.

## స్వమతాభిమానము

అరవీటివంశమువారు మొదలనుండియు వైష్ణవమతస్థులై యుండుటచే నళియరామరాయలును వైష్ణవమతము నందే నిలిచి యుండెను. విజయనగరసామ్రాజ్యమును బరిపాలించినసంగమవంశమువారుమాత్రము శైవులుగ నుండుటకాని తక్కినవంశములవారెల్లరును వైష్ణవమతమువారై యున్నారు. ఈసామ్రాజ్యాధిపతులలో మొదటివంశములోనివాఁ డయిన విరూపాక్షరాయలుదక్క తదితర ప్రభువు లెవ్వరునుమతములను మార్చుకొనలేదు. మొదటివంశమువారైనశైవప్రభువులును తరువాతివంశములవారయినవైష్ణవప్రభువులును మతపరిపాలనాసందర్భమున శైవవైష్ణవమతభేదము లెంచకుండ దేవస్థానములను మతములను నిష్పక్షపాతబుద్ధితోనే పోషింపుచు వచ్చిరని నిస్సంశయముగ నుడువవచ్చును. రామరాయలగురువు శ్రీనివాసాచార్యులపుత్త్రుఁ డగుతాతాచార్యులు. రామరాయలును గురువుతాతాచార్యులును చంద్రగిరిదుర్గమునఁ గొంత

కాలమువిద్వద్గోష్ఠి యందుండెనని ప్రపన్నామృత మను గ్రంథమునుబట్టి దెలియుచున్నది. ఈ శ్రీనివాసతాతాచార్యుఁడు శ్రీరామానుజులవారిమేనమామ యగు శ్రీశైలపూర్ణునివంశములోనివాఁడు. మొదటస్మార్తమతము నందున్న బ్రాహ్మణ కుటుంబమె రామానుజునికాలముననే వైష్ణవములోనికి మారినది. వాధూలగోత్రోద్భవుఁ డయినదొడ్డ యాచార్యుఁడు వాదమునశైవాచార్యులఁ గెలిచినందున నతఁడు చిదంబరదేవాలయములో క్రిమికంఠచోళునికాలము నాటినుండియుఁ బూజాపునస్కారములులేక మూలపడియున్న గోవిందరాజస్వామివారి విగ్రహమును మరల నాదేవాలయములోఁ బ్రతిష్ఠాపించి పూజాసంస్కారములు జరుగునట్లు చేయవలసినదని రామరాయలనుకోరఁగా నతఁడాఘనకార్యమును నిర్వహించెనని పైగ్రంథము దెలుపుచున్నది. ఈదొడ్డయాచార్యులు చండమారుతమను గ్రంథమును తాతాచార్యులుపంచమతభంజనమును వ్రాసెను.

ఇయ్యావి యప్పయదీక్షితులవారు వ్రాసినయద్వైత దీపికపై ఖండనగ్రంథములు. రామరాయలితరమతశాఖలను ద్వేషింపకపోయినను స్వమతాభిమానమును విశేషముగాఁ జూపించెను. ఇతఁడేగాదు వీనిపూర్వులును వైష్ణవమతవ్యాప్తికిఁ బాటుపడిరి. ఈవిజయనగరసామ్రాజ్యపాలకులకాలముననే. దక్షిణదేశమున వైష్ణవమతము విస్తరింపఁ బడినది. తాతాచార్యులవారిముద్రయని లోకులచేఁ బ్రశంసింపఁబడు తాతాచార్యులవారు వీరిగురువుతాతాచార్యులవారే. చక్ర

వర్తిసదాశివదేవరాయలుకూడ విష్ణుభక్తుఁడు. వీనిపూర్వులు కూడ వైష్ణవమత మవలంబించినవారే. వైష్ణవమతము నభివృద్ధిపఱచుటకై యితఁడు 1556 సంవత్సరమున 30 గ్రామములను రామానుజులవారి కనఁగా నాతనిచే నేర్పాటుకావింపఁబడినశాఖవారికి దానముచేసి యుండెను. సదాశివదేవరాయనికి మరణించుట యన 'వైష్ణవపదముచేరుటయే' యని యభిప్రాయ మున్నట్టుగా 1558 సంవత్సరము లోనియొకశాసనము వలనఁ దెలియుచున్నది.

## భాషాభిమానము—కవిపండితగోష్ఠి

ఇతఁడు సంస్కృతాంధ్రములయం దసమానపాండిత్యముకలిగియుండుటయేగాక సంస్కృతాంధ్రకవులను పోషించినట్లు కనంబడుచున్నది. ఇతనిమంత్రి రామయామాత్యుఁడు సంగీతశాస్త్రజ్ఞుఁ డనియు, సంస్కృతకవి, స్వరమేళకళానిధి యనుగ్రంథమును రచించి రామరాయల కంకితముచేసి యున్నవాఁడని యిదివఱకె తెలిపి యున్నాఁడను. రామరాయలకు సంగీతశాస్త్రజ్ఞానము కలదనియు, వీణపాటయందును సంగీతమునందు నెక్కువయభిరుచి గలవాఁడయి యుండెనని వీరవేంకటపతిరాయలవారు 1589 లో లిఖింపించినయొక శాసనము వలనఁ దెలియుచున్నది. 1545 లో బాలుఁడైనసదాశివదేవరాయచక్రవర్తి మహాకవు లయినతాళ్లపాక తిరుమలయ్యాగారికిని వారికుమారుఁ డయినచిన్నకోనేటి తిరువేంగళనాథయ్యాగా

రికిని గ్రామముల నొసంగె నని పైనియుదాహరించి యున్నాను. వీరాంధ్రకవులయిన నియోగిబ్రాహ్మణులు. వైష్ణవమత మవలంబించినవారు. తెలుఁగుద్విపదలలో వైష్ణవగ్రంథములు రచించినవారు వీరే. వీరిద్విపదలు రాగిరేకులమీఁద వ్రాయఁబడి యట్టివి వందలకొలఁది రేకులు తిరుపతిదేవస్థానములో నున్నవనివినుచున్నారము. మహాపండితుఁడును మధ్వమతబోధకుఁడును నగువిజయేంద్రస్వాములవారు రామరాయలచే ననేకాగ్రహారములను, కనకాభిషేకములను గాంచెను. అహోబలమతాధిపతు లయినషష్టపరాంకుశు లనువారు సిద్ధాంతమణిదీపము, పంచకాలదీపిక, ప్రపత్తిప్రయోగ, నృసింహస్తవము మొదలగుగ్రంథములను రచించెను. ఇతఁడు కొంతకాలము రామరాయలకు కార్యకర్తగ నుండెను.

కాని యీతనియాస్థానకవులలో ముఖ్యుఁడయినవాఁడు భట్టుమూర్తి. రామరాజభూషణుఁ డన్నబిరుదమును పొందినవాఁడు. ఇతఁడురచించిన వసుచరిత్రము, నరసభూపాలీయము, హరిశ్చంద్రనలోపాఖ్యానము మొదలగుగ్రంథములు రామరాయలమరణానంతరము రచింపఁబడినవిగా నున్నవిగాని యితనికాలమున రచింపఁబడినగ్రంథము లేవియుఁ గానరావు. ఇతఁడు సుప్రఖ్యాతిఁగాంచిన యాంధ్రకవి యనియెల్లవారికిం దెలియును.

# అనుబంధము

## రామరాయలబిరుదుగద్యము

జయజయ, స్వస్తి, సమస్తసద్గుణస్తోమభద్ర, రణరంగ రామభద్ర, కళ్యాణమహీపాలభాస్వర, కళ్యాణపురవరాధీశ్వర, కన్యాకుమారీభీమరథీ తటాంతనిక్షేపవిజయస్తంభ, స్తోత్రార్హ యశఃప్రక్రియాపావనచరిత్ర, ఆత్రేయగోత్రక్షత్రియకుల పవిత్ర, మహితకేళికాపారాయణ, మహితచాళుక్యనారాయణ, ధాన్యమ్యచక్రవర్తిబిరుద, నానావర్ణమండలీకరగండ, దైత్యేభరి గండ, హత్తిబ్బరగండ, భాసురభుజాదండ, జయబిరుదురగండ, అసమశూరదగండ, హాంసబిరుదురగండ, గండరగండ, ఘనీ కృతమదేభకరశరజన్యలంపట, త్రిభువనబిరుదులవెన్నునమ్మెట, పట్టెనరాయనిజానిష్ట, ఒడయరాయనిశాభట్టశిష్ట, వర్గరాయఘన ప్రియంకర, అష్టవిగ్రాయమనోభయంకర, విజయచరితసింహా సనాభాస్వర, విజయనగరసింహాసనాధీశ్వర, యుక్తివర్గసద్యో ధనపుర, గుత్తిదుర్గనిర్భేదనపుర, వాదిపురతర్కాభరణ, ఆద వేనిదుర్గాపహరణ, ఘనచండవర్గబాధక, పెనుగొండదుర్గసాధక, మంద్రగిరిదుర్గభాస్వర, చంద్రగిరిదుర్గరాజ్యాధీశ్వర, శబ్దపరి శుద్ధపాలక, ఉద్దగిరిరాజ్యపాలక, కాయదుర్గపనయబంధుర, రా యదుర్గావనధురంధర, నందనశిలకిరీటపాదక, కందనవోలుకవాట

భేదక, చాటూరుఫణితినిర్వాహక, జూటూరుసమతి నిర్వాహక, చండనపాటి ఖడ్గనాయక, కొండవీటి దుర్గనాయక, పుట్టపల్లిసీమాధిష్ఠిత ధామసాగర, రెట్టహాల్లిసీమాప్రతిష్ఠితధామసాగర, సంకాదిమవీరసమాసంగిత, బంకాపురవీర రమాలింగిత, సాంద్రకీర్తినిరంతర, చంద్రగుప్తిధరాంతర, ఆచారరాజ్యావయవచర్య, రాచూరురాజ్యాహరణధుర్య, మదచండవర్గాదిదాయక, ముసుగంటిదుర్గాధినాయక, పరిభల్లుచరణభూషణ, ఓరుగల్లునగరపోషణ, విజయకరాయతసాయక, విజయాపురభయదాయక, వర్ణనాదికరక్షోపకార, పొల్లలాపురసంక్షోభకార, కల్యాదినృపకబాధక, కళ్యాణనగరసాధక, సామధానముఖ్యాశీలరంజన, ఆముదానగరసాలభంజన, ధావకరమార్గవిక్రాంతిసార, దేవగిరిదుర్గసమాక్రాంతిధీర, గౌతమీస్నానపావనాకార, కౌతుకాఖిలభూజనాధార, బలిచాపవిజన్యదాయక, హరిపురచాంచల్యకారక, ఘుడితకూటతమసింహాసంహనన, బెడఁదకోటనగరసింహాసంహనన, బలికిరికూటపాకలశౌర్య, కలుబరగికోటపాటనధుర్య, నగరసమాక్రమణవిచార, నగరసమాక్రమణధీర, పరచండనిర్గతకింకర, పరచండదుర్గభయంకర, సంసదుర్గకేతుహరణ, హంసదుర్గనిబర్హణ, స్వర్ణాటవర్గసద్గ్రంథనాసిక, కర్ణాటకబుధధన్యాసిక, జుర్నూరుభయనిర్ణాయక, నిర్నూరుసాముజసముద్రద్రునిష్ఠాదిరాయక, సామగిరిదావక, రామగిరిదుర్గప్రతిష్ఠాపక, మేదినీతలసమగ్ర

సంపాదన, ఘూడగిరిదుర్గభేదన, శిలదండమ్ముదుభాషణ, గోల
కొండప్రదూషణ, ఆయులకొండవిమతహాలాహల, ఆయుల
కొండహరణకౌతూహల, పానుగల్లుధృతిపరాక్రమ, పాను
గల్లుకృతిపరాక్రమ, పానుగంటిదుర్గపాటనధుర్య, భూను
తసాహసధుర్య, వేల్లితచండదుల్లభ, బెల్లముకొండవల్లభ,
నిలయులోలగర్జితాకార, మలయకేళిమహిమాధార్య, కామ
సమాచరణాక్రమణ, సోమపదమానచణాక్రమణ, శావ
గదుర్గబాధక, మావ్రరిదుర్గమాధక, ఖండితసముగ్రసందాచరణ,
దండితసమస్తశత్రుగణ, అక్షాహూధరత్నానికర, మక్షాకోటదత్నా
నికర, మక్షాకోటశిత్నానికర, అక్షాహూఢశిత్నానికర, ఉల్లీధని
జాస్తికల్లోలజాలక, ఢిల్లీపురహల్లకల్లోలహేలిక, కేలీసుమందారు
గతబృందాయక, గోలేరుసందేహాభయసందాయక, కలంబవర్గ
సంభాసుర, కలంబదుర్గకంపాసుర, భూగోళరుచిరభూషణ, పై
గోవనగరభీషణ, కొండపల్లిహరణ, చండకరనిభప్రతాపభరణ,
వినుకొండపాలక, వినూత్నకృతనాగార్జునునికొండ సాలజాలక,
అవంతీకలితపూరణ, అవంతీమదవిదారణ, కటకరాజ్యాధివర్తన,
కటకరాజ్యఘటితకీర్తన, అజికరేంద్రదారుణశాసన, రాజమ
హేంద్రరాజధనుశ్శాసన, బూదలభానుతిక్తాంగహరణ, యేదుల
భానుగుప్తాంగహరణ, దానమలకగుణసహజాపగాదిచారక, నిదా
నమలకభుజాబలాపహారక, రమాధిపవినుతాపదానకీర్తన, ఇమా
దనమలకమానమర్ధన, భృతరిపుదళనబంధుర, కుతుపణమల్కా
డళసిందుర, కరిశతరుణాకారిశగుణాభరణ, బరీదుబలల్హారణ,

భుజకృతరిపుధావనావధాన, గజపతివినుతపరాక్రమావధాన, కలికర్కశసమగ్రస్తంభీకృతారాతివర్గవిశాల, కవివర్గమనసిద్ధపరతర్కవారాశినవర్గకేళి, గిరిదుర్గ, వనదుర్గ, జలదుర్గ, స్థలదుర్గ, చతురశీతిదుర్గసమస్తదళవిభాళ, రిపురాజగోపికాగోపాల, గాయగోవాళ, శ్రీరంగరాజరామభూపాల, విజయాభవ, దిగ్విజయాభవ. (అందుగులవెంకయవిరచిత నరపతివిజయము.)

సమాప్తము.

శ్రీ సత్యానందప్రెస్, ఇన్నీసుపేట, రాజమహేంద్రవరము—1931.

# శుద్ధపత్రము.

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 8 | 6 | నలుకు | పలుకు |
| 10 | 7 | నూరాంబిక | సూరాంబిక |
| 14 | 11 | పద్దుర్గా | తద్దుర్గా |
| 15 | 17 | పెట్టైపన | పెట్టైపను |
| 17 | 16 | భావించుట | భావించిన |
| 19 | 5 | నిరుస్సాహము | నిరుత్సాహము |
| 21 | 8 | దిక్కరించి | ధిక్కరించి |
| 22 | 3 | సర్ధారులు | సర్దారులు |
| 24 | 2 | స్ఫురింపను | స్ఫురించును |
| 27 | 2 | నవలంభించి | నవలంబించి |
| 28 | 12 | నేడి | నేఁగి |
| 29 | 17 | నాభుంగూర్చి | నాభుఁగూర్చి |
| 32 | 16 | నరశింహ | నరసింహ |
| 38 | 16 | వలిసి | వలసి |
| 39 | 1 | ఆది | ఆద |
| 41 | 1 | జొబిళాంబ | జొబలాంబ |
| 45 | 8 | సత్యాను | సత్యమును |
| 46 | 9 | బడినది | బడినవి |
| 47 | 8 | సలకముమ్మయను | సలకముతిమ్మయను |
| 50 | 1 | సమన్వింప | సమన్వయింప |
| 50 | 7 | తొడిచి | లొడిచి |
| 51 | 10 | యూసానమున | యూస్థానమున |
| 54 | 19 | రాజీయవలన | రాజీయమువలన |

| | | | |
|---|---|---|---|
| 58 | 16 | రానియ | రాయని |
| 60 | 1 | లెట్టిసితి | లెట్టిస్థితి |
| 62 | 10 | నికని | నికిని |
| 69 | 15 | కారికులును | కాలికులును |
| 71 | 19 | తిమ్మయక | తిమ్మయకు |
| 72 | 6 | తిప్పలను | తిప్పలను |
| 75 | 2 | మైత్రాను | మైత్ర్యాను |
| 75 | 15 | వరమునకు | వర్గమునకు |
| 76 | 9 | నోసింగెడ | నోసంగెడ |
| 79 | 12 | బ్రభళ | బ్రబల |
| 85 | 12 | మానున | మానువ |
| 85 | 15 | మానున | మానువ |
| 88 | 13 | భీమార్జునలం | భీమార్జునులం |
| 97 | 1 | మేదాశక్తి | మేధాశక్తి |
| 99 | 18 | నవత్యార్శికను | నవతారికను |
| 105 | 2 | దమదమ | దమతమ |
| 112 | 4 | పరాదీనము | పరాధీనము |
| 112 | 11 | పటా | పట్టా |
| 124 | 7 | శత్రుత్వమున | శత్రుత్వమును |
| 125 | 5 | వచ్చేసె | విచ్చేసె |
| 126 | 13 | రాయకుఁడీ | రాయఁడీ |
| 145 | 9 | తుల్లానం | తుల్లాను |
| 147 | 1 | నిదివటి | లిదివజ |
| 147 | 89 | నగ్హానీయములే | గర్హ్యాములే |
| .52 | 10 | సిద్ధిరాజు | సిద్ధిరాజు |
| 158 | 9 | శాశనములు | శాసనములు |
| 159 | 1 | వ్రాఁతలతో | వ్రాఁతలలో |

| | | | |
|---|---|---|---|
| 162 | 13 | దేవరాయల | దేవరాయలు |
| 165 | 12 | సదాసివ | సదాశివ |
| 167 | 13 | రాయలతాను | రాయలుతాను |
| 172 | 10 | ఫ్రెడరిక్క | ఫ్రెడరిక్కు |
| 182 | 14 | తెంకాశ | తెంకాశి |
| 183 | 12 | సింటుథోము | సెంటుథోము |
| 185 | 13 | డసేహాని | డసేగాని |
| 185 | 19 | విజయగనర | విజయనగర |
| 186 | 20 | యఱ్ఱగుడ్డ | ఎఱ్ఱగుడ్డ |
| 190 | 14 | శరణోగతుఁ | శరణాగతుఁ |
| 194 | 6 | మబ్ఖా | మఖ్ఖా |
| ,, | ,, | తుబ్ఖా | తుఖ్ఖా |
| 197 | 7 | రాజము | రాజ్యము |
| 199 | 6 | ఘౌజాగారే | ఫౌజాగారే |
| 206 | 15 | గ్రహింపఁగలిగిరి | తోఁచినది |
| 215 | 22 | గ్రంథస్తప | గ్రంథస్థము |
| 216 | 1 | నూడిసీకథ | నూడినయీకథ |
| 221 | 21 | పార్శ్వమునున్న | పార్శ్వమననున్న |
| 223 | 18 | యరవీగు | యరలీగు |
| 224 | 4 | ఢిరంగుల | ఫిరంగుల |
| 227 | 17 | పప్పించుకొని | తప్పించుకొని |
| 229 | 4 | సాధ్యముగదా | సాధ్యముగామగదా |
| 232 | 16 | రాయల | రాయలు |
| 233 | 8 | భాగములుతో | భాగములతో |
| 233 | 9 | నాయని | నాయన |
| 235 | 8 | గాఁడీ | గాడ్డీ |

# శ్రీ నా థ క వి

(జీవితము)

ఇయ్యది చిలుకూరి వీరభద్రరావుగారిచే

రచియింపఁబడినది.

ఇందు వీరేశలింగము, లక్ష్మణరావు, ప్రభాకరశాస్త్రి గార్లు మొదలగువారు చర్చించివ్రాసిన యనేక విషయములను విమర్శించి యనేకనూతనాంశములను జేర్చి ప్రకటింపఁబడినజీవితవిమర్శగ్రంథము. శ్రీనాథకవినిగూర్చి తెలిసికొనఁదగిన ప్రత్యంశము నీగ్రంథముంజదివినఁ దెలిసికొనఁగలరు. ఇంతవరకుఁ బ్రకటింపఁబడిన గ్రంథములలో నుత్తమవిమర్శలతో విరాజిల్లుచున్న యుత్తమగ్రంథము. వెల రు 2—0—0

వలయువారు—

## ఆర్యపుస్తకాలయము,

రాజమహేంద్రవరము.